www.andhrajyothy.com
పేజీలు: 14
వెల (Price) : Rs. 6.50
విజయవాడ సిటీ**
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI
సంపుటి (Volume) : 66
సంచిక (Issue) : 55
మంగళవారం | 10-6-2025
శ్రీ విశ్వావసు నామసంవత్సరం, ఉత్తరాయణం, గ్రీష్మరుతువు, జ్యేష్ఠమాసం, శుక్లపక్షం తిథి: చతుర్దశి ఉ.11.36 తదుపరి పౌర్ణమి, నక్షత్రం: అనూరాధ సా.6.02 తదుపరి జ్యేష్ఠ, వర్జ్యం: రా.12.08-1.52, దుర్ముహూర్తం: ఉ.8.20-9.12, రా.10.20-11.02, అమృతఘడియలు: ఉ.6.32-8.18, రాహుకాలం: మ.3.00-4.30, సూర్యోదయం: 5.43, సూర్యాస్తమయం: 6.45
Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru



భారతికి భూ హారతి!

Bharathi CEMENT

సొంత కంపెనీకి జగన్ సంతర్పణ

అధికారం జగన్‌ది! సంస్థ... ఆయన సతీమణి భారతిది! ఇంకేముందీ... భారతికి భూ హారతి ఇచ్చేశారు. 2024 సార్వత్రిక ఎన్నికల షెడ్యూలుకు ముందు భూ సంతర్పణ చేశారు. అధికారాన్ని అడ్డం పెట్టుకుని, అనేక చట్టాలను తుంగలో తొక్కి మరీ భారతీ సిమెంట్స్‌కు 50 ఏళ్లపాటు సున్నపు రాయి లీజులు రాసిచ్చేశారు.

కేంద్రం చేసిన రెండు సవరణల ప్రకారం... భారతీ సిమెంట్స్‌కు లీజులు కేటాయించడం కుదరదు. అమలులోకి రాని మైనింగ్ ఒప్పందాలు ముగిసిపోయాయి. కానీ, అధికారాన్ని అడ్డం పెట్టుకుని జగన్ ఆ చట్టాలనే తుంగలో తొక్కారు.

2023 సెప్టెంబరులో హైకోర్టు ఇచ్చిన ఆదేశాల ప్రకారం... భారతీ సిమెంట్స్ వాదనలు విన్న తర్వాతే లీజుల కొనసాగింపుపై ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాలి. ఆ వాదనలు చెల్లవని తెలిసే... 'న్యాయ సలహా' పేరిట కథ నడిపించారు.

అడ్వొకేట్ జనరల్‌ను తప్పుదారి పట్టించారా? లేక... ఆయనే అబద్ధాలు చెప్పారా? మైనింగ్ శాఖ కార్యదర్శి, డైరెక్టర్, మంత్రి... వీరికి నిజాలు తెలియవా? అన్నీ తెలిసీ... భారతీ సిమెంట్స్‌కు సున్నపు రాయి లీజులు కట్టబెట్టారా? ఇప్పుడు ఇవన్నీ తేల్చాల్సింది కూటమి ప్రభుత్వమే!

ఎన్నికల షెడ్యూలుకు ముందు బరితెగింపు
భారతీ సిమెంట్స్‌కు 744 ఎకరాల సున్నపురాయి లీజు
వైఎస్ హయాంలో రఘురామ్ సిమెంట్స్‌కు మంజూరు
రాష్ట్ర ప్రభుత్వంతో ఒప్పందం చేసుకోని 'రఘురామ్'
ఆ తర్వాత.. భారతీ సిమెంట్స్‌గా పేరు మార్పు
కేంద్ర సవరణలతో కాలం చెల్లిన ఒప్పందాలు
జగన్ సీఎం కాగానే.. పునరుద్ధరణకు ప్రయత్నాలు
హైకోర్టు ఆదేశాలకు 'న్యాయ సలహా' గంతలు
అడ్వొకేట్ జనరల్ సహా పలువురి పాత్ర
కడప వాసి ఫిర్యాదుతో స్పందించిన కేంద్రం
సమగ్ర విచారణ జరిపించాలని రాష్ట్రానికి ఆదేశం

(అమరావతి - ఆంధ్రజ్యోతి)

తండ్రి అధికారాన్ని అడ్డం పెట్టుకుని అడ్డగోలుగా సంపాదించేశారంటూ వైఎస్ జగన్‌పై అనేక కేసులు నమోదయ్యాయి. మరి... ఆయనే అధికారంలో ఉంటే!? అంతా సొంత లాభానికే! ప్రజల కళ్లకు 'బటన్ నొక్కుడు' గంతలు కట్టి... తెరవెనుక దోచేయడమే! అధికారాంతంలో అత్యంత గుట్టుగా సాగించిన ఒక భూదోపిడీ ఇప్పుడు వెలుగులోకి వచ్చింది. తన సతీమణి భారతీ రెడ్డి

మిగతా 14వ పేజీలో...



ఎన్నికలవేళ గుట్టుగా...

2024 ఫిబ్రవరి! రాష్ట్రమంతా అప్పటికే ఎన్నికల సందడి నెలకొంది. మరి కొద్ది రోజుల్లో ఎన్నికల షెడ్యూల్ వెలువడనుంది. అదే సమయంలో... ఎర్రగుంట్ల, కమలాపురం మండలాల్లోని రెండు మైనింగ్ లీజులను భారతీ సిమెంట్స్‌కు పునరుద్ధరించేశారు. ఫిబ్రవరి 2న జీవో 4, 5లు జారీ చేశారు. వెంటనే లీజు అమల్లోకి వస్తుందని హడావుడిగా ఉత్తర్వులు ఇచ్చారు. జగన్ హయాంలో అన్నీ చీకటి జీవోలే కదా! భారతీ సిమెంట్స్‌కు 'గుట్టుగా' ఇచ్చేసిన లీజుల జీవోలూ చీకట్లోనే ఉండిపోయాయి. కూటమి ప్రభుత్వం వచ్చినా వీటిని వెలుగులోకి తీసుకురాలేకపోయింది.

జగన్ మీడియాపై జనాగ్రహం

మహిళల నిరసనలు.. పోలీసులకు ఫిర్యాదులు

మంగళగిరి ఆఫీసును ముట్టడించిన రాజధాని మహిళలు
కొమ్మినేని, కృష్ణంరాజుపై కఠిన చర్యలకు డిమాండ్
జగన్, భారతి క్షమాపణ చెప్పాలని నినాదాలు
చెప్పులు, చీపుర్లు, చాటలు చూపుతూ హెచ్చరికలు
సాక్షి నేమ్ బోర్డులు ధ్వంసం.. గేట్లెక్కి ఆందోళనలు
కర్నూలు ఆఫీసు ఎదుట జగన్ దిష్టిబొమ్మ దహనం



విజయవాడ ఆటోనగర్‌లోని కార్యాలయం వద్ద సాక్షి పేరును పీకేసి కాళ్లతో తొక్కుతున్న ఆందోళనకారులు

కొమ్మినేని అరెస్టు

పరారీలో ఎనలిస్టు కృష్ణంరాజు

అమరావతిని వేశ్యల రాజధానిగా చిత్రించడంపై దళిత జేఏసీ నేత కంభంపాటి శిరీష ఫిర్యాదు
తుళ్లూరు స్టేషన్‌లో వారిద్దరితోపాటు సాక్షి యాజమాన్యంపై కేసు నమోదు
ఉదయాన్నే హైదరాబాద్‌లో కొమ్మినేనిని అదుపులోకి తీసుకున్న తుళ్లూరు పోలీసులు
రాత్రి పొద్దుపోయేదాకా విజయవాడలోనే
అనంతరం నల్లపాడు స్టేషన్‌కు తరలింపు

గుంటూరు, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): నవ్యాంధ్ర రాజధాని అమరావతి వేశ్యల రాజధాని అని జగన్ చానల్లో తీవ్ర వ్యాఖ్యలు చేసిన కేసులో యాంకర్ కొమ్మినేని శ్రీనివాసరావును పోలీసులు అరెస్టుచేశారు. ప్రధాన నిందితుడు, ఎనలిస్టు కృష్ణంరాజు మాత్రం ఇంటికి తాళాలు వేసుకుని అజ్ఞాతంలోకి వెళ్లిపోయారు. ఆయన కోసం

మిగతా 13వ పేజీలో...



హైదరాబాద్‌లో కొమ్మినేని శ్రీనివాసరావును అరెస్టు చేస్తున్న పోలీసులు

సంకరజాతి తెగవారే ఇలా చేస్తారు!

రాక్షసులు, పిశాచాలు కూడా చేయవు
కొమ్మినేని ఫొటోలను చెప్పులతో కొడతారా?
తప్పంతా చంద్రబాబు, లోకేశ్‌దే: సజ్జల

వైఛీపీ విషం!

ఈ ఘటనలు యాదృచ్ఛికం కాదు
విషం చిమ్మండి అంటూ తిరుపతిలో పిలుపు
అమరావతిపై అదే తీర్మానం అమలు
కులాలు, ప్రాంతాలే లక్ష్యంగా రాష్ట్రంపై దాడులు
బరితెగించి మరీ అమరావతి మహిళలపై దూషణ
కొమ్మినేని వయసుపై జగన్ వింత వాదన
వేధించినప్పుడు అంకబాబు, రంగనాయకమ్మ వయసులు గుర్తుకు రాలేదా?

13

నియోజకవర్గానికో విజన్

స్వర్ణాంధ్ర విజన్-2047 అమలుకు
175 స్థానాల్లో కార్యాలయాల ఏర్పాటు
వర్చువల్‌గా ప్రారంభించిన చంద్రబాబు
ఒక్కో యూనిట్‌కు స్థానిక ఎమ్మెల్యే అధ్యక్షతన 9 మందితో టీమ్
అన్ని జిల్లాల అభివృద్ధే ధ్యేయం: సీఎం

అమరావతి, జూన్ 9(ఆంధ్రజ్యోతి): స్వర్ణాంధ్ర విజన్-2047 పకడ్బందీ అమలు కోసం రాష్ట్ర ప్రభుత్వం నియోజకవర్గానికో విజన్ యాక్షన్ ప్లాన్ యూనిట్ కార్యాలయాన్ని ఏర్పాటు చేసింది. సోమవారం రాష్ట్రవ్యాప్తంగా 175 నియోజకవర్గాల్లో ఈ కార్యాలయాలను ముఖ్యమంత్రి చంద్రబాబు వర్చువల్‌గా ప్రారంభించారు. ఆయా నియోజకవర్గాల్లో ఈ యూనిట్లకు స్థానిక ఎమ్మెల్యే అధ్యక్షుడిగా ఉంటారని చంద్రబాబు చెప్పారు. ఒక్కో యూనిట్‌కు 9 మందితో టీమ్ ఉంటుందని తెలిపారు. ఒక్కో కార్యాలయానికి నిర్వహణ కోసం రూ.10 లక్షలు ఇస్తామని ముఖ్యమంత్రి వెల్లడించారు. నియోజకవర్గ స్థాయిలో ఎమ్మెల్యేలకు ఇప్పటి వరకు ప్రభుత్వ

మిగతా 14వ పేజీలో...



విజన్ యాక్షన్ ప్లాన్ యూనిట్ కార్యాలయాలను వర్చువల్‌గా ప్రారంభిస్తున్న సీఎం

అమరావతికి క్వాంటమ్ వ్యాలీ కీలకం

సిలికాన్ వ్యాలీ తరహా గుర్తింపు.. 30న బెజవాడలో వర్క్‌షాపు: బాబు

12

ఎస్జీటీల బదిలీలకు మాన్యువల్ కౌన్సెలింగ్

టీచర్ల విజ్ఞప్తిపై మంత్రి లోకేశ్ స్పందన.. 'విద్యాభవన్ ముట్టడి' వాయిదా

14



2

ఇండియా ఫస్ట్!

మా ప్రతి విధానం వెనుకా ఇదే నినాదం
11 ఏళ్లలో వివిధ రంగాల్లో శీఘ్ర పరివర్తన
వేగంగా వృద్ధి చెందే ఏకానమీగా ఆవిర్భావం
సామాజిక న్యాయానికి పెద్దపీట
మంత్రివర్గంలో 60% ఎస్సీ, ఎస్టీ, ఓబీసీలే
గతంలో ఎప్పుడూ ఇంత ప్రాతినిధ్యం లేదు
సమష్టి విజయాలకు గర్విస్తున్నాం: మోదీ



2

సంకెళ్లు వేసి.. నేలకు అదిమి..

భారతీయ విద్యార్థి పట్ల అమెరికా అధికారుల అమానుషం
అక్రమంగా వచ్చాడని వెనక్కి పంపిన వైనం.. న్యూజెర్సీలో ఘటన

కార్మిక చట్టాలకు సవరణలు!

పనివేళలు 10 గంటల పెంపునకు ఇప్పటికే రాష్ట్ర క్యాబినెట్ ఆమోదం

12

పారిశ్రామిక వివాద, కాంపౌండింగ్ చట్టాల్లోనూ సవరణలకు ప్రతిపాదనలు
పని ప్రదేశాల్లో మహిళల రక్షణకు రూల్స్
కొన్నింటికి కేంద్ర ప్రభుత్వ సమ్మతితో..

కదులుతున్న రైళ్లలోంచి జారిపడి నలుగురి మృతి

ముంబైలో విషాదం, 9 మందికి గాయాలు
రద్దీ వల్ల ఫుట్‌బోర్డుపై ప్రయాణిస్తున్న వారు పరస్పరం ఢీకొనడంతో ప్రమాదం

2

నక్సల్స్ మందుపాతరకు అదనపు ఎస్పీ బలి

2

డీఎస్పీ, ఇన్‌స్పెక్టర్‌కు తీవ్ర గాయాలు
ఛత్తీస్‌గఢ్ సుకుమా జిల్లాలో ఘటన
ఉచ్చు పన్ని మందుపాతర పేల్చిన నక్సల్స్
నంబాల ఎన్‌కౌంటర్‌కు నిరసనగా నేడు బంద్‌కు మావోయిస్టుల పిలుపు



ఏఎస్పీ ఆకాశ్‌రావు గిర్పుంజే

హనీమూన్‌లో హత్య

కట్టుకున్న భర్తను చంపించిన భార్య

- బాయ్‌ఫ్రెండ్ సహాయంతో ముగ్గురికి సుపారీ ఇచ్చి మరీ ఘోరం
- హతుడి భార్య, మిగతా నలుగురి అరెస్టు



షిల్లాంగ్, లఖ్‌నవూ 9: హనీమూన్‌కు వెళ్లిన భార్యాభర్తల్లో భర్త దారుణహత్యకు గురయ్యాడు. కట్టుకున్న భార్యే తన ప్రియుడి సహకారంతో ముగ్గురికి సుపారీ ఇచ్చి భర్తను చంపించిందని పోలీసులు ప్రాథమికంగా నిర్ధారించారు. హతుడు మధ్యప్రదేశ్‌లోని ఇండోర్‌కు చెందిన వ్యాపారవేత్త రాజా రఘువంశీ. నిందితురాలు ఆయన భార్య సోనమ్. భర్తను ఆమె ఎందుకు హత్య చేయించాల్సి వచ్చింది? అనేది పోలీసులు వెల్లడించలేదు. రఘువంశీకి, సోనమ్‌కు మే 11న వివాహమైంది. మే 20న ఈ జంట హనీమూన్ కోసం మేఘాలయా వెళ్లింది. 22న నవ దంపతులు ఓ బైక్‌ను అద్దెకు తీసుకొని ప్రఖ్యాత 'లివింగ్ రూట్ వంతెన' మౌలాకియాత్ అనే గ్రామానికి వెళ్లారు. ఆ తర్వాత రఘువంశీ, సోనమ్ కనిపించకుండాపోయారు. మే 24న సోహ్రా వద్ద దంపతులు ఉపయోగించిన బైక్ లభ్యమైంది. ఈ ఘటనపై మేఘాలయా పోలీసులు ఎస్పీ, నలుగురు డీఎస్పీలతో ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని (సిట్) ఏర్పాటు చేశారు. జూన్ 2న సోహ్రాలోని ఓ జలపాతం దగ్గర్లోని లోయలో రఘువంశీ మృతదేహాన్ని పోలీసులు కనుగొన్నారు. అతడి తలపై బలమైన గాయాలు, శరీరంపై కత్తిపోట్లు ఉన్నట్లు పోస్టుమార్టం నివేదిక పేర్కొంది. రఘువంశీ వేలికి బంగారం ఉంగరం, మెడలో గొలుసు కనిపించలేదు. ఘటన జరిగిన మరుసటి రోజు సమీపంలో రక్తపుమరకలున్న కత్తి లభ్యమైంది. వంతెన వద్ద అల్బర్ట్ అనే టూరిస్ట్ గైడ్ ఘటనపై కీలక విషయాలు వెల్లడించారు. 22న రఘువంశీ, సోనమ్‌లకు అక్కడి విశేషాలను వెల్లడించానని, మర్నాడు.. దంపతులను మరో ముగ్గురితో కలిసి ఉండగా తాను చూశానని, అంతా హిందీలో మాట్లాడుకున్నారని అల్బర్ట్ వివరించాడు. హతుడి భార్య సోనమ్, యూపీలోని నందగంజ్ పోలీసుల ఎదుట లొంగిపోయినట్లు తెలుస్తోంది. మరో ముగ్గురు నిందితులు.. ఆకాశ్ రాజ్‌పుత్ (19), విశాల్ సింగ్ చౌహాన్ (22), రాజ్‌సింగ్ కుశ్వాహా (21), ఆనంద్ కుర్మీ(23)లను పోలీసులు ఇప్పటికే అరెస్టు చేశారు. నలుగురు నిందితుల్లో రాజ్ కుశ్వాహాను సోనమ్ బాయ్‌ఫ్రెండ్‌గా అనుమానిస్తున్నారు. రఘువంశీని హత్యచేసేందుకు ఆయన భార్యే తమకు సుపారీ ఇచ్చినట్లుగా నిందితులు వెల్లడించినట్లు పోలీసులు చెప్పారు.



నేను చంపలేదు: సోనమ్

తన భర్త రఘువంశీని తాను చంపలేదని పోలీసుల విచారణలో సోనమ్ చెప్పినట్లు తెలుస్తోంది. తననే కొందరు కిడ్నాప్ చేశారని, తర్వాత గాజీపూర్‌లో వదిలేశారని, అక్కడి నుంచి తన కుటుంబసభ్యులతో మాట్లాడానని సోనమ్ చెప్పుకొచ్చినట్లు తెలుస్తోంది. అయితే, రాజ్ కుశ్వాహాతో కొంతకాలంగా సోనమ్ సన్నిహితంగా ఉంటోందని.. పక్కా ప్రథకం ప్రకారమే రఘువంశీ హత్య జరిగినట్లు పోలీసులు వర్గాలు అనుమానిస్తున్నాయి. సోనమ్ సోదరుడు గౌరవ్ నడుపుతున్న ఓ కంపెనీలో రాజ్ కుశ్వాహా అకౌటెంట్‌గా పనిచేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఇండియా ఫస్ట్!



మా ప్రతి విధానం వెనుకా ఇదే నినాదం

- 11ఏళ్లలో అన్ని రంగాల్లో శీఘ్ర పరివర్తనం
- సమష్టి విజయాలకు గర్విస్తున్నాం: మోదీ

న్యూఢిల్లీ, జూన్ 9: తన ప్రభుత్వ ఆధ్వర్యంలో గత 11 ఏళ్లలో భారత్ అతి వేగంగా వృద్ధి చెందుతున్న ప్రధాన ఆర్థిక వ్యవస్థగా అవతరించడమే గాక.. వాతావరణ మార్పులు, డిజిటల్ ఇన్నొవేషన్‌లో అంతర్జాతీయంగా కీలక గొంతుకగా మారిందని ప్రధాని మోదీ ఉద్ఘాటించారు. తమ ప్రతి విధానం, నిర్ణయం వెనుక 'ఇండియా ఫస్ట్' చోదక శక్తిగా ఉందన్నారు. 'సబ్‌కా సాథ్, సబ్‌కా వికాస్, సబ్‌కా విశ్వాస్, సబ్‌కా ప్రయాస్..' ఎన్‌డీఏ ప్రభుత్వ మార్గదర్శక సూత్రంగా పేర్కొన్నారు. దీనిద్వారా విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చామని తెలిపారు. ప్రధాని పగ్గాలు చేపట్టి 11 ఏళ్లు.. మూడోసారి బాధ్యతలు చేపట్టి ఏడాది పూర్తయిన సందర్భంగా ఆయన సోమవారం 'ఎక్స్' వేదికగా స్పందించారు. '11 ఏళ్ల సేవలో' అనే హ్యాష్‌టాగ్ జోడించారు. ఈ 11 ఏళ్లలో సత్పరిపాలన, పరివర్తనపై దృష్టి కేంద్రీకరించామన్నారు. 140 కోట్ల మంది సమష్టి భాగస్వామ్యం, ఆశీర్వాదంతో వివిధ రంగాల్లో శీఘ్ర అభివృద్ధి, ఎంతో పరివర్తన చోటుచేసుకున్నాయని తెలిపారు. బడుగు వర్గాలకు ప్రభుత్వంలో సరైన ప్రాతినిధ్యం లేదని, వారి ప్రయోజనాలకు విరుద్ధంగా తన ప్రభుత్వం పనిచేస్తున్నట్లుగా ప్రతిపక్షాలు చిత్రించే ప్రయత్నం చేస్తున్నాయని.. కానీ తన మంత్రివర్గంలో 60 శాతం మంది ఎస్సీ, ఎస్టీ, ఓబీసీలకు చోటు కల్పించామన్నారు. సామాజిక న్యాయానికి అధిక ప్రాధాన్యం ఇస్తున్నామని చెప్పారు. ఈ వర్గాలకు గతంలో ఎప్పుడూ ఇంత ప్రాతినిధ్యం లేదన్నారు. ఆర్థికాభివృద్ధి నుంచి సామాజిక సాధికారత వరకు ప్రభుత్వ కృషి మొత్తం ప్రజలే కేంద్రకంగా, సర్వతోముఖాభివృద్ధి దిశగా సాగుతోందన్నారు. ఈ సమష్టి విజయానికి గర్విస్తున్నామని.. ఇదే సమయంలో వికసిత్ భారత్ నిర్మాణానికి మొక్కవోని సంకల్పం తీసుకున్నామని తెలిపారు. వివిధ రంగాల్లో తెచ్చిన మార్పులను వివరించే సమాచారంతో కొన్ని లింకులను ఆయన పోస్టుచేశారు. 'పురోగామి రాజకీయాలను తీసుకొచ్చాం. వికాసవాదాన్ని ప్రధాన స్రవంతిలోకి తెచ్చాం. దేశవ్యాప్తంగా 81 కోట్ల మందికి ఉచితంగా ఆహార ధాన్యాలు అందిస్తున్నాం. 15 కోట్ల ఇళ్లకు కొళాయి కనెక్షన్లు ఇచ్చాం. 4 కోట్ల మందికి పైగా పేదలకు ఇళ్లు కట్టించి ఇచ్చాం. 12 కోట్ల మరుగుదొడ్లు నిర్మించాం. 68 లక్షల మంది వీధి వ్యాపారులకు రుణాలు అందించాం. కొవిడ్ సమయంలో వివిధ పథకాల కింద 20 కోట్ల మంది మహిళలకు నగదు సాయం అందించాం' అని వివరించారు.

సువర్ణాక్షరాలతో లిఖిస్తారు: నడ్డా

మోదీ ప్రభుత్వం తీసుకొచ్చిన సానుకూల మార్పులకు గాను దాని 11 ఏళ్ల పాలనను చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖిస్తారని బీజేపీ జాతీయ అధ్యక్షుడు, కేంద్ర ఆరోగ్య మంత్రి జేపీ నడ్డా అన్నారు. రాహుల్‌గాంధీ బాధ్యతారహిత విపక్ష నేత అని మండిపడ్డారు. పహల్గాం దాడి దరిమిలా నిర్వహించిన అఖిల పక్ష సమావేశానికి హాజరై.. ప్రభుత్వం వెంటే ఉంటామని చెప్పారని.. తీరా బయటకు వెళ్లాక బాధ్యత లేకుండా మాట్లాడారని... విదేశాంగ విధానం.. ఆపరేషన్ సిందూర్‌లో ఎన్ని యుద్ధవిమానాలు నష్టపోయామంటూ నిరాధార ప్రశ్నలు వేస్తున్నారని ధ్వజమెత్తారు. క్రికెట్ మ్యాచ్‌లో ఓటమికి ఆటగాళ్లు అంపైర్‌ను నిందించినట్లుగా.. మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో పరాజయానికి ఎన్నికల కమిషన్‌పై విమర్శలు చేస్తున్నారని ఆక్షేపించారు. ఆయనకు భగవంతుడు సద్బుద్ధి ప్రసాదిస్తాడన్న ఆశాభావం వ్యక్తంచేశారు. సోమవారం ఢిల్లీలో నడ్డా విలేకరులతో మాట్లాడారు. 11 ఏళ్ల మోదీ సర్కారు విజయాలను వివరించారు. 'యూపీఏ పదేళ్ల హయాంలో జరిగిన స్కాంలు, విభజన, బుజ్జగింపు రాజకీయాలు, నకారాత్మకతకు మోదీ స్వస్తి పలికారు. సవాళ్లను దీటుగా ఎదుర్కొంటూనే ప్రభుత్వాన్ని జవాబుదారీగా, స్పందించే విధంగా మలిచారు' అని తెలిపారు. ఎన్‌డీఏ ప్రభుత్వం ఈ ఐదేళ్లు మాత్రమే గాక.. వచ్చే ఐదేళ్లూ పాలన సాగిస్తుందన్న విశ్వాసం వ్యక్తంచేశారు.

స్వర్ణయుగం: అమిత్‌షా

11 ఏళ్ల మోదీ ప్రభుత్వం.. ప్రజాసేవలో అంకితభావం, సంకల్పం, కృషికి స్వర్ణయుగంగా కేంద్ర హోం మంత్రి అమిత్‌షా అభివర్ణించారు. మోదీ మూడో టెర్మ్‌లో నవభారతం అభివృద్ధి, స్వావలంబన దిశగా వేగంగా పురోగమిస్తోందని 'ఎక్స్'లో తెలిపారు. భారతీయుల జీవితాల్లో సానుకూల మార్పులు తీసుకురావడం ద్వారా భారత్‌ను ప్రతి రంగంలో నంబర్ వన్‌గా తీర్చిదిద్దే కృషి కొనసాగుతుందన్నారు. గత 11 ఏళ్ల 'సేవలో' 'కనిష్ఠ ప్రభుత్వం.. గరిష్ఠ పాలన'తో దేశాభివృద్ధి వేగం, పరిమాణాన్ని మోదీ ప్రభుత్వం మార్చివేసిందని తెలిపారు.



వర్తమానం వదిలేసి.. 2047 గురించి కలలా?

- ప్రచార ఆర్భాటమే తప్ప ఏ మార్పూ లేదు
- 11 ఏళ్ల మోదీ ప్రభుత్వ పాలనపై రాహుల్



న్యూఢిల్లీ, జూన్ 9: ప్రధాని మోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వ 11 ఏళ్ల పాలనపై ప్రతిపక్ష కాంగ్రెస్ విమర్శలు గుప్పించింది. మోదీ ప్రభుత్వ పాలనలో జవాబుదారీతనం లోపించిందని, ఎలాంటి మార్పు లేదని, ప్రచారం మాత్రమే కనిపిస్తోందని ఆ పార్టీ నేత రాహుల్ గాంధీ ఆరోపించారు. వర్తమానం గురించి మాట్లాడని కేంద్ర సర్కార్.. 2047 గురించి కలలు కంటోందని సోమవారం 'ఎక్స్' వేదికగా విమర్శించారు. మహారాష్ట్రలోని థానే జిల్లాలో కదులుతున్న, రద్దీగా ఉన్న లోకల్ రైలు నుంచి కింద పడి పలువురు ప్రయాణికులు మరణించిన ఘటనపై రాహుల్ స్పందించారు. 'మోదీ ప్రభుత్వం 11 ఏళ్ల పాలనను సెలబ్రేట్ చేసుకుంటుంటే.. ముంబై నుంచి వచ్చిన విషాద వార్త దేశంలోని వాస్తవ పరిస్థితికి అద్దం పడుతోంది' అని అన్నారు. భారతీయ రైల్వే కోట్లాది మంది ప్రజల జీవితాలకు వెన్నెముకగా అభివర్ణించిన కాంగ్రెస్ నేత.. ఈరోజున ఆ సంస్థ అభద్రత, రద్దీ, గందరగోళానికి చిహ్నంగా మారిందని విమర్శించారు. మోదీ ప్రభుత్వం రాజ్యాంగంలోని ప్రతి పేజీపై నియంతృత్వపు సిరా పూసిందని కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే ఆరోపించారు. ఈ 11 ఏళ్ల పాలన దేశ ప్రజాస్వామ్యం, ఆర్థిక వ్యవస్థ, సామాజిక నిర్మాణానికి పెద్ద దెబ్బ అని ఎక్స్ పోస్టులో అన్నారు. మోదీ ప్రభుత్వ 11 ఏళ్ల పాలనపై విమర్శలతో ప్రతిపక్ష కాంగ్రెస్ ఒక బుక్‌లెట్‌ను సోమవారం విడుదల చేసింది.

జస్టిస్ యాదవ్‌పై అంతర్గత విచారణ నిలిపివేత

- జడ్జిలపై దర్యాప్తు మా పరిధిలోనిదని రాజ్యసభ లేఖ
- శాసన వ్యవస్థతో ఘర్షణ వద్దని వెనక్కి తగ్గిన సుప్రీం

న్యూఢిల్లీ, జూన్ 9: మైనార్టీలపై వివాదాస్పద వ్యాఖ్యలు చేసిన అలహాబాద్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ శేఖర్ కుమార్ యాదవ్‌పై అంతర్గత విచారణను సుప్రీంకోర్టు విరమించుకొంది. న్యాయమూర్తిపై చర్యలు తీసుకునే అధికారం కేవలం పార్లమెంటుకు మాత్రమే ఉందని స్పష్టం చేస్తూ రాజ్యసభ సచివాలయం నుంచి లేఖ రావడంతో సర్వోన్నత న్యాయస్థానం తన ప్రయత్నాలకు స్వస్తి చెప్పినట్టు విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. గత ఏడాది డిసెంబరు 8న ప్రయాగ్‌రాజ్‌లో విశ్వహిందూ పరిషత్ నిర్వహించిన సదస్సులో ప్రసంగించిన జస్టిస్ యాదవ్ ముస్లింలపై వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. ఆయన వ్యాఖ్యలు లౌకికవాదానికి, న్యాయ వ్యవస్థ నిష్పక్షపాత పనితీరుకు విరుద్ధంగా ఉన్నాయంటూ పెద్దయెత్తున విమర్శలు వచ్చాయి. వీటిని పరిగణనలోకి తీసుకున్న అలహాబాద్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి ఆయనకు వ్యతిరేకంగా సుప్రీంకోర్టుకు నివేదిక పంపించారు. దాన్ని పరిశీలించిన అప్పటి సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సంజీవ్ ఖన్నా..జస్టిస్ యాదవ్ ప్రవర్తనపై సమీక్ష జరిపేందుకు అంతర్గత విచారణను ప్రారంభించారు. అయితే దీనిని అడ్డుకుంటూ మార్చి నెలలో రాజ్యసభ సెక్రటేరియట్ సుప్రీంకోర్టుకు లేఖ రాసింది. దీంతో సుప్రీంకోర్టు తన విచారణను నిలిపివేసింది. శాసన వ్యవస్థతో ఘర్షణ ఉండకూడదన్న ఏకైక కారణంతోనే సర్వోన్నత న్యాయస్థానం ఆ నిర్ణయం తీసుకొంది.

'చిన్నస్వామి'లో తొక్కిసలాటపై నేడు విచారణ

బెంగళూరు, జూన్ 9(ఆంధ్రజ్యోతి): బెంగళూరు చిన్నస్వామి స్టేడియం వద్ద ఆర్‌సీబీ విజయోత్సవాల సమయంలో జరిగిన తొక్కిసలాటపై హైకోర్టు ధర్మాసనం సుమోటోగా తీసుకున్న కేసు విచారణ మంగళవారం జరగనుంది. ఈ నెల 5న హైకోర్టు ధర్మాసనం సుమోటోగా ఈ ఘటనపై విచారణ చేపట్టి, సమగ్ర నివేదిక ఇవ్వాలని ప్రభుత్వాన్ని ఆదేశిస్తూ.. ఈ నెల 10వ తేదీకి వాయిదా వేసిన విషయం తెలిసిందే. ఇదిలా ఉండగా, తొక్కిసలాట ఘటనకు సంబంధించి తమపై కేసులు నమోదు కావడంతో ఆర్‌సీబీ, డీఎన్ఏ సోమవారం హైకోర్టును ఆశ్రయించాయి. ఆ సంఘటనతో తమకు ఎలాంటి సంబంధం లేదని, కేసునుంచి మినహాయింపు ఇవ్వాలని ఆర్‌సీబీ ఫ్రాంచైజీ పిటిషన్ దాఖలు చేసింది. కాగా, తొక్కిసలాట ఘటనతో సస్పెన్షన్‌కు గురైన బెంగళూరు పశ్చిమ విభాగం అదనపు పోలీస్ కమిషనర్ వికాస్ కుమార్ సెంట్రల్ అడ్మినిస్ట్రేటివ్ ట్రిబ్యునల్‌ను ఆశ్రయించారు.

కేంద్ర న్యాయశాఖ అదనపు కార్యదర్శిగా శ్రీనివాస్

న్యూఢిల్లీ, జూన్ 9(ఆంధ్రజ్యోతి): కేంద్ర న్యాయమంత్రిత్వ శాఖ అదనపు కార్యదర్శిగా రామిశెట్టి శ్రీనివాస్ నియమితులయ్యారు. కేంద్ర నియామకాల కమిటీ ఈ మేరకు అధికారిక ఉత్తర్వులు జారీ చేసింది. యూపీఎస్సీ ద్వారా ఇండియన్ లీగల్ సర్వీస్‌కు ఎంపికైన రామిశెట్టి శ్రీనివాస్ కేంద్ర న్యాయ శాఖలో ఉప కార్యదర్శిగా ఇంతకుముందు బాధ్యతలు నిర్వర్తించారు. శ్రీనివాస్ ఏపీలోని గుంటూరు జిల్లాలో జన్మించారు. మచిలీపట్నంలో చదువుకున్నారు.

95 ఏళ్ల వరుడు.. 90 ఏళ్ల వధువు!

- ఏడు దశాబ్దాల సహజీవనం తర్వాత వివాహం
- వారికి ఆరుగురు సంతానం



జైపూర్, జూన్ 9: చేతికర్ర పట్టుకొని.. బోసినవ్వుల మధ్య ఆ వధూవరులు పెళ్లి ప్రమాణాలు చేశారు! పెళ్లి కుమారుడికి 95 ఏళ్లు.. పెళ్లి కూతురికి 90 ఏళ్లు. రాజస్థాన్ దుంగార్పూర్ జిల్లాలోని గలందర్ గ్రామంలో ఈ వివాహం జరిగింది. వరుడు రామాభాయ్ అంగారీ, వధువు జివాలీదేవి 70 ఏళ్ల సహజీవనం తర్వాత పెళ్లి చేసుకున్నారు. ఈ జంటకు నలుగురు కుమారులు, ఇద్దరు కూతుళ్లు.. ఎంతో మంది మనుమలు, మనుమరాళ్లు ఉన్నారు. వృద్ధ నవ దంపతుల సంతానంలో నలుగురు ప్రభుత్వ ఉద్యోగులుగా పనిచేస్తున్నారు. పెద్ద కుమారుడు బాకూ అంగారీ (65) రైతు. రెండో కుమారుడు శివరామ్ (55), మూడో కుమారుడు కాంతీలాల్ (52) ఉపాధ్యాయులుగా పనిచేస్తున్నారు. మరో సంతానం లక్ష్మణ్ (52) రైతు కాగా కూతుళ్లలో సునీత టీచర్‌గా, అనిత నర్సుగా పనిచేస్తున్నారు. సంతానం బలవంతమ్మీదే హల్దీ, మెహందీ వేడుకల నిర్వహణతో పాటు పూర్తి సంప్రదాయ లాంఛనాల మధ్య అత్యంత వైభవంగా వృద్ధ జంట పెళ్లి జరిగింది. ఇప్పుడీ పెళ్లి తాలూకు ఫొటోలు, వీడియోలు నెట్‌లో వైరల్‌గా మారాయి.

విమానం మెట్లపై తూలి పడ్డ ట్రంప్!



న్యూఢిల్లీ, జూన్ 9: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌కు ఓ చేదు అనుభవం ఎదురైంది. ఆదివారం న్యూజెర్సీ నుంచి వాషింగ్టన్ డీసీకి వచ్చేందుకు ట్రంప్.. ఎయిర్‌ఫోర్స్ వన్ విమానం ఎక్కుతూ మెట్లపై తూలిపడబోయారు. ఎలాగోలా నియంత్రించుకుని మెట్లెక్కి నవ్వుతూ అభివాదం చేసినా.. ఈ దృశ్యం మీడియా కెమెరాలకు చిక్కింది. ఇంకేముంది.. సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. నెటిజన్లు ట్రంప్‌ను ఆడేసుకుంటున్నారు. 78 ఏళ్ల ట్రంప్‌ను అమెరికా మాజీ అధ్యక్షుడు జో బైడెన్‌తో పోలుస్తూ 'బైడెన్ 2.0' అంటూ జోకులు వేస్తున్నారు. గతంలో బైడెన్ కూడా ఇలాగే విమానం ఎక్కే క్రమంలో తూలిపడబోగా.. ఆయనపై ట్రంప్ సెటైర్లు వేసిన విషయాన్ని గుర్తు చేస్తున్నారు. బైడెన్‌కు వయసు మీరిందని, అధ్యక్ష ఎన్నికల్లో ఆయన తనకు పోటీయే కాదని చెప్పేందుకు, "బైడెన్ కనీసం విమానం మెట్లు కూడా ఎక్కలేరు.. దిగలేరు" అంటూ ట్రంప్ 2023 ఎన్నికల ప్రచారంలో మాట్లాడారు.

ఏఎస్‌జీఈ జర్నల్ అసోసియేట్ ఎడిటర్‌గా ఏఐజీ వైద్యుడు రాకేశ్ కలపాల



హైదరాబాద్, జూన్ 9 (ఆంధ్రజ్యోతి) : అమెరికన్ సొసైటీ ఫర్ గ్యాస్ట్రో ఇంటెస్టినల్ ఎండోస్కోపి(ఏఎస్‌జీఈ) జర్నల్ అసోసియేట్ ఎడిటర్‌గా డాక్టర్ రాకేశ్ కలపాల నియమితులయ్యారు. డాక్టర్ రాకేశ్ ప్రస్తుతం హైదరాబాద్‌లోని ఏఐజీ ఆస్పత్రిలో ఎండోస్కోపి విభాగానికి డైరెక్టర్‌గా వ్యవహరిస్తున్నారు. డాక్టర్ రాకేశ్ నియామకంపై ఏపీ సీఎం చంద్రబాబు 'ఎక్స్' వేదికగా స్పందించారు. ఆయనకు హృదయపూర్వక అభినందనలు తెలిపారు. ఈ గుర్తింపు కలపాల రాకేశ్ నైపుణ్యాస్థాయికి లభించిన గౌరవంగా కొనియాడారు. దేశానికి, తెలుగుజాతికి ఆయన గొప్ప విజయాన్ని తీసుకువచ్చారని ఏపీ సీఎం పేర్కొన్నారు.

శుభాన్షు శుక్లా రోదసి యాత్ర రేపటికి వాయిదా

న్యూయార్క్, జూన్ 9: భారతీయ వ్యోమగామి శుభాన్షు శుక్లా సహా నలుగురు వ్యోమగాములను అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రానికి తీసుకెళ్లే యాక్సియం-4 మిషన్ మరోసారి వాయిదా పడింది. నిర్ణీత షెడ్యూలు ప్రకారం మంగళవారం (జూన్ 10) సాయంత్రం 5.52 గంటలకు చేపట్టాల్సిన ఈ ప్రయోగాన్ని.. వాతావరణం అనుకూలించకపోవడంతో 11వ తేదీ సాయంత్రం 5.30 గంటలకు వాయిదావేసినట్టు ఇస్రో 'ఎక్స్' ద్వారా తెలిపింది. అటు స్పేస్ ఎక్స్ సంస్థ కూడా ఈ విషయాన్ని ఎక్స్ వేదికగా వెల్లడించింది. బుధవారం సాయంత్రం ఐదున్నర గంటలకు లాంచ్ చేయనున్నట్టు.. ఒకవేళ అప్పుడు కూడా కుదరకపోతే గురువారం సాయంత్రం 5.07 గంటల సమయాన్ని బ్యాకప్‌గా నిర్ణయించినట్టు తెలిపింది. యాక్స్-4 మిషన్‌ను తొలుత మే 29న చేపట్టడానికి అన్ని ఏర్పాట్లూ చేసి.. చివరి నిమిషంలో జూన్ 8వ తేదీకి, ఆ తర్వాత జూన్ 10వ తేదీకి వాయిదా వేసిన సంగతి తెలిసిందే.

479 డ్రోన్లతో రష్యా దాడి

కీవ్, జూన్ 9: ఉక్రెయిన్‌పై రష్యా 479 డ్రోన్లతో విరుచుకు పడింది. ఇరు దేశాల మధ్య యుద్ధం మొదలైన నాటి నుంచి ఒకే రాత్రి ఇన్ని డ్రోన్లు ప్రయోగించడం ఇదే మొదటిసారి. డ్రోన్లతో పాటు వివిధ రకాల 20 క్షిపణులను కూడా తమ దేశంలోని వివిధ ప్రాంతాలపైకి రష్యా పంపిందని ఉక్రెయిన్ తెలిపింది. ముఖ్యంగా మధ్య, పశ్చిమ ప్రాంతాలను లక్ష్యంగా చేసుకుని ఈ దాడులు జరిగాయని పేర్కొంది. రష్యా ప్రయోగించిన డ్రోన్లలో 277 డ్రోన్లను, 19 క్షిపణులను తమ వైమానిక దళం గాలిలోనే ధ్వంసం చేసినట్లు వెల్లడించింది. కేవలం పది డ్రోన్లు మాత్రమే లక్ష్యాలను ఛేదించగలిగాయని తెలిపింది.

సంకెళ్లు వేసి.. నేలకు అదిమి..

భారతీయ విద్యార్థి పట్ల అమెరికా అధికారుల అమానుషం

- అక్రమంగా వచ్చాడని వెనక్కి పంపిన వైనం
- న్యూజెర్సీ విమానాశ్రయంలో ఘటన

వాషింగ్టన్, జూన్ 9: అక్రమ వలసదారులను వెనక్కి పంపటంలో భాగంగా.. ఓ భారతీయ విద్యార్థిని అమెరికా అధికారులు చేతులు వెనక్కి కట్టి, సంకెళ్లు వేసి, నేలకు అదిమి పెట్టిన అమానుష ఘటన వెలుగులోకి వచ్చింది. అమెరికాలోని న్యూజెర్సీలో నేవార్క్ విమానాశ్రయంలో జరిగిన ఈ దారుణంపై భారతీయ అమెరికన్లు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. 'హెల్త్‌బాట్స్ ఏఐ' అనే సంస్థ ప్రెసిడెంట్‌గా ఉన్న ఎన్నారై కునాల్ జైన్.. ఈ ఘటన తాలూకు వీడియోను ఎక్స్‌లో షేర్ చేశారు. 'విమానాశ్రయంలో ఓ భారతీయ యువ విద్యార్థికి నేరస్థునిలా బేడీలు తగిలించి తిప్పి పంపటం చూశాను. కలలు సాకారం చేసుకోవటానికి ఆ యువకుడు ఈ దేశానికి వచ్చాడు. అంతేగానీ, ఎవరికీ హాని చేయటానికి కాదు. ఆ అబ్బాయి ఏడుస్తుంటే కూడా నేను ఏమీ చేయలేని నిస్సహాయ పరిస్థితిలో ఉండిపోయాను. నా గుండె పగిలిపోయినట్లు అనిపించింది. నిజంగా ఇది మానవ విషాదం' అని ఆవేదన వ్యక్తం చేశారు. సదరు యువకుడు హరియాణా భాష హరియాణ్వీ మాట్లాడుతున్నట్లు అనిపించిందని తెలిపారు. ఈ తరహా ఘటనలు ఇటీవలి కాలంలో తరచూ జరుగుతున్నాయన్నారు. 'వీసా లభించిన మార్నాడే ఉదయం అమెరికాలో అడుగుపెడుతున్న ఈ పిల్లలు.. తమ రాకకు కారణాలేమిటో సహేతుకంగా అధికారులకు చెప్పలేకపోతున్నారు. దాంతో వారిని నేరస్థుల్లా చూస్తూ, అదే రోజు సాయంత్రం విమానంలో తిప్పిపంపుతున్నారు' అని తెలిపారు. జైన్ షేర్ చేసిన ఫొటోలు, వీడియోలు వైరల్ అవుతున్నాయి. 'నేనేమీ పిచ్చివాడిని కాదు.. నన్ను అధికారులు పిచ్చివాడిలా మార్చాలని చూస్తున్నారు' అంటూ ఆ యువకుడు అరవటం ఓ వీడియోలో ఉంది. కాగా, పలువురు భారతీయ అమెరికన్లు ఈ ఘటనపై ఆగ్రహం, వ్యక్తం చేస్తున్నారు.



లాస్‌ఏంజెలెస్‌లో ట్యాక్సీలకు ఆందోళనకారుల నిప్పు

లాస్ ఏంజెలెస్‌కు విముక్తి కల్పిస్తాం!

అక్రమ వలసదారుల నుంచి లాస్ ఏంజెలెస్‌కు విముక్తి కలిగిస్తామని, వలసదారుల ఉద్యమాలను అణిచివేస్తామని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రకటించారు. దీనికి అవసరమైన అన్ని చర్యలు చేపట్టాలని సెక్రటరీ ఆఫ్ హోంల్యాండ్ సెక్యూరిటీ క్రిస్టీ నియోమ్‌ను ఆయన ఆదేశించారు. వలసదారుల బారి నుంచి నగరానికి స్వేచ్ఛకల్పించాలని పేర్కొన్నారు. "అమెరికాలో ఒకప్పుడు గొప్ప నగరంగా ఉన్న లాస్ ఏంజెలెస్.. అక్రమ వలసదారుల దండయాత్ర, నేరస్థుల ఆక్రమణలతో నిండిపోయింది. ఇప్పుడు హింసాత్మక తిరుగుబాటు దారులు ఫెడరల్ ఏజెంట్లపై(పోలీసులు) దాడులు చేస్తున్నారు. అంతేకాదు.. మనం చేపట్టిన బహిష్కరణ కార్యకలాపాలను నిలువరించే ప్రయత్నం చేస్తున్నారు" అని ట్రంప్ స్పష్టం చేశారు.

12 దేశాల పౌరులపై అమెరికా నిషేధం

డాకర్ (సెనెగల్), జూన్ 9 : విదేశాంగ విధానాన్ని డొనాల్డ్ ట్రంప్ ప్రభుత్వం మరింత కఠినతరం చేసింది. అమెరికాలో ప్రయాణించకుండా 12 దేశాల పౌరులపై నిషేధం విధించింది. మరో ఏడు దేశాల పౌరుల ప్రవేశాలపై కఠిన ఆంక్షల వేటు వేసింది. ఈ ఆదేశాలు మంగళవారం (భారత్ కాలమానం) నుంచి అమలులోకి వస్తాయి. దీని ప్రభావం ఆఫ్రికా, పశ్చిమాసియాలోని దేశాలపైనే అధికంగా పడనుంది. నిషేధం వేటు పడిన దేశాల్లో అఫ్ఘానిస్థాన్, ఇరాన్, మయన్మార్, చాద్, కాంగో, గినియా, ఎరిత్రియా, హైతీ, లిబియా, సోమాలియా, సూడాన్, యెమెన్ ఉన్నాయి. ఇక.. ప్రయాణ ఆంక్షలకు గురైన దేశాల్లో బురుండీ, క్యూబా, లావోస్, సియర్రా లియోన్, టోగో, తుర్క్‌మెనిస్థాన్, వెనెజులా ఉన్నాయి. అమెరికా బయట ఉంటూ, ధ్రువీకరించిన వీసాలు లేనిపక్షంతో ఈ ఏడు దేశాల పౌరులను అమెరికాలో ప్రయాణించడానికి అనుమతించరు.

నక్సల్స్ మందుపాతర పేలి అదనపు ఎస్పీ మృతి

దుమ్ముగూడెం/చింతూరు, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): ఛత్తీస్‌గఢ్‌లో మావోయిస్టులు వలపన్ని.. ఓ అదనపు ఎస్పీని బలిగొన్నారు. తొలుత రోడ్డుపై ఎక్స్‌కవేటర్‌ను తగులబెట్టి.. అక్కడికి పోలీసులు వచ్చే మార్గంలో మందుపాతరను అమర్చారు. ఈ ఘటనలో ఏఎస్పీ ఆకాశ్‌రావు గిర్పుంజే దుర్మరణంపాలయ్యారు. మరో ఇద్దరు పోలీసు అధికారులకు గాయాలయ్యాయి. బస్తర్ ఐజీ సుందర్‌రాజ్ కథనం ప్రకారం.. సుకుమా జిల్లా కుంట పోలీస్‌స్టేషన్ పరిధిలో క్వారీ దగ్గర ఎక్స్‌కవేటర్‌ను మావోయిస్టులు తగులబెట్టారు. ఆ సమయంలో కుంట పోలీసు వసతిగృహంలో ఉన్న అదనపు ఎస్పీ ఆకాశ్‌రావు గిర్పుంజే(42) విషయం తెలుసుకుని, తన సిబ్బందితో కలిసి వాహనాల్లో ఘటనాస్థలికి బయలుదేరారు. పోలీసులు వస్తారనే ఉద్దేశంతో ఆ మార్గంలో మావోయిస్టులు మందుపాతరను అమర్చారు. ఏఎస్పీ వాహనం అక్కడికి చేరుకోగానే.. మందుపాతరను పేల్చి, కాల్పులు జరిపారు. పోలీసులు ఎదురుకాల్పులకు దిగడంతో.. మావోయిస్టులు సమీప అడవుల్లోకి పారిపోయారు. ఈ ఘటనలో ఏఎస్పీ ఆకాశ్‌రావు, డీఎస్పీ భానుప్రతాప్ చంద్రకర్, ఇన్‌స్పెక్టర్ సోనాల్ గవ్లా తీవ్రంగా గాయపడ్డారు. ఏఎస్పీ చికిత్స పొందుతూ మృతిచెందారు. కాగా, నంబాల కేశవరావు ఎన్‌కౌంటర్‌కు నిరసనగా నక్సల్స్ మంగళవారం దేశవ్యాప్త బంద్‌కు పిలుపునిచ్చారు.

ఇజ్రాయెల్ బలగాలు నన్ను కిడ్నాప్ చేశాయి

పర్యావరణ ఉద్యమకారిణి గ్రెటా ఆరోపణ

జెరూసలేం, జూన్ 9: గాజా వాసులకు మానవతా సాయంగా బేబీ ఫుడ్, మందులు ఇతర ఆహార పదార్థాలను తీసుకొని వెళ్తున్న పర్యావరణ ఉద్యమకారిణి గ్రెటా థన్‌బర్గ్‌ను, ఆమెతో పాటు ఉన్న మరికొంత మంది హక్కుల కార్యకర్తలను ఇజ్రాయెల్ బలగాలు మధ్యలోనే అడ్డుకున్నాయి. వారు వెళ్తున్న ఓడను మధ్యధరా సముద్రంలోనే చుట్టుముట్టాయి. థన్‌బర్గ్, ఇతర కార్యకర్తలను అదుపులోకి తీసుకున్నాయి. దీనిపై గ్రెటా థన్‌బర్గ్ వీడియో విడుదల చేశారు. ఇజ్రాయెల్ బలగాలు తమను కిడ్నాప్ చేశాయని ఆరోపించారు. అయితే, థన్‌బర్గ్ ఆరోపణలను ఇజ్రాయెల్ ఖండించింది. పడవలో మానవతా సాయాన్ని తీసుకురావడాన్ని పబ్లిసిటీ స్టంట్‌గా అభివర్ణించింది. అది 'సెలబ్రిటీల సెల్ఫీ యాత్ర' అని ఎద్దేవా చేసింది. ఓడ ఇజ్రాయెల్ పోర్టుకు చేరుకున్న తర్వాత థన్‌బర్గ్, హక్కుల కార్యకర్తలందరినీ వారి స్వదేశాలకు పంపిస్తామని తెలిపింది. వారు తీసుకువచ్చిన మానవతా సాయాన్ని ఇప్పటికే ఏర్పాటు చేసిన మార్గాల ద్వారా గాజాకు చేరవేస్తామని వెల్లడించింది.

కదులుతున్న రైళ్లలోంచి జారిపడి నలుగురి మృతి

- ముంబ్రా రైల్వే స్టేషన్ సమీపంలో ఘటన, 9 మందికి గాయాలు
- రద్దీయే కారణమన్న అధికారులు



ముంబై, జూన్ 9: మహారాష్ట్ర థానే జిల్లాలో ఘోర రైలు ప్రమాదం జరిగింది. రద్దీగా ఉన్న రెండు లోకల్ ట్రైన్ల నుంచి జారిపడి నలుగురు ప్రయాణికులు మృతిచెందగా, తొమ్మిది మంది తీవ్రంగా గాయపడ్డారు. ముంబ్రా రైల్వేస్టేషన్ సమీపంలో సోమవారం ఉదయం ఈ ఘటన చోటు చేసుకుంది. కసారా, ఛత్రపతి శివాజీ టెర్మినస్ వైపు నుంచి ఎదురెదురుగా వెళ్తున్న రెండు రైళ్లు ప్రయాణికులతో కిక్కిరిసిపోయి ఉన్నాయని, ఇవి ఒకదానినొకటి దాటుతున్నప్పుడు ఈ ప్రమాదం జరిగిందని అధికారులు తెలిపారు. రెండు రైళ్లలో ఫుట్‌బోర్డులపై ప్రయాణిస్తున్న వారు ఒకరికొకరు తగలడంతో అదుపుతప్పి కిందపడిపోయారని అన్నారు. క్షతగాత్రులను సమీపంలోని ఆస్పత్రులకు తరలించామని, ఘటనపై దర్యాప్తు జరుపుతున్నామని రైల్వే పోలీసులు తెలిపారు. "ముంబై లోకల్ ట్రైన్లలో నిత్యం లక్షలాది మంది ప్రయాణం చేస్తుంటారు. రద్దీ సమయాల్లో తలుపులు తెరిచే ఉంచడం, ప్రయాణికులు ఫుట్‌బోర్డుపై ప్రయాణించడం సర్వసాధారణమైపోయింది" అని అధికారులు అన్నారు. ఈ క్రమంలో జరుగుతున్న ప్రమాదాలను అరికట్టేందుకు అన్ని సబర్బన్ రైళ్లకు ఆటోమేటిక్ డోర్ క్లోజింగ్ వ్యవస్థను ఏర్పాటు చేయాలనే అంశాన్ని పరిశీలిస్తున్నట్లు ఓ రైల్వే శాఖ అధికారి తెలిపారు. ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడణవీస్, డిప్యూటీ సీఎం ఏక్‌నాథ్ షిండే ఘటనపై విచారం వ్యక్తం చేశారు. బాధిత కుటుంబాలను ఆదుకుంటామని తెలిపారు. ఘటనపై ప్రతిపక్షాలు తీవ్రంగా స్పందించాయి. ప్రమాదానికి బాధ్యత వహిస్తూ రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్ రాజీనామా చేయాలని శివసేన(యూబీటీ) ఎంపీ ప్రియాంక చతుర్వేది డిమాండ్ చేశారు.



వజ్రకవచాలతో ఊరేగుతున్న ఉత్సవమూర్తులు

శ్రీవారి ఆలయంలో జ్యేష్ఠాభిషేకం ప్రారంభం

తిరుమల, జూన్9(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారి ఆలయంలో సోమవారం జ్యేష్ఠాభిషేకం శాస్త్రోక్తంగా ప్రారంభమైంది. జ్యేష్ఠానక్షత్రానికి ముగిసేట్టు ఏటా మూడురోజుల పాటు శ్రీవారికి జ్యేష్ఠాభిషేకం నిర్వహిస్తారు. తొలిరోజు సోమవారం ఆలయంలోని సంపంగి ప్రదక్షిణంలో ఉన్న కల్యాణమండపంలో ఉదయం, సాయంత్రం ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహించారు. సాయంత్రం ఉత్సవమూర్తులు వజ్రకవచాలతో నాలుగుమాడవీధుల్లో ఊరేగి భక్తులకు దర్శనమిచ్చారు. కాగా, ఈవారం చివరి మూడు రోజుల్లో 2.51 లక్షల మంది భక్తులు శ్రీవారిని దర్శించుకున్నారు. రూ.10.29 కోట్లు హుండీ ఆదాయం లభించింది.

అబద్ధాలు ప్రచారం చేస్తే చర్యలు: టీటీడీ

'తిరుమలలో మద్యం సేవించిన వ్యక్తి' అంటూ సోషల్ మీడియాలో ఒక వీడియోను ప్రచారం చేస్తున్నారని, అది నిజం కాదని టీటీడీ సోమవారం ఓ ప్రకటన ద్వారా తెలిపింది. 'ఈ ఘటన అలిపిరి ప్రారంభంలో అంటే తనిఖీ కేంద్రానికి వచ్చే ముందు ప్రాంతంలో చోటుచేసుకుంది. ఈప్రాంతం తిరుమల పరిధిలోకి రాదు. తిరుమల పవిత్రతను దెబ్బతీసేలా అసత్యాలను ప్రచారం చేస్తున్న వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటాం' టీటీడీ హెచ్చరించింది.

ఆలయ భూములు అన్యాక్రాంతం కానివ్వం: మంత్రి ఆనం

నంద్యాల, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఆలయ భూములు అన్యాక్రాంతం కాకుండా చర్యలు తీసుకుంటున్నట్టు దేవదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి తెలిపారు. సోమవారం నంద్యాల జిల్లా మహానందిలో రూ.12 కోట్ల వ్యయంతో తలపెట్టిన వసతి గృహాల నిర్మాణానికి మంత్రులు ఆనం రామనారాయణ రెడ్డి, ఎన్ఎండీ ఫరూక్, శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి భూమి పూజ చేశారు. మంత్రి ఆనం మాట్లాడుతూ ప్రతి ఆలయంలో సామాన్య భక్తులకు ప్రాధాన్యమివ్వడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు.

ప్రశాంతంగా ఏపీ పీజీసెట్... తొలిరోజు కీ విడుదల

తిరుపతి(విద్య), జూన్ 9(ఆంధ్రజ్యోతి): ఏపీ పీజీసెట్-2025 సోమవారం ప్రశాతంగా ప్రారంభమైనట్టు సెట్ ఛైర్మన్, ఎస్వీయూ వీసీ అప్పారావు తెలిపారు. నాలుగు రోజులపాటు పరీక్షలు జరగనున్నాయి. తొలిరోజు పరీక్షలకు సంబంధించిన కీని ఆయన విడుదల చేశారు. హైదరాబాదుతోపాటు ఏపీలోని మొత్తం 14 కేంద్రాల్లో మూడు సెషన్లుగా పరీక్షలు జరిగాయని, తొలిరోజు 17 సబ్జెక్టులకు పరీక్షలు జరగ్గా 81 శాతం మంది హాజరయ్యారని వెల్లడించారు.

'డ్రాగన్' ప్రకంపనలపై సీఎంవో ఆరా

'ఆంధ్రజ్యోతి' కథనంపై స్పందించిన అధికారులు

- మిర్చి ఎగుమతులపై సమగ్ర నివేదికకు ఆదేశం
- చైనా కస్టమ్స్ రిపోర్టును తెప్పించి పరిశీలించిన మార్కెటింగ్ శాఖ
- 60 కంటైనర్లను తిరస్కరించినా.. నగదు జమ అయినట్లు వెల్లడి
- అయితే భవిష్యత్తులో ఇబ్బందులు తప్పవనే ఆందోళన

[ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్]

గుంటూరు, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): గుంటూరు మిర్చి మార్కెట్‌లో డ్రాగన్ ప్రకంపనలపై ముఖ్యమంత్రి కార్యాలయం ఆరా తీసింది. గుంటూరు మిర్చి ఎగుమతిదారులు ఎగుమతి చేసిన చేసిన కంటైనర్లలో 60 తిరస్కరణకు గురైన విషయంపై సోమవారం 'ఆంధ్రజ్యోతి' ప్రచురించిన కథనంపై స్పందించింది. ఈ వ్యవహారంలో మార్కెటింగ్, వ్యవసాయ, ఉద్యానవన శాఖల నుంచి సమగ్ర నివేదిక కోరింది. దాంతో ఆయా శాఖల అధికారులు మిర్చి ఎగుమతి, దిగుమతిదారులు, గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ అధికారులకు ఫోన్లు చేసి వివరాలు తీసుకొన్నారు. కంటైనర్లను నిలిపేస్తూ చైనాలోని క్విండావో పోర్టు కస్టమ్స్ అధికారులు జారీ చేసిన సర్టిఫికెట్, పురుగుమందు అవశేషాలున్న ల్యాబ్ రిపోర్టులు, విజయవాడ కస్టమ్స్ శాఖకు ఇక్కడి ఎగుమతిదారులు చేసుకొన్న విజ్ఞప్తి పత్రాలను మార్కెటింగ్ కమిషనర్ కార్యాలయ అధికారులు సేకరించి సీఎంవోకు నివేదిక ఇచ్చారు. కాగా, కంటైనర్లు తిరస్కారానికి గురైన విషయం తెలియడంతో మిర్చి మార్కెట్‌లో కలకలం రేకెత్తించింది. ఇది ఇరుదేశాల మధ్యన ఎలాంటి ట్రేడ్ వార్‌కు దారి తీస్తుందో నని వ్యాపారవర్గాల్లో ఆందోళన నెలకొంది.

చైనా, మిగతా దేశాల ఎగుమతి విధానంలో తేడాలు!

అంతర్జాతీయంగా మిర్చి ఎగుమతులకు గుంటూరు పెట్టింది పేరు. ఇక్కడ పండే తేజ వెరైటీ మిర్చి ఘాటే ఇందుకు కారణం. దాంతో ఆయా దేశాల ప్రజలు ఆహార పదార్థాల తయారీలో ఈ రకాన్ని ఎక్కువగా వినియోగిస్తుంటారు. యూరప్, అమెరికా ఖండాల్లోని దేశాలు ఏ ఆహారోత్పత్తినైనా దిగుమతి చేసుకోవడానికి మినిమిం రెసిడ్యూవల్ లెవల్(ఎంఆర్ఎల్)ని చూస్తాయి. పురుగుమందుల అవశేషాలు మోతాదుకు మించి ఉండరాదు. ఈ దేశాలకు ఇక్కడి ఎగుమతిదారులు ముందుగానే వాళ్ల సూచికల మేరకు మిర్చి నాణ్యత ఉందో, లేదో స్పైసెస్ బోర్డు ల్యాబ్‌లో టెస్టింగ్ చేయిస్తారు. అంతా సవ్యంగా ఉంటేనే సరుకు ఎక్స్‌పోర్టు చేస్తారు. చైనా విషయంలో అలా కాదు. ఎక్స్‌పోర్టు చేసే ముందు స్పైసెస్ బోర్డుకు శాంపిల్ పంపిస్తారు. ఆ సంస్థ శాంపిల్ డ్రా చేసినట్లు సర్టిఫికెట్ ఇస్తుంది. టెస్టు రిపోర్టుతో సంబంధం లేకుండా చెన్నై పోర్టు నుంచి చైనాకు ఎక్స్‌పోర్టు చేస్తారు. ఆ దేశంలో ప్రధానంగా షికావో, క్విండావో పోర్టులకే కంటైనర్లలో మిర్చి షిప్‌ల ద్వారా ఎగుమతి అవుతుంటుంది. ఈ రెండు పోర్టుల్లో నిబంధనలు వేరుగా ఉన్నాయి. ఎప్పుడైతే పోర్టుకు కంటైనర్లు చేరాయో ఆ సమాచారం ఇక్కడి ఎగుమతిదారులకు ఆన్‌లైన్‌లో తెలిసిపోతుంది. దాంతో వీళ్లు మెయిల్‌లో గూడ్స్ సరెండర్ మెసేజ్ పంపుతారు. దాని ఆధారంగా అక్కడి దిగుమతిదారుకు పోర్టు అధికారులు కంటైనర్‌ను స్వాధీనపరుస్తారు. ఆ వెంటనే దిగుమతిదారు భారత్‌లోని ఎగుమతిదారులకు మొత్తం నగదును ఆన్‌లైన్‌లో బదిలీ చేస్తారు. తదుపరి కంటైనర్లను కస్టమ్స్ అధికారులు పోర్టులో తనిఖీ చేయరు. వేర్‌హౌస్‌కు తీసుకెళ్లి క్వారంటైన్ చేయాలని చెప్పి రెండు, మూడు రోజుల వ్యవధిలో యాదృచ్ఛికంగా కొన్ని కంటైనర్లలో శాంపిల్స్ తీస్తారు. వాటిని టెస్టులకు పంపుతారు. అయితే అక్కడి ఎగుమతిదారులు కస్టమ్స్ అధికారులను మేనేజ్ చేసుకొని గూడ్స్ పాస్ సర్టిఫికెట్ తీసుకొని మిర్చిని విక్రయించుకొంటుంటారు. అయితే, భారత్, చైనా మధ్యన దిగుమతుల విషయంలో పరస్పరం సుంకాలు విధించినప్పుడు, ఏవైనా సరుకులు తిరస్కరించినప్పుడు ఇలా ఇబ్బందులు పెడుతుంటారని ఇక్కడి ఎగుమతిదారులు చెబుతున్నారు. గతంలో ఉత్తర భారతదేశం నుంచి జీలకర్ర కంటైనర్లను ఇలానే అక్కడి కస్టమ్స్ తిరస్కరించిందని గుంటూరు మిర్చి ఎక్స్‌పోర్టర్లు తెలిపారు. ఇప్పుడు తిరస్కరించిన 60 కంటైనర్లకు సంబంధించి మిర్చి ఎగుమతిదారులకు ఇప్పటికిప్పుడు వచ్చిన నష్టం ఏమీలేదు. అక్కడ దిగుమతి అయిన సరుకు మొత్తానికి చెల్లింపులు జరిగాయి. ఒకసారి శాంపిల్ నెగెటివ్ రిపోర్టు వస్తే ఆ సరుకును వేర్‌హౌస్ నుంచి బయటకు కదలనివ్వరు. మరోసారి శాంపిల్ పరీక్షకు దరఖాస్తు చేసుకొనేందుకు అవకాశం కల్పిస్తారు. లేకుంటే కస్టమ్స్ నిర్ణయంపై అక్కడి కోర్టులో అప్పీలు చేసుకొనేందుకు అనుమతి ఇస్తారు. ఇందుకు అంగీకరించకపోతే దిగుమతి అయిన సరుకును వెనక్కి పంపించాలి. ఇలా కంటైనర్ వెనక్కి వచ్చిందంటే ఎగుమతి వ్యాపారి తీవ్రంగా నష్టపోతాడు. అంతేకాకుండా ఆ మిర్చిని స్థానిక మార్కెట్‌లో విక్రయించుకోవాలి. అప్పుడు మార్కెట్ కమిటీలకు ఎరైవల్స్ పెరిగి ధర పతనమయ్యే ప్రమాదం ఉంటుంది. ఇదే పరిస్థితి కొనసాగితే భవిష్యత్తులో సరుకు దిగుమతి చేసుకొని నగదు చెల్లించకుండా దిగుమతిదారులు సమస్యలు సృష్టించే అవకాశం ఉందని ఎక్స్‌పోర్టర్లు తెలిపారు. తమ మధ్య వ్యాపార సంబంధాలు దెబ్బ తింటాయని, ఇది మిర్చి ఎగుమతులకు పెనుముప్పుగా పరిణవిస్తుందని చెబుతున్నారు. ఏటా రూ. 10 వేల కోట్లకు పైగా విదేశీ మారకద్రవ్యాన్ని రాబడుతున్న మిర్చి ఎగుమతులు తిరస్కరణకు గురైతే దేశం ఆదాయాన్ని కూడా కోల్పోవాల్సి వస్తుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఏపీఈఏపీ సెట్‌లో 'ఆదిత్య' విద్యార్థుల హవా

కాకినాడ రూరల్, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): ఏపీఈఏపీ సెట్-2025 ఫలితాల్లో కాకినాడ 'ఆదిత్య' విద్యార్థుల హవా కొనసాగింది. రాష్ట్ర స్థాయిలో ఇంజనీరింగ్ విభాగంలో పి.ఆదిత్య అభిషేక్ (13), జి.లోషిణి (72), వై.శుభశ్రీవల్లీఆత్రేయి (91), జి.శ్రీరామ శశాంక్ (95), వై.వేజిత్ (96) ర్యాంకులు సాధించారు. 121, 136, 156, 169, 170, 172, 177, 198 ర్యాంకులను కూడా తమ విద్యార్థులు కైవసం చేసుకున్నారని ఆదిత్య విద్యా సంస్థల కార్యదర్శి ఎన్.కృష్ణదీపక్‌రెడ్డి సోమవారం తెలిపారు. అగ్రికల్చర్ ఫార్మసీ విభాగంలో వి.సాయిభవ్య హర్షిణి (31), డి.దేవిసౌమ్యశ్రీ (112), పి.సాయిశ్రీధర్ (119), సీహెచ్ శ్రీవెంకటశివ సాయి అచ్యుత (152) ర్యాంకులు సాధించారు. 100లోపు ఆరుగురు, 500లోపు 38 మంది, 1000లోపు 62 మంది ర్యాంకులు సాధించారు. ప్రతిభ కనబరిచి ఉత్తమ ర్యాంకులు సాధించిన విద్యార్థులను ఆదిత్య విద్యా సంస్థల ఛైర్మన్ ఎస్. శేషారెడ్డి, హాస్టల్స్ డైరెక్టర్ లక్ష్మీరాజ్యం, డైరెక్టర్లు శృతి, సుగుణ, ప్రిన్సిపాల్ మొయినా అభినందించారు.

ముగిసిన మావోయిస్టు సుధాకర్ అంత్యక్రియలు



సుధాకర్ భౌతికకాయం వద్ద నివాళులర్పిస్తున్న ప్రజా సంఘాలు, సీపీఎం, సీపీఐ నాయకులు

పెదపాడు, జూన్ 9(ఆంధ్రజ్యోతి) : మావోయిస్టు కీలకనేత, కేంద్ర కమిటీ సభ్యుడు తెంటు సుధాకర్(65) అంత్యక్రియలు ఏలూరు జిల్లా పెదపాడు మండలం సత్యవోలు గ్రామంలో సోమవారం ఉదయం ముగిశాయి. సుధాకర్ భౌతికకాయంపై ఎర్రజెండా కప్పి పలువురు నివాళులర్పించారు. సీపీఎం, సీపీఐ, ప్రజా సంఘాల నాయకులు, రచయితలు విప్లవ గీతాలను ఆలపించారు. సుధాకర్ భౌతికకాయాన్ని సందర్శించేందుకు పెద్ద సంఖ్యలో గ్రామస్థులతో పాటు చుట్టుపక్కల ప్రాంతాల వారు తరలివచ్చారు. సుధాకర్ భౌతికకాయాన్ని ట్రాక్టర్‌పై ఉంచి శ్మశానవాటికకు తరలించగా, సుధాకర్ అన్న ఆనందరావు అంత్యక్రియలు నిర్వహించారు.

అలిపిరిలో ఎయిర్ పిస్టల్ కలకలం



ఎయిర్ పిస్టల్, టెలిస్కోప్‌తో పట్టుబడిన మహేష్

తిరుమల,జూన్ 9(ఆంధ్రజ్యోతి): తిరుమల ముఖద్వారమైన అలిపిరి చెక్‌పాయింట్ తనిఖీల్లో సోమవారం ఎయిర్ పిస్టల్ బయటపడింది. బెంగళూరుకు చెందిన మహేష్ కుటుంబం తిరుమలకు కారులో వెళ్తుండగా ఓ బ్యాగులో ఇది కనిపించింది. అందులో ఈక్వటోరియల్ టెలిస్కోప్ కూడా ఉండడంతో భద్రతా సిబ్బంది మహేష్‌ను అదుపులోకి తీసుకుని ప్రశ్నించారు. తన సోదరుడి కారు తీసుకువచ్చానని, అందులో ఏమున్నదీ తాను చూసుకోలేదని అతను చెప్పాడు. మహేష్ సోదరుడితో విజిలెన్స్ అధికారులు ఫోన్‌లో మాట్లాడగా, పిల్లల కోసం వాటిని కొనుగోలు చేశానని, కారు నుంచి వాటిని తీయడం మర్చిపోయినట్టు వివరించాడు. విచారణ కోసం మహేష్‌ను అలిపిరి పోలీసులకు అప్పగించారు.

కాంగ్రెస్ రెబల్స్ సభ రసాభాస

- కడపలో వైఎస్ షర్మిలకు వ్యతిరేకంగా సుంకర పద్మశ్రీ సమావేశం
- అడ్డుకున్న కాంగ్రెస్ నేతలు.. తీవ్ర వాగ్వాదం



సుంకర పద్మశ్రీతో పార్టీ పులివెందుల నియోజకవర్గ ఇన్‌చార్జి ధ్రువకుమార్ వాగ్వాదం చేస్తున్న దృశ్యం

కడప కలెక్టరేట్, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): కడపలో పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిలకు వ్యతిరేకంగా ఏఐసీసీ సభ్యురాలు సుంకర పద్మశ్రీ నిర్వహించిన సమావేశం రసాభాసగా మారింది. సోమవారం ఇక్కడి ఐఎంఏ హాలులో సుంకర పద్మశ్రీ, ఇద్దరు మాజీ డీసీసీ అధ్యక్షులు గుండ్లకుంట శ్రీరాములు, నజీర్ అహమ్మద్ (ప్రస్తుతం ఇతను వైసీపీ), ఎస్ఏ సత్తార్, మరికొందరు రెబల్స్‌తో సమావేశం ఏర్పాటు చేశారు. దీనిని డీసీసీ అధ్యక్షురాలు విజయజ్యోతి ఆధ్వర్యంలో నియోజకవర్గ ఇన్‌చార్జిలు ఇర్ఫాన్‌బాషా, అశోక్ రెడ్డి, ధ్రువకుమార్ రెడ్డి, శివమోహన్ రెడ్డి, మైనుద్దీన్, మరికొందరు నేతలు అడ్డుకున్నారు. వైఎస్ షర్మిలారెడ్డి జిందాబాద్ అంటూ నినాదాలు చేశారు. పద్మశ్రీ వర్గం మాత్రం రాహుల్ గాంధీ నాయకత్వం వర్ధిల్లాలంటూ నినాదాలు చేశారు. దీంతో ఉద్రిక్తత పెరిగి రెండు వర్గాల మధ్య తోపులాటకు దారి తీసింది. ఒక దశలో చొక్కాలు పట్టుకొని కొట్టుకునేందుకు సిద్ధమయ్యారు. పోలీసుల రాకతో గొడవ సద్దుమణిగింది. రెండు రోజుల పర్యటన కోసం ఆదివారం కడపకు వచ్చిన సుంకర పద్మశ్రీ.. సోమవారం కాంగ్రెస్ రెబల్స్‌తో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పద్మశ్రీ మాట్లాడుతూ.. వైఎస్ షర్మిల కాంగ్రెస్ పార్టీని భ్రష్టు పట్టించారని, పీసీసీ పగ్గాలు చేపట్టాక జగన్‌ను టార్గెట్ చేయడమే తప్ప పార్టీ పూర్వ వైభవానికి పాటుపడడం లేదని ఆరోపించారు. షర్మిల పనితీరును రాహుల్ గాంధీకి వివరిస్తానని చెప్పారు. కాగా.. షర్మిలకు వ్యతిరేకంగా సుంకర పద్మశ్రీ మాట్లాడిన విషయం తెలుసుకున్న కాంగ్రెస్ నాయకులు ఆ సమావేశాన్ని అడ్డుకున్నారు. పథకం ప్రకారం ప్యాకేజీ తీసుకుని కడపలో షర్మిలను టార్గెట్ చేశారన్నారు. ఈ నేపథ్యంలో ఇరువర్గాల మధ్య వాగ్వాదం జరిగింది.





ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

మిత్రభేదం

ఇద్దరు సెలబ్రిటీల మధ్య ఘర్షణ మిగతావారికి చూడముచ్చటగానే ఉంటుంది. అగ్రరాజ్యాధినేత డోనాల్డ్ ట్రంప్‌కూ, అపరకుబేరుడు ఎలాన్ మస్క్‌కూ మధ్యన అలనాటి ఆత్మీయతలూ ఆలింగనాలు చెరిగిపోయి, అపహాస్యాలు, అవహేళనల దశ కూడా దాటిపోయి, ఇప్పుడు అనుమానాలూ హెచ్చరికల వరకూ పరిస్థితి వచ్చేసింది. అంతిమంగా ఎవరిది పైచేయి కావచ్చునన్న విశ్లేషణలను అటుంచితే, స్వప్రయోజనాలను రక్షించుకొనే విషయంలోనే వీరిద్దరి మధ్యా ఘర్షణ ఏర్పడిన మాట వాస్తవం.

ట్రంప్‌ను గెలిపించింది తానేనన్న అహంకారం మస్క్‌కు ఉన్నా తప్పేమీ లేదు. అధికారికంగా ఓ మూడువందల మిలియన్ డాలర్ల ఎన్నికల ఖర్చు భరించి, తన గుప్పిట్లో ఉన్న సోషల్‌మీడియాద్వారా ట్రంప్‌ను అమెరికా రక్షకుడుగా ప్రచారం చేసి మరీ ఆయనను కుర్చీలో కూర్చోబెట్టాడు మస్క్. అధికారంలోకి రాకముందునుంచే మస్క్‌ను మించిన మేధావి ఈ భూప్రపంచంలోనే లేడంటూ ఆకాశానికి ఎత్తేసిన ట్రంప్, కుర్చీలో కూచోగానే, తన తరువాత తనంతటివాడు ఆయనేనని స్పష్టంచేస్తూ సమస్తవ్యవస్థలనూ ప్రక్షాళించే బాధ్యతలను అప్పగించాడు. అమెరికా ఒక్కటే కాదు, మిగతా ప్రపంచం కూడా ఏనాడూ ట్రంప్‌వేరు, మస్క్ వేరు అనుకోలేదు. ఎలాన్ ఎలా అంటే అలా చెల్లుబాటయ్యేలా సమస్త శక్తినీ, సర్వాధికారాలనూ అతడికి ధారపోసి తనను అధికారంలోకి తెచ్చిన ఆ రుణం తీర్చుకోవడానికి ట్రంప్ సిద్ధపడ్డాడు. ఖర్చులు తగ్గించేపేరిట అన్నిరంగాల్లోనూ వేలుపెడుతున్నాడని, సైనిక రహస్యాలనూ, గూఢచర్యం గుట్టునూ తెలుసుకుంటున్నాడని ఎన్నో విమర్శలు వచ్చాయి, న్యాయస్థానాల్లో కేసులూ పడ్డాయి. ఇలా మస్క్ మంచి జోరుమీద ఉండగా, ఖర్చు తగ్గించే ఎజెండాకు పూర్తిభిన్నంగా ట్రంప్ తెరమీదకు తెచ్చిన సదరు బిగ్ బ్యూటిఫుల్ బిల్ ఇద్దరి మధ్యా వివాదానికి కారణమైంది. చిన్న,మధ్యతరహా పరిశ్రమలకు పన్నుల్లో కోతనూ, భారీ వ్యయాన్ని ప్రతిపాదిస్తున్న ఈ బిల్లుమీద మస్క్ తన మనసులో ఉన్న ఆగ్రహాన్ని పూర్తిగా కక్కేశారు. ఒకపక్క వేలాదిమంది ఉద్యోగాలు పీకేస్తూ, విదేశీనిధులను నిలిపివేస్తూ తాను ప్రతీ డాలర్ కూడబెడుతూంటే ఈ నికృష్టపు బిల్లు ఏమిటన్నది మస్క్ వాదన. ఈ ఘర్షణ మధ్యనే, ఒక పదవిని భర్తీచేసే విషయంలో ఆర్థికమంత్రికి అనుకూలంగా ట్రంప్ వ్యవహరించినందున మస్క్ మనసు నొచ్చుకుందని, తనతో అవమానకరంగా వ్యవహరించిన ఆర్థిక మంత్రి స్కాట్ బిసెంట్‌తో ముష్టిఘాతాలకు దిగాడని ఇటీవలే ఓ వార్త వెలుగులోకి వచ్చింది. యావత్ ప్రపంచంలో మస్క్‌ను మించిన మేధావి తనకు కనబడనేలేదని ఒకప్పుడు ప్రశంసించిన ట్రంప్ అదేనోటితో చివరకు పిచ్చోడని తీసిపారేశారు. మస్క్‌కు వీడ్కోలు చెప్పడానికి కూడా ట్రంప్‌కు మనసురాలేదని అంటారు. ఒక విధానపరమైన అసమ్మతిగా మొదలైన ఈ వ్యవహారానికి శ్రుతిమించిన అహంకారాలు తోడై విస్తృత రాజకీయ యుద్ధంగా మారింది. ట్రంప్ గతాన్ని తవ్వుతూ, ప్రత్యేకించి జెఫ్రీ ఎప్‌స్టీన్ కేసు ప్రస్తావన చేస్తూ, అధ్యక్షుడిని అభిశంసించాలంటూ పోస్టులు పెట్టడం వరకూ మస్క్ పోయారు. తాను వ్యతిరేకిస్తున్న బిల్లుకు అనుకూలంగా ఓటేసిన రిపబ్లికన్లను వచ్చే ఏడాది ఎన్నికల్లో ఓడిస్తానని కూడా శపథం చేశారు. డెమోక్రాట్లకు ఆర్థికసాయం చేస్తే నిన్ను ఇక క్షమించేది లేదని ట్రంప్ మరోపక్క బెదిరిస్తున్నారు. మస్క్, టెస్లాలమీద ట్రంప్ మనసు విరిగిపోయిన కారణంగా ఆ సంస్థ లక్షలాదికోట్లు కోల్పోయింది. గతంలో స్పేస్ ఎక్స్‌ను అమితంగా శ్లాఘించిన ట్రంప్ ఇప్పుడు దానితో ఫెడరల్ ప్రభుత్వానికి ఉన్న కాంట్రాక్టులన్నీ రద్దు చేస్తానని బెదిరిస్తూ, నాసా ప్రాజెక్టుల భవిష్యత్తునే ప్రశ్నార్థకంగా మార్చేశారు.

తనకు హామీ ఇచ్చినదానికి భిన్నంగా చమురులాబీ పక్షాన ట్రంప్ నిర్ణయాలు కొనసాగుతూండటంతో, ఈ విద్యుత్ వాహనాల తయారీదారుడు తట్టుకోలేకపోతున్నారని అంటారు. నాసా అధినేత నియామకం కూడా ఇరువురి మధ్యా వైషమ్యాలు పెంచిందట. ట్రంప్–మస్క్ వివాదం రాజకీయాల్లో వ్యాపారవేత్తల ప్రత్యక్షపాత్రమీద తీవ్ర చర్చను లేవనెత్తుతోంది. పారిశ్రామికవేత్తలకు, రాజకీయనాయకులకు మధ్య ఉన్న సంబంధం తెలియనిదేమీ కాదు. ఎన్నికల ఖర్చుకోసం వారినుంచి నిధులు అందుకోవడం, అధికారంలోకి వచ్చిన తరువాత వారికి కొన్ని మేళ్ళు చేసిపెట్టడం అనాదిగా ఉన్నదే. కానీ, అమెరికాను మళ్ళీ మహోన్నత దేశంగా నిలబెడతానన్న ట్రంప్ తనకు ఎన్నికల నిధులు సమకూర్చిన మస్క్‌కు ప్రభుత్వంలో కీలకబాధ్యతలు అప్పగించి చిట్టచివరకు తనకూ, దేశానికీ కూడా అప్రదిష్ఠ మిగిల్చారు.

యుద్ధారవాలు... నదీబంధనాలు!

మధ్యతరగతి ప్రజల్లో వారుణాస్త్రం గురించి తెలియని వారు ఉండరు. ప్రాచీన సాహిత్యంతో పరిచయం లేకపోయినా పౌరాణిక సినిమాలు కొన్నైనా చూసి ఉంటే దాని మహిమ కొంతైనా అర్థం అవుతుంది. ప్రత్యర్థులను అన్నివైపుల నుంచి నీటి ఉధృతిలో ముంచి ఆయుధాలు ప్రయోగించకుండా కట్టడిచేసి యుద్ధంలో పైచేయి సాధించటం వారుణాస్త్ర ప్రయోగ లక్ష్యంగా ఉండేది. కల్పిత కథల్లో ఊహాస్త్రంగా దాన్ని భావించినప్పటికీ, నీటిని ఆయుధంగా ఉపయోగించుకుని శత్రువును దెబ్బతీయటం అన్ని దేశాల చరిత్రల్లో కనపడుతుంది. కాలువలకు గండి కొట్టటం, వంతెనలను కూల్చటం, చెరువులను విషతుల్యం చేయటం, డ్యాంల్లో నీటిని ఒక్కపెట్టున వదలటం యుద్ధాల్లో ఎన్నో సార్లు జరిగింది. యుద్ధనీతులు, ధర్మాల పాటింపు గురించి గొప్పగా చెప్పుకొన్నా ఆచరణలో వాటికి విరుద్ధంగా జరిగిన దారుణాలే ఎక్కువ.

పహల్గాంలో తీవ్రవాదుల కిరాతం తర్వాత మళ్లీ నీటి యుద్ధాల ప్రస్తావనలు ఎక్కువయ్యాయి. ఆ దారుణానికి ప్రతీకార చర్యగా సింధూ జలాల ఒప్పందం అమలును తాత్కాలికంగా నిలిపివేస్తున్నామని కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన తర్వాత పాకిస్థాన్ పాదాక్రాంతం అవ్వక తప్పదనే వ్యాఖ్యలు వెల్లువెత్తాయి. సింధూ జలాలను కట్టడి చేస్తే పాకిస్థాన్ నవనాడులూ కుంగిపోతాయని ప్రభుత్వ వర్గాల అంచనాలతో ఏకీభవించే వారందరూ ప్రకటనలతో హోరెత్తించారు. సింధూ జలాల ఒప్పందాన్నీ అది కుదరటానికి జరిగిన 10 ఏళ్ల కసరత్తునీ లోతుగా పరిశీలించిన వారు.. దాన్నుంచి వైదొలగటం అంతతేలిక కాదనే విషయాన్ని పదేపదే చెబుతున్నా దాన్ని పట్టించుకునే వారి సంఖ్య తక్కువగానే ఉంది. ఒప్పందం కుదిరి 65 ఏళ్లు అవుతున్నా భారత్ తనకు కేటాయించిన జలాలనే ఇంకా పూర్తిగా ఉపయోగించుకోలేదు. అనుకున్న విధంగా జల విద్యుత్తు ప్రాజెక్టులనూ సకాలంలో కట్టలేకపోయింది. లభించిన నీటిని పూర్తిగా ఉపయోగించుకోటానికి ఇంకా పదేళ్లు పట్టొచ్చు. కనీవినీ ఎరగనంత వేగంతో ఇప్పుడు ప్రాజెక్టులను కట్టి నీటిని నిలువరించినంత మాత్రాన పాక్ నుంచి తీవ్రవాదం ముప్పు ఆగుతుందన్న భరోసా లేదు!

మత భావజాలం ఆధారంగా తలెత్తే తీవ్రవాదాలు ప్రభుత్వాలను సైతం ఖాతరుచేయని పరిస్థితులే చాలా చోట్ల ఉన్నాయి. ఒకనాటి రష్యాని దెబ్బతీయటానికీ, కమ్యూనిస్టు భావజాలం విస్తరించకుండా ఉండటానికీ ఇస్లామిక్ తీవ్రవాదానికి అమెరికా అండదండలు అందించింది. గల్ఫ్, అరబ్బు దేశాల్లో రాచరిక, మత రాజ్యాలకు దశాబ్దాలపాటు చేదోడు వాదోడుగా నిలబడింది. ఇప్పటికీ నిలుస్తోంది. ఇస్లామిక్ తీవ్రవాద శక్తులు తనకు ముప్పుగా పరిణమించే స్థాయికి వచ్చినప్పుడు మాత్రమే 'వార్ ఆన్ టెర్రర్' అంటూ యుద్ధాలు మొదలుపెట్టి వాటిని సైతం మధ్యలో వదలివేసింది. ఆఫ్ఘానిస్థాన్‌ను మళ్లీ తాలిబన్లకు అప్పగించటమే ఇందుకు నిదర్శనం. అమెరికా ప్రత్యక్ష, పరోక్ష ఆశీస్సులు లేని నిరంకుశ, అప్రజాస్వామిక దేశాలను ఇప్పటికీ వేళ్లమీద లెక్కించొచ్చు.

తీవ్రవాద, మతతత్వ భావజాలాలను ఓడించటంలో హింస, అణచివేత, ఆయుధ ప్రయోగాల పాత్ర ఉన్నా వాటితోనే అవి సమసిపోయిన సంఘటనలు ఆధునిక చరిత్రలో కనపడవు. తీవ్రవాదం పట్ల ఆకర్షితంకాని రీతిలో ఆర్థిక ఫలాలనూ భద్రమైన జీవితాన్నీ ప్రజలకు అందించటమే అసలు పరిష్కారం అన్నది కాదనలేని సత్యం. తీవ్రవాద సంస్థలకూ బృందాలకూ నాయకత్వం వహించే వారు పైవర్గాల నుంచి వచ్చినా ఆయుధధారులై ముందుండే వాళ్లలో అట్టడుగువర్గాలే ఎక్కువ. ఆర్థికంగా ఫలాలు దక్కని అసంతృప్తులే తీవ్రవాదానికి అసలుసిసలైన పదాతిదళాలుగా వ్యవహరిస్తున్నారు.



ఇప్పటికే పాక్‌కు అన్ని విధాలుగా చేదోడు వాదోడుగా మారిన చైనా.. సింధూ జలాల ఒప్పందంపై మౌనంగా ఉంటుందనీ చెప్పలేం. భూటాన్, ఆఫ్ఘానిస్థాన్ మినహా భారత్ చుట్టూ ఉన్న అన్ని దేశాల్లోనూ చైనా ప్రాబల్యాన్ని విపరీతంగా పెంచుకుంటోంది. ఒకరకంగా ఇది చైనా చక్రబంధం. దీని నుంచి చాకచక్యంగా బయటపడటమే ఇప్పుడు అత్యవసరం. యుద్ధారవాలతో దీన్ని తొలగించుకోలేం. ఉన్మత్త ప్రలాపాలు దౌత్యనీతికి ప్రత్యామ్నాయాలు కాలేవు!

భారత ఉపఖండంలో నదీ వ్యవస్థలు చాలా సంక్లిష్టమైనవి. కోట్లమందిని ప్రభావితంచేసే ఆ వ్యవస్థలను లక్ష్యంగా చేసుకుని తీవ్రవాదాన్ని కట్టడి చేయాలనుకోవటం వ్యూహాత్మకంగా ప్రమాదాలూ సవాళ్లతో కూడుకున్నది. వాతావరణ మార్పులతో నదీ వ్యవస్థలు ఇప్పటికే అల్లకల్లోలం అవుతున్నాయి. పరిస్థితులు ఇలాగే కొనసాగితే రానున్న కొన్ని దశాబ్దాల్లో పంటల దిగుబడుల్లో 10 నుంచి 40 శాతం లోపు కోతలుపడే ప్రమాదం ఉందన్న హెచ్చరికలను పర్యావరణ శాస్త్రవేత్తలు చేస్తున్నారు. 2010 జులైలో పడిన భారీ వర్షాలతో సింధూనది పరివాహక ప్రాంతం కకావికలైంది. పాకిస్థాన్‌లో అయిదో వంతు భూభాగం వరద తాకిడికి గురైంది. రెండు కోట్ల మంది తీవ్ర ఇబ్బందుల పాలయ్యారు. 140 లక్షల మంది ఇళ్లను పోగొట్టుకున్నారు. వేలమంది చనిపోయారు. ఆర్థిక వృద్ధిలో 2 శాతం కోత పడింది. నదుల పరివాహక ప్రాంతాల్లో పర్యావరణ పరిరక్షణ చర్యలు తీసుకోకుండా డ్యాంలు కట్టుకుంటూ పోయి, వాటిని రాజకీయ కారణాలతో నియంత్రించటం మొదలుపెడితే 2010 నాటి తరహా బీభత్సాలను ఎదుర్కోవటం ఇంకా కష్టమవుతుంది. మానవ ధనదాహ కార్యకలాపాల ప్రమేయంతో హిమాలయ నదుల ప్రవాహ ప్రకోపం ఊహించని రీతిలో వ్యక్తమవుతోంది. పాక్‌తో పాటు భారత్, బంగ్లాదేశ్‌లకు ఆ ప్రమాదం ఏదోరకంగా ఎదురవుతూనే ఉంది. గంగ, బ్రహ్మపుత్ర నదులకు తరచూ వస్తున్న వరదలే ఇందుకు నిదర్శనం. సముద్రమట్టాల పెరుగుదలకూ అదే ప్రధాన కారణం.



■ రాహుల్ కుమార్

సింధూ దాని ఉపనదుల కింద ఈనాటి వ్యవసాయానికి ఉన్న చరిత్ర కొంత విశిష్టమైంది. బ్రిటిష్ కాలంలో ఏర్పాటైన కాలువ కాలనీలతో అది మొదలైంది. ఈ కాలనీల కింద 60 లక్షల ఎకరాల పైచిలుకే సాగవుతోంది. 1885 నుంచి 1940 వరకూ తొమ్మిది కాలువ కాలనీలను సృష్టించారు. కాలువలు ప్రవహించే ప్రాంతాలకు తరలి వెళ్లటం ఉమ్మడి పంజాబు చరిత్రను తీవ్రంగా ప్రభావితం చేసింది. బ్రిటిషు పాలకులు అక్కడికి వలసలను విపరీతంగా ప్రోత్సహించారు. ముఖ్యంగా మాజీ సైనికులకు పెద్ద ఎత్తున భూములను పంపిణీ చేశారు. జాట్ సిక్కులు, ముస్లిం రాజ్‌పుత్‌లు మాజీ సైనికుల్లో ప్రధానంగా ఉండేవారు. మొదటి ప్రపంచ యుద్ధం మొదలయ్యే నాటికి భారత్‌లోని మొత్తం సైన్యంలో 60 శాతం మంది ఉమ్మడి పంజాబు రాష్ట్రం నుంచే ఎంపికయ్యారు. వీరోచిత జాతులుగా కొన్ని కులాలనే బ్రిటిషు పాలకులు పరిగణించేవారు. సైన్యంలో చేర్చుకునేటప్పుడే ప్రతి వ్యక్తి కులాన్నీ, వారి వంశ వీరోచిత చరిత్రనూ విపులంగా నమోదు చేసేవారు. దేశ విభజన సందర్భంగా కాలువ భూములను వీడాల్సిన పరిస్థితి పంజాబులో లక్షల కుటుంబాల జీవితాలను తలకిందులను చేసింది. సైనిక నేపథ్యం ఉండి, ఆయుధ ప్రయోగ సామర్థ్యం ఉన్న ప్రజల మధ్య మత వైషమ్యాలు రాజుకోవటం.. లక్షలాది ప్రాణాలను కోల్పోయేలా చేశాయి. పంజాబు కాలువల కాలనీ ప్రాంతాల నుంచి వచ్చిన వారే ఇప్పటికీ పాక్ సైన్యాన్ని శాసిస్తున్నారు. అక్కడి ఉన్నతోద్యోగులూ అధికంగా ఆ ప్రాంతం వారే. పాక్‌లో 'పంజాబు సామ్రాజ్యవాదం' రాజ్యమేలుతోందన్న భావం ఏర్పడటానికి ఈ ఆధిపత్యమే కారణం.

బ్రిటిషు పాలకులు సృష్టించిన కృత్రిమ సరిహద్దుల పరిధుల్లో నదుల వ్యవస్థలను సక్రమంగా, పర్యావరణ హితంగా ఉపయోగించుకోవటం భారత ఉపఖండం ముందున్న పెద్ద సవాలుగా ప్రముఖ దక్షిణాసియా చరిత్రకారుడు ఇయన్ టాల్‌బట్ వ్యాఖ్యానించారు. ఆ సరిహద్దుల పరిధులు దాటే విధంగా దేశాలు ఆలోచనలు చేసి సరైన పర్యావరణ వ్యూహంతో ఆచరించకపోతే విపరిణామాలనే ఎదుర్కోవల్సి వస్తుందని కూడా హెచ్చరించారు. ఉదాహరణకు బంగ్లాదేశ్ ఉపరితలంపై ప్రవహించే నీటిలో 90 శాతం టిబెట్, భారత్‌లో ఉన్న నదీవ్యవస్థల నుంచే వస్తుంది. అంటే బయటి దేశాల్లో కట్టే డ్యాంలు, రిజర్వాయర్లు, కాలువలు, అడవుల నిర్వహణ బంగ్లాదేశ్ నీటి లభ్యతను, వరదలను తీవ్రంగా ప్రభావితం చేస్తుంది. సింధు, బ్రహ్మపుత్ర నదులు టిబెట్ భూభాగం నుంచే మొదలవుతాయి. నదుల ఆరంభ పరిసర ప్రాంతాలపై ఆధిపత్యం ఉన్న దేశాలు అనుసరించే విధానాలు ప్రవాహాలను తీవ్రంగా ప్రభావితం చేసే అవకాశాలే ఎక్కువ. పాక్, బంగ్లాదేశ్‌లను భారత్ అలా ప్రభావితం చేస్తే భారత్ విషయంలో చైనా కూడా అదే దారితొక్కే అవకాశం ఉంటుంది. నదీ ప్రవాహాల సమస్య దక్షిణాసియా దేశాల సంబంధాలను భవిష్యత్తులో తీవ్రంగా ప్రభావితం చేసే అవకాశం ఉందని 2016లో టాల్‌బట్ ఊహించినదే నిజమైతే నిరంతర ఉద్రిక్తతలతో ఆర్థిక వ్యవస్థలూ ప్రజలూ సతమతవ్వక తప్పదు.

ఇంకో ఆసక్తికరమైన విషయాన్నీ ఇక్కడ చెప్పుకోవచ్చు. భారత్–బంగ్లా సరిహద్దు 2500 మైళ్లు ఉంటే అందులో నాలుగో వంతు నదులే సరిహద్దులుగా ఉన్నాయి. వీటి ప్రవాహమార్గాలు మారిపోవటంతో రెండు దేశాల మధ్య ఎన్నో పేచీలు తలెత్తుతున్నాయి. నదుల ప్రవాహాలు మారటంతో ఏర్పడే ఇసుక దిబ్బల హక్కులు కూడా వివాదాలకు దారితీస్తున్నాయి. లక్షలమంది ఈ దిబ్బలపై ఆధారపడి మనుగడ సాగించటం అక్కడ సర్వసాధారణం.

నదుల ఆరంభ పరిసర ప్రాంతాలపై ఆధిపత్యం ఉన్న దేశాలు అనుసరించే విధానాలు ప్రవాహాలను తీవ్రంగా ప్రభావితం చేసే అవకాశాలే ఎక్కువ. పాక్, బంగ్లాదేశ్‌లను భారత్ అలా ప్రభావితం చేస్తే భారత్ విషయంలో చైనా కూడా అదే దారితొక్కే అవకాశం ఉంటుంది.

దక్షిణాసియాలో ప్రస్తుతం నెలకొన్న పరిస్థితుల్లో సింధూ జలాల ఒప్పందం నుంచి వైదొలగి నచ్చిన రీతిలో డ్యాంలు కట్టుకుని, విద్యుత్తు ఉత్పత్తి చేసుకోవటం అనేది ఏటికి ఎదురీదటం లాంటిది. దానికి చెల్లించాల్సిన మూల్యమూ ఎక్కువగానే ఉండొచ్చు! ప్రపంచబ్యాంకు చొరవతో 1960లో భారత్–పాక్ మధ్య ఆ ఒప్పందం జరిగినా దానికి ముందు పదేళ్లపాటు చర్చలు సాగాయి. అమెరికా తెరవెనుక నుంచీ మొత్తం వ్యవహారాన్ని నడిపించింది. సింధూ, దాని ఉపనదుల జలాలపై పాక్‌లో 15 కోట్ల మంది ప్రజలు ఆధారపడి ఉన్న నేపథ్యంలో భారత్ కొత్త ప్రాజెక్టులు కడితే అమెరికా ఎలా వ్యవహరిస్తుందో ఇప్పుడే చెప్పలేం. గతంలో లాగా పాక్ అవసరం అమెరికాకు ఇప్పుడు లేదు. పావు శతాబ్దం నుంచి భారత్‌కు దగ్గర అవ్వటానికే అమెరికా ప్రయత్నిస్తోంది. మరోవైపున టిబెట్ నుంచి పెద్దఎత్తున నీటిని తరలించటానికి చైనా భారీ ప్రణాళికలే రచిస్తోంది. బ్రహ్మపుత్ర నుంచి హోయాంగ్ హో (యల్లో రివర్) నదిలోకి అనేక మార్గాల ద్వారా నీటిని మళ్లించి ఉత్తర చైనా నీటి, విద్యుత్తు సమస్యలను తీర్చనుంది. చైనా సగం జనాభా ఉత్తరభాగంలోనే ఉంది. బ్రహ్మపుత్రపై 60000 మెగావాట్ల విద్యుత్తును ఉత్పత్తి చేసే మహా భారీ ప్రాజెక్టుకు కిందటి డిసెంబరులో అనుమతులు కూడా మంజూరు చేసింది. ఇప్పటికే పాక్‌కు అన్ని విధాలుగా చేదోడు వాదోడుగా మారిన చైనా.. సింధూ జలాల ఒప్పందంపై మౌనంగా ఉంటుందనీ చెప్పలేం. భూటాన్, ఆఫ్ఘానిస్థాన్ మినహా భారత్ చుట్టూ ఉన్న అన్ని దేశాల్లోనూ చైనా ప్రాబల్యాన్ని విపరీతంగా పెంచుకుంటోంది. ఒకరకంగా ఇది చైనా చక్రబంధం. దీని నుంచి చాకచక్యంగా బయటపడటమే ఇప్పుడు అత్యవసరం. యుద్ధారవాలతో దీన్ని తొలగించుకోలేం. ఉన్మత్త ప్రలాపాలు దౌత్యనీతికి ప్రత్యామ్నాయాలు కాలేవు!

(ఆంధ్రజ్యోతి ఎడిటర్)

జాతికిబాట పైడిమర్రి 'ప్రతిజ్ఞ'

జాతీయ గీతం, జాతీయ గేయాలను ఎవరు రచించారని విద్యార్థులనడిగితే.. ఠక్కున సమాధానం చెప్తారు. ఆ రచయితలకు చరిత్రలో సముచిత స్థానం లభించింది. 'ప్రతిజ్ఞ' రచయిత ఎవరని అడిగితే మాత్రం కొందరే సమాధానం చెప్తారు!

జూన్ 10, 1916లో నల్లగొండ జిల్లా అన్నెపర్తి గ్రామంలో పైడిమర్రి వెంకటసుబ్బారావు జన్మించారు. పలు భాషల్లో ప్రావీణ్యం ఉన్న పైడిమర్రి.. వెట్టిచాకిరి, భూస్వామ్య వ్యవస్థలకు వ్యతిరేకంగా పలు రచనలు చేశారు. ఆయన తన 18వ ఏటనే 'కాలభైరవుడు' కలం పేరుతో ఓ నవల రాశారు. 'ఉషస్సు కథలు' కథా సంపుటిని రచించారు. దేవదత్తుడు, తులసీదాస్, త్యాగరాజు మొదలైన పద్య కావ్యాలు, బ్రహ్మచర్యం, గృహస్థ జీవితం, స్త్రీధర్మం, ఫిరదౌసి, శ్రీమతి అనే నాటకాలు రాశారు. అనేక అనువాద రచనలూ చేశారు. 1945–46సంవత్సరాల్లో నల్లగొండలో నిర్వహించిన ఆంధ్ర సారస్వత పరిషత్తు సభల్లో ప్రముఖ పాత్ర వహించారు.



ప్రతిజ్ఞను పైడిమర్రి 1962లో రచించారు. దాన్ని చదివి ఉప్పొంగిపోయిన సాహితీవేత్త తెన్నేటి విశ్వనాథం, నాటి విద్యాశాఖ మంత్రి పీవీజీ రాజు దృష్టికి తీసుకెళ్లారు. తరువాత బెంగళూరులో నిర్వహించిన కేంద్ర విద్యా సలహా మండలి సమావేశంలో ఈ రచనను జాతీయ ప్రతిజ్ఞగా ఆమోదించారు. 'భారతదేశం నా మాతృభూమి..' అంటూ సాగే ప్రతిజ్ఞ (జనవరి 26, 1965 నుంచి) దేశంలోని ప్రతి పాఠశాలలో రేపటి పౌరుల గుండెల నిండా దేశభక్తిని పాదుకొల్పుతున్నది. పైడిమర్రి పేరు అంతగా ప్రాచుర్యంలో లేకపోవడం పెద్ద చారిత్రక తప్పిదంగా నేటితరం రచయితలు, మేధావులు గుర్తించారు. ఎలికట్టె శంకర్రావు 2011లో 'ప్రతిజ్ఞ పదశిల్పి పైడిమర్రి' అనే పేరుతో ప్రత్యేక సంచికను ప్రచురించారు. అంతకుముందు ఇదే పేరుతో ఆంధ్రజ్యోతి దినపత్రిక ఓ వ్యాసాన్ని ప్రచురించింది. పైడిమర్రి జీవితచరిత్రను పాఠ్యాంశంగా చేర్చాలని జన విజ్ఞాన వేదిక డిమాండ్ చేసింది. ఫలితంగా 6వ తరగతి తెలుగు పాఠ్యపుస్తకంలో పైడిమర్రి జీవిత చరిత్రను పొందుపర్చారు.

పైడిమర్రి జీవిత చరిత్రను ఎం.రాంప్రదీప్ తెలుగులో 'భారతదేశం నా మాతృభూమి' పేరుతోనూ, ఆంగ్లంలో 'ది ఫర్గాటెన్ పేట్రియాట్' పేరిట ప్రచురించారు. పైడిమర్రి విగ్రహాన్ని ఆయన స్వగ్రామంలో ఏర్పాటు చేయిస్తామని ఆయన శతజయంతి ఉత్సవాల సందర్భంగా 2016లో తెలంగాణ సాహితీవేత్తలు ప్రకటించారు. కానీ అది నేటికీ కార్యరూపం దాల్చకపోవడం విచారకరం. దేశానికి 'ప్రతిజ్ఞ'ను అందించిన పైడిమర్రిని సముచితంగా గౌరవించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

– యం. రాంప్రదీప్

(నేడు పైడిమర్రి వెంకట సుబ్బారావు జయంతి)

బహుముఖ ప్రజ్ఞావంతురాలు

కొందరి జీవితాలు మహోన్నత శిఖరాలై వెలుగొందుతాయి. వారు తమ వ్యక్తిత్వ శోభతో, ఆచరణాత్మక కృషితో సమాజానికి ఆదర్శప్రాయులవుతారు. జూన్ 1న ఈ లోకాన్ని వీడిన విదుషీమణి డా. పి.చిరంజీవినీకుమారి ఆ కోవకే చెందుతారు.

ఆమె 1931 మార్చి 30న జన్మించారు. తన బతుకుబాటలో ఎన్నో ఎత్తు పల్లాలను చూశారు. ఆమె రాసిన 'శ్రీశ్రీ సప్తతి మహోత్సవం' ఒక చరిత్ర. 'తూర్పుగోదావరి జిల్లా చరిత్ర, సంస్కృతి' ఒక సంచలనం. తూ.గో జిల్లా సాహిత్య చరిత్ర ఒక కరదీపిక. 'తూగో జిల్లా గోదావరి కథలు... అలలు' ఇతర ప్రాంతాల వారికి స్ఫూర్తి. 'గొల్ల రామవ్వ' కథపై పీవీ శతజయంతి సందర్భంగా ఆమె రాసిన అభిప్రాయ మాలిక ఒక ప్రాంతీయాతీత సహానుభూతి. ఇవన్నీ చిరంజీవినీకుమారి ఆలోచనల ప్రతిరూపాలే.



విలువల విధ్వంసం పట్ల మానవ సంబంధాల్లో వచ్చిన అవాంఛనీయ ధోరణుల పట్ల తీవ్ర ఆవేదన కనబరిచేవారు. గొప్ప జ్ఞాపకశక్తి ఆమె సొంతం. చరిత్రలో నిలిచిపోయే ఎన్నో కార్యక్రమాలకు రూపకల్పన చేసి కాకినాడ కేంద్రంగా ప్రతిభావంతంగా నిర్వహించిన ఘనత ఆవిడది. తన దృఢచిత్తంతో ఐడియల్ కాలేజీకి వన్నె తెచ్చారు. ఆ కాలేజీని మెరుగైన విద్యాసంస్థగా తీర్చిదిద్దారు.

చిరంజీవినీ కుమారి తన జీవితకాలంలో ఎన్నో పదవులనధిరోహించారు. ఏపీ స్టేట్ ప్రైవేట్ కాలేజీస్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ ఆర్గనైజింగ్ సెక్రటరీగా, వేణుగోపాల సంస్కృత ప్రచారసభ సెక్రటరీగా, తూగో జిల్లా గ్రంథాలయ సంఘం కార్యదర్శిగా, గిరిజన ప్రాంతపు 'స్పందన' స్వచ్ఛంద సేవాసంస్థ ప్రెసిడెంట్‌గా సేవలందించారు. రాష్ట్ర అభ్యుదయ రచయితల సంఘం ఉపాధ్యక్షురాలిగా, ఏపీ హిస్టరీ కాంగ్రెస్ సభ్యురాలిగా పని చేశారు. ఆదికవి నన్నయ్య యూనివర్సిటీ సాధన సమితి వైస్ ప్రెసిడెంట్‌గా, అధికార భాషా సంఘం సభ్యురాలిగా ఇలా ఎన్నో పదవులకు వన్నె తెచ్చారు. శ్రీ పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం కీర్తి పురస్కారం, తుమ్మల సాహితీ సత్కారం, షీ ఫౌండేషన్ ఎక్సలెన్స్ ఇన్ ఎడ్యుకేషన్ ఉమెన్ వంటి అనేక పురస్కారాలు పొందారు. అభ్యుదయవాదిగా, ప్రగతిశీల రచయిత్రిగా చిరంజీవినీకుమారి కాకినాడకు కీర్తి కిరీటంలా వెలుగొందారు. యానాంలో నిర్వహించిన ఈ వ్యాసకర్త కళారత్న పురస్కార అభినందన సభకు విచ్చేసి ఆశీస్సులు అందించారు. అదే ఆవిడ చివరగా పాల్గొన్న సభ. ఆచరణవాదిగా చిరంజీవినీకుమారి ఆకాంక్ష మేరకు కుటుంబసభ్యులు ఆమె పార్థివ దేహాన్ని వైద్య విద్యార్థుల పరిశోధనల కోసం రంగరాయ మెడికల్ కాలేజీకి అప్పగించారు.

– దాట్ల దేవదానం రాజు

రైతు లాభంతో కార్పొరేట్లకు నష్టమా?

శివరాజ్ సింగ్ చౌహాన్ కేంద్ర వ్యవసాయ, గ్రామీణాభివృద్ధి శాఖా మంత్రిగా సంవత్సర కాలం పూర్తి చేసుకుంటున్న సందర్భంలో 'బిజినెస్ స్టాండర్డ్' అనే ఒక ఆంగ్ల వాణిజ్య పత్రిక ఆయనను ఇంటర్వ్యూ చేసింది. గతంలో మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రిగా సుదీర్ఘ కాలం పని చేసి, వ్యవసాయ రంగం పట్ల విశేష శ్రద్ధ చూపిన వాడిగా, కేంద్రంలో ఆయన హయాంలో రైతాంగానికి మంచి జరుగుతుందని మనం ఆశించడం సహజం. కాగా, ఆయన ఇచ్చిన ఈ ఇంటర్వ్యూను పరిశీలిస్తే ఆయన పని చేస్తూన్న చట్రంలో రైతాంగానికి ఆయనైనా ఎవరైనా పెద్దగా ఒరగ పెట్టగలిగింది ఏమీ లేదని అర్థం అవుతుంది.

మొదటగా అసలు దేశంలో రైతాంగానికి వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చేందుకు కావల్సింది ఏమిటి? అనేది ప్రశ్న. దీనికి రెండు జవాబులు ఉన్నాయి: ఒకటి– వ్యవసాయ ఉత్పాదకతను పెంచడం ద్వారా రైతు ఆదాయాన్ని పెంచడం. రెండవది– వ్యవసాయ ఉత్పత్తులకు కనీస మద్దతు ధరను హామీ చేయడం ద్వారా వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చడం.

అనేక దశాబ్దాల తర్వాత వెనక్కి తిరిగి చూసుకుంటే, హరిత విప్లవం అనంతరం దేశంలో వ్యవసాయ ఉత్పత్తి భారీగా పెరిగినప్పటికీ, వ్యవసాయదారుల స్థితిగతులు మాత్రం రాను రాను దిగజారిపోతున్నాయి. 1970–2015ల మధ్య 45ఏళ్ళ కాలంలో గోధుమలకు కనీస మద్దతు ధర కేవలం 19 రెట్లు మాత్రమే పెరిగింది. కాగా, అదే కాలంలో ప్రభుత్వ ఉద్యోగుల ఆదాయాలు 120 రెట్లు, కళాశాల ఉపాధ్యాయుల వేతనాలు 150 రెట్లు, పాఠశాల ఉపాధ్యాయుల ఆదాయాలు 280 రెట్లు పెరిగాయి!

అంటే ఇక్కడ, ఉత్పత్తిని పెంచుతూ పోయినా రైతాంగం ఆర్థిక స్థితి మెరుగుపడదని మనకు అర్థం అవుతుంది. ఇందుకే స్వయంగా శివరాజ్ సింగ్ చౌహాన్ వ్యవసాయరంగ 'అనుకూల' పాలనా కాలంలో కూడా మధ్యప్రదేశ్‌లో రైతాంగ సమస్యలు అపరిష్కృతంగానే ఉండిపోయాయి. వాస్తవానికి శివరాజ్ సింగ్ పాలనా కాలంలో మధ్యప్రదేశ్‌లో వ్యవసాయ రంగం దేశంలో అన్ని రాష్ట్రాల కన్నా అద్భుతమైన ముందడుగు సాధించింది. అక్కడ ఉత్పత్తి విపరీతంగా పెరిగింది. ఉదాహరణకు, ఆ రాష్ట్రంలో 2011–12లో 149 లక్షల టన్నులుగా ఉన్న వరి, గోధుమలు, ముతకధాన్యాలు, పప్పుధాన్యాల ఉత్పత్తి, 2021–22 నాటికి 349 లక్షల టన్నులకు, అంటే రెట్టింపుకు పెరిగింది. ఇది, ఆ రాష్ట్ర వ్యవసాయ రంగంలో సగటున 9.12 శాతం వార్షిక వృద్ధి రేటుకు సమానం.

ఇంతగా ఉత్పత్తి సాధించినప్పటికీ రైతాంగానికి వ్యవసాయం మాత్రం లాభసాటి కాలేదు. పైగా, ఈ రికార్డు స్థాయి పంటల ఉత్పత్తితో మార్కెట్‌లో సరఫరా భారీగా పెరిగి ధరలు పతనమయ్యాయి. రైతులు రికార్డు స్థాయి పంటలను పండించినా, వర్షాభావ పరిస్థితుల వల్ల పంటలు దెబ్బతిన్నా– అంటే, పంట ఉత్పత్తి పెరిగినా, పడిపోయినా– అంతిమ ఫలితం మాత్రం రైతు నష్టపోవడమే అన్నది మధ్యప్రదేశ్ రైతాంగానికి అర్థమయింది. అందుకే 2017లో మధ్యప్రదేశ్‌లోని మాందసూర్‌లో రైతాంగం ఆందోళనలకు దిగింది. గిట్టుబాటు ధరల కోసం, వర్షాభావం వల్ల జరిగిన పంట నష్టానికి పరిహారం కోసం ఉద్యమిస్తోన్న రైతాంగంపై కాల్పులు జరిగాయి, ఆరుగురు రైతులు చనిపోయారు. ఫలితంగా, వ్యవసాయ ఉత్పత్తిలో ప్రగతి సాధించినప్పటికీ, మధ్యప్రదేశ్‌లో 2018 ఎన్నికలలో శివరాజ్ సింగ్ చౌహాన్ నేతృత్వంలోని బీజేపీ ప్రభుత్వం ఓటమి పాలయ్యింది.

కార్మికులనూ, ఉద్యోగులనూ సాధ్యమైనంత తక్కువ వేతనాలతో పని చేయించుకోవడం కార్పొరేట్ల స్వభావం. దీని కోసం నగర ప్రాంతాల్లో నిత్యావసరాల ధరలు సాధ్యమైనంత తక్కువ ఉండటం కూడా వారికి అవసరం. ఇందుకోసమే కార్పొరేట్ అనుకూల ప్రభుత్వాలు రైతు ప్రయోజనాలనూ, ఆర్థిక స్థితిగతులనూ పణంగా పెట్టి, వారి ఉత్పత్తులను తక్కువ ధరకు నగరాలకు తరలిస్తున్నాయి. నేడు అమలు జరుగుతోన్న సంస్కరణల సారాంశం ఇదే.



ఈ సమస్యల నేపథ్యంలోనే దేశ రైతాంగం కూడా మూడు రైతు చట్టాలకు వ్యతిరేకంగా ఢిల్లీని చుట్టుముట్టి ఆందోళనకు దిగింది. ప్రధాని నరేంద్ర మోదీ రైతాంగానికి క్షమాపణ చెప్పి ఆ మూడు చట్టాలను ఉపసంహరించుకున్నారు. అలాగే కనీస మద్దతు ధర అంశం పైన కమిటీని కూడా ఏర్పరిచారు. అయితే, అనంతంగా సాగుతోన్న చర్చోపచర్చలు, కేంద్ర ప్రభుత్వానికి సుప్రీంకోర్టు సూచనల తర్వాత కూడా, నేటికీ, కనీస మద్దతు ధరకు చట్టబద్ధత కావాలనే రైతాంగ డిమాండ్ అందని ద్రాక్షగానే మిగిలిపోయింది. ఈ విషయంలో ప్రభుత్వ మొండి వైఖరికి కారణం ఏమిటి?

ఇంటర్వ్యూలో ఈ అంశంపై శివరాజ్ సింగ్ చౌహాన్ పలుమార్లు జవాబును దాటవేశారు. "మీ ప్రభుత్వం ఉత్పత్తి పెంపుదలపై అతిగా దృష్టిని పెడుతోంది, కాగా భారత రైతాంగం తాలూకు అసలు సమస్య పడిపోతూవున్న వారి ఆదాయాలు" అన్న ప్రస్తావనకు స్పందనగా చౌహాన్: "...ఒక ప్రక్కన మేము 145 కోట్ల జనాభాకు సేవ చేయవలసి ఉంది," అనే అస్పష్టమైన జవాబును ఇచ్చారు. అయితే దీని పరమార్థం స్పష్టమే! "మేము రైతాంగానికి గిట్టుబాటు ధరలను ఇస్తే– అది దేశంలోని మిగతా జనాభాకు సమస్య అవుతుంది" అని ఆ మాటల అర్థం. అదెలా? అన్న ప్రశ్నకు జవాబు సులువే. రైతుకు గనుక స్వామినాథన్ కమిటీ సూచించిన తరహాలో గిట్టుబాటు ధరను ఇస్తే – అది వినియోగదారులకు ధరల పెరుగుదల రూపంలో 'భారం' అవుతుందనేది– ఈ జవాబు అంతరార్థం.

అయితే, కనీస మద్దతు ధర విషయంలో ప్రభుత్వం రైతులకు అనుకూలంగా నిర్ణయం తీసుకోకపోవడానికి కారణం వినియోగదారుల ప్రయోజనమేనా? ఖచ్చితంగా కాదు. ఇదే నిజమైతే మన పాలకులు ప్రజల కనీస అవసరాల పైన కూడా జి.ఎస్.టి వంటి పన్నులను విధించేవారు కాదు. ఈ పన్నుల భారం వలన కూడా, నేడు మార్కెట్‌లో నిత్యావసరాల ధరలు పెరిగాయన్నది తెలిసిందే.


అసలు సమస్య వినియోగదారులది కాదు. కార్పొరేట్ యజమానులది. ఎలాగంటే – రైతాంగానికి కనీస మద్దతు ధర ఇవ్వటం వల్ల నగర ప్రాంతాలలో వినియోగదారులకు ధరలు పెరిగాయనుకుందాం. ఈ వినియోగదారుల్లోని అత్యధికులు కార్మికులు, ఉద్యోగులే ఉంటారు. వీరు ధరల భారాన్ని భరించలేక తమ యజమానులను అధిక వేతనాల కోసం డిమాండ్ చేస్తారు. అదీ అసలు కథ! అంటే, రైతుకు మద్దతు ధర ఇవ్వటం వల్ల ఉద్యోగులూ, కార్మికులు అధిక వేతనాల కోసం కార్పొరేట్ల మీద ఒత్తిడి తెస్తారు కాబట్టే, కార్పొరేట్లకు ఇబ్బంది కలుగుతుంది కాబట్టే, ప్రభుత్వం మద్దతు ధరలకు సుముఖంగా లేదు!

కార్మికులనూ, ఉద్యోగులనూ సాధ్యమైనంత తక్కువ వేతనాలతో పని చేయించుకోవడం కార్పొరేట్ల స్వభావం. లాభాలను పెంచుకోవడం కోసం వారికి ఇది అవసరం. దీని కోసం నగర ప్రాంతాల్లో నిత్యవసరాల ధరలు సాధ్యమైనంత తక్కువ ఉండటం కూడా వారికి అవసరం. ఇందుకోసమే కార్పొరేట్ అనుకూల ప్రభుత్వాలు రైతు ప్రయోజనాలనూ, ఆర్థిక స్థితిగతులనూ పణంగా పెట్టి, వారి ఉత్పత్తులను తక్కువ ధరకు నగరాలకు తరలిస్తున్నాయి. నేడు అమలు జరుగుతున్న సంస్కరణల సారాంశం ఇదే. గ్రామాలను కొట్టి నగరాలకూ పెట్టడమే! నగరాలకు పెట్టడమంటే అంతిమంగా నగర ప్రాంత కార్పొరేట్లకు దోచిపెట్టడమే! ఈ క్రమంలో గత మూడు దశాబ్దాలుగా రైతాంగానికి వ్యవసాయం నష్టదాయకమై, వారి ఆత్మహత్యలు పెరిగిపోయాయి.

అలాగే, గిట్టుబాటు ధరలకు చట్టబద్ధతను ఇచ్చేందుకు ప్రభుత్వాల అయిష్టత వెనుక మరో కారణం కూడా ఉంది. అది నగర ప్రాంతాల్లోని కార్పొరేట్లకు అవసరమైన కార్మికులు, ఉద్యోగుల సరఫరా. అంటే, గ్రామీణ ప్రాంతాల నుంచి, నగరాలకు తగినంత స్థాయిలో వలసలు ఉండాలీ అంటే, వ్యవసాయ రంగం లాభసాటిగా ఉండకూడదు. అలా ఉంటే రైతు గ్రామాన్ని వదిలి బయటకి రాడు. వ్యవసాయ రంగంలో బతకడం కష్టమైతేనే రైతు వలసకూలీగా మారి నగర బాట పడతాడు. కార్పొరేట్లకు కావల్సింది ఇదే. నగరాలలో మానవవనరుల సరఫరా అధికంగా ఉండాలి. ఉంటేనే ఉపాధి కోసం పోటీ పెరుగుతుంది. పెరిగితేనే ఉద్యోగులకు ఇచ్చే వేతనాలను తగ్గించే అవకాశం కార్పొరేట్లకు కలుగుతుంది. దీని తాలూకు మరొక కొనసాగింపే – ఉపాధి హామీ పథకాన్ని నీరుగార్చివేసే ప్రయత్నం. ఈ పథకం వలన గ్రామాల్లో ఉపాధి పెరిగి నగర ప్రాంతాలకు వలసలు తగ్గుతాయి. దీనివల్ల నగర ప్రాంత కార్పొరేట్లకు కార్మికుల సరఫరాను తగ్గిపోతుంది.

శివరాజ్ సింగ్ చౌహాన్ వ్యక్తిగతంగా ఎంతటి మానవీయ కోణం కలిగిన వారయినా, రైతాంగానికి మేలు కోరుకునే వారయినా, వాస్తవంలో ఆయన వర్గపరిమితులు, రాజకీయ పరిమితులు దానిని అనుమతించవు. ఇక ఇప్పుడు ఈ ప్రభుత్వాల హయాంలో – కనీస మద్దతు ధరకు చట్టబద్ధత అటుంచి, కనీసం అమెరికాతో వాణిజ్య ఒప్పంద చర్చలలో – దిగుమతి టారిఫ్‌ల తగ్గింపు పేరుతో – భారత వ్యవసాయ రంగం పూర్తిగా బలిపీఠం ఎక్కదని ఆశించడం మాత్రమే మనం చేయగలిగింది!

◆ డి. పాపారావు



● సాహో శివాజీ మహరాజ్



జగ్గయ్యపేట పట్టణంలోని విజయవాడ రోడ్డులో ఏర్పాటుచేసిన ఛత్రపతి శివాజీ మహరాజ్ విగ్రహాన్ని సోమవారం మంత్రి సత్యకుమార్ యాదవ్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జగ్గయ్యపేట ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య, కేడీసీసీ బ్యాంకు చైర్మన్ నెట్టెం రఘురాం, జనసేన జిల్లా అధ్యక్షుడు సామినేని ఉదయభాను, తాత్వికులు చిట్టా లక్ష్మీ నరసింహశాస్త్రి పాల్గొన్నారు. 6

● మహిళాగ్రహం



అమరావతి మహిళలను అసభ్య పదజాలంతో దూషించిన వారిపై చర్యలు తీసుకోవాలంటూ సోమవారం ఆటోనగర్‌లోని జగన్ పత్రిక కార్యాలయాన్ని టీడీపీ మహిళా నాయకులు ముట్టడించారు. ప్రధాన గేటు ముందు బైఠాయించి జగన్ మీడియా ఎండీ వైఎస్ భారతీరెడ్డి, మాజీ సీఎం జగన్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కార్యాలయం బయట సాక్షి పేరుతో ఉన్న బోర్డును తొలగించారు. జగన్ పత్రిక ప్రతులను దహనం చేశారు. 6

● యోగా ర్యాలీ



యోగాంధ్ర మాసోత్సవాల్లో భాగంగా సంపూర్ణ ఆరోగ్యానికి యోగాతో కలిగే ప్రయోజనాలపై అవగాహన కల్పించి, యోగా సాధన చేసేలా ప్రజలను ప్రోత్సహించేందుకు జిల్లా అధికార యంత్రాంగం, నగరపాలక సంస్థ, ఆయుష్ శాఖ ఆధ్వర్యంలో సోమవారం ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియం నుంచి బెంజిసర్కిల్ వరకు మెగా యోగాంధ్ర ర్యాలీ నిర్వహించారు. కలెక్టర్ లక్ష్మీశ, మున్సిపల్ కమిషనర్ ధ్యానచంద్ర, జాయింట్ కలెక్టర్ ఇలక్కియా ర్యాలీ ముందు సాగారు. 8

కూల్చివేతకు అనుమతి లేదు

శాతవాహన కరస్పాండెంట్ రమాసత్యనారాయణ

విజయవాడ, జూన్ 9 (ఆంధ్రజ్యోతి) : శాతవాహన కళాశాల భవనాలను కూల్చడానికి లిఖితపూర్వకంగా కానీ, మౌఖికంగా కానీ ఎలాంటి అనుమతి ఇవ్వలేదని ఆ కళాశాల కరస్పాండెంట్ నిడుమోలు రమాసత్యనారాయణ తెలిపారు. దీనికి సంబంధించి ఆయన సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. తాను కరస్పాండెంట్ మాత్రమేనని, ఒక అనుమతి ఇచ్చినా అది పనిచేయదని పేర్కొన్నారు. బోయపాటి శ్రీనివాస అప్పారావుకు అనుకూలంగా సుప్రీంకోర్టు ఉత్తర్వులు ఇచ్చినా.. దాన్ని తీసుకొచ్చి పెద్ద మనుషులు, పోలీస్, రెవెన్యూ శాఖ అధికారులు పంచనామా చేసి ఆస్తిని అప్పగించాలని తెలిపారు. భవనాలు కూల్చడానికి మున్సిపల్ కమిషనర్, పోలీస్ శాఖ అనుమతి కావాలని పేర్కొన్నారు. ఈ ప్రక్రియ ఏదీ శాతవాహన విషయంలో జరగలేదని ఆయన మండిపడ్డారు. అర్ధరాత్రి దుండగులు కాలేజీని నేలమట్టం చేయడాన్ని ఖండించారు. పురాతన చరిత్ర ఉన్న గ్రంథాలయాన్ని శిథిలాలుగా మార్చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. శాతవాహన కాలేజీకి వేరే శాఖ లేదని, కాలేజీ ఇక్కడే నడుస్తోందని పేర్కొన్నారు. ఇంతటి అతిపెద్ద పురాతనమైన కాలేజీని సుప్రీంకోర్టు ఉత్తర్వుల ద్వారా స్వాధీనం చేసుకునేటప్పుడు పత్రికల్లో బహిరంగ ప్రకటన ఇవ్వాలని, దీన్ని బోయపాటి పాటించలేదని ఆయన పేర్కొన్నారు.

గుంటుపల్లిలో గుట్టుగా..

కృష్ణాతీరంలో, ఇసుక తిన్నెల్లో, పచ్చగా ఏపుగా ఎదిగిన పొదల్లో పందెపురాయుళ్లు 'బరి' తెగించారు. ఇబ్రహీంపట్నం పోలీస్‌స్టేషన్ పరిధిలోని గుంటుపల్లిలో గుట్టుచప్పుడు కాకుండా కోడిపందేలు వేశారు. ఖరీదైన కార్లలో దర్జాగా జరిగిన ఈ పందెపు శిబిరాలపై ఆదివారం దాడిచేసిన పోలీసులు పెద్దవారిని వదిలి, పనివారిని పట్టుకోవడం వెనుక అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

కృష్ణానది తీరాన, పచ్చటి పొదల్లో కోడిపందేలు



ఖరీదైన కార్లలో వచ్చి మరీ భారీగా పందేలు

- పక్కా సమాచారంతో దాడిచేసిన పోలీసులు
- ప్రముఖులను వదిలేసి, పనివారిపై పెట్టీ కేసులు
- ఇబ్రహీంపట్నం పోలీసుల తీరుపై అనుమానాలు

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : సాధారణంగా సంక్రాంతి సంబరాల్లో కోడిపందేలు జోరుగా సాగుతాయి. కానీ, ఇబ్రహీంపట్నం పోలీస్‌స్టేషన్ పరిధిలోని గుంటుపల్లిలో మాత్రం సంబరాలతో సంబంధం లేకుండానే కోళ్లకు కత్తులు కడుతున్నారు. వైసీపీ హయాంలో గుంటుపల్లిలో ఇసుక ర్యాంపు నిర్వహించిన ప్రాంతం ఇప్పుడు ఖాళీగా ఉంది. ప్రధాన రహదారి నుంచి రెండు కిలోమీటర్లు వెళ్లిన తర్వాత ఇక్కడ ఓ చిన్న రహదారి వస్తుంది. ఇది పుంతమార్గంలా ఉంటుంది. ఇసుక ర్యాంపు నిర్వహించడానికి ఆ ప్రదేశాన్ని మొత్తం చదును చేశారు. ఈ ప్రదేశాన్ని పందెపురాయుళ్లు కోడిపందేలు వేసుకోవడానికి ఎంపిక చేసుకున్నారు. ఆదివారం ఇక్కడ విచ్చలవిడిగా పందేలు జరిగాయి. ఇందుకోసం హైటెక్ ఏర్పాట్లు కూడా చేశారు. నీడ కోసం టెంట్లు వేశారు. కోడిపుంజులు ఎగిరినప్పుడు, కాలు రువ్వినప్పుడు మట్టి పైకి లేవకుండా గ్రీన్‌కార్పెట్ పరిచారు. చల్లదనం కోసం కూలర్లు ఏర్పాటు చేశారు. ఆదివారం ఉదయం నుంచి లక్షలాది రూపాయల బెట్టింగ్‌లతో పందేలు వేశారు. గుంటుపల్లితో పాటు చుట్టుపక్కల ప్రాంతాల నుంచి కార్లలో వచ్చి పందేలు మిగతా 6లో..

ఆ అధికారి ఎవరు?

ఈ విషయంపై పోలీసు కమిషనర్ రాజశేఖర బాబు సీరియస్‌గా ఉన్నారు. ఇబ్రహీంపట్నం పోలీసుల తీరుపై అసంతృప్తి వ్యక్తం చేశారు. గుంటుపల్లిలో నది ఒడ్డున కోడిపందేలు నిర్వహిస్తున్నారని ఆ సెక్టర్ ఎస్ఐ పైఅధికారులకు ఫోన్‌చేసి సమాచారం ఇచ్చినట్టు తెలిసింది. ఆ ఎస్ఐను అక్కడి నుంచి బయటకు వచ్చేయమని ఓ అధికారి చెప్పినట్టు సమాచారం. ఆ అధికారి ఎవరన్న దానిపై సీపీ ఆరా తీశారు. దీనికి సంబంధించి పూర్తి సమాచారం తెలుసుకున్నాక ఇబ్రహీంపట్నం సిబ్బందిని సీపీ కార్యాలయానికి పిలిపించారు. మరోసారి ఇలాంటి వ్యవహారాలు కొనసాగితే పరిణామాలు తీవ్రంగా ఉంటాయని హెచ్చరించినట్టు తెలిసింది.

పీహెచ్‌డీలా!

కృష్ణా యూనివర్సిటీలో 200 మందికిపైగా స్కాలర్‌లు

- పరిశోధనా పత్రాలు సమర్పించిన 57 మంది ఫైల్స్ మాయం
- 2012 నుంచి పెండింగ్‌లోనే పీహెచ్‌డీల ప్రదానం
- కావాలనే జాప్యం చేస్తున్నారని అధికారులపై విమర్శలు

కృష్ణా యూనివర్సిటీలో పీహెచ్‌డీల ప్రదానం ప్రహసనంగా మారింది. లక్షల రూపాయలు ఫీజులు చెల్లించి, పీహెచ్‌డీ పూర్తి చేసి, పరిశోధనా పత్రాలు సమర్పించిన అభ్యర్థులు పట్టాల కోసం ఏళ్ల తరబడి వర్సిటీ చుట్టూ తిరుగుతున్నారు. 57 మంది స్కాలర్‌లు సమర్పించిన పత్రాలు కనిపించకుండా పోవడం ఇక్కడి అధికారుల పనితీరుకు అద్దం పడుతోంది. దీనిపై ఉన్నత విద్యామండలి అధికారులు, గవర్నర్‌కు ఫిర్యాదు చేసినా వీరిలో చలనం ఉండటంలేదని అభ్యర్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ స్పందించి తమకు న్యాయం చేయాలని వేడుకుంటున్నారు.

(ఆంధ్రజ్యోతి-మచిలీపట్నం): కృష్ణా యూనివర్సిటీలో కెమిస్ట్రీ, ఫార్మసీ, కామర్స్, ఇంగ్లీష్, బిజినెస్ మేనేజ్‌మెంట్, బయో టెక్నాలజీ తదితర విభాగాల్లో 200 మందికిపైగా రీసెర్చ్ స్కాలర్‌లు ఉన్నారు. రెగ్యులర్‌గా అయితే మూడు సంవత్సరాల్లో, పార్ట్‌టైమ్ పద్ధతిలో అయితే నాలుగేళ్లలో పీహెచ్‌డీని పూర్తి చేయాలి. తొలుత పీహెచ్‌డీ చేసేందుకు ముందుకు వచ్చిన స్కాలర్‌లకు ఆరు నెలల్లో పరీక్ష నిర్వహించి, వారు ఏ అంశంపై రీసెర్చ్ చేస్తున్నారో చూసుకుని అనుమతులు ఇవ్వాలి. ప్రతి ఏడాది జనవరి, జూన్ నెలల్లో ఒకసారి రీసెర్చ్ రెన్యువల్ కమిటీ సభ్యులు స్కాలర్‌లు చేస్తున్న పరిశోధనల తీరును పరిశీలించి వారికి తగు సూచనలు చేయాలి. యూనివర్సిటీలో రీసెర్చ్ విభాగంలో డైరెక్టర్‌లు రెగ్యులర్‌గా లేకపోవడం, వచ్చిన వారు మొక్కుబడిగా పనిచేయడంతో పీహెచ్‌డీల ప్రదానంలో తీవ్ర జాప్యం జరుగుతోంది. 2012లో యూనివర్సిటీలో పీహెచ్‌డీ పరిశోధనలు ప్రారంభం కాగా, 2012, 2014, 2018 సంవత్సరాల్లో పరిశోధనలు ప్రారంభించి పూర్తిస్థాయిలో తమ పత్రాలను సమర్పించిన వారికి నేటికీ పీహెచ్‌డీ పట్టాలు అందజేయక పోవడం గమనార్హం. సైన్స్ సబ్జెక్టుల్లో పీహెచ్‌డీ చేసే వారు అధికశాతం మిగతా 6లో..

దుర్గగుడిలో అంతర్గత బదిలీలు 6

చెత్తశుద్ధి కావాలి

నగరంలో వర్మీ కంపోస్టు ప్లాంట్ల ఏర్పాటు అవసరం



- రోజూ 300 టన్నుల మేర సేంద్రియ వ్యర్థాల ఉత్పత్తి
- సద్వినియోగం చేసుకోలేకపోతున్న అధికార యంత్రాంగం
- ఉమ్మడి రాష్ట్రంలో ఉండగా 30 వర్మీ ప్లాంట్లు
- నాడు ప్రపంచ బ్యాంకు గుర్తింపు.. జాతీయస్థాయిలో మూడోస్థానం
- నేడు కనిపించకుండాపోయిన వర్మీ ప్లాంట్లు
- మళ్లీ ఏర్పాటుచేస్తే ఎంతో ఉపయుక్తం

వర్మీ కంపోస్టు ప్లాంట్లు.. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌గా ఉండగా నగరంలో ఓ వెలుగు వెలిగిన ఈ ప్లాంట్లు ఇప్పుడు మచ్చుకు కూడా కనిపించట్లేదు. సేంద్రియ వ్యర్థాల నుంచి వర్మీ కంపోస్టును తయారుచేసే ఈ ప్లాంట్లు అప్పట్లో విజయవంతం కాగా, కాలక్రమంలో మూతపడ్డాయి. ప్రస్తుతం నగరంలో 300 టన్నుల వరకు సేంద్రియ వ్యర్థాలు ఉత్పత్తి అవుతున్న నేపథ్యంలో తిరిగి వర్మీ ప్లాంట్లు ఏర్పాటుచేస్తే బాగుంటుందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : నగరంలో రోజుకు 750 టన్నుల చెత్త ఉత్పత్తి అవుతుండగా, ఇందులో 300 టన్నుల సేంద్రియ వ్యర్థాలు ఉత్పత్తి అవుతున్నాయి. అయితే, వీటిలో పొడిచెత్తను జిందాల్ కంపెనీకి పంపించి సద్వినియోగం చేసుకుంటుండగా, ప్లాస్టిక్ వంటి వ్యర్థాలను ఫైర్ ఉడ్ కేటగిరీ కింద అమ్మి ఆదాయాన్ని సాధిస్తున్నారు. కానీ, సేంద్రియ వ్యర్థాల విషయంలో మాత్రం అధికారులు నిర్లిప్తంగా వ్యవహరిస్తున్నారు. ఈ వ్యర్థాల ద్వారా కూడా సంపద సృష్టించుకునే అవకాశాలున్నా కార్యరూపంలోకి తీసుకొచ్చేలా నిర్ణయాలు ఉండట్లేదు.

వర్మీ కంపోస్టు ప్లాంట్లు అవసరం

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఉండగా, నగరంలో సేంద్రియ వ్యర్థాల సద్వినియోగంతో పాటు సంపద సృష్టించేలా వర్మీ కంపోస్టు మిగతా 6లో..

దేశంలోనే మూడోస్థానం

అప్పట్లో శ్రీరామ్ ఎనర్జీ ప్లాంట్ ద్వారా చెత్త నుంచి విద్యుత్ తయారుచేసే ప్రాజెక్టును కార్పొరేషన్ చేపట్టింది. మాంసం వ్యర్థాల నుంచి గ్యాస్ తయారుచేసి, దానిద్వారా విద్యుత్‌ను తయారుచేసే బయోమెథనైజేషన్ ప్లాంట్‌ను కూడా ఏర్పాటు చేసింది. చెత్త నుంచి కంపోస్టు, పిల్లెట్లు తయారుచేసే యూనిట్లను ఏర్పాటు చేసింది. కాలక్రమంలో ఇవన్నీ మూతపడ్డాయి. ఇవి మూతపడిన క్రమంలో వచ్చిన వర్మీ కంపోస్టు ప్లాంట్లు చాలావరకు సమర్థవంతంగా పనిచేశాయి. దీంతో జాతీయ స్థాయిలో విజయవాడ మూడో స్థానాన్ని సాధించింది. స్వచ్ఛతలో విజయవాడకు దక్కిన గౌరవమిది.



● షైనింగ్ స్టార్స్

పది, ఇంటర్ ఫలితాల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు షైనింగ్ స్టార్స్ అవార్డుల ప్రదానోత్సవం సోమవారం తుమ్మలపల్లి క్షేత్రయ్య కళాక్షేత్రంలో జరిగింది. మంత్రి సత్యకుమార్ యాదవ్, కలెక్టర్ లక్ష్మీశ, ఎమ్మెల్యేలు గద్దె రామ్మోహన్, బొండా ఉమామహేశ్వరరావు, యార్లగడ్డ వెంకట్రావు పాల్గొన్నారు. అనంతరం 131 మంది పదో తరగతి విద్యార్థులు, 43 మంది ఇంటర్ విద్యార్థులకు రూ.20 వేల నగదు చొప్పున, షీల్డ్, ప్రశంసా పత్రాలను అందజేశారు. 8

ఎ.కొండూరు రైస్‌మిల్లులో అగ్ని ప్రమాదం

విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ కారణంగానే..

- రూ.90 లక్షల వరకు ఆస్తినష్టం
- 32 వేల క్వింటాళ్ల ధాన్యం, 80 వేల గోనె సంచులు బూడిద 6



ప్రమాదంలో బూడిదైన ధాన్యం, గన్నీ బ్యాగ్‌లు

అమ్మకం ప్రకటన

ఇన్‌సాల్వెన్సీ అండ్ బ్యాంక్‌రప్టసీ బోర్డ్ ఆఫ్ ఇండియా (బ్యాంక్‌రప్టసీ ప్రాసెస్ ఫర్ పర్సనల్ గ్యారంటార్స్ టు కార్పొరేట్ డెటార్స్) రెగ్యులేషన్స్, 2019లోని రెగ్యులేషన్ 27తో చదువబడు ఇన్‌సాల్వెన్సీ అండ్ బ్యాంక్‌రప్టసీ కోడ్ 2016 క్రింద.

శ్రీమతి మలిరెడ్డి శాంతి యొక్క బ్యాంక్‌రప్టసీ ప్రాసెస్‌లో
బ్యాంకరప్టసీ ట్రస్టీ కార్యాలయం: బి-725, వెస్టర్న్ ప్లాజా, ఓయూ కాలనీ, హెచ్.ఎస్. దర్గా, హైదరాబాద్ - 500008

ఇ-వేలం

బ్యాంక్‌రప్టసీ ఎస్టేట్‌లో భాగంగా ఏర్పడిన బ్యాంక్‌రప్టసీ ప్రాసెస్‌లో శ్రీమతి మలిరెడ్డి శాంతికి చెందిన దిగువ తెలిపిన అసెట్స్ మరియు ఆస్తులు బ్యాంక్‌రప్టసీ ట్రస్టీ ద్వారా అమ్మకం.

ఆస్తుల వివరణ	రిజర్వు ధర	బయానా	బిడ్ పెంపుదల మొత్తం
శ్రీమతి మలిరెడ్డి శాంతి పేరున గల ఏలూరు, ఆలివీడు గ్రామం వద్దగల సర్వే నం.134/2 & 135లోని ఎ.17-33 గుంటల విస్తీర్ణం గల వ్యవసాయ భూమి.	రూ.280.40 లక్షలు	రూ.28.00 లక్షలు	రూ.2.00 లక్షలు

1. అమ్మకం "ఎక్కడ ఎలా ఉన్నది అలా", "అక్కడ ఏమున్నదో అదే", "ఎలాంటి అవలంబన లేని" ప్రాతిపదికన ఉంటుంది.
2. ఈ-వేలం ప్లాట్‌ఫామ్ ద్వారా (ప్రతీ 5 నిమిషాల అపరిమిత పొడిగింపుతో) దిగువ సంతకందారుచే అమ్మకం జరుగుతుంది .
3. ఇ-వేలం అమ్మకానికి సంబంధించిన సవివరమైన నియమ నిబంధనల కోసం, ఆసక్తిగల దరఖాస్తుదారులు/ పార్టీలు https://www.bankeauctions.comలో లభించే పూర్తి ఇ-వేలం ప్రాసెస్ డాక్యుమెంట్‌ను రిఫర్ చేయవచ్చును లేదా బ్యాంక్‌రప్టసీ ట్రస్టీకి ఇమెయిల్ పంపడం ద్వారా పొందవచ్చును.
4. ఈ-వేలం వివరాల కోసం సంప్రదించండి: శ్రీ పి. ధరణికుమార్, ఫోన్ నం.9948182222, ఇమెయిల్: telangana@c1india.com లేదా బ్యాంక్‌రప్టసీ ట్రస్టీ: helapuri.pirp@gmail.com
5. ఆసక్తిగల పార్టీలు/ బిడ్డర్లు పైన పేర్కొన్న వెబ్‌సైట్‌ను దర్శించి బిడ్‌ను దాఖలు చేయాలని కోరబడుచున్నారు.
6. ఇ-వేలంలోని ఏదేని నియమ నిబంధనలను అంగీకరించడానికి లేదా రద్దుచేయడానికి లేదా పొడిగించడానికి లేదా మార్పు చేయడానికి బ్యాంక్‌రప్టసీ ట్రస్టీ హక్కు కలిగి ఉన్నారు.
7. బిడ్ డాక్యుమెంట్లు & బయానా దాఖలుకు చివరి తేదీ మరియు సమయం 24.06.2025న సా.5:00 గం.
8. బిడ్ డాక్యుమెంట్ల పరిశీలన పూర్తి 25.06.2025 సా.5:00 గం.
9. ఇ-వేలం తేదీ మరియు సమయం 26.06.2025 ఉ.11:00 గం. నుండి మ.1:00 గం. వరకు.

సం/- రాజేష్ చిల్లాలె
IBBI/IPA-001/IP-P00699/2017-2018/11226
శ్రీమతి మలిరెడ్డి శాంతి యొక్క బ్యాంక్‌రప్టసీ ప్రాసెస్‌లో బ్యాంక్‌రప్టసీ ట్రస్టీ
ప్రదేశం: హైదరాబాద్,
తేది: 10.06.2025

నందిగామ మార్కెట్ కమిటీ పాలకవర్గం ఎంపికపై ఉత్కంఠ
- పీఠం దక్కించుకునేందుకు టీడీపీ నేతల పోటీ 6

ఉసురు తీసిన కట్నం వేధింపులు!
- మామ ఫిర్యాదుతో అల్లుడి అరెస్టు 6

మైలవరానికి.. మహర్దశ!
- అమరావతి అభివృద్ధే నియోజకవర్గానికి వరం
- సీఆర్‌డీఏలో త్రీటైర్ పట్టణంగా నమోదు



8

విద్యుత్ శాఖ విజిలెన్స్ అధికారుల ఆకస్మిక తనిఖీలు



ఘాట్ రోడ్డులో అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న దుర్గగుడి ఈవో శీనానాయక్, ఇంజనీరింగ్ అధికారులు

ఆలయ భద్రతను పరిరక్షించండి

» దుర్గగుడి ఈవో శీనానాయక్

ఇంద్రకీలాద్రి, జూన్ 9 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో రెండో అతి పెద్దదైన దుర్గామల్లేశ్వరస్వామి దేవస్థానం భద్రత, భక్తులకు ఇబ్బంది కలిగించే చర్యలను అన్ని స్థాయిల సిబ్బంది అరికట్టాలని ఈవో వీకే శీనానాయక్ కోరారు. సోమవారం ఘాట్ రోడ్డులో పార్కింగ్ స్థలం, పొంగలి తయారీ షెడ్, బస్ షెల్టర్, ప్రొటోకాల్ ఆఫీసులను ఆయన పరిశీలించారు. ఆ సమయంలో కొన్ని వాహనాలు ప్రొటోకాల్ ఆఫీస్ వరకు రావడం, ద్విచక్ర వాహనాలు ఎక్కడికక్కడ పార్క్ చేసి ఉండటం గమనించారు. ఎటువంటి భద్రతా తనిఖీలు లేకుండా ప్రధాన ఆలయానికి సమీపానికి వాహనాలు అనుమతించడం అంటే ఆలయ భద్రతను పణంగా పెట్టడమే అని అన్నారు. సమీపం వరకు వాహనాలు పంపమని తీవ్ర ఒత్తిడి ఉంటుందని, ట్రాఫిక్ సమస్యలతో తరచూ వివాదాలు జరుగుతున్నాయని ప్రొటోకాల్, సెక్యూరిటీ సిబ్బంది పేర్కొన్నారు. ఓం మలుపు తరువాత పొంగలి షెడ్ దాటి వాహనాలను అనుమతించవద్దని, ప్రొటోకాల్ పరిధిలోకి వచ్చేవారిని ఆఫీస్ వరకు తీసుకురావడానికి చర్యలు తీసుకోవాలని డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు అశోక్‌కుమార్, రవీంద్రలను ఈవో ఆదేశించారు.

దుర్గగుడి గిరి ప్రదక్షిణ రేపు

ఇంద్రకీలాద్రి: ప్రతి పౌర్ణమినాడు జరిగే గిరిప్రదక్షిణ మాసవారీ ఉత్సవం ఈనెల 11న బుధవారం నిర్వహిస్తున్నట్టు దుర్గగుడి ఈవో వీకే శీనానాయక్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. జ్యేష్ఠ పౌర్ణమి సందర్భంగా బుధవారం ఉదయం 5.55 గంటలకు ఘాట్‌రోడ్డులోని టోల్ గేట్ వద్ద కామధేను అమ్మవారి ఆలయం నుంచి గిరిప్రదక్షిణ ప్రారంభమవుతుందని తెలిపారు. ఘాట్ రోడ్డు అమ్మవారి గుడి, కుమ్మరిపాలెం సెంటర్, విద్యాధరపురం, పాల ఫ్యాక్టరీ, చిట్టినగర్, కొత్తపేట, బ్రాహ్మణవీధి నుండి ఇంద్రకీలాద్రి వరకు గిరి ప్రదక్షిణ జరుగుతుందని తెలిపారు. భక్తులు విరివిగా పాల్గొని అమ్మవారి కృపకు పాత్రులు కావాలని ఈవో కోరారు.

దుర్గగుడిలో అంతర్గత బదిలీలు

ఇంద్రకీలాద్రి : దుర్గామల్లేశ్వర దేవస్థానంలో అమ్మవారి ప్రధాన ఆలయంతో పాటు వివిధ సేవల్లో విధులు నిర్వహిస్తున్న వేద పండితులు, అర్చకులు, పరిచారకులను ఈవో శీనానాయక్ అంతర్గత బదిలీ చేశారు. దేవదాయ కమిషనర్ ఆదేశాల మేరకు ప్రతి ఆరు నెలలకు ఉద్యోగులతో పాటు వేదపండితులు, అర్చకులు, పరిచారకులను అంతర్గత బదిలీ చేస్తుంటారు. ఈ క్రమంలో పూర్వ ఈవో కేఎస్ రామారావు అంతర్గత బదిలీల కాలపరిమితి ముగియటంతో శీనా నాయక్ వేద పండితులు, అర్చకులు, పరిచారకులు ఎక్కడెక్కడ ఎంత కాలం నుంచి విధులు నిర్వహిస్తున్నారు.. అని పూర్తి సమాచారం తెలుసుకున్నారు. ఈ సందర్భంగా దేవస్థానంలో 40 మంది అర్చకులు, 20 మంది పరిచారకులను, 22 మంది వేద పండితుల్లో ముగ్గురిని బదిలీ చేశారు.

బెదిరిస్తున్న ఇద్దరు అర్చకులు..

అమ్మవారి ప్రధాన ఆలయంలో విధులు నిర్వహిస్తున్న ఇద్దరు అర్చకులను ఆలయ ప్రాంగణంలో వేరేచోటకు బదిలీ చేయటంతో వారు పలువురు అర్చకులను బెదిరిస్తున్నట్టు విమర్శలు వినిపిస్తున్నాయి. తమను కావాలనే అంతర్గత బదిలీ చేశారని విస్తృత ప్రచారం చేస్తున్నట్టు తెలుస్తోంది. సీఎం కార్యాలయంలో ఓ ముఖ్య ఐఏఎస్ అధికారి తమకు తెలుసని, ఆయన పేరు చెప్పి ఆ ఇద్దరు అర్చకులు పలువురు అర్చకులపై బెదిరింపులకు పాల్పడుతున్నారని ప్రచారం జరుగుతోంది.

విజయవాడ ఏఎంసీలో అధికారుల బదిలీ

విజయవాడ, జూన్ 9 (ఆంధ్రజ్యోతి) : వ్యవసాయ మార్కెటింగ్ శాఖలో బదిలీలపై నిషేధం ఎత్తివేస్తూ డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ మార్కెటింగ్, సెలక్షన్ గ్రేడ్ కార్యదర్శి (ఏఎంసీ) తీసుకున్న నిర్ణయంతో పలువురు అధికారులకు స్థానచలనం కలిగింది. విశాఖపట్నం ఏఎంసీలో డీడీఎం ఓడీ స్పెషల్ సెక్రటరీగా పనిచేస్తున్న పి.పాపారావు విజయవాడ డిప్యూటీ డైరెక్టర్‌గా బదిలీపై రానున్నారు. విజయవాడ ఏఎంసీలో డిప్యూటీ డైరెక్టర్‌గా ఉన్న పి.లావణ్య (డీడీఎం) కడప డీడీఎమ్ (అడ్మినిస్ట్రేటివ్ గ్రౌండ్స్)కు బదిలీ అయ్యారు. ఏలూరు ఏఎంసీలో డీడీఎం (ఓడీ) ఎ.శారదరాణి విజయవాడ ఏఎంసీకి సెలక్షన్ గ్రేడ్ సెక్రటరి (ఓడీ)గా బదిలీపై వస్తున్నారు.

భ్రమల్లో బతికేస్తున్న జోగి : టీడీపీ కౌన్సిలర్లు

ఇబ్రహీంపట్నం, జూన్ 9 (ఆంధ్రజ్యోతి) : వైసీపీ నేత, మాజీ మంత్రి జోగి రమేష్ ఇంకా తాము అధికారంలో ఉన్నట్టు, మంత్రి హోదా వెలగబెడుతున్నట్టు కొండపల్లి మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్ ఎవరో కూడా ఆయనే మీడియా సమావేశంలో ప్రకటిస్తూ భ్రమల్లో బతికేస్తున్నాడని టీడీపీ కౌన్సిలర్లు ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం కౌన్సిలర్లు విలేకర్లతో మాట్లాడుతూ, కొండపల్లి మున్సిపాలిటీలో సీల్డ్ కవర్ ఓపెన్ సాంకేతిక కారణాలతో వాయిదా వేస్తే జోగి రమేష్ పిచ్చి ప్రేలాపనలు పేలుతున్నాడన్నారు. వాయిదా వేస్తే ఓడిపోయనట్టు ఎలా అవుతుందని ప్రశ్నించారు. 2021లో చైర్మన్ ఎన్నిక జరిపిన సమయంలో అప్పటి ఎంపీ కేశినేని శ్రీనివాస్ ఓటుతో టీడీపీ బలం 16 ఉంటే ఆయనెలా సమానంగా ఉన్నామని చెబుతావని ప్రశ్నించారు. కొండపల్లి మున్సిపాలిటీ వైసీపీదే అని జగన్‌కు కానుకా ఇస్తున్నా అని, చైర్మన్, వైస్ చైర్మన్స్‌గా వైసీపీ వాళ్లు ఇకనుంచి పాలిస్తారని జోగి ప్రగల్భాలు పలకడం చూస్తుంటే ఆయన మానసిక స్థితి ఎలా ఉందో అర్థమవుతుందని దుయ్యబట్టారు. సంపూర్ణబలంతో కొండపల్లి మున్సిపాలిటీని టీడీపీ కైవసం చేసుకోవడం ఖాయమన్నారు. పగటి కలలు కంటున్న జోగి పిచ్చి వాగుడు కట్టి పెట్టాలని హితవు పలికారు. సమావేశంలో చెన్నుబోయిన చిట్టిబాబు, చుట్టుకుదురు శ్రీనివాసరావు, చనమోలు నారాయణరావు, రావి ఫణి, మైలా సైదులు, అప్సర్, బసవ ఉమా తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న టీడీపీ కౌన్సిలర్లు

నందిగామ మార్కెట్ కమిటీ
పాలకవర్గం ఎంపికపై ఉత్కంఠ!

నందిగామ, జూన్ 9 (ఆంధ్రజ్యోతి) : నందిగామ మార్కెట్ కమిటీ పాలకవర్గం ఎంపికపై తీవ్ర ఉత్కంఠ కొనసాగుతోంది. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి ఏడాది పూర్తయింది. అయినా ఇంతవరకు కీలకమైన నామినేటెడ్ పదవుల పంపిణీ జరగకపోవడం నేతల్లో అసహనం రేపుతోంది. జిల్లా యూనిట్‌గా రిజర్వేషన్లలో నందిగామ ఏఎంసీ చైర్మన్ పీఠాన్ని బీసీ జనరల్‌కు కేటాయించారు. దీంతో పలువురు బీసీ నాయకులు పీఠం దక్కించుకొనేందుకు పోటీపడుతున్నారు. ఎవరికి వారు తమతమ మద్దతుదారులతో ఎమ్మెల్యేపై తీవ్ర ఒత్తిడి తెస్తున్నారు. ఈ క్రమంలో ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య మౌనంపై ప్రజల్లో చర్చ సాగుతోంది. కొద్దికాలం పాటు హడావుడి సృష్టించిన ఆశావహులు నేడు నీరసించి నిలబడ్డారు. నియోజకవర్గంలో రెండో యార్డు అయిన కంచికచర్లకు కమిటీ చైర్మన్‌గా కోగంటి బాబును ఖరారు చేశారు. అయితే ఇప్పటికీ జీవో రాకపోవడంతో ఆయన కుర్చీ ఎక్కలేని పరిస్థితి. పార్టీ కోసం సుదీర్ఘ కాలం కష్టపడిన నేతలు నేడు పదవుల కోసం ఆశగా ఎదురు చూస్తున్నారు. కాలయాపన వల్ల పదవీ కాలం కరిగిపోతుందని, ఎవరో ఒకరికి అవకాశం ఇవ్వొచ్చు కదా అంటూ ఆశావహులు వాపోతున్నారు. ఇప్పటికైనా మార్కెట్ కమిటీలకు పాలకవర్గాలను నియమించాలని ఆశావహులు కోరుతున్నారు.

నీచపు రాతలు.. వికృత పోకడలు!

ఉగ్రవాదుల కంటే ఘోరం!

» ఎమ్మెల్యే వసంత కృష్ణ ప్రసాద్



గొల్లపూడి, జూన్ 9 (ఆంధ్రజ్యోతి) : నీచపు రాతలు, వికృత పోకడలతో ఉగ్రవాదుల కంటే జగన్ మీడియా ఘోరంగా తయారైందని, ఇది సభ్య సమాజానికి పెను ప్రమాదమని మైలవరం ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ వ్యాఖ్యానించారు. సోమవారం గొల్లపూడిలోని కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా జగన్ రోత పత్రిక ప్రచురిస్తున్న కథనాలు వెగటు పుట్టిస్తున్నాయని విమర్శించారు. ప్రజల, రైతుల ప్రయోజనాలు కాంక్షిస్తూ విజయవాడ నగరవాసులకు వరద ముప్పు నుంచి కాపాడేందుకు బుడమేరు కరకట్టలను బలోపేతం చేస్తుంటే జగన్ మీడియా తన అక్కసును వెళ్లగక్కుతూ అబద్ధాలను ప్రచారం చేస్తున్నదన్నారు. అమరావతి మహిళలను కించపరుస్తూ వ్యాఖ్యలను ప్రత్యక్ష ప్రసారం చేసిందని విమర్శించారు. గతేడాది అకాల వర్షాల కారణంగా బుడమేరు, దానికి అనుబంధంగా వాగులు, వంకలు, చెరువులు, కట్టలు దెబ్బతిన్నాయని పేర్కొన్నారు. ఖరీఫ్ ప్రారంభంలోనే పాడైపోయిన వాటికి మరమ్మతులు చేసేందుకు సీఎం చంద్రబాబు, జలవనరులశాఖ మంత్రిని కలిసి, ఉన్నతాధికారులతో మాట్లాడి ప్రత్యేక నిధులను కేటాయించినట్టు తెలిపారు. మంత్రివర్గంలో కూడా ఆమోదం లభించిందని, ఆర్థిక శాఖ నుంచి అనుమతులూ వచ్చాయని చెప్పారు. దీనిపై జగన్ పత్రిక బుడమేరు డైవర్షన్ చానల్ నిధులపై తప్పుడు ప్రచారం చేస్తున్నదన్నారు.

మైనార్టీ హక్కుల పరిరక్షణ సమితి ఆగ్రహం

కలెక్టరేట్ : రాష్ట్ర రాజధాని అమరావతి ప్రాంతాన్ని, రాజధాని మహిళలపై చేసిన జుగుప్సాకరమైన, అనుచిత వ్యాఖ్యలపై మైనార్టీ హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు ఫారూఖ్ షిబ్లి మండిపడ్డారు. ఎం.హెచ్.పి.ఎస్ రాష్ట్ర అధ్యక్షుడు సోమవారం మీడియా సమావేశంలో మాట్లాడుతూ, జగన్ మీడియాపై విరుచుకుపడ్డారు. నాడు వెంకటాద్రినాయుడు చివరి పాలకునిగా అమరావతిని ఏలితే, నేడు ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు పరిపాలనలో ఆంధ్రప్రదేశ్ రాజధానికి అమరావతిగా అభివృద్ధి పనులు శరవేగంగా పూర్తి చేయడాన్ని జీర్ణించుకోలేక దిగజారుడుతనంతో జుగుప్సాకరమైన వ్యాఖ్యలు చేసిన కొమ్మినేని, కృష్ణంరాజు, జగన్ మీడియాపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సమావేశంలో మౌలానా హస్సేన్ అహ్మద్, అబ్దుల్ గఫూర్, అబ్దుల్ బాషా, మహిళా విభాగం నుంచి ఆయేషా, అఫ్రోజ్, రఫియా సుల్తానా తదితరులు పాల్గొన్నారు.

జగన్ మీడియాపై జనాగ్రహం.. పత్రిక ప్రతుల దహనం



ఆటోనగర్‌లోని జగన్ పత్రికా కార్యాలయం వద్ద మహిళల ఆందోళన



జగన్ పత్రిక ప్రతులను దహనం చేస్తున్న టీడీపీ నేతలు

అమరావతి మహిళలకు క్షమాపణ చెప్పాలి

» ఎన్టీఆర్ జిల్లా టీడీపీ ఎస్సీసెల్

పాయకాపురం : అమరావతి రాజధానిపై అనుచిత వ్యాఖ్యలు సరికాదని ఎన్టీఆర్ జిల్లా టీడీపీ ఎస్సీ సెల్ సీనియర్ నేత చల్లగాలి అనీల్‌కుమార్ అన్నారు. అజిత్ సింగ్‌నగర్, దళితమార్గ్ సెంటర్ వద్ద సోమవారం జగన్ పత్రిక ప్రతులను దహనం చేశారు. అనీల్‌కుమార్ మాట్లాడుతూ, అమరావతిపై ముందు నుంచీ వైసిపి నేతలు దుష్ప్రచారం చేస్తున్నారన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా పోలీసులు కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మహిళలపై అసభ్యకరమైన వ్యాఖ్యలు చేసిన వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. రాజధానిపై బురదజల్లే ప్రయత్నం వైసీపీ నేతలు మానుకోవాలని హెచ్చరించారు. తక్షణమే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. నిరసన కార్యక్రమంలో ఎన్టీఆర్ జిల్లా టీఎన్‌టీయూసీ సెక్రటరీ తంగిరాల కొండ, విజయకృష్ణ సూపర్‌బజార్ డైరెక్టర్ వేల్పుల రాజేష్, బేబీ, చంటి, ఏసుపాదం తదితరులు పాల్గొన్నారు.

గుడివాడలో..

గుడివాడ : గుడివాడ తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో నెహ్రూచౌక్ సెంటర్‌లో జగన్ పత్రిక ప్రతులను దహనం చేశారు. అమరావతి మహిళలను కించపరుస్తూ అనుచిత వ్యాఖ్యలు చేసిన వారిని అరెస్టు చేయాలన్నారు. సోమవారం రాత్రి స్థానిక ప్రజావేదిక నుంచి నెహ్రూచౌక్ సెంటర్ వరకు పార్టీ శ్రేణులు, తెలుగు మహిళలు పెద్దఎత్తున ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ, రాజధాని మహిళలను అవమానిస్తే కూటమి ప్రభుత్వం చూస్తు ఊరుకోదన్నారు. యావత్ మహిళా లోకానికి భారతిరెడ్డి బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో తెలుగు మహిళలు యార్లగడ్డ సుధారాణి, గొర్ల శ్రీలక్ష్మి, పొట్లూరి రమాదేవి, మాదాల సునీత, కొల్లి రమ్య, సిరిపురపు తులసీరాణి, మల్లికాబేగం, నాయకులు సయ్యద్ జబీన్, వంగపండు ఆదినారాయణ, రామదేను వేణుబాబు తదితరులు పాల్గొన్నారు.



కంకిపాడు స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తున్న అంగన్వాడీ డ్వాక్రా సంఘం మహిళా నేతలు

నీచపు రాతలపై కఠిన చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు

కంకిపాడు : రాజధాని మహిళలపై నీచపు రాతలు రాసిన జగన్ పత్రికతో పాటు కొమ్మినేని శ్రీనివాస్‌పై కఠినచర్యలు తీసుకోవాలని అంగన్వాడీ డ్వాక్రా సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి అన్నవరపు శివపార్వతి అన్నారు. కొమ్మినేని శ్రీనివాస్, కృష్ణంరాజులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ కంకిపాడు స్టేషన్‌లో సోమవారం ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, రాజధాని అభివృద్ధికి స్వచ్ఛందంగా భూములిచ్చిన రైతులను బ్లూ మీడియా అసత్య ప్రచారం చేయడంతో పాటు ఇష్టానుసారం మాట్లాడటం సిగ్గు చేటన్నారు. వీరిపై తక్షణం చర్యలు తీసుకోవాలని పోలీసులను కోరారు. ఎస్ శ్రీదేవి, నాగశ్రీ, డి.రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

దేశంలో ఉగ్రవాదం, తీవ్రవాదం తగ్గుముఖం

» పాకిస్తాన్‌కు మోదీ గట్టి బుద్ధి చెప్పారు

» నక్సల్ ఉద్యమం ఆఖరి దశ

» ఛత్రపతి శివాజీ విగ్రహావిష్కరణలో మంత్రి సత్యకుమార్ యాదవ్

జగ్గయ్యపేట, జూన్ 9 (ఆంధ్రజ్యోతి) : ప్రధానిగా మోదీ వచ్చాక దేశంలో ఉగ్ర దాడులు, తీవ్రవాదం తగ్గుముఖం పట్టాయని వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ అన్నారు. పాకిస్తాన్ పిరికిపంద చర్యలకు మోదీ సర్జికల్ స్ట్రైక్, ఆపరేషన్ సిందూర్‌లతో గట్టి సమాధానమిచ్చారని ప్రశంసించారు. నక్సలిజం చివరిదశకు చేరిందని, చర్చలకు మావోలు ముందుకు రావటమే తార్కాణమన్నారు. ఛత్రపతి శివాజీ వంటి వీరుల జీవితాలను యువత స్ఫూర్తిగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. సోమవారం జగ్గయ్యపేట పట్టణంలో విజయవాడ రోడ్డులో ఏర్పాటు చేసిన ఛత్రపతి శివాజీ మహరాజ్ విగ్రహాన్ని తాత్వికులు చిట్టా లక్ష్మీనరసింహశాస్త్రి, స్థానిక ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య, కేడీసీసీ బ్యాంకు చైర్మన్ నెట్టెం రఘురాం, జనసేన జిల్లా అధ్యక్షుడు సామినేని ఉదయభాను, చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర తదితరులతో కలిసి ఆవిష్కరించారు. అనంతరం టీటీడీ కల్యాణ మండప స్థలంలో ఏర్పాటు చేసిన హిందు సమ్మేళనంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న సత్యకుమార్ మాట్లాడుతూ, దేశానికి ఆదర్శంగా నిలిచిన మహనీయుల చరిత్రను భవిష్యత్‌తరాలకు అందించేందుకు కేంద్రం నడుం బిగించిందన్నారు. నెట్టెం రఘురాం మాట్లాడుతూ, హిందు సామ్రాజ్య స్థాపనకు ఛత్రపతి శివాజీ మహరాజ్ చేసిన పోరాటం స్ఫూర్తిదాయకమన్నారు. శ్రీరాం తాతయ్య మాట్లాడుతూ దేశం కోసం, హిందూ ధర్మం కోసం పోరాటం చేసిన వీరుల చరిత్రను నేటితరానికి తెలిసేందుకు చరిత్ర పాఠ్య పుస్తకాలలో చేర్చాలని కోరారు. సామినేని ఉదయభాను మాట్లాడుతూ నేటి తరానికి శివాజీ మహరాజ్ గురించి చెప్పేందుకు విగ్రహ ఏర్పాటుపై హర్షం వ్యక్తం చేశారు. రాఘవేంద్ర, ఆర్ఎస్ఎస్ నేత భరత్, చాముండేశ్వరీ పీఠాధిపతి కమలానంద భారతీ స్వామి తదితరులు మాట్లాడారు. శివాజీ కాంస్య విగ్రహం ఏర్పాటుకు రూ.5.25 లక్షల విరాళాన్ని ఇచ్చిన మాజీ వైస్ చైర్మన్ నూకల కుమార్‌రాజాను, రూ.5లక్షల విరాళం ఇచ్చిన విష్ణును నేతలు సత్కరించారు.



హిందు సమ్మేళనంలో వీరఖడ్గాన్ని చూపుతున్న మంత్రి సత్యకుమార్, చిత్రంలో నెట్టెం రఘురాం, తాతయ్య తదితరులు

చెత్తశుద్ధి కావాలి

(5వ పేజీ తరువాయి)

ప్లాంట్లను పెద్ద ఎత్తున ప్రోత్సహించారు. నగరంలో 30 వరకు ప్లాంట్లను ఏర్పాటు చేశారు. ఒక్కో ప్లాంట్ ద్వారా నెలకు 3 నుంచి 4 టన్నుల వర్మీ కంపోస్టు ఉత్పత్తి జరిగే ది. అప్పట్లో వర్మీ కంపోస్టు టన్ను రూ.4 వేలు పలికితే, ఇప్పుడు రూ.10 వేలకు చేరింది. ప్రస్తుతం నగరంలో ఉత్పత్తి అయ్యే 300 టన్నుల సేంద్రియ వ్యర్థాల నుంచి 100 టన్నుల వర్మీ కంపోస్టును ఉత్పత్తి చేయవచ్చు. నాడు పెద్దగా ఖర్చు లేకుండా కాలనీ అసోసియేషన్లు, ఎన్‌జీవోల సహకారంతో ఈ ప్లాంట్లు ప్రారంభించగా, ప్రస్తుతం నగరంలో ఒక్కటి కూడా కనిపించట్లేదు. కార్పొరేషన్ అధికారులు, జిల్లా యంత్రాంగం ఈ అంశంపై దృష్టిసారించి తిరిగి వర్మీ కంపోస్టు ప్లాంట్లకు ప్రోత్సహించడం ద్వారా సేంద్రియ వ్యర్థాల సద్వినియోగంతో పాటు సంపద సృష్టి దిశగా అడుగులు వేయొచ్చు. వర్మీ కంపోస్టు ప్లాంట్ పెట్టడానికి గరిష్ఠంగా రూ.3 లక్షలు అయ్యే అవకాశముంది. కార్పొరేషన్ స్థలాల్లో పక్కా భవనాలు కాకుండా, పాకలు వేసి ప్లాంట్లకు ఏర్పాటుచేయొచ్చు. ప్రతి కాలనీ సంఘానికి వీటి నిర్వహణ బాధ్యతలను అప్పగించటం ద్వారా వర్మీ ప్లాంట్లను మరింత సమర్థంగా నిర్వహించే అవకాశం ఉంటుంది.

సేంద్రియ వ్యర్థాలంటే..

కుళ్లిపోయే స్వభావం కలిగిన వ్యర్థాలనే సేంద్రియ వ్యర్థాలు అంటారు. రైతుబజార్లలో కూరగాయల వ్యర్థాలు, కల్యాణ మండపాల్లో భోజనాలు, హోటళ్లు, హాస్టళ్లలో వ్యర్థాలు ఈ సేంద్రియ కేటగిరీలోకి వస్తాయి. గతంలో సేంద్రియ, అసేంద్రియ వ్యర్థాల పేరుతో ఇంటింటికీ ప్రత్యేకంగా గ్రీన్, ఎల్లో ప్లాస్టిక్ డస్ట్‌బిన్లు ఇచ్చేవారు. వర్మీ కంపోస్టు ప్లాంట్లు ఏర్పాటుచేసిన ప్రాంతాల పరిధిలో డోర్ టు డోర్ చెత్త సేకరణ జరిగేది. ప్రస్తుతం ఈ విధానంలో ఎక్కడా చెత్త సేకరణ జరగట్లేదు.

గతమెంతో ఘనం

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఉండగా, నగర పరిధిలో ఏర్పాటు చేసిన వర్మీ కంపోస్టు ప్లాంట్ల వ్యవస్థను ప్రపంచ బ్యాంకు గుర్తించింది. ఆ బ్యాంకు బృందం నగరానికి వచ్చి వర్మీ కంపోస్టు ప్లాంట్లను క్షేత్రస్థాయిలో పరిశీలించింది. ఈ ప్లాంట్లలో వానపాములను పెంచి సేంద్రియ వ్యర్థాలను కరిగిస్తూ కంపోస్టును ఉత్పత్తి చేసే విధానాన్ని పరిశీలించింది. తమ వంతు సహకారం అందిస్తామని హామీ కూడా ఇచ్చింది. వీరి పర్యటనతో దేశస్థాయిలో నగరంలోని వర్మీ కంపోస్టు ప్లాంట్లకు మంచి పేరు వచ్చింది.

పీహెచ్‌డీలా!

(5వ పేజీ తరువాయి)

మంది స్కాలర్‌లు ఉండగా, యూనివర్సిటీలో ఇంతవరకు సైన్స్ సబ్జెక్టులు బోధించే ప్రొఫెసర్‌లు, రీసెర్చ్ విభాగం డైరెక్టర్‌గా ఒక్కరు కూడా ఇంతవరకు పనిచేయకపోవడం విశేషం. గతంలో వివిధ అంశాలపై పరిశోధనలు చేసి పత్రాలు సమర్పించిన 57 మందికి సంబంధించిన పత్రాలు కనిపించకుండా పోయినట్టు సమాచారం. వీరంతా యూరివర్సిటీకి వచ్చి మాకు పీహెచ్‌డీ ఇవ్వాలని కోరుతుంటే మీ పరిశోధనపత్రాలు కనపడటం లేదని చెప్పి అధికారులు తప్పించుకునే ప్రయత్నం చేస్తున్నారని విమర్శలు వినిపిస్తున్నాయి. దీంతో పీహెచ్‌డీ కోసం లక్షలాది రూపాయలు ఫీజులు కట్టిన స్కాలర్‌లు తమకు న్యాయం చేయాలని ఉన్నత విద్యామండలి అధికారులకు, గవర్నర్‌కు ఫిర్యాదు చేసినా యూనివర్సిటీ అధికారులు పట్టించుకోవడం లేదని తెలిసింది. పలువురు స్కాలర్‌లు పీహెచ్‌డీ పూర్తిచేశామని, పూర్తిస్థాయిలో ఫీజులు చెల్లించామని, తమకు వైవాను నిర్వహించి పట్టా ఇవ్వాలని యూనివర్సిటీ అధికారుల చుట్టూ తిరుగుతున్నారు. ఇంకా ఫీజులు చె ల్లించాలని, అవి కడితే అప్పుడు చూద్దామని చెప్పి పంపేస్తున్నారు. ప్రైవేటు కళాశాలల్లో తక్కువ జీతానికి పనిచేస్తూ పీహెచ్‌డీ పూర్తిచేశామని, ఇప్పటికిప్పుడు పెద్దమొత్తంలో అదనంగా ఫీజులు చెల్లించలేమని స్కాలర్‌లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాగా, స్కాలర్‌లు సమర్పించిన పత్రాలు గతంలో ఎవరైనా చేసిన పరిశోధనల నుంచి కాపీ చేసి, వాటినే సమర్పించారా అనే అంశాన్ని తెలుసుకునేందుకు ప్రత్యేక సాఫ్ట్‌వేర్ ఉండాలి. ఈ సాఫ్ట్‌వేర్‌ను నాలుగు సంవత్సరాల క్రితమే నిలిపివేశారు. సాఫ్ట్‌వేర్ కొనుగోలు చేయకుండా యూనివర్సిటీ అధికారులు తీవ్ర జాప్యం చేస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయి.

చెల్లించిన ఫీజులు రూ.15 కోట్ల పైనే..

యూనివర్సిటీలో పీహెచ్‌డీ చేసేందుకు అనుమతులు ఇచ్చిన నాటి నుంచి ఇప్పటి వరకు స్కాలర్‌లు కట్టిన ఫీజులు రూ.15 కోట్లపైనే ఉంటాయని వర్సిటీ అధికారులే చెబుతున్నారు. ఇంత పెద్దమొత్తంలో ఫీజులు వసూలు చేసినా పీహెచ్‌డీ పట్టాలు ఇవ్వకుండా స్కాలర్‌లను యూనివర్సిటీ చుట్టూ తిప్పుకుంటున్నారని పలువురు విమర్శిస్తున్నారు.

యూనివర్సిటీ నగదు ప్రైవేటు బ్యాంకులకు..

ఇటీవల కాలంలో యూనివర్సిటీకి చెందిన నగదును రెండు ప్రైవేటు బ్యాంకుల్లోకి మార్చిన అంశంపై అధికారుల్లో చర్చ నడుస్తోంది. యూనివర్సిటీలో ఎస్‌బీఐ బ్రాంచ్ ఉంది. ఇప్పటివరకు అందులోనే యూనివర్సిటీకి సంబంధించిన ఆర్థిక వ్యవహారాలను నడుపుతూ వచ్చారు. ఇటీవల కాలంలో ఎస్‌బీఐ బ్రాంచ్‌లోని మూడు కోట్ల రూపాయలను మచిలీపట్నంలోని రెండు ప్రైవేటు బ్యాంకుల్లోకి మార్చిన విషయం వెలుగులోకి వచ్చింది. ఇది ఎవరి ప్రమేయంతో జరిగింది, పాత్రదారులు, సూత్రదారులు ఎవరు, ఇందుకు గల కారణాలు ఏమై ఉంటాయనే అంశంపై అనేక అనుమానాలను యూనివర్సిటీలో పనిచేసే ప్రొఫెసర్‌లు, సిబ్బంది వ్యక్తం చేస్తున్నారు. ఎస్‌బీఐ అధికారులు యూనివర్సిటీలో ఎస్‌బీఐ బ్రాంచ్ ఏర్పాటు చేయడం లాభదాయకంగా లేదని, వేరే ప్రాంతానికి ఈ బ్రాంచ్‌ను మార్చాలని ఇప్పటికే ఉన్నతాధికారులకు లేఖ కూడా రాసినట్లు సమాచారం.

ఎ.కొండూరు రైస్‌మిల్లులో అగ్ని ప్రమాదం

ఎ.కొండూరు, జూన్ 9 (ఆంధ్రజ్యోతి) : తిరువూరు నియోజకవర్గంలోని ఎకొండూరు అడ్డరోడ్డు సమీపంలో ఉన్న శ్రీవెంకట శ్రీసాయి రైస్ ఇండ్రస్టీలో సోమవారం అగ్ని ప్రమాదం సంభవించింది. షార్ట్ సర్క్యూట్ కారణంగా జరిగిన ఈ ప్రమాదంలో రబీలో రైతుల వద్ద నుంచి ప్రభుత్వం సేకరించిన 32 వేల క్వింటాళ్ల ధాన్యం, 80 వేల (ప్రభుత్వానికి చెందినవి 43 వేలు, యజమానులవి 37 వేలు) గోనె సంచులు, 718 క్వింటాళ్ల నూకలు అగ్నికి ఆహుతయ్యాయి. మొత్తం నష్టం రూ.90 లక్షల వరకు ఉంటుందని మిల్లు యజమాన్యం లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేసినట్లు వీఆర్వో జి.గోపాలకృష్ణ తెలిపారు. కాగా, మిల్లు యజమాన్యం సమాచారంతో విస్సన్నపేట, తిరువూరుకు చెందిన అగ్నిమాపక సిబ్బంది సంఘటనాస్థలికి చేరుకుని, తీవ్రంగా శ్రమించి, మంటలను అదుపు చేశారు. గన్నవరం అగ్నిమాపకాధికారి షేక్ జాన్ అహ్మద్ ఆధ్వర్యంలో ఫైర్ సిబ్బంది మంటలు అదుపులోకి తీసుకురావడంతో నష్టం కొంతమేర తగ్గింది.

ఈ రైస్‌మిల్లులో జరిగిన ఈ అగ్ని ప్రమాదంతో జిల్లా వ్యాప్తంగా ఉన్న బ్రాయిలర్ రైస్ మిల్లుల్లోని భద్రతా లోపాలపై రైతులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు మిల్లులపై దాడులు చేసిచర్యలు తీసుకోకపోతే ఇలాంటి ఘటనలు పునరావృతమయ్యే అవకాశాలున్నాయని రైతులు చెబుతున్నారు.

రైతుల ధాన్యాన్ని సేకరించేందుకు ప్రభుత్వం గన్నీ బ్యాగ్‌లు సమకూర్చలేక ఇబ్బందులు పడుతుంటే, కొందరు మిల్లుల యజమానుల తీరుతో ఈ బ్యాగులు అగ్నికి ఆహుతవుతున్నాయి. ఈ రైస్ మిల్లులో సుమారు 80 వేల గోనె సంచులు బూడిద కావడంపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ఉసురు తీసిన
కట్నం వేధింపులు!

» మామ ఫిర్యాదుతో అల్లుడి అరెస్టు



పుట్టల సదా

గుణదల, జూన్ 9 (ఆంధ్రజ్యోతి) : నాన్నా డబ్బులు కావాలి.. అని కుమార్తె ఫోన్ చేయగా.. ఇప్పుడు లేవమ్మా రెండ్రోజులు ఆగు అని సర్దిచెప్పి ఫోన్ పెట్టిన రెండు గంటల వ్యవధిలోనే.. మీ కూతురు ఉరేసుకుందని అల్లుడు ఫోన్‌చేసి చెప్పడంతో ఆ తండ్రి హతాశుడయ్యాడు. ఈ ఘటన మాచవరం స్టేషన్ పరిధిలో సోమవారం చోటుచేసుకుంది. బాధితులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నల్లగొండ జిల్లా వేములపల్లికి చెందిన వ్యవసాయ కూలీ పుట్టల సురేందర్‌కు ఇద్దరు పిల్లలు. ఇంటర్ చదివిన కుమార్తె సదా(23) అదే ప్రాంతానికి చెందిన రమావత్ సైదాను 2021లో ప్రేమ వివాహం చేసుకుంది. వీరికి మూడేళ్ల పాప ఉంది. వీరు జీవనోపాధి నిమిత్తం నగరానికి వచ్చి చుట్టుగుంట వద్ద నివాసం ఉంటున్నారు. 10రోజుల క్రితం సదా తన పుట్టింటికి వెళ్లి తండ్రిని రూ.లక్ష కావాలని కోరింది. ఇప్పటికిప్పుడు అంటే డబ్బులు లేవమ్మా.. 15 రోజుల్లో తెచ్చి ఇవ్వగలనని తండ్రి చెప్పాడు. దాంతో గత శుక్రవారం ఆమె తిరిగి విజయవాడ చేరుకుంది. ఆదివారం సాయంత్రం మళ్లీ పుట్టింటికి ఫోన్ చేసి నాన్నా ఒక్క 20వేలు అయినా సర్దు అని అడగ్గా.. ఇప్పుడు లేవని చెప్పానుగా తల్లీ అని తండ్రి సమాధానం ఇచ్చి ఫోన్ పెట్టేశాడు. రెండు గంటల వ్యవధిలోనే అల్లుడు మామకు ఫోన్‌చేసి మీ కూతురు ఉరేసుకుందని చెప్పాడు. వెంటనే తండ్రి బంధువర్గంతో సోమవారం ఉదయం విజయవాడ ప్రభుత్వాసుపత్రికి చేరుకున్నారు. మార్చురీలో విగతజీవిగా పడివున్న కుమార్తెను చూసి విలవిలలాడిపోయాడు. కుమార్తెను అదనపు కట్నం కోసం వేధించి మృతికి కారకుడైన అల్లుడు రమావత్ సైదాపై చర్యలు తీసుకోవాలని మాచవరం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. సైదాను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

గుంటుపల్లిలో గుట్టుగా..

(5వ పేజీ తరువాయి)

వేశారు. ఆహారం, మందు కూడా సమకూర్చుకున్నారు. కార్లుబయటకు కనిపించకుండా తుప్పల మధ్య పార్కింగ్ ఏర్పాట్లు చేశారు.

అసలు వారిని వదిలి..

పందేల సమాచారం తెలుసుకున్న ఇబ్రహీంపట్నం పోలీసులు ఈ శిబిరంపై దాడి చేశారు. ఈ దాడిలో ఐదు పుంజులు, ఏడుగురు బెట్టింగ్ రాయుళ్లను పట్టుకున్నారు. అయితే, ఎలాంటి నగదు లభించలేదు. ఖరీదైన కార్లలో వచ్చిన వ్యక్తులెవరూ పోలీసులకు చిక్కలేదు. విచిత్రమేమిటంటే.. పందేలకు వచ్చిన కార్లు కూడా అక్కడి నుంచి వెళ్లిపోయాయి. పోలీసులు అదుపులోకి తీసుకున్న ఏడుగురిలో కార్లలో వచ్చిన వ్యక్తులెవరూ లేరు. ఆహారం, బీర్లు సరఫరా చేయడానికి ఏర్పాటు చేసుకున్న సహాయకులే ఉన్నారు. వీరిపై పెట్టీ కేసు నమోదు చేసి వదిలేశారు. సాధారణంగా పోలీసులు ఎక్కడైనా దాడి చేసి వ్యక్తులను పట్టుకున్నప్పుడు అక్కడున్న వాహనాలను సీజ్ చేస్తారు. ఈ కోడిపందేల శిబిరం వద్ద కనిపించిన కార్లను ఎందుకు పోలీస్‌స్టేషన్‌కు తరలించలేదన్న దానిపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

బ్రాయిలర్ ధరలు

అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	116,125, 136
చికెన్ విత్ స్కిన్	220
చికెన్ స్కిన్‌లెస్	230

నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ. 550

నేడు కరెంట్ ఉండని ప్రాంతాలు

రాణిగారితోట, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ లైన్ల మరమ్మతులు, మెయింటెనెన్స్ నిమిత్తం మంగళవారం ఉదయం 8 గంటల నుంచి 10.30 వరకు న్యూ బ్రిడ్జి సెక్షన్, కృష్ణలంక ఉపకేంద్రం, 11కేవీ బాలాజీనగర్ ఫీడర్ పరిధిలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏపీసీపీడీసీఎల్ కార్య నిర్వాహక ఇంజనీర్ పి. రవీంద్రబాబు తెలిపారు. బాపనయ్యనగర్, చలసానినగర్, రాణిగారితోట, పాత కొత్త శాంపిల్ బిల్డింగ్ ఏరియా, సంగీత అపార్ట్‌మెంట్, పేర్ని బద్రినాథ్ అపార్ట్‌మెంట్ తదితర ప్రాంతాల్లో సరఫరా నిలిపివేయడం జరుగుతుందని, ఆయా ప్రాంతాల వినియోగదారులు సహకరించాలని కోరారు.



అవంతి స్కూల్ గేటు వద్ద ప్రమాదకరంగా మారిన సిమెంట్ దిమ్మ



అవంతి స్కూల్‌లో లీకవుతున్న వాటర్ పైపు







రేగుల అనురాధ స్కూల్ గ్రౌండ్‌లో పెరిగిన ముళ్లపొదలు. గేటు ముందు లేచిన రాళ్లు, గ్రౌండ్‌లో ప్రమాదకరంగా ఉన్న సిమెంట్ పైప్

కార్పొరేషన్ పాఠశాలల్లో సమస్యల తిష్ట

గుణదలలోని అవంతి, ఏపీఐఐసీ కాలనీలో రేగుల అనురాధ పాఠశాలల్లో పెరిగిన పచ్చగడ్డి, ముళ్లపొదలు, బురదతో అధ్వానం

భారతీనగర్, ఆంధ్రజ్యోతి : గుణదల ఈఎస్‌ఐ రోడ్లోని దాసరి వెంకట గిరిధర కుమార్ అవంతి నగర పాలక సంస్థ ప్రాథమిక పాఠశాల, ఏపీఐఐసీ కాలనీలో రేగుల అనురాధ నగరపాలక సంస్థ పాఠశాలలు అపరిశుభ్ర వాతావరణంతో దర్శనమిస్తున్నాయి. మరో మూడు రోజుల్లో బడులు పునః ప్రారంభమవుతాయి. పట్టించుకునే వారు లేకపోవడంతో సమస్యల నిలయంగా మారాయి. నాలుగో డివిజన్ పరిధిలోని గుణదల ఈఎస్‌ఐ రోడ్లోని దాసరి వెంకట గిరిధర కుమార్ అవంతి నగర పాలక సంస్థ ప్రాథమిక పాఠశాల, ఏపీఐఐసీ కాలనీలో రేగుల అనురాధ నగరపాలక సంస్థ పాఠశాలల్లో ఒకటో తరగతి నుంచి 5వ తరగతి వరకు ఉంది. ప్రస్తుతం ఈస్కూల్లో పరిసరాలు అధ్వానంగా ఉండడంతో పాటు పలు సమస్యలు తాండవిస్తున్నాయి.

గుణదల దాసరి వెంకట గిరిధర కుమార్ అవంతి స్కూల్ మెయిన్ గేటు వద్ద ప్రమాదకరంగా మారిన సిమెంట్ దిమ్మ, గ్రౌండ్‌లో మున్సిపల్ వాటర్ పైపు లీకవడంతో ఈ ప్రాంతం మొత్తం బురదగా ఉంది. పెరిగిన పచ్చగడ్డితో స్కూల్ ప్రాంగణం అధ్వానంగా మారింది. ఏపీఐఐసీ కాలనీలోని రేగుల అనురాధ స్కూల్ ప్రాంగణంలో పెరిగిన పచ్చగడ్డి, ముళ్లపొదలు, గ్రౌండ్‌లో లేచిన రాళ్లు, ఆటపరికరాల సమీపంలో బురద సమస్యలకు నిలయంగా మారింది. వీటి గురించి ఎవరూ పట్టించుకోకపోవడంతో స్కూల్లో పరిసరాలు ప్రమాదకరంగా మారాయని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పాఠశాలలు ప్రారంభమయ్యే నాటికి అధికారులు చర్యలు తీసుకోవాలని విద్యార్థులు, తల్లిదండ్రులు కోరుతున్నారు.

ప్రతి సమస్యకు శాశ్వత పరిష్కారాన్ని అందించండి

పీజీఆర్ఎస్‌లో నగర కమిషనర్ ధ్యానచంద్ర ఆదేశం



ఫిర్యాదులను స్వీకరిస్తున్న నగర కమిషనర్ ధ్యానచంద్ర

కార్పొరేషన్, జూన్ 9 (ఆంధ్రజ్యోతి) : నగర ప్రజల నుంచి ఫిర్యాదులు అందిన వెంటనే ప్రతి సమస్యకు శాశ్వత పరిష్కారం అందించాలని నగర కమిషనర్ ధ్యానచంద్ర అధికారులను ఆదేశించారు. నగరపాలకసంస్థ ప్రధాన కార్యాలయం కమాండ్ కంట్రోల్ రూమ్‌లో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికను అధికారులతో కలిసి నిర్వహించారు. సర్కిల్-1, 2, 3 కార్యాలయాలలో జరిగిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికను వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పరిశీలించారు. ఈ సందర్భంలో కమిషనర్ మాట్లాడుతూ ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో అధికారులు సమయపాలన పాటించాలని, ప్రధాన కార్యాలయంతో పాటు జోనల్ కార్యాలయంలో అధికారులందరూ పది గంటలకు హాజరు కావాలని ఆదేశించారు. దరఖాస్తుదారులను వేచి ఉంచకుండా వెంటనే దరఖాస్తులను స్వీకరించాలని సూచించారు. పురమిత్ర యాప్ ద్వారా వచ్చిన ఫిర్యాదులను కూడా పరిష్కరించాలని, ఇప్పటి వరకు పురమిత్రలో నమోదైన సమస్యలను పరిశీలించి తగిన పరిష్కారం అందించాలని అధికారులను ఆదేశించారు. ఈ వేదికలో 13 ఫిర్యాదులు అందినట్లు తెలిపారు. అడిషనల్ కమిషనర్ (ప్రాజెక్ట్స్) డాక్టర్ డి. చంద్రశేఖర్, చీఫ్ సిటీ ప్లానర్ సంజయ్ రత్నకుమార్, సీఈ ఆర్. శ్రీనాథ్ రెడ్డి, పర్యవేక్షణ ఇంజనీర్లు పి. సత్యనారాయణ, పి. సత్యకుమారి, డిప్యూటీ కమిషనర్ (రెవెన్యూ) జి. సృజన పాల్గొన్నారు.

బారికేడ్లు తొలగించాలి

సీపీఎం ఆధ్వర్యంలో సీపీకి వినతి

కృష్ణలంక, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): కృష్ణలంక సత్యం హోటల్ సెంటర్ వద్ద జాతీయ రహదారిపై ప్రమాదాల నివారణ, బారికేడ్లు తొలగించాలని సీపీఎం ఆధ్వర్యంలో నగర పోలీసు కమిషనర్ రాజశేఖరబాబుకు సోమవారం వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం రాష్ట్ర కార్యవర్గసభ్యులు దోనేపూడి కాశీనాథ్, సీపీకి అక్కడి పరిస్థితులను వివరించారు. కృష్ణలంక ప్రాంతంలో గత నెల రోజుల్లో రెండు, మూడు ప్రమాదాలు జరిగాయని, హైవేపై మితిమీరిన వేగంతో వాహనాలు నడుస్తున్నాయని, ప్రజలను ఇబ్బందిపెట్టే విధంగా హైవేపై బారికేడ్లు ఏర్పాటు చేశారన్నారు. హైవేపై నాలుగు చోట్ల బారికేడ్లతో మూసివేసి అటువారు ఇటు, ఇటువారు అటు వెళ్లేందుకు లేకుండా చర్యలు చేపట్టారన్నారు. హైవేపై ప్రమాదాలు జరగకుండా ఈ ప్రాంతంలో పోలీసు బీట్‌ను ఏర్పాటు చేయాలని సీపీని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు పుప్పాల కృష్ణ, కోరాడ రమణ, గోపి, అనిల్, సిద్ధు, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

ఈఏపీసెట్‌లో ర్యాంకులు పొందిన శారద విద్యార్థులకు అభినందన

మొగల్రాజపురం, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): ఏపీ ఈఏపీసెట్ ప్రవేశ పరీక్షలలో వివిధ కేటగిరిలలో అత్యుత్తమ ర్యాంకులు సాధించిన శారద విద్యార్థుల అభినందన కార్యక్రమం సోమవారం కళాశాలలో జరిగింది. ర్యాంకులు సాధించిన ఎండీ ఖమరన్ (135), బి.లిఖిత(151),కె. అక్షిత(177), సిహెచ్ శ్రీరామ్ (241), ఆర్. చైత్రప్రియ (253), జి లోకనాథ శాస్త్రి(5480, బి. సింధు(675), జీఎస్‌వీ రమేష్ బాబు (687)లను శారద విద్యాసంస్థల చైర్మన్ వై. రమేష్ బాబు, మేనేజింగ్ డైరెక్టర్ శారదా దేవి అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మొత్తం 850 మంది విద్యార్థులలో సగానికి పైగా మంచి ర్యాంకులు, 120 మంది విద్యార్థులు 10వేల లోపు అత్యుత్తమ ర్యాంకులు సాధించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల జీఎం జీవీ రావు, అధ్యాపకులు పాల్గొన్నారు.

శాతవాహన కూల్చివేతపై చర్యలేం తీసుకున్నారు?

- సీఎంను ప్రశ్నించిన సీపీఎం నేత బాబూరావు

వన్‌టౌన్, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): శాతవాహన కళాశాలను అర్ధరాత్రి కూల్చివేసిన ఘటనపై ముఖ్యమంత్రి చంద్రబాబు ఘటనకు బాధ్యులైన వారిపై ఎటువంటి చర్యలు తీసుకున్నారని సీపీఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సీహెచ్ బాబూరావు ప్రశ్నించారు. ఈ మేరకు ఆయన సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. సీఎం చంద్రబాబు ఎమ్మెల్యేలతో టెలీకాన్ఫరెన్స్‌లో మాట్లాడుతూ గీత దాటితే చర్యలు తీసుకుంటానని, సింగిల్ టైమ్ ఎమ్మెల్యేలుగా ఉండదలచుకుంటారా? అని హెచ్చరించారని, అయితే ఈఘటన పై సీఎం ఎలాంటి చర్యలు తీసుకున్నారని ప్రశ్నించారు. శాతవాహన కళాశాలకు ఎమ్మెల్సీ రాజేంద్రప్రసాద్‌కు సంబంధం ఏమిటి అని నిలదీశారు. ఈ ఘటనపై పోలీసులు చర్యలు తీసుకోకపోయినా, ముఖ్యమంత్రి చంద్రబాబు ఎందుకు చర్యలు తీసుకోలేదన్నారు. తన ఇంటికి సమీపంలో ఉన్న కళాశాల కూల్చివేత గురించి స్థానిక ఎమ్మెల్యేకు తెలియదా అని ఎద్దేవా చేశారు. ఇటువంటి ఘటనలు జరుగుతుంటే చట్ట నిబంధనలు గురించి మాట్లాడే వారు ఆ నిబంధనలను ఎందుకు పాటించటం లేదని బాబూరావు ప్రశ్నించారు.

సిడ్నీ మహానాడులో ఎమ్మెల్యే బోడె ప్రసాద్

పెనమలూరు, జూన్ 9 (ఆంధ్రజ్యోతి) : ఆస్ట్రేలియాలోని సిడ్నీ మహానాడు, ఎన్టీఆర్ సినీ వజ్రోత్సవ వేడుకల్లో పెనమలూరు ఎమ్మెల్యే బోడె ప్రసాద్ సతీసమేతంగా హాజరయ్యారు. కార్యక్రమంలో పాల్గొనడానికి నందమూరి రామకృష్ణ, నారారోహిత్, నన్నూరి నర్సిరెడ్డి, అట్లూరి అశ్విన్ తదితరులు వచ్చారు. వీరందరికీ సిడ్నీ ఎన్నారై కుటుంబసభ్యులు స్వాగతం పలికారు.

విజన్ 2047 లక్ష్యంగా పనిచేయాలి

- నియోజకవర్గ యాక్షన్ ప్లాన్ టెలీకాన్ఫరెన్స్‌లో సీఎం చంద్రబాబు పిలుపు

పటమట, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం వికసిత్ లక్ష్యాల్లో భాగంగా 15 శాతం జీడీపీ పెంపు లక్ష్యంగా పెట్టుకొని అందరూ పని చేయాలని సీఎం చంద్రబాబు పిలుపునిచ్చారు. 2047 విజన్‌లో భాగంగా ఏర్పాటైన నియోజకవర్గ యాక్షన్ ప్లాన్, జిల్లా విజన్ యాక్షన్ ప్లాన్‌ను సీఎం వర్చువల్‌గా ప్రారంభించారు. స్వర్ణాంధ్ర 2047 విజన్‌కు సంబంధించి సోమవారం సీఎం చంద్రబాబు నాయుడు నిర్వహించిన టెలీకాన్ఫరెన్స్‌లో ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్, సర్కిల్ - 3 అధికారులు పాల్గొన్నారు. ప్రపంచ దేశాల్లో భారత్ మూడో స్థానంలో ఉందని, త్వరలోనే జర్మనీని దాటి పోతామని సీఎం తెలిపారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కమిషనర్ చంద్రశేఖర్, ఈఈ సామ్రాజ్యం, ఏసీ -3 బి.శర్మ, చెన్నుపాటి గాంధీ, ముమ్మనేని ప్రసాద్, మాధవి, పలువురు పాల్గొన్నారు.



టెలీకాన్ఫరెన్స్‌లో పాల్గొన్న ఎమ్మెల్యే గద్దె

రాష్ట్ర ప్రతిష్ఠను దిగజారుస్తున్న వైసీపీ

సీఎం చంద్రబాబు తనకున్న పాలనానుభవం సమర్థతతో రాష్ట్ర రాజధాని అమరావతి ఇమేజ్‌ను పెంచుతున్నారని, వైస్ జగన్మోహన్ రెడ్డి తన మీడియా ద్వారా రాష్ట్ర ప్రతిష్ఠతను దిగజార్చేందుకు యత్నిస్తుడని ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ విమర్శించారు. సోమవారం అశోక్‌నగర్‌లోని తన కార్యాలయంలో ఇద్దరికి జీవనోపాధి తోపుడు బండ్లను వితరణగావించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేవతల రాజధాని అమరావతి అని అందరూ అం టుంటే అమరావతి పేరును కించపరిచేలా వ్యాఖ్యలు చేయించారని ధ్వజమెత్తారు. ఈ వ్యాఖ్యలను సాక్షి యాజమాన్యం ఖండించక పోవడం భావ్యం కాదన్నారు. ఎన్నికల అనంతరం రాజకీయాలు చేయడం తగదన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ పొట్లూరి సాయిబాబు, శాయన బుజ్జి, కొండవీటి శ్రీనివాసరావు, సింహాచలం, ఫజల్‌రఫ్, రమణ తదితరులు పాల్గొన్నారు.



కపిరాజ్ నాటక కళాకారులతో సెంట్రల్ రైల్వే జనరల్ మేనేజర్ ధర్మవీర్ మీనా

హిందీ నాటక పోటీల్లో కపిరాజ్ నాటకం ఫస్ట్

విజయవాడ రైల్వే డివిజన్ కళాకారులకు డీఆర్ఎం నరేంద్ర ఎ పాటిల్ అభినందన

రైల్వేస్టేషన్, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): సౌత్ సెంట్రల్ రైల్వే అఖిల భారత హిందీ నాటక పోటీల్లో విజయవాడ డివిజన్ కళాకారులు ప్రదర్శించిన కపిరాజ్ (విజేత) నాటకం మొదటి బహుమతిని కైవసం చేసుకుంది. ఈ నాటకానికి వరుసగా మూడోసారి మొదటి బహుమతి లభించింది. భూసావల్‌లో హిందీ నాటక పోటీలు జరిగాయి. ఈ సందర్భంగా సెంట్రల్ రైల్వే జనరల్ మేనేజర్ ధర్మవీర్ మీనా కళాకారులను ప్రశంసిస్తూ దర్శకుడి ప్రతిభను కొనియాడారు. మొత్తం కళాకారుల జట్టు అద్భుతంగా ప్రదర్శించిందని పేర్కొన్నారు. విజయవాడ డివిజన్ రైల్వే మేనేజర్ నరేంద్ర ఎ పాటిల్ కళాకారుల బృందాన్ని ప్రశంసిస్తూ, మొదటి బహుమతి గెలుచుకున్నందుకు అభినందించారు.

ప్రతి ఒక్కరూ యోగా అలవాటు చేసుకోవాలి

- సర్కిల్-3 ఈఈ సామ్రాజ్యం

కృష్ణలంక, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ యోగాను అలవాటు చేసుకొని, పదిమందినీ యోగాకు అలవాటు పడేలా చేయాలని సర్కిల్-3 ఈఈ జి.సామ్రాజ్యం తెలిపారు. సోమవారం కృష్ణలంక 21వ డివిజన్‌లోని పలు సచివాలయాల అడ్మిన్‌లు, వివిధ విభాగాల సెక్రటరీలు యోగాంధ్ర ర్యాలీని డివిజన్‌లోని పలు వీధుల్లో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఈఈ సామ్రాజ్యం మాట్లాడుతూ అనారోగ్యాలకు దూరంగా ఉండాలంటే ప్రతి ఒక్కరూ యోగా సాధన చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో వివిధ విభాగాల సెక్రటరీలు పాల్గొన్నారు.



కృష్ణలంక పురవీధుల్లో యోగాంధ్ర ర్యాలీ నిర్వహిస్తున్న సచివాలయ అడ్మిన్‌లు, వివిధ విభాగాల సెక్రటరీలు

సనాతన ధర్మానికి ప్రతీక శివాజీ మహరాజ్

శైవక్షేత్ర పీఠాధిపతి శివస్వామి



కనకదుర్గమ్మకు, ఛత్రపతి శివాజీ మహరాజ్‌కు హారతులు ఇస్తున్న ట్రస్టు సభ్యులు

సత్యనారాయణపురం, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): సనాతన ధర్మానికి ప్రతీక శివాజీ మహరాజ్ అని శైవ క్షేత్రపీఠాధిపతి శివస్వామి అన్నారు. శ్రీ ఛత్రపతి శివాజీ స్మారక ట్రస్ట్ ఆధ్వర్యంలో బీఆర్‌టీఎస్ రోడ్డు శ్రీఆదిశంకరాచార్య సర్కిల్ వద్ద సోమవారం సాయంత్రం హిందూసామ్రాజ్య దినోత్సవం నిర్వహించారు. కనకదుర్గమ్మకు, ఛత్రపతి శివాజీ మహరాజ్‌కు హారతి ఇచ్చారు. ఈ సందర్భంగా శివస్వామి మాట్లాడుతూ మొగల్ సామ్రాజ్యం ఆధిపత్యం చెలాయించిన కాలంలో శివాజీ హిందువుల ఆత్మగౌరవాన్ని కాపాడి, స్వరాజ్యాన్ని స్థాపించారన్నారు. బీజేపీ జిల్లా అధ్యక్షు అడ్డూరి శ్రీరామ్ మాట్లాడుతూ శివాజీ హిందూ ధర్మాన్ని, సంస్కృతి సంప్రదాయాలను కాపాడరాన్నారు. ఛత్రపతి శివాజీ సమితి కన్వీనర్ నాగలింగం శివాజీ మాట్లాడుతూ నగరంలో శివాజీ మహరాజ్ విగ్రహం ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బుల్లబ్బాయి, బొడ్డు నాగలక్ష్మి, అవుటుపల్లి శివ ప్రసాద్, పి.రాఘవ రాజు, రత్నకుమార్, రవితేజ, శ్రీనివాస్ పద్మజ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగం ఇప్పిస్తానని మోసం

అజిత్‌సింగ్‌నగర్, జూన్ 9 (ఆంధ్రజ్యోతి) : ఉద్యోగం ఇప్పిస్తానని ఓ మహిళను మోసం చేసిన వ్యక్తిపై అజిత్‌సింగ్‌నగర్ పోలీసులు సోమవారం కేసు నమోదు చేశారు. వివరాల ప్రకారం అజిత్‌సింగ్‌నగర్ ప్రాంతానికి చెందిన మహిళ కుటుంబసభ్యులతో ఉంటుంది. భర్త కేరళలోని సీఐఎస్ఎఫ్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా పనిచేస్తున్నాడు. మహిళకు తుళ్లూరుకు చెందిన మునగాల అనిల్‌తో రెండేళ్ల క్రితం పరిచయం ఏర్పడింది. మునగాల అనిల్, అతని భార్య పార్వతి జపాన్‌లో ఉద్యోగం ఇప్పిస్తానని సదరు మహిళను నమ్మబలికారు. ఉద్యోగం వస్తుందన్న ఆశతో మహిళ పలు దఫాలుగా రూ.12,50,000 అనిల్‌కు ఇచ్చింది. అప్పటి నుంచి ఉద్యోగం కోసం మహిళ అనిల్‌ను ప్రశ్నించగా అదిగో ఇదిగో అంటూ మాయమాటలు చెప్పుకొచ్చాడు. దీంతో తాను మోసపోయానని గ్రహించిన మహిళ సోమవారం అజిత్‌సింగ్‌నగర్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

తాడిగడప మున్సిపల్ కమిషనర్ పి. భవానీప్రసాద్



కానూరు, జూన్ 9 (ఆంధ్రజ్యోతి) : యోగాతో సంపూర్ణ ఆరోగ్యమని, ప్రతి ఒక్కరూ నిత్యం యోగా సాధన చేయాలని తాడిగడప మున్సిపల్ కమిషనర్ పి. భవానీప్రసాద్ అన్నారు. సోమవారం కానూరులో యోగాంధ్ర-2025 అవగాహన ర్యాలీ జరిగింది. ఈ ర్యాలీ కానూరు వీఆర్ సిద్ధార్థ ఇంజనీరింగ్ కళాశాల నుంచి వంద అడుగుల రోడ్డు జంక్షన్‌లో ఆల్ఫా కేఫ్ వరకు సాగింది. ఈ ర్యాలీని కమిషనర్ పి. భవానీ ప్రసాద్ ప్రారంభించి మాట్లాడుతూ, ప్రతిఒక్కరూ తమ ఆరోగ్య పరిరక్షణలో భాగంగా నిత్యం కొద్దిసేపు యోగా చేయాలని సూచించారు. దీనివల్ల రాష్ట్రం యోగాంధ్రగా మారుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ డి. కిరణ్ కుమార్, టీడీపీ నేత దోనేపూడి రవికిరణ్‌తో పాటు మున్సిపల్, సచివాలయం సిబ్బంది, సీనియర్ సిటిజన్స్, శానిటరీ మేస్త్రీలు, పబ్లిక్ వర్కర్లు పాల్గొన్నారు.

చెత్త తొలగించండి



రామలింగేశ్వరనగర్, ఆంధ్రజ్యోతి: పటమట అంబేడ్కర్ నగర్ కాల్వగట్టు ప్రాంతం శ్మశాన వాటిక సమీపంలో చెత్త పేరుకుపోయి దుర్గంధం వెదజల్లుతోంది. దుర్వాసన భరించలేక చుట్టు పక్కల కాలనీ వాసులు అధికారుల వైఖరిపై మండి పడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత శానిటరీ అధికారులు స్పందించి తక్షణమే తగు చర్యలు తీసుకోవాలని స్థానిక ప్రజలు కోరుకుంటున్నారు.



మైలవరానికి.. మహర్దశ!

● అమరావతి అభివృద్ధే నియోజకవర్గానికి వరం ● సీఆర్‌డీఏలో త్రీ టైర్ పట్టణంగా నమోదు

ఆంధ్రజ్యోతి, ఇబ్రహీంపట్నం: రాజధాని అమరావతికి గేట్ వేగా మూలపాడు ప్రాంతం నిలవబోతుండటం, స్పోర్ట్స్ సిటీ, అవుటర్ రిం గ్ రోడ్డు, విజయవాడ - ఖమ్మం గ్రీన్‌ఫీల్డ్ హై వే ఏర్పాటు కాబోతుండటం వంటివి సీఆర్‌డీఏలో పట్టణ ప్రాంతంగా ఉన్న మైలవరం ప్రాంతానికి మహర్దశ పట్టించబోతున్నాయి. భవిష్యత్‌లో మహా పట్టణంగా వెలుగొందడం ఖాయం. రాజకీయంగా ఎంతో చైతన్యవంతమైన మైలవరం పాలకుల నిర్లక్ష్యానికి గురయిందనే చెప్పాలి. నియోజకవర్గానికి ముఖ్యకేంద్రమైనా అభివృద్ధి మాత్రం ఆమడదూరంలోనే ఆగింది. అమరావతి చుట్టూ నిర్మించనున్న అవుటర్ రింగ్ రోడ్డుతో మైలవరం దశ తిరగబోతుంది. వాణిజ్య, వ్యాపారపరంగా అభివృద్ధి చెందబోతుంది. ఈ అవుటర్ పూర్తయితే ఇబ్రహీం


మైలవరం మెయిన్ సెంటర్

పట్నం - చత్తీస్‌గఢ్ 30వ నంబరు జాతీయ రహదారి, విజయవాడ - హైదరాబాద్ జాతీయ రహదారులు కలిసిపోతాయి. ఖమ్మం - విజయవాడ గ్రీన్‌ఫీల్డ్ హైవేని అవుట్ రింగ్ రోడ్డు జి.కొండూరు మండలం పెట్రంపాడు వద్ద క్రాస్ చేస్తుంది. ఆ ప్రాంతంలో అవుటర్ రింగ్ రోడ్డుపైకి గ్రీన్ ఫీల్డ్ హైవే వాహనాలు మళ్లిస్తే అక్కడి నుంచి కేవలం 10 నిముషాల్లో మైలవరం చేరుకోవచ్చు.

నియోజకవర్గంలో విస్తృత అభివృద్ధి

అమరావతి అభివృద్ధిలో భాగంగా నియోజకవర్గంలో పలు ప్రాంతాలను అభివృద్ధి చేయనున్నారు. మూలపాడు, కొటికలపూడి, జమిపోతవరం, త్రిలోచనపురం గ్రామాల్లో స్పోర్ట్స్ సిటీ, స్పోర్ట్స్ వర్సిటీ నిర్మాణానికి ప్రభుత్వం ల్యాండ్ పూలింగ్ ద్వారా భూ సేకరణకు సన్నాహాలు చేస్తోంది. ఇవన్నీ ఏర్పడి, మూలపాడు వద్ద రాజధాని అమరావతి ముఖ ద్వారం ఏర్పాటు చేసి కృష్ణానదిపై వంతెన నిర్మాణం జరిగితే మైలవరం నియోజకవర్గం పూర్తిగా రాజధానిలో కలిసిపోతుంది. పైగా ఎర్రుపాలెం నుంచి గుంటూరు జిల్లా నంబూరు వరకు వేయనున్న రైల్వే మార్గం కూడా నియోజకవర్గంలోని కొన్ని ప్రాంతాలను కలిసి వెళ్తుండటం కలిసి వచ్చే అంశంగా చెప్పుకోవచ్చు.

కంచికచర్ల హెచ్‌సీపై వేటు

● పేకాట ఎఫెక్ట్

విజయవాడ, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): కంచికచర్ల హెడ్ కానిస్టేబుల్ ప్రభుకుమార్‌పై వేటుకు రంగం సిద్ధమైంది. ఆయన్ను విధుల నుంచి సస్పెండ్ చేయాలని అధికారులు నిర్ణయించారు. నివాసముంటున్న ఇంటికి పక్కనే ఉన్న ఇంట్లో పేకాట నిర్వహించడంతో ఆయన్ను విధుల నుంచి తప్పించడానికి ప్రతిపాదనలు సిద్ధం చేశారు. కొండపల్లిలోని ఎస్టీ కాలనీలో ఉంటున్న ప్రభుకుమార్ కంచికచర్ల పోలీస్‌స్టేషన్‌లో హెడ్‌కానిస్టేబుల్‌గా పనిచేస్తున్నారు. ఆదివారం తన ఇంటికి పక్కనే ఉన్న ఇంట్లో పేకాట శిబిరం ఏర్పాటు చేయడం, అందులో ఆయన భాగస్వామి అవడం, పోలీసులు అరెస్టు చేయడం తెలిసిందే. అయితే ఈ విషయాన్ని గోప్యంగా ఉంచాలని ఇబ్రహీంపట్నం పోలీసులు చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. విషయం ఉన్నతాధికారులకు తెలియడంతో సీరియస్ అయ్యారు. సోమవారం ఉదయం నిర్వహించిన సెల్ కాన్ఫరెన్స్‌లో ప్రభుకుమార్‌ను సస్పెండ్ చేయాలని సీపీ రాజశేఖరబాబు ఆదేశాలిచ్చారు.

నేటి షైనింగ్ స్టార్స్.. రేపటి డైమండ్ స్టార్స్

● మంత్రి సత్యకుమార్ యాదవ్

వన్‌టౌన్, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): పరీక్షా ఫలితాల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన నేటి షైనింగ్ స్టార్స్. రేపటి డైమండ్ స్టార్స్ ఎదగాలని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి సత్యకుమార్ యాదవ్ అన్నారు. సమాజ పురోగతికి విద్య ఎంతో దోహదపడుతుందన్నారు. 10వ తరగతి, ఇంటర్ 2025 ఫలితాల్లో అసాధారణ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను గుర్తించి ప్రోత్సహించేందుకు నిర్వహించిన షైనింగ్ స్టార్స్ అవార్డుల కార్యక్రమం సోమవారం తుమ్మలపల్లి కళాక్షేత్రంలో జరిగింది. ముఖ్య అతిథిగా మంత్రి సత్యకుమార్ యాదవ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు చదువు పట్ల ఉత్సాహం, ఆసక్తిని కలిగించేలా రాష్ట్ర ప్రభుత్వం అనేక పథకాలను ప్రవేశపెట్టిందన్నారు. రాష్ట్రాన్ని క్వాంటమ్ వ్యాలీగా కొత్త ఆవిష్కరణలకు కేంద్రంగా తయారు చేయటానికి ప్రయత్నం చేస్తున్నామన్నారు. కేంద్రం నుంచి డిజిటల్ ఇండియా, మేకింగ్ ఇండియా వంటి కార్యక్రమాలతో సహ



విద్యార్థినులకు షైనింగ్ స్టార్ అవార్డులను అందజేస్తున్న మంత్రి సత్యకుమార్, కలెక్టర్ లక్ష్మీశ

కారం అందిస్తున్నారన్నారు. రాష్ట్రాన్ని ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ (ఏఐ)కు కేంద్రంగా చేయాలని 500 పైగా స్టార్టప్‌లను ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. కలెక్టర్ జి.లక్ష్మీశ మాట్లాడుతూ 10వ తరగతి, ఇంటర్‌లో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులను మరింత ప్రోత్సహించి ఊతమిచ్చేలా రాష్ట్ర ప్రభుత్వం ఈ ఏడాది వినూత్నంగా షైనింగ్ స్టార్స్ పేరుతో అవార్డులను ప్రధానం చేయటం అభినందనీయమన్నారు. సెంట్రల్ ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ విద్యారంగాన్ని అభివృద్ధి చేసేందుకు కేజీ నుంచి పీజీ వరకు ప్రణాళికతో సంస్కరణలు చేసేందుకు ప్రభుత్వం చర్య తీసుకుంటుందన్నారు. తూర్పు ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ మాట్లాడుతూ గాడి తప్పిన విద్యావ్యవస్థను గాడిలో పెట్టేందుకు విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్ కృషి చేస్తున్నారన్నారు. గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావ్ మాట్లాడుతూ విద్యార్థులు నిరంతరం పరిశోధనాత్మక ఆలోచనలు చేయాలన్నారు. అనంతరం ఫలితాల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన షైనింగ్ స్టార్స్ అవార్డులకు ఎంపికైన 131 మంది 10వ తరగతి విద్యార్థులు, 43 ఇంటర్ విద్యార్థులకు రూ.20వేల నగదు, షీల్డ్, ప్రశంసా పత్రాలను అందజేశారు. విద్యార్థుల వెనుక అహర్నిశలు కృషి చేసిన ఆయా పాఠశాలల ఉపాధ్యాయులను అభినందించారు. జాయింట్ కలెక్టర్ ఇలక్కియా, వీఎంసీ కమిషనర్ హెచ్‌ఎం ధ్యానచంద్ర, జిల్లా విద్యాశాఖాధికారి ఎంవీ సుబ్బారావు, సమగ్ర శిక్షా అభియాన్ ప్రాజెక్టు డైరెక్టర్ జి.ఉమామహేశ్వరరావు, షైనింగ్ స్టార్స్ విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.


కలెక్టరేట్ వద్ద నిరాహార దీక్షల్లో పాల్గొన్న ఉపాధ్యాయ సంఘాల నేతలు

ఉపాధ్యాయ సంఘాల నేతల దీక్షలు

మచిలీపట్నం టౌన్, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): సెకండరీ గ్రేడు టీచర్లకు మాన్యువల్‌గా బదిలీల కౌన్సెలింగ్ నిర్వహించాలంటూ సోమవారం కలెక్టరేట్ ఉపాధ్యాయ సంఘాల నేతలు నిరాహార దీక్షలు నిర్వహించారు. వెబ్ కౌన్సెలింగ్‌తో టీచర్లు తీవ్రంగా నష్టపోతారని దీక్షల్లో పాల్గొన్న ఉపాధ్యాయ సంఘాల నేతలు ఆవేదన వ్యక్తం చేశారు. యూటీఎఫ్ నేతలు బి కనకారావు, ఏ సుందరయ్య, కేఏ ఉమామహేశ్వరరావు, ఏపీటీఎఫ్ నేతలు బీ లంకేశ్, జీ సత్యనారాయణ, పీ పాండురంగ ప్రసాద్, ఏ సుబ్రహ్మణ్యం, రాధిక, ఈవీ రామారావు, ఎస్టీయూ నేతలు చంద్రశేఖర్, ఏపీటీఎఫ్ నేతలు తమ్ము నాగరాజు, ఏపీపీటీఏ నేతలు ఏఆర్ అస్లాం, పీఆర్‌టీయూ నేతలు పీ శ్రీనివాసరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వివిధ ఉపాధ్యాయ సంఘాల నేతలు శిబిరంలో మాట్లాడారు. ఉమ్మడి కృష్ణాజిల్లాలో దాదాపు 4,300 మంది సెకండరీ గ్రేడు టీచర్లు బదిలీల కోసం దరఖాస్తు చేసుకున్నారని సంఘ నేతలు పీ పాండురంగ వరప్రసాద్, తమ్ము నాగరాజు, కేఏ ఉమామహేశ్వరరావు అన్నారు. ఎన్నికల ముందు టీచర్లకు ఇబ్బందులు కలుగనీయమని లోకేశ్ వాగ్దానం చేశారన్నారు. వాటిని నిలుపుకుని టీచర్లకు న్యాయం చేయాలన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని ఉపాధ్యాయ సంఘాల నేతలు ఉద్యమిస్తున్నారని, సమస్య జటిలతను ప్రభుత్వం గుర్తించి పరిష్కరించాలన్నారు.

రేపు అండర్-18 బాలబాలికల కబడ్డీ జట్ల ఎంపికలు

విజయవాడ స్పోర్ట్స్, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర అండర్ -18 బాల బాలికల కబడ్డీ జట్ల ఎంపికలు ఈ నెల 11న నిర్వహిస్తున్నట్టు ఆంధ్రప్రదేశ్ కబడ్డీ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ యలమంచిలి శ్రీకాంత్ తెలిపారు. ఈ ఎంపికలు కాకినాడలోని జేఎన్‌టీయూ ఇండోర్ స్పోర్ట్స్ కాంప్లెక్స్ నందు ఉదయం 7 గంటలకు ప్రారంభమవుతాయని, ఎంపికైన జట్లు ఈ నెల 28 నుంచి జూలై 1 వరకు ఉత్తరాఖండ్‌లోని హరిద్వార్‌లో జరిగే ఫస్ట్ జూనియర్ నేషనల్ కబడ్డీ చాంపియన్‌షిప్ అండర్-18లో పాల్గొంటాయని తెలిపారు. ఈ ఎంపికల్లో పాల్గొనే క్రీడాకారులు 15 నుంచి 18 ఏళ్లలోపు వయసు కలిగి ఉండాలని, బాలురు 70 కేజీలు, బాలికలు 65 కేజీల లోపు బరువు కలిగి ఉండాలన్నారు. రాష్ట్రంలోని 26 జిల్లాల కబడ్డీ అసోసియేషన్ సెక్రటరీలు తమ జిల్లాలోని అత్యుత్తమ ప్రతిభగల క్రీడాకారులను ఈ ఎంపికకు హాజరయ్యేలా సహకరించాలని కోరారు.


విద్యుత్ అధికారులు, సిబ్బందితో మాట్లాడుతున్న విజయకుమారి

విద్యుత్ శాఖ విజిలెన్స్ అధికారుల

ఆకస్మిక తనిఖీలు

● కానూరు సెక్షన్‌లో 37 బృందాలుగా ఏర్పడి దాడులు

● 120 కేసులు నమోదు.. రూ. 4.36 లక్షల అపరాధ రుసుం

కానూరు, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ అక్రమ వినియోగం జరుగుతున్నట్టు సమాచారం అందడంతో సోమవారం గుణదల డివిజన్ పరిధిలోని కానూరు సెక్షన్‌లో విద్యుత్ శాఖ విజిలెన్స్ అధికారులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. విద్యుత్ విజిలెన్స్, ఆపరేషన్ అధికారులు 37 బృందాలుగా ఏర్పడి తనిఖీలు చేశారు. ఈ తనిఖీల్లో 120 కేసులు నమోదు చేసి రూ.4.36లక్షలు అపరాధరుసుం విధించారు. ఇందులో అధికంగా వాడుకుంటున్న విద్యుత్ లోడ్‌తోపాటు ఒక కేటగిరి నుంచి ఇంకో కేటగిరికి విద్యుత్ వాడకం గుర్తించారు. అలాగే తక్కువ బిల్లు వస్తున్న సర్వీస్‌లను కూడా గుర్తించి క్రమబద్ధీకరణ చేసుకోవాలని వినియోగదారులకు నోటీసులను అధికారులు అందజేశారు. ఈ దాడుల్లో గుణదల డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పీ హరిబాబు, విజిలెన్స్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పీ విజయకుమారి, డీఈ నవీన్‌కుమార్, కానూరు ఏఈ వంశీకృష్ణ, విజిలెన్స్ ఏఈలు, ఏడీఈతో పాటు పలువురు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. కాగా తొలుత డివిజన్‌లోని లైన్‌మెన్‌లు, లైన్ ఇన్‌స్పెక్టర్‌లకు వారి విధులు, వారి బాధ్యతలను గురించి, ఫీల్డ్‌లో లైన్‌ల మీద పనిచేసే సమయంలో తీసుకోవలసిన జాగ్రత్తలను గురించి వారి సిబ్బందికి వివరించారు.

యోగాతోనే ఆరోగ్య వైభోగం

● కలెక్టర్ లక్ష్మీశ ● నగరంలో 3వేల మందితో మెగా యోగాంధ్ర ర్యాలీ

● ర్యాలీకి తరలివచ్చిన ఉద్యోగులు, స్వచ్ఛంద సంస్థలు, యోగా ఔత్సాహికులు...

కలెక్టరేట్, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): యోగా ఆవశ్యకతను చాటిచెప్పేందుకు నిర్వహిస్తున్న యోగాంధ్ర ప్రచారానికి ప్రజల నుంచి అనూహ్య స్పందన లభిస్తోందని, జిల్లాలో 10 లక్షల మందికి యోగాసనాలు నేర్పేందుకు 5వేల మంది ట్రైనర్లతో శిక్షణ ఇస్తున్నామని కలెక్టర్ లక్ష్మీశ తెలిపారు. యోగాంధ్ర మాసోత్సవాల్లో భాగంగా జిల్లా అధికారులు, వీఎంసీ, ఆయుష్ శాఖ ఆధ్వర్యంలో సోమవారం నగరంలోని ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియం నుంచి బెంజిసర్కిల్ వరకు ర్యాలీని కలెక్టర్ లక్ష్మీశ, అధికారులతో కలిసి ప్రారంభించారు. జాయింట్ కలెక్టర్ ఇలక్కియ, వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్రతో కలిసి వడివడిగా అడుగులేస్తూ యోగాసనాల ఉపయోగాలను చాటిచెప్పారు. ఈ సందర్భంగా కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ రాష్ట్రంలో జూన్ 21 నాటికి కనీసం 2 కోట్ల మందికి, జిల్లాలో దాదాపు 10 లక్షల మందికి యోగాసనాలను నేర్పించేందుకు ప్రతి గ్రామం, పట్టణంలోనూ యోగాంధ్ర నిర్వహిస్తున్నామన్నారు. రోజూ వివిధ వర్గాల వారితో చిన్నారుల నుంచి సీనియర్ సిటిజన్స్ వరకు అందరికీ యోగాసనాలను చేరువచేసేందుకు కృషిచేస్తున్నామని కలెక్టర్ వెల్లడించారు.

యోగాసనాలు వేయండి

'యోగాసనాలు వేయండి, ఆరోగ్యాన్ని కాపాడుకోండి' అనే నినాదంతో యోగాపై ప్రజల్లో అవగాహన కల్పిస్తున్నామని కలెక్టర్ తెలిపారు. కేంద్ర ఆయుష్ మంత్రిత్వ శాఖ నిపుణులతో రూపొందించిన 45 నిమిషాల సరళ యోగా కామన్ ప్రొటోకాల్‌తో యోగాసనాలను నేర్పిస్తున్నట్టు వివరించారు. అనంతరం ఆయన


యోగాంధ్ర ర్యాలీలో పాల్గొన్న కలెక్టర్ లక్ష్మీశ, కమిషనర్ ధ్యానచంద్ర తదితరులు

అధికారులతో కలిసి డ్రగ్స్ వద్దు బ్రో (1972 టోల్ ఫ్రీ నెంబరు) నినాదంతో రూపొందించిన పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ ర్యాలీలో ఆర్డీవో కావూరి చైతన్య, డీఎంహెచ్‌వో డాక్టర్ ఎం.సుహాసిని, వీఎంసీ అదనపు కమిషనర్ డీ చంద్రశేఖర్, స్వచ్ఛంద సంస్థలు, యోగా శిక్షణ సంస్థలు, యోగా గురు సత్యనారాయణ, అధికారులు, సిబ్బంది, యోగా ఔత్సాహికులు పాల్గొన్నారు.

యోగాభ్యాసంతో ఒత్తిళ్లు దూరం

సత్యనారాయణపురం: రోజువారీ జీవితంలో ఎదురయ్యే ఒత్తిళ్లను ఎదుర్కొనేందుకు యోగా ఎంతగానో ఉపయోగపడుతుందని కలెక్టర్ జి.లక్ష్మీశ అన్నారు. బీఆర్‌టీఎస్ రోడ్డు యోగా స్ట్రీట్‌లో జిల్లా అధికారులు, వీఎంసీ, సోమవారం టీచర్స్ థీమ్ యోగా జరిగింది. ఉపాధ్యాయులతో కలిసి కలెక్టర్ యోగాసనాలు వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో యోగాంధ్రకు విశేష స్పందన వస్తోందన్నారు. ప్రతి ఒక్కరూ రోజులో కొంత సమయాన్ని యోగా, ధ్యానానికి కేటాయించి సంపూర్ణ ఆరోగ్యాన్ని సొంతం చేసుకోవాలన్నారు. విశ్రాంత ఉపాధ్యాయులు కే ధనలక్ష్మి, టీ రాజేశ్వరి, నర్సింగ్ కాలేజీ ఉపాధ్యాయురాలు ఎం మాధవి, డాక్టర్ కొల్లేటి రమేష్, వీఎంసీ పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఇగ్నోలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

వన్‌టౌన్, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): ఇందిరాగాంధీ జాతీయ సార్వత్రిక విశ్వవిద్యాలయం (ఇగ్నో)లో వచ్చేనెల నుంచి ప్రారంభమయ్యే విద్యా సంవత్సరానికి గాను, పోస్టు గ్రాడ్యుయేషన్ (పీజీ) డిగ్రీ, డిగ్రీ ఆనర్స్, పీజీ డిప్లొమా, డిప్లొమా, సర్టిఫికెట్ కోర్సులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ప్రాంతీయ కేంద్రం సీనియర్ సంచాలకుడు డాక్టర్ బీఆర్ శర్మ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆన్‌లైన్‌లో జూలై 15 వరకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. పీజీ రెండో సంవత్సరం, డిగ్రీ రెండు, 3వ సంవత్సరం, సెమిస్టర్ విధానంలో చదివే విద్యార్థులు ఆన్‌లైన్ ద్వారా జూలై 15 లోపల ఫ్రీ రిజిస్టేషన్ ఫీజును చెల్లించాలని కోరారు. వివరాలకు ఇగ్నో వెబ్‌సైట్‌ను సందర్శించాలని, లేదా విజయవాడ కొత్తపేటలోని హిందూ హైస్కూల్ ప్రాంగణంలోని ఇగ్నో ప్రాంతీయ కార్యాలయంలో స్వయంగా గానీ, లేదా 0866-2565253 ఫోన్‌లోగానీ తెలుసుకోవచ్చునన్నారు.

మెట్రోపాలిటన్ సెషన్స్ కోర్టు గ్రేడ్-1

అదనపు పీపీగా ఎంకే విజయలక్ష్మి

నెల్లూరుకు జి కల్యాణి, విజయవాడ 8వ ఏడీజే కోర్టుకు ఆర్ జగదీష్

విజయవాడ లీగల్, జూన్ 9 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రవ్యాప్తంగా బదిలీలకు చివరిరోజు కావడంతో వివిధ జిల్లాల కోర్టుల్లో అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్లుగా పనిచేస్తున్న పలువురిని పలు జిల్లా కోర్టులకు అదనపు పీపీలుగా బదిలీ చేస్తూ హోం శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ కుమార్ విశ్వజిత్ సోమవారం ఆదేశాలు జారీ చేశారు. గ్రేడ్-1 అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్లుగా పనిచేస్తున్న జి.కల్యాణి (విజయవాడ 8వ అదనపు జిల్లా కోర్టు)ని నెల్లూరులోని 8వ అదనపు జిల్లా కోర్టుకు బదిలీ చేశారు. అలాగే నెల్లూరులోని 8వ అదనపు జిల్లా కోర్టులో గ్రేడ్-1 అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా పనిచేస్తున్న ఎంకే విజయలక్ష్మిని విజయవాడ మెట్రోపాలిటన్ సెషన్స్ కోర్టుకు బదిలీ చేశారు. నెల్లూరు ఎస్సీ, ఎస్టీ కోర్టులో గ్రేడ్-1 అదనపు పీపీగా పనిచేస్తున్న ఆర్ జగదీష్‌ను విజయవాడ 8వ అదనపు జిల్లా కోర్టుకు బదిలీ చేస్తూ కుమార్ విశ్వజిత్ ఆదేశాలు జారీ చేశారు.



ఉత్సాహంగా సౌత్‌జోన్ మహిళల క్రికెట్

● ఐదు జిల్లాల క్రీడాకారిణుల హాజరు

నెల్లూరు (విద్య), జూన్ 9 (ఆంధ్రజ్యోతి): జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుజబుజనెల్లూరులోని సీఏఏ క్రీడామైదానంలో సోమవారం అండర్-15 మహిళల ఏసీఏ సౌత్‌జోన్ క్రికెట్ పోటీలు ఉత్సాహంగా ప్రారంభమయ్యాయి. అనంతపురం, చిత్తూరు, నెల్లూరు, కడప, కర్నూలు జిల్లాలకు చెందిన క్రికెట్ క్రీడాకారిణిలు ఈ పోటీలకు హాజరయ్యారు. వారంపాటు పోటీలను నిర్వహించనున్నారు. తొలిరోజు పోటీల్లో చిత్తూరు, నెల్లూరు జట్లు తలపడ్డాయి. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న చిత్తూరు జట్టు నిర్ణీత 25 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి 288 పరుగులు సాధించింది. ఈ జట్టులోని ఈ. గేయకీర్తి 120 పరుగులు సాధించారు. అనంతరం బ్యాటింగ్ చేసిన నెల్లూరు జట్టు 24.3 ఓవర్లలో 10 వికెట్లు కోల్పోయి 118 పరుగులకే ఆలౌట్ కావడంతో చిత్తూరు జట్టు విజయం సాధించింది. రెండో మ్యాచ్‌లో అనంతపురం, కర్నూలు జట్లు తలపడగా, టాస్‌గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న అనంతపురం జట్టు 16 ఓవర్లలో 10 వికెట్లు కోల్పోయి 78 పరుగులు మాత్రమే సాధించింది. అనంతరం బ్యాటింగ్ చేసిన కర్నూలు జట్టు 21.1 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి 81 పరుగులతో విజయం సాధించింది. తొలిరోజు ఈ పోటీలను ఎన్‌డీసీఏ అధ్యక్షుడు ఎస్.రాజశేఖర్‌రెడ్డి, కార్యదర్శి కే.శ్రీనివాసులరెడ్డి, జనరల్ మేనేజర్ పీ. భాను ప్రకాష్‌రెడ్డి, రాష్ట్ర జూనియర్ సెలక్షన్ కమిటీ సభ్యులు బీ.లీలామోహన్‌రెడ్డి, ఏసీఏ అంపైర్స్ పవన్‌కిషోర్, త్రినాథ్ పర్యవేక్షించారు.

నియోజకవర్గాల సమగ్రాభివృద్ధే లక్ష్యం

● రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖా మంత్రి సత్యకుమార్ యాదవ్

కలెక్టరేట్, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): స్వర్ణాంధ్ర 2047 దార్శనిక ప్రణాళికకు అనుగుణంగా నియోజకవర్గాల సమగ్రాభివృద్ధి లక్ష్యంగా ముఖ్యమంత్రి నియోజకవర్గ దార్శనిక కార్యాచరణ ప్రణాళిక యూనిట్లు (సీవీఏపీయూలు) ప్రారంభించారని, ఇది నియోజకవర్గాల అభివృద్ధిలో కీలక మైలురాయి అని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి సత్యకుమార్ యాదవ్ అన్నారు. సోమవారం సచివాలయం నుంచి రాష్ట్రంలోని 26 జిల్లాలు, 175 నియోజకవర్గాల్లో విజన్ యాక్షన్ ప్లాన్ యూనిట్ కార్యాలయాలను సీఎం చంద్రబాబు వర్చువల్‌గా ప్రారంభించారు. జిల్లా కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్సు హాల్ నుంచి మంత్రి సత్యకుమార్ యాదవ్, కలెక్టర్ డాక్టర్ లక్ష్మీశ, జాయింట్ కలెక్టర్ ఇలక్కియ హాజరయ్యారు. అనంతరం మంత్రి సత్యకు


కలెక్టరేట్‌లో ముఖ్యమంత్రి వీడియో కాన్ఫరెన్సులో పాల్గొన్న మంత్రి సత్యకుమార్ యాదవ్, కలెక్టర్ లక్ష్మీశ తదితరులు

మార్ మాట్లాడుతూ నియోజకవర్గ కార్యాచరణ ప్రణాళిక యూనిట్‌కు స్థానిక ఎమ్మెల్యే చైర్‌పర్సన్‌గా వ్యవహరిస్తారని, ప్రత్యేక అధికారి ఎగ్జిక్యూటివ్ వైస్ చైర్‌పర్సన్‌గా వ్యవహరిస్తారన్నారు. ఆరోగ్యం, విద్య, జీవనప్రమాణాల్లో అత్యుత్తమ ప్రమాణాలను సాధించడంతో పాటు ఆర్థిక వృద్ధిని వేగవంతం చేయడం, పౌర కేంద్రీకృత సేవల పంపిణీ, యువత, మహిళా సాధికారత సాధన లక్ష్యంగా దార్శనిక ప్రణాళికలు రూపొందించినట్లు వివరించారు. ప్రజా భాగస్వామ్యంతో లక్ష్యాల సాధనకు సమిష్టిగా కృషిచేయనున్నట్లు మంత్రి సత్యకుమార్ యాదవ్ అన్నారు. కార్యక్రమంలో సీపీఓ వై.శ్రీలత, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

అర్జీల పరిష్కారంలో నాణ్యతకు ప్రాధాన్యం

● జాయింట్ కలెక్టర్ ఇలక్కియా

కలెక్టరేట్, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): అర్జీలు పునరావృతం కాకుండా నాణ్యతతో దరఖాస్తుదారుడు సంతృప్తి చెందేలా అర్జీల పరిష్కారంపై అధికారులు ప్రత్యేక దృష్టిపెట్టాలని జాయింట్ కలెక్టర్ ఎస్ ఇలక్కియా అన్నారు. పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రెసెల్ సిస్టమ్ (పీజీఆర్ఎస్)లో భాగంగా సోమవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో జేసీ ఇలక్కియా ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ స్వీకరించిన అర్జీలకు సంబంధించి కిందిస్థాయి అధికారులు సిబ్బంది నుంచి స్పష్టమైన సమాచారం తీసుకొని, పునరావృతం కాకుండా సమస్యలను పరిష్కరించి అర్జీదారులను సంతృప్తి పరచడమే లక్ష్యంగా పనిచేసి ప్రభుత్వ లక్ష్యం నెరవేర్చాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలుచేస్తున్న పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రసల్ సిస్టమ్ (పీజీఆర్ఎస్)పై ప్రజలు అనేక ఆశలు పెట్టుకుంటారన్నారు. సమస్యలను జిల్లా అధికారుల దృష్టికి తీసుకువస్తే పరిష్కారం లభిస్తుందనే ఆశతో ప్రజలు సుదూర ప్రాంతాల నుంచి వచ్చి తాము ఎదుర్కొంటున్న సమస్యలపై అర్జీలను సమర్పిస్తున్నారని జేసీ తెలిపారు. అర్జీల స్వీకరణలో డీఆర్‌వో ఎం.లక్ష్మీ నరసింహం, డీఆర్‌డీఏ పీడీ ఏఎన్‌వీ నాంచారరావు, గ్రామ, వార్డు సచివాలయాల ప్రత్యేక అధికారి జి.జ్యోతి వివిధ శాఖలకు చెందిన జిల్లాస్థాయి అధికారులు పాల్గొన్నారు.


ప్రజా సమస్యలను వింటున్న జేసీ ఇలక్కియా

లీజు పేరుతో దుకాణాల కబ్జా..!

● బాధితులను బెదిరిస్తున్న వైసీపీ నేత, మాజీ మంత్రి అనుచరులు

● పోలీసులను ఆశ్రయించిన బాధితులు

● వారి సమక్షంలోనూ బెదిరింపులు

వన్‌టౌన్, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): చిరు వ్యాపారస్థులకు మాయమాటలు చెప్పి లీజు పేరుతో మూడు దుకాణాలు తీసుకున్న వైసీపీ నేత, మాజీ మంత్రి అనుచరులు చిరు వ్యాపారస్థులను బెదిరిస్తున్నారు. దీంతో బాధితులు పోలీసులను ఆశ్రయించారు. తర్వాత వారి సమక్షంలోనూ వైసీపీ నేతలు బరితెగించి బెదిరింపులకు పాల్పడ్డారు. వివరాల్లోకి వెళితే కండ్రికకు చెందిన ఎస్ శివ, ఎస్ సోమయ్య, కొత్తపేటకు చెందిన కే శ్రీనివాసరావుకు సుమారు 40 ఏళ్ల నుంచి గవర్నర్‌పేట లెనిన్ సెంటర్ కాలువ ఒడ్డున 27, 28, 29 షాపుల్లో వస్త్ర వ్యాపారం చేస్తున్నారు. వీరంతా చిరు వ్యాపారులే. కృష్ణలంక సత్యంగారి హోటల్ సమీపంలోని మాజీ మంత్రి, వైసీపీ నేత ముఖ్య


బాధితులు శివ, సోమయ్య, శ్రీనివాసరావు

అనుచరులు నారంశెట్టి చిరంజీవి, అతడి తమ్ముడు ఈశ్వరరావు 2015లో ఒక్కోషాపునకు ప్రతినెలా రూ. 16వేలు అద్దె చెల్లిస్తామని ఒప్పందం చేసుకున్నారు. 2017 వరకు బాగానే చెల్లించారు. తరువాత నుంచి చెల్లించకపోవటంతో అద్దె గురించి అడగ్గా, తాము అంత చెల్లించలేమని కోర్టుకు వెళ్లారు. అక్కడ కూడా చెల్లించలేదు. 2021లో పలువురు పెద్దల సమక్షంలో పాత బకాయిలు చెల్లించలేము, ఇప్పటి నుంచి ప్రతి నెలా అద్దె చెల్లిస్తామని ఒప్పుకొన్నారు. అయినా చెల్లించటం లేదు. అద్దె గురించి అడుతుంటే తాము అధికారంలో ఉన్నామని, మంత్రి అండదండలున్నాయని బెదిరించారు. గత ఏడాది ఫిబ్రవరి 19న బాధితులు స్పందనలో సీపీకి ఫిర్యాదు చేయగా, ఎన్నికల సమయం కావటంతో రేపు మాపు అంటూ కాలయాపన చేశారు. దీంతో బాధితులు కోర్టును ఆశ్రయించారు. ప్రతి వాయిదాకు బాధితులు హాజరవుతున్నా చిరంజీవి, అతడి సోదరుడు హాజరవ్వటం లేదని బాధితులు చెబుతున్నారు. వారం క్రితం బాధిత కుటుంబాలు తమ షాపుల వద్దకు వెళ్లి మూడు షాపులను స్వాధీనం చేసుకుని, తాళాలు వేసుకున్నారు. మరుసటి రోజు వారు షాపుల తాళాలు పగులకొట్టి షాపులోకి వెళ్లారు. బాధితులు గవర్నరుపేట పోలీసుల వద్దకు అక్కడికి వెళ్లగా వారిపైనా వీరంగం చేసి పెట్రోల్ పోసుకుని చచ్చిపోతామంటూ బెదిరించాడు. మూడు షాపుల్లో తమ అనుచరులను పెట్టి బాధితులను వెళ్లనీయకుండా భయభ్రాంతులకు గురిచేస్తున్నాడని బాధిత కుటుంబాలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పుడు కనీసం తమకు తెలియపరచకుండా షాపుల మధ్య గోడలు పగులకొట్టి పనులు చేయించారని బాధితులు శివ, సోమయ్య, శ్రీనివాసరావు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పోలీసులు తమకు న్యాయం చేయాలని బాధితులు కోరుతున్నారు.

కాలకృత్యం





పొద్దున్నే పొట్ట ఖాళీ అయితే అదోక సంతృప్తి. కానీ కొన్నిసార్లు ఆ పని సజావుగా జరగక మలబద్ధకం వేధించవచ్చు. ఇలా అరుదుగా జరిగితే ఫరవాలేదు. వారాల తరబడి కొనసాగితే, పరిస్థితిని తీవ్రంగానే పరిగణించాలంటున్నారు వైద్యులు. మలబద్ధకం, మూల కారణాలు, పరిష్కారాలు, పరిణామాల గురించి ఇలా వివరిస్తున్నారు.

మలబద్ధకం మతలబు

ప్రతి రోజూ ఉదయం నిద్ర లేచిన వెంటనే కాలకృత్యాలు తీర్చుకోవడం ఆరోగ్యకరం. నిజమే! కానీ అందరికీ ఈ సూత్రం వర్తించదు. రెండు, మూడు రోజులకోసారి విరేచనమయ్యే వాళ్లు కూడా ఉంటారు. వాళ్లకు చిన్నప్పటి నుంచి అలవడిన అలవాటు అది. కాబట్టి మలబద్ధకం ఉందో, లేదో ఎవరికి వారు తెలుసుకోవడం కోసం కొన్ని లక్షణాలను గమనించాలి. ముక్కవలసిన అవసరం లేకుండా, నిమిషాల వ్యవధిలోనే సుఖ విరోచనం సంతృప్తిగా జరిగిపోతే మలబద్ధకం లేనట్టే! ఇందుకు భిన్నంగా ప్రతిసారీ ముక్కవలసి వస్తున్నా, మలం పెంటికల్లా గట్టి ఉండలు కట్టినా, మలవిసర్జన తదనంతరం పొట్ట ఖాళీ కానట్టు అనిపిస్తున్నా మలబద్ధకంగానే భావించాలి. అయితే సరిపడా పీచు తినకపోవడం, నీళ్లు తాగకపోవడం వల్ల అప్పుడప్పుడూ తాత్కాలిక మలబద్ధకం కొంత ఇబ్బంది పెట్టవచ్చు. దీన్ని తీవ్రంగా పరిగణించవలసిన అవసరం లేదు. కానీ కొన్ని రెండు వారాలకు మించి మలబద్ధకం కొనసాగితే వెంటనే వైద్యులను కలవడం మంచిది.


లాక్సేటివ్స్ వాడుకుంటే...

మలబద్ధకాన్ని నివారించుకోవడం కోసం కాయంచూర్ లాంటి ఆయుర్వేద మందుల మీద ఆధారపడేవాళ్లూ ఉంటారు. వీటిలో కూడా సహజసిద్ధ పీచు మాత్రమే ఉంటుంది. ఇవి హానికరమైనవి కాకపోయినా, వీటిని వాడుకోవలసిన అవసరం వస్తుంటే, ఆ అవసరం ఎందుకొస్తోంది? అని ఎవరికి వారు ప్రశ్నించుకోవాలి. మలబద్ధకాన్ని మందులతో సరిదిద్దుకోవడానికి బదులుగా మూల కారణాన్ని కనిపెట్టి, దాన్ని సరిదిద్దుకోవడం మీదే దృష్టి పెట్టాలి. కానీ కారణాన్ని తెలుసుకోకుండా గుడ్డిగా మందులు వాడుకుంటే మూల కారణం మరుగున పడి, ఇతరత్రా ఆరోగ్య సమస్యలు తీవ్రమయ్యే ప్రమాదం ఉంటుంది.

కారణాలు అనేకం

మలబద్ధకానికి చాలా కారణాలున్నాయి. మన ఆహార, జీవనశైలులు కూడా మన మలవిసర్జనను ప్రభావితం చేస్తాయి. ఈ ఇబ్బందికి ఇంకొన్ని వైద్యపరమైన కారణాలు కూడా ఉంటాయి. అవేంటంటే...

- హైపో థైరాయిడిజం
- పారా థైరాయిడ్ గ్రంథులు అవసరానికి మించి పని చేయడం
- శరీరంలో క్యాల్షియం మోతాదులు పెరగడం
- మూత్రపిండాల సమస్యలు
- పెద్ద పేగుల కదలికలు మందగించడం
- గుండెపోటుకు గురవడం
- పార్కిన్సన్స్ వ్యాధి బారిన పడడం
- మంచానికే పరిమితమవడం
- కటి కండరాల మధ్య సహకారం లోపించడం
- గుండె జబ్బుల మందులు, నొప్పి నివారణ మందులు వాడుకోవడం



45 దాటిన వాళ్లకు 'కొలనోస్కోపీ'

పెద్దపేగు క్యాన్సర్ ప్రధాన లక్షణం మలబద్ధకం. కాబట్టి 45 సంవత్సరాలు దాటిన ప్రతి ఒక్కరూ కొలనోస్కోపీ పరీక్ష చేయించుకోవడం అవసరం. పెద్దపేగు క్యాన్సర్ చిన్న చిన్న పాలిప్స్ రూపంలో మొదలవుతుంది. కొలనోస్కోపీతో పెద్దపేగులను పరీక్షించి, ఈ పాలిప్స్‌ను తొలగించుకోగలిగితే క్యాన్సర్‌కు దారి తీయకుండా ఉంటుంది. మునుపు పెద్దపేగు క్యాన్సర్ ఎక్కువ మందిలో కనిపిస్తూ ఉండేది. కానీ కొలనోస్కోపీ అందుబాటులోకి రావడంతో, ఈ పరీక్షతో ముందస్తుగానే పాలిప్స్‌ను గుర్తించి వాటిని తొలగించుకోవడంతో, ఈ క్యాన్సర్ తీవ్రత బాగా తగ్గిపోయింది. అన్ని రకాల క్యాన్సర్లలో మొదటి స్థానంలో ఉన్న పెద్ద పేగు క్యాన్సరు నేడు ఎనిమిదో స్థానానికి పరిమితం అయిపోయింది. కాబట్టి 45 దాటిన ప్రతి ఒక్కరూ ఒకసారి కొలనోస్కోపీ చేయించుకుని, పాలిప్స్ లాంటివి లేకపోతే ఆ తర్వాత ఐదేళ్లకోసారి పరీక్ష చేయించుకుంటే సరిపోతుంది. ఒకవేళ మొదటి పరీక్షలోనే పాలిప్స్ లాంటివి కనిపిస్తే, వాటి సంఖ్య ఆధారంగా, వైద్యుల సూచన మేరకు ప్రతి ఏడాదీ లేదా మూడేళ్లకోసారి కొలనోస్కోపీ చేయించుకుంటూ ఉండాలి. పైగా కొలనోస్కోపీ ఎంతో సరళమైన, సురక్షితమైన పరీక్ష. పది నిమిషాల్లో పూర్తయిపోయే ఈ పరీక్షతో ఎలాంటి నొప్పి, అసౌకర్యం కలగదు.

మలబద్ధకం అంటే?

ప్రతి రోజూ మలవిసర్జన అలవాటు ఉన్న వాళ్లకు రోజుల తరబడి సుఖ విరోచనం జరగకపోయినా, రోజుకు పదిసార్లు వెళ్లినా విరోచనం అవకపోతున్నా, వెళ్లిన ప్రతిసారీ ముక్కవలసి వస్తున్నా, మలం పెంటికల్లా గట్టి పడినా మలబద్ధకంగానే భావించాలి. మూడు రోజులకు మలవిసర్జన చేసే అలవాటు ఉన్నవాళ్లు, ఆ సమయంలో విసర్జన కోసం కష్టపడవలసి వస్తున్నా, దాన్ని కూడా మలబద్ధకంగానే భావించాలి. అయితే ఆహారంలో పీచును పెంచి, నీళ్లు ఎక్కువగా తాగడం లాంటివి పాటిస్తే మలబద్ధకం తొలగిపోతుంది. ఈ జాగ్రత్తలు పాటించినా రెండు వారాలకు పైగా మలబద్ధకం వేధిస్తే వైద్యులను తప్పనిసరిగా సంప్రతించాలి. మరీ ముఖ్యంగా 45 ఏళ్లు దాటిన వాళ్లు వారి మలవిసర్జన క్రమం తప్పితే వెంటనే అప్రమత్తం కావాలి. అలాగే మలంలో రక్తం పడడం, అకారణంగా బరువు తగ్గడం, పొట్టలో నొప్పి లాంటివి పెద్దపేగు క్యాన్సర్ లక్షణాలు కాబట్టి, 45 ఏళ్లు దాటిన వాళ్లు మలబద్ధకంతో పాటు ఈ లక్షణాలు కూడా కనిపిస్తే ఆలస్యం చేయకుండా వైద్యులను సంప్రతించాలి.

నిర్లక్ష్యం చేస్తే...

మలబద్ధకంతో ప్రత్యక్ష, పరోక్ష ప్రభావాలుంటాయి. ఈ సమస్యను తీవ్రంగా పరిగణించేవాళ్లు ఎంతో అరుదు. ఈ ఇబ్బంది గురించి తమలో తాము ఆలోచించుకుంటూ కుంగిపోతూ ఉంటారే తప్ప సమస్యను తీవ్రంగా పరిగణించరు. నిజానికి మలబద్ధకం జీవన నాణ్యతను కూడా దెబ్బ తీస్తుంది. సుఖ విరోచనం జరగని సందర్భాల్లో, తెలియని అసౌకర్యంతో చికాకు, మానసిక కుంగుబాటులకు గురవుతూ ఉంటారు. రోజంతా దాని గురించే ఆలోచించడం, నిద్రకు దూరమవడం, పని సామర్థ్యం తగ్గడం, ఉత్పాదకత దెబ్బతినడం లాంటి సమస్యలు కూడా తోడవుతాయి. కాబట్టి మలబద్ధకాన్ని నిర్లక్ష్యం చేయకూడదు. ఈ సమస్యను నిర్లక్ష్యం చేస్తే....

- మొలలు వేధిస్తాయి
- మలద్వారం దగ్గర చీలికలు ఏర్పడతాయి
- పేగుల్లో కండరాలు బలహీనపడి, రంధ్రాలు ఏర్పడి ప్రాణాంతక పరిస్థితి తలెత్తవచ్చు
- మలబద్ధకంతో పేగుల కదలికలు మందగించి, ఆ పరిస్థితి భవిష్యత్తుల్లో క్యాన్సర్‌కు దారితీయవచ్చు

పరిష్కారాలున్నాయి...

పీచు లేని ఆహారం తిన్నప్పుడు మలబద్ధకం తలెత్తవచ్చు. అయితే వెంటనే ఆహారంలో మార్పులు చేసుకుని విరోచన సమస్యను సరిదిద్దుకోవాలి. కానీ ఈ జాగ్రత్తలు పాటించినా రెండు వారాలకు మించి మలబద్ధకం వేధిస్తూ ఉంటే, వైద్యపరమైన కారణాలను విశ్లేషించుకోవాలి. వైద్యులను కలిసి హైపోథైరాయిడ్, మూత్రపిండాల సమస్యలు, క్యాల్షియం మోతాదులు తగ్గడం లాంటి మలబద్ధకం మూల కారణాలను పరీక్షించుకోవాలి. పరీక్షల ఫలితాలను బట్టి తగిన చికిత్సలతో ఆయా సమస్యలను సరిదిద్దుకుని, మలబద్ధకాన్ని తొలగించుకోవాలి.

నివారణ ఇలా...

- ఆహారంలో పీచు ఉండేలా చూసుకోవాలి
- రోజుకు 2నుంచి 3లీటర్లకు తగ్గకుండా నీళ్లు తాగాలి
- బీర, సొర, బెండ, ఆకుకూరలు ఎక్కువగా తీసుకోవాలి
- ప్రతి రోజూ తప్పనిసరిగా పండ్లు తినాలి
- క్రమం తప్పక వ్యాయామం చేయాలి
- ఆహారంలో మైదా తగ్గించాలి
- పరిమితంగా కాఫీ తీసుకోవాలి
- రెడ్ మీట్ పరిమితం చేయాలి



డాక్టర్ నవీన్ పోలవరపు
సీనియర్ గ్యాస్ట్రోఎంటరాలజిస్ట్,
లివర్ స్పెషలిస్ట్,
అడ్వాన్స్‌డ్ థెరప్యూటిక్ ఎండోస్కోపిస్ట్
అండ్ ఎండోసోనాలజిస్ట్,
యశోద హాస్పిటల్స్, హైటెక్ సిటీ,
హైదరాబాద్.

అధ్యయనం

ఊబకాయం చికిత్సతో క్యాన్సర్లు దూరం

ఊబకాయం చికిత్సతో పలు రకాల క్యాన్సర్ల ప్రమాదం దాదాపు సగం తగ్గుతుందని ఓ అధ్యయనంలో తేలింది. ఆ వివరాలు...

ఊబకాయం చికిత్సతో ఊబకాయ సంబంధిత క్యాన్సర్ల ప్రమాదం దాదాపు 50 శాతం తగ్గుతుందని ఇజ్రాయెల్ పరిశోధకులు కనుగొన్నారు. ఈ పరిశోధనలో భాగంగా సుమారు 6 వేల మందిని పరిశీలించారు. ఊబకాయం చిక్సితకు వాడే ఇంజక్షన్లు, బేరియాట్రిక్ శస్త్రచికిత్స వలన, 13 రకాల ఊబకాయ సంబంధిత క్యాన్సర్ల ప్రమాదం తగ్గుతుందని కనుగొన్నారు.
ది లాన్సెట్ క్లినికల్ మెడిసిన్‌లో ప్రచురితమైన ఈ అధ్యయనం వివరాలను స్పెయిన్‌లో జరిగిన యూరోపిన్ కాంగ్రెస్ ఆన్ ఒబిసిటీ సమావేశంలో పరిశోధకులు వెల్లడించారు. సాధారణంగా బరువు తగ్గడం వలన ఆ క్యాన్సర్ల ప్రమాదం కొంతమేర తగ్గుతుంది. అయితే చికిత్సకు వాడే ఇంజెక్షన్ల వలన ఆ ప్రమాదం మరింత తగ్గుతుందని పరిశోధకులు తాజా అధ్యయనంలో గుర్తించారు. ఊబకాయానికి మందులు, ఇంజెక్షన్‌లు వాడే వారికంటే బేరియాట్రిక్ సర్జరీ చేయించుకునే వారు రెండింతల బరువు తగ్గుతారు. బేరియాట్రిక్ సర్జరీ వలన 30 నుంచి 42 శాతం వరకు ఈ క్యాన్సర్ల ప్రమాదం తగ్గుతుందని పరిశోధకులు గుర్తించారు. అలాగే బరువును తగ్గించే మందులు, ఇంజక్షన్లు ఈ క్యాన్సర్ల ప్రమాదాన్ని దాదాపు 50 శాతం తగ్గించగలవని కనుగొన్నారు. అయితే ఈ మందులు ఊబకాయం సంబంధం లేని క్యాన్సర్ల ప్రమాదాన్ని పెంచబోవని నిర్ధారించుకోవడం కోసం మరిన్ని పరిశోధనలు అవసరమని పరిశోధకులు అభిప్రాయపడుతున్నారు.



అప్రమత్తం

గాలి కాలుష్యంతో గర్భిణులకు చేటు

వెడల్పు పరంగా, మానవ రోమం కంటే 30 రెట్లు సూక్ష్మంగా ఉండే గాలి కలుషితాలకూ, నెలలు నిండకుండా పుట్టే పిల్లలకూ సంబంధం ఉందని పరిశోధకులు ఎంతో కాలంగా హెచ్చరిస్తున్నారు. అయితే తాజాగా అందుకు కారణాలను కనిపెట్టడం జరిగింది. ప్రత్యేకించి ట్రాఫిక్, పరిశ్రమలు, శిలాజ ఇంధనాలను మండించడం, దావానలాల పొగలు, గర్భిణుల రక్తంలోని కణాలను దెబ్బ తీస్తాయనీ, తద్వారా నెలలు నిండకుండా ప్రసవమైపోయే ప్రమాదం ఉంటుందనీ పరిశోధకులు అంటున్నారు. ఎన్విరాన్‌మెంటల్ సైన్స్ అండ్ టెక్నాలజీలో ప్రచురితమైన ఈ అధ్యయనంలో, గర్భిణి శరీరం మీద కలుషితాలు ఏ విధమైన ప్రభావం చూపిస్తాయనే దానికి సంబంధించి స్పష్టమైన వివరణ ఉంది. ప్రపంచవ్యాప్తంగా 37 వారల కంటే ముందే పుట్టే నెలలు నిండని 10% పసికందుల పుట్టుక వెనక 2.5 మైక్రోమీటర్ల అణువులు ఉంటున్నట్టు పరిశోధకులు పేర్కొంటున్నారు.




ప్రపంచవ్యాప్తంగా ఐదేళ్ల కంటే తక్కువ వయసున్న పిల్లల మరణాల్లో 17% నెలలు నిండకుండా పుట్టిన పిల్లలే ఉంటున్నట్టు కూడా వారు పేర్కొంటున్నారు. ఒకవేళ నెలలు నిండకుండా పుట్టిన పిల్లలు ప్రాణాలను కాపాడుకోగలిగినా, ఇలాంటి ముందస్తు జననాల కారణంగా పిల్లల్లో సెరెబ్రల్ పాల్సీ, శ్వాసకోశ సమస్యలు లాంటి ఆరోగ్య సమస్యలు ఎక్కువగా ఉంటాయని పరిశోధకులు అంటున్నారు.

పురోగతి

శరీరంలో కరిగిపోయే 'పేస్ మేకర్'

బియ్యపు గింజ పరిమాణంలో రూపొందించిన పేస్ మేకర్, శస్త్రచికిత్స తదనంతర గుండెకు రక్షణనివ్వబోతోంది. నార్త్‌వెస్టర్న్ యూనివర్శిటీకి చెందిన శాస్త్రవేత్తలు సూక్ష్మంగా ఉండే, శరీరంలో పూర్తిగా కరిగిపోయే వీలుండే పేస్‌మేకర్‌ను రూపొందించారు.



ఎలాంటి తీగలు, బ్యాటరీలు లేదా సర్జరీ అవసరం లేని ఈ పేస్ మేకర్, సహజసిద్ధంగానే శరీరంలో కలిసిపోతుంది. 1.8 మిల్లీమీటర్ల వెడల్పు, 3.5 మిల్లీమీటర్ల పొడవు ఉండే ఈ పరికరాన్ని నేరుగా గుండెలోకి ఇంజెక్ట్ చేయవచ్చు. ఆ తర్వాత గాల్వానిక్ సెల్ మెకానిజం ద్వారా శరీర ద్రవాలనే ఇంధనంగా మలుచుకుని ఈ పరికరం పని చేయడం మొదలుపెడుతుంది. తీగల్లో ప్రవహించే విద్యుత్తుకు బదులుగా, చర్మం మీద అంటించుకున్న ప్యాచ్ ద్వారా ఈ పేస్ మేకర్ పని చేస్తుంది.
ఈ సూక్ష్మ పరికరం, గుండె అస్తవ్యస్థ లయలను పసిగట్టి, అతినీలలోహిత వెలుగుల ఆధారంగా గుండెను పని చేయిస్తూ ఉంటుంది. ఇలా గుండె దగ్గరకు ప్రవేశపెట్టిన ఈ పేస్ మేకర్ ఐదు నుంచి పది వారాల వ్యవధిలో తన విధిని పూర్తి చేసుకుని, సురక్షితంగా శరీరంలో కలిసిపోతుంది. పుట్టుకతోనే గుండె జబ్బులను వెంటబెట్టుకొచ్చిన పసికందులు, తాత్కాలిక పేసింగ్ అవసరమైన గుండె సర్జరీ రోగులకు ఈ సూక్ష్మ పేస్ మేకర్ ఒక ఆశాదీపం కాబోతోంది.

మీకు తెలుసా?

ఈ భంగిమతో గాఢ నిద్ర

కొంత మంది ఒక కాలిని లేదా రెండు కాళ్లను దుప్పటి బయట పెట్టి నిద్రపోతుంటారు. ఇలా చేయడం వలన ఏం జరుగుతుందో తెలుసుకుందాం..



నిద్రించే సమయంలో మనకు తెలియకుండానే, ఒక కాలిని దుప్పట్లో నుంచి బయట పెట్టి పడుకుంటూ ఉంటాం. అయితే ఇలా ఒక కాలును దుప్పటి బయట పెట్టి నిద్రపోయే అలవాటు వెనక ఒక ఆరోగ్యకరమైన కారణం ఉందని జోర్నల్ ఆఫ్ ఫిజియలాజికల్ యాంత్రొపాలజీలో ప్రచురించిన 2023 నాటి అధ్యయనంలో పేర్కొన్నారు. ఇంతకూ ఇలాంటి అలవాటు వల్ల మన శరీరంలో ఏం జరుగుతుంది? శరీర వేడిని వేగంగా వదిలించుకోడానికి వీలుగా మన అరికాళ్లలో ప్రత్యేకమైన రక్తనాళాలుంటాయి. కాబట్టి రాత్రి వేళ కాళ్లను దుప్పటి వెలుపల ఉంచడం వల్ల, పాదాలకు చల్లటి గాలి సోకి, శరీర ఉష్ణోగ్రత తగ్గుతుంది.. దాంతో గాఢనిద్రకు అవసరమయ్యే మెలటోనిన్ హార్మోన్ స్రావం పెరుగుతుంది. ఇలా శరీరం చల్లబడే ప్రభావం, నిద్రలోకి జారుకునే సమయాన్ని వేగవంతం చేస్తుందనీ, గాఢనిద్రలోకి జారుకునేలా చేసి, నిద్ర నాణ్యతను పెంచుతుందనీ పరిశోధకులు అంటున్నారు.


పరిశోధన

5 నిమిషాల్లో క్యాన్సర్ ఇంజెక్షన్!

క్యాన్సర్ చికిత్సకు వాడే నివోలుమాబ్ ఔషధాన్ని 5 నిమిషాల్లో ఇంజెక్షన్ రూపంలో ఇచ్చే ఆవిష్కరణను ఇంగ్లాండ్ పరిశోధకులు కనుగొన్నారు.
నివోలుమాబ్ ఔషధాన్ని ఐవీ డ్రిప్ ద్వారా ఇవ్వడానికి గంట సమయం పడుతుంది. అయితే దానిని ఇంజక్షన్ రూపంలో 5 నిమిషాల్లో ఇవ్వొచ్చని ఇంగ్లాండ్ నేషనల్ హెల్త్ సర్వీస్ పరిశోధకులు కనుగొన్నారు. దీనివల్ల సమయం ఆదా అవడంతో పాటు ప్రతికూల ప్రభావాలు తక్కువగా ఉన్నట్లు గుర్తించారు. ఊపిరితిత్తులు, మూత్రపిండాలు, చర్మం, మూత్రాశయం వంటి 15 రకాల క్యాన్సర్ల నివారణకు ఈ ఇంజెక్షన్ ఉపయోగపడుతుంది. క్యాన్సర్ కణాలను గుర్తించి, వాటిని ధ్వంసం చేసే విధంగా రోగనిరోధక వ్యవస్థను ప్రేరేపించేలా నివోలుమాబ్ పని చేస్తుంది. ఇలా ఇంజెక్షన్ రూపంలో ఔషధాన్ని అందించడం ద్వారా, రోగికి సౌకర్యవంతమైన, సమర్థమైన చికిత్సను అందించే వీలు కలుగుతోంది. నివోలుమాబ్ ఇంజెక్షన్ షాట్ వినియోగానికి యూకే ఔషధ నియంత్రణ సంస్థ నుంచి అనుమతులు కూడా అందాయి.



అవగాహన



ఇటీవల ముంబయిలో 29 ఏళ్ల యువతి గుండెపోటుకు గురైంది. తక్షణం స్పందించిన వైద్యులు స్టెంట్‌తో ఆమె ప్రాణాలను కాపాడగలిగారు. కానీ సాధారణంగా పిల్లలను కనే వయసు యువతులకు ఈస్ట్రోజన్ హార్మోన్ వల్ల గుండెకు రక్షణ దక్కుతూ ఉంటుంది. కానీ ఈ యువతి విషయంలో ఆ రక్షణ లోపించడానికి వైద్యులు ఆసక్తికరమైన కారణాలను వివరించారు.

యువతుల్లో గుండెపోట్లు ఎందుకు?

ఈస్ట్రోజన్ హార్మోన్ రక్తనాళాలను విప్పార్చి, ఇన్‌ఫ్లమేషన్‌ను తగ్గిస్తుంది. కాబట్టే ఈ హార్మోన్ స్రావాలు సక్రమంగా స్రవించే యువతుల్లో గుండె సమస్యలు తక్కువ. కానీ నేడు యువతుల్లో పాలిసిస్టిక్ ఓవరీ సిండ్రోమ్ సమస్య సర్వసాధారణమైపోతోంది. ఈ హార్మోన్ అసమతౌల్యం వల్ల నెలసరి క్రమం తప్పడంతో పాటు ఒవేరియన్ సిస్టులు కూడా ఏర్పడతాయి. ఈ సమస్యను సరిదిద్దడం కోసం ఈస్ట్రోజన్ ప్రొజెస్టిన్ హార్మోన్లు కలిగి ఉండే గర్భనిరోధక మాత్రలను వైద్యులు సూచిస్తూ ఉంటారు. ఈ మాత్రలు ఇష్కిమిక్ స్ట్రోక్, గుండె పోటుకు దారితీస్తూ ఉంటాయి.

ఆ మాత్రల వల్లే...

ఏడాది పాటు ఈ మాత్రలను వాడుకునే ప్రతి 4,760 మంది మహిళలకు ఒక అదనపు స్ట్రోక్ ముప్పు ఉంటుందనీ, ప్రతి పది వేల మంది మహిళలకూ ఒక అదనపు గుండె పోటు ముప్పు ఉంటుందనీ అధ్యయనాలు అంచనా వేస్తున్నాయి. ఈస్ట్రోజన్‌ను కలిగి ఉండే వెజైనల్ రింగ్స్, చర్మపు ప్యాచ్‌లతో ఈ ముప్పు మరింత ఎక్కువ. ఈ పరిస్థితి గురించి వివరిస్తూ.. "గర్భనిరోధక మాత్రలతో సంబంధం ఉన్న గుండెపోట్ల కంటే స్ట్రోక్స్ అత్యంత సాధారణమైపోయాయి. పాలీసిస్టిక్ ఓవరీ సిండ్రోమ్‌తో బాధపడే 22 నుంచి 28 ఏళ్ల యువతులు స్ట్రోక్ గురవడాన్ని నేను చూశాను. అయితే అండాల విడుదలను నిలువరించడం ద్వారా అండాశయాల్లో సిస్టులు ఏర్పడే అవకాశాలను తగ్గించడం కోసం మహిళలు గర్భనిరోధక మాత్రలను వాడుకోవలసిన అవసరం ఉంటుంది" అంటూ గైనకాలజిస్ట్, డాక్టర్ కిరణ్ కోల్హో వివరిస్తున్నారు. "ఊబకాయం, ఇన్సులిన్ రెసిస్టెన్స్ సమస్యలు కూడా పాలీసిస్టిక్ ఓవరీ సిండ్రోమ్‌తో ముడిపడి ఉంటాయి. ఫలితంగా రక్తంలో కొవ్వు మోతాదులు ఎక్కువగా ఉండి, గుండె జబ్బు ముప్పును పెంచే పిస్లిపిడీమియా సమస్య కూడా వీళ్లలో ఎక్కువగా ఉంటుంది. మరీ ముఖ్యంగా నగరాల్లోని మహిళల్లో అత్యధిక ఒత్తిడి మోతాదులు, బాల ఊబకాయ సమస్యలు కూడా అంతకంతకూ పెరుగుతున్నాయి. ఈ కారకాలు, పట్టణ భారతదేశంలోని ప్రతి ఐదుగురు కౌమార బాలికల్లో ఒకరికి, పిసిఒ అవకాశాలను మరింత పెంచుతున్నాయి" అని కూడా అంటున్నారామె.

> ఊబకాయం, ఇన్సులిన్ రెసిస్టెన్స్ సమస్యలు కూడా పాలీసిస్టిక్ ఓవరీ సిండ్రోమ్‌తో ముడిపడి ఉంటాయి. ఫలితంగా రక్తంలో కొవ్వు మోతాదులు ఎక్కువగా ఉండి, గుండె జబ్బు ముప్పును పెంచే పిస్లిపిడీమియా సమస్య కూడా వీళ్లలో ఎక్కువగా ఉంటుంది. మరీ ముఖ్యంగా నగరాల్లోని మహిళల్లో అత్యధిక ఒత్తిడి మోతాదులు, బాల ఊబకాయ సమస్యలు కూడా అంతకంతకూ పెరుగుతున్నాయి. ఈ కారకాలు, పట్టణ భారతదేశంలోని ప్రతి ఐదుగురు కౌమార బాలికల్లో ఒకరికి, పిసిఒ అవకాశాలను మరింత పెంచుతున్నాయి

కుటుంబ చరిత్ర తెలుసుకుని...

నానావతి హాస్పిటల్ హృద్రోగ వైద్యులు డాక్టర్ రాజీవ్ భగవత్... "యువతుల్లో గుండెపోట్లు, స్ట్రోక్స్ ముప్పు తగ్గాలంటే, గర్భనిరోధక మాత్రలను సూచించే సందర్భంలో వైద్యులు ఎంతో జాగ్రత్తగా వ్యవహరించాలి. ఈ మాత్రలు రక్తపు గడ్డలను పెంచే అవకాశాలున్నాయి కాబట్టి, వాటిని సూచించే ముందు మహిళ కుటుంబంలో గుండె జబ్బుల చరిత్ర గురించి క్షుణ్ణంగా తెలుసుకుని, ఆ తర్వాతే ఆ మాత్రలను సూచించాలి" అని అంటున్నారు.

'టెస్టు' వేదికలు మారాయ్!

న్యూఢిల్లీ: భారత క్రికెట్ జట్టు స్వదేశంలో వెస్టిండీస్, దక్షిణాఫ్రికాలతో అక్టోబరు నుంచి టెస్టు, పరిమిత ఓవర్ల సిరీస్‌లను ఆడనుంది. దీనిలో భాగంగా ఇదివరకు ప్రకటించిన వేదికల్లో స్వల్ప మార్పులు చోటు చేసుకున్నాయి. అక్టోబరు 2 నుంచి వెస్టిండీస్‌తో తొలి టెస్టు అహ్మదాబాద్‌లోనే జరుగనుండగా.. చివరిదైన రెండో టెస్టు వేదికను మాత్రం కోల్‌కతా నుంచి న్యూఢిల్లీకి మార్చారు. అలాగే నవంబరు 14 నుంచి దక్షిణాఫ్రికాతో జరిగే తొలి టెస్టును ఢిల్లీ నుంచి కోల్‌కతాకు తరలించారు. ఇక సెప్టెంబరు 14 నుంచి జరిగే భారత్-ఆస్ట్రేలియా మహిళల వన్డే సిరీస్‌లోని మూడో మ్యాచ్‌ను చెన్నై నుంచి ఢిల్లీకి తరలించారు.

రాణించిన తనుష్

ఇంగ్లండ్ 'ఎ'తో మ్యాచ్ డ్రా



తనుష్ (90 నాటౌట్)

నార్తాంప్టన్: తనుష్ కోటియన్ (90 నాటౌట్), అన్షుల్ కంబోజ్ (51 నాటౌట్) బ్యాటింగ్‌లో రాణించడంతో ఇంగ్లండ్ 'ఎ'తో జరిగిన రెండో అనధికార టెస్టు డ్రాగా ముగిసింది. సోమవారం చివరి రోజు భారత్ 'ఎ' రెండో ఇన్నింగ్స్‌ను 92 ఓవర్లలో 417/7 స్కోరు వద్ద డిక్లేర్ చేసింది. నితీశ్ (42), శార్దూల్ (34) సహకరించారు. జార్జి హిల్‌కు మూడు.. వోక్స్, జాక్‌లకు రెండేసి వికెట్లు దక్కాయి. ఇక చివరి సెషన్‌లో బరిలోకి దిగిన ఇంగ్లండ్ 'ఎ' రెండో ఇన్నింగ్స్‌లో 11 ఓవర్లలో 32/3 స్కోరు సాధించింది. అన్షుల్‌కు రెండు వికెట్లు దక్కాయి. ఫలితం తేలే అవకాశం లేకపోయేసరికి ముందుగానే ఇరు జట్లు డ్రాకు అంగీకరించాయి. భారత్ 'ఎ' తొలి ఇన్నింగ్స్‌లో 348, ఇంగ్లండ్ 'ఎ' తొలి ఇన్నింగ్స్‌లో 327 పరుగులు చేశాయి.

నయా నడాల్

(ఆంధ్రజ్యోతి క్రీడా విభాగం)




టెన్నిస్ దిగ్గజాలు అనగానే ప్రస్తుత తరానికి గుర్తొచ్చే పేర్లు రోజర్ ఫెడరర్, రఫెల్ నడాల్, నొవాక్ జొకోవిచ్. ఈ ముగ్గురు కలిసే దాదాపు అరవైకిపైగా గ్రాండ్‌స్లామ్స్‌ను కొల్లగొట్టారు. ఏ మేజర్ టోర్నీ ని చూసినా ఈ ముగ్గురిలో ఇద్దరు కచ్చితంగా ఫైనల్లో ప్రత్యర్థులుగా ఉండేవారు. అంతలా.. వీళ్లు రెండు దశాబ్దాల పాటు ప్రపంచ టెన్నిస్‌ను శాసించారు. ఈ త్రయంలో ఇప్పటికే ఫెడరర్, నడాల్ ఆటకు వీడ్కోలు పలికారు. జొకో ఇంకా ఆటలో కొనసాగుతున్నా, మునుపటి స్థాయిలో ఆకట్టుకోలేకపోతున్నాడు. రికార్డుస్థాయిలో 25వ గ్రాండ్‌స్లామ్ కోసం రెండేళ్లుగా దండయాత్ర చేస్తున్నా, సఫలం కాలేకపోతున్నాడు. చివరిసారిగా 2023లో యూఎస్ ఓపెన్ నెగ్గాడు. మరి.. ఆ బిగ్ త్రీ తర్వాత ఎవరు అంటే.. వినిపిస్తున్న ఒకే ఒక్క పేరు కార్లోస్ అల్కారజ్. అసాధారణ ఆటతీరుతో, అలుపెరగనిపోరాట పటిమతో రయ్‌మంటూ దూసుకొచ్చాడీ స్పెయిన్ సంచలనం. తాజాగా వరుసగా రెండో ఏడాది ఫ్రెంచ్ ఓపెన్ టైటిల్ సాధించి మట్టికోర్టులో రఫెల్ నడాల్‌కు వారసుడిగా కితాబు అందుకుంటున్నాడు. 2021 నుంచే గ్రాండ్‌స్లామ్ ఆడడం మొదలుపెట్టిన ఈ 22 ఏళ్ల కుర్రాడు.. అప్పుడే ఐదు మేజర్ టైటిళ్లు నెగ్గి నవతరం ఆటగాళ్లలో మేటిగా నిరూపించుకున్నాడు.

సంచలనాలతో మొదలై..

తన దేశానికే చెందిన 22 గ్రాండ్‌స్లామ్ టైటిళ్ల వీరుడు నడాల్ అంటే కార్లోస్‌కు ఎంతో అభిమానం. అతడిలా కెరీర్‌లో అత్యున్నత శిఖరాలను అందుకోవాలని నాలుగేళ్ల వయసులోనే రాకెట్ పట్టిన అల్కారజ్.. ఇప్పుడు నడాల్ రికార్డులనే బద్దలు కొడుతున్నాడు. ఎర్రమట్టి కోర్టు రారాజుగా ఉన్న నడాల్‌పై 2022 మాడ్రిడ్ ఓపెన్ క్వార్టర్స్‌లో నెగ్గి.. క్లేకోర్టులో నడాల్‌ను ఓడించిన టీనేజర్‌గా (19 ఏళ్లు) రికార్డు సృష్టించాడు. ఇదే టోర్నీ సెమీస్‌లో నాటి వరల్డ్ నెం.1 జొకోవిచ్‌ను, ఫైనల్లో నెం.3 జ్వెరెవ్‌ను ఓడించి ఏకంగా మాడ్రిడ్ కిరీటాన్ని అందుకున్నాడు. అదే ఏడాది యూఎస్ ఓపెన్‌లో విజేతగా నిలిచి కెరీర్‌లో తొలి గ్రాండ్‌స్లామ్‌తో పాటు వరల్డ్ నెం.1 ర్యాంక్‌ను దక్కించుకున్నాడు. 19 ఏళ్లకే ఏటీపీ ర్యాంకింగ్స్‌లో నెంబర్‌వన్‌గా నిలిచిన ఆటగాడిగా చరిత్రకెక్కాడు. ఇలా, అల్కారజ్ టీనేజర్‌గా ఉన్నప్పుడే ప్రపంచ టెన్నిస్‌లో ప్రకంపనలు సృష్టించాడు. అంతేకాదు.. వింబుల్డన్‌లో 2018 నుంచి చాంపియన్‌గా ఉన్న జొకోవిచ్‌ను 2023 ఫైనల్లో చిత్తు చేశాడు. వరుసగా ఆస్ట్రేలియన్ ఓపెన్, ఫ్రెంచ్ ఓపెన్ నెగ్గి జోరుమీదున్న జొకోవిచ్‌కు ఆ ఏడాది తొలి గ్రాండ్‌స్లామ్ ఓటమి రుచి చూపించాడు. ఆ మరుసటి ఏడాది ఫ్రెంచ్ ఓపెన్ ఫైనల్లో జ్వెరెవ్‌ను చిత్తు చేసి మొదటిసారి ఎర్రమట్టి కోర్టులో పాగా వేశాడు. ఆ వెంటనే వింబుల్డన్‌లో వరుసగా రెండో ఏడాదీ విజేతగా నిలిచి జొకోవిచ్‌కు కొరకరాని కొయ్యలా మారాడు. ఆ తర్వాత కొన్నిరోజులు గాయం బారిన పడ్డా వెంటనే కోలుకున్న అల్కారజ్.. ఇటీవల ఫ్రెంచ్ ఓపెన్‌తో మళ్లీ గాడిన పడ్డాడు. తనలోని అత్యుత్తమ ఆటతీరును ప్రదర్శిస్తూ.. ఫైనల్లో జానిక్ సినర్‌తో సుదీర్ఘంగా దాదాపు ఐదున్నర గంటల పాటు పోరాడి పైచేయి సాధించాడు. వరుసగా రెండో ఏడాది ఫ్రెంచ్ కిరీటాన్ని ముద్దాడి క్లేకోర్టు కింగ్ నడాల్‌ను మరిపించాడు.

అచ్చం అతనిలా...

గతవారం ఫ్రెంచ్ ఓపెన్‌తో అల్కారజ్ కెరీర్‌లో ఐదో గ్రాండ్‌స్లామ్‌ను అందుకున్నాడు. ప్రస్తుతం అతడి వయసు 22 ఏళ్ల 33 రోజులు. సరిగ్గా.. ఇదే వయసులో నడాల్ 2008 వింబుల్డన్ ఫైనల్లో ఫెడరర్‌ను ఓడించి కెరీర్‌లో ఐదో గ్రాండ్‌స్లామ్‌ను సాధించాడు. ఇది యాదృచ్ఛికమే అయినా.. ఆరాధ్య ఆటగాడి రికార్డును సమం చేయడం తన అదృష్టంగా భావిస్తానని అల్కారజ్ ఆనందం వ్యక్తం చేశాడు.



'హాల్ ఆఫ్ ఫేమ్'లో ధోనీ

మహీకి అరుదైన గౌరవం



న్యూఢిల్లీ: టీమిండియా మాజీ కెప్టెన్ ఎంఎస్ ధోనీకి అరుదైన గౌరవం దక్కింది. అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) 'హాల్ ఆఫ్ ఫేమ్'లో మహీకి చోటు లభించింది. ఈమేరకు ఐసీసీ సోమవారం ప్రకటించింది. ప్రపంచ క్రికెట్‌లో అత్యంత విజయవంతమైన కెప్టెన్‌గా మన్ననలు అందుకున్న ధోనీ ఆధ్వర్యంలో భారత్ రెండు ఐసీసీ వరల్డ్ కప్‌లు (2007 టీ20, 2011 వన్డే) అందుకుంది. అలాగే అతడి సారథ్యంలో 2013 చాంపియన్స్ ట్రోఫీ కూడా టీమిండియా సాధించింది. ధోనీ నాయకత్వంలోనే భారత జట్టు 2009లో టెస్టుల్లో నెంబర్ వన్ స్థానాన్ని చేజిక్కించుకుంది. 'ప్రపంచ వ్యాప్తంగా అన్ని తరాల క్రికెటర్ల సేవలను గుర్తించే ఐసీసీ హాల్ ఆఫ్ ఫేమ్‌లో చోటు లభించడం ఎంతో గౌరవంగా భావిస్తున్నా. ఎందరో గొప్ప క్రికెటర్ల మధ్య నా పేరు ఉండబోతోందన్న భావనే అద్భుతంగా ఉంది. ఈ సందర్భాన్ని ఎప్పటికీ మరువలేను' అని ధోనీ పేర్కొన్నట్టు ఐసీసీ తెలిపింది. 'అన్ని ఫార్మాట్లలో కలిపి 538 మ్యాచ్‌లు, 17,266 అంతర్జాతీయ పరుగులు, కీపర్‌గా 829 మందిని అవుట్ చేయడం ధోనీ అసాధారణ ప్రతిభకు, ఫిట్‌నెస్‌కు నిదర్శనం' అని ఐసీసీ కొనియాడింది. ధోనీతో పాటు మాథ్యూ హేడెన్ (ఆస్ట్రేలియా), హషీమ్ ఆమ్లా, గ్రేమ్ స్మిత్ (దక్షిణాఫ్రికా), డానియెల్ వెటోరి (న్యూజిలాండ్), సనా మిర్ (పాకిస్థాన్), సారా టేలర్ (ఇంగ్లండ్)లకు కూడా హాల్ ఆఫ్ ఫేమ్‌లో చోటు దక్కింది. ఇక..హాల్ ఆఫ్ ఫేమ్‌లో చోటు దక్కించుకున్న 11వ భారత క్రికెటర్ ధోనీ. ఇంతకుముందు గవాస్కర్, సచిన్, సెహ్వాగ్, డయానా ఎడుల్జీ, అనిల్ కుంబ్లే, బిషన్ సింగ్ బేడీ, కపిల్ దేవ్, రాహుల్ ద్రవిడ్, వినూ మన్కడ్, నీతూ డేవిడ్ ఈ జాబితాలో ఉన్నారు.

బోయిసన్.. 296 ర్యాంక్‌లు జంప్!

65కు చేరిక



పారిస్: ఫ్రెంచ్ ఓపెన్‌లో సెమీస్ చేరి సంచలనం సృష్టించిన యువ క్రీడాకారిణి లూయిస్ బోయిసన్ ప్రపంచ ర్యాంకింగ్స్‌లో ఏకంగా 296 స్థానాలు ఎగబాకింది. రొలాండ్ గారోస్ నాలుగో రౌండ్‌లో మూడో సీడ్ పెగులాకు షాకిచ్చిన 22 ఏళ్ల ఫ్రాన్స్ క్రీడాకారిణి బోయిసన్ ఈ టోర్నీకి ముందు 361వ ర్యాంక్‌లో ఉంది. కానీ ఫ్రెంచ్ ఓపెన్ ప్రదర్శన దరిమిలా ఆమె ఏకంగా 65వ స్థానానికి చేరింది. టాప్ ర్యాంక్‌ల్లో మార్పులు లేవు. సబలెంకా, గాఫ్, పెగులా తొలి మూడు స్థానాలలోనే నిలిచారు. పురుషుల సింగిల్స్‌లో ఫ్రెంచ్ ఓపెన్ ఫైనల్లో ఓడినా..సినర్ టాప్ ర్యాంక్‌ను నిలబెట్టుకున్నాడు. ఫ్రెంచ్ ఓపెన్ విజేత అల్కారజ్ 2వ, జ్వెరెవ్ 3వ స్థానంలోనే కొనసాగుతున్నారు.

అప్పుడే గుడ్‌బై చెబుతాడనుకుంది!

రోహిత్ వన్డే భవితవ్యంపై బీసీసీఐ




న్యూఢిల్లీ: రోహిత్ శర్మ..తెల్లబంతుల ఫార్మాట్‌లో అన్ని తరాలకు నిస్సందేహంగా గొప్ప క్రికెటర్. 38 ఏళ్ల రోహిత్ టీ20లలో అత్యధిక రన్స్ చేసిన బ్యాటర్. అలాగే వన్డేలలో 11వేలకు పైగా పరుగులు సాధించిన ఆటగాడు. నిరుడు జూన్‌లో టీమిండియా వరల్డ్ కప్ నెగ్గాక పొట్టి ఫార్మాట్‌కు హిట్‌మ్యాన్ రిటైర్మెంట్ ప్రకటించాడు. తాజాగా టెస్టులకూ వీడ్కోలు పలికాడు. ప్రస్తుతం కేవలం 50 ఓవర్ల ఫార్మాట్‌కే పరిమితమైన రోహిత్ 2027 వన్డే ప్రపంచ కప్ ఆడాలన్న పట్టుదలతో ఉన్నాడు. కానీ గత మార్చిలో ముగిసిన ఐసీసీ చాంపియన్స్ ట్రోఫీ తర్వాత హిట్‌మ్యాన్ వన్డేలకు గుడ్‌బై చెబుతాడని బీసీసీఐ భావించిందట! 'నిజం చెప్పాలంటే.. చాంపియన్స్ ట్రోఫీ అందుకున్నాక రోహిత్ వన్డేలకూ రిటైర్మెంట్ ప్రకటిస్తాడని అంచనా వేశాం. అయితే రోహిత్ వన్డే భవితవ్యంపై అతడికి, సెలెక్టర్లకు నడుమ ఎలాంటి చర్చా జరగలేదు' అని బీసీసీఐ అధికారి ఒకరు వెల్లడించారు. భారత జట్టు తదుపరి వన్డే సిరీస్‌ను ఆగస్టులో బంగ్లాదేశ్‌తో ఆడాల్సి ఉంది. అయితే ప్రస్తుతం బంగ్లాదేశ్‌లో పరిస్థితుల రీత్యా చూస్తే ఆ సిరీస్ జరిగేది అనుమానమే. అది రద్దయితే అక్టోబరులో మూడు వన్డేల సిరీస్ కోసం భారత జట్టు ఆస్ట్రేలియా వెళ్లాల్సి ఉంది. కాగా..సౌతాఫ్రికా ఆతిథ్యమిచ్చే తదుపరి వన్డే వరల్డ్ కప్‌నకు రెండేళ్లకు పైగా వ్యవధి ఉంది. ఆ మెగా టోర్నీ సమయానికి రోహిత్ 40వ ఏట ప్రవేశిస్తాడు. అయితే రాబోయే వన్డే వరల్డ్ కప్ వరకూ అతడు ఇదే స్థాయిలో దూకుడుగా ఆడగలడా..అన్నది ప్రశ్న. ఈ క్రమంలో రోహిత్ కెప్టెన్సీ నిలబెట్టుకుంటాడా అనేది కూడా చూడాలి. సారథ్య బాధ్యతలు లేకపోవడం రోహిత్‌కు ప్రతికూలమే కాగలదు. ఇప్పటికే భిన్న ఫార్మాట్లకు భిన్న సారథుల దిశగా భారత క్రికెట్ అడుగులు వేస్తోంది. టీ20లకు సూర్యకుమార్ కెప్టెన్‌గా వ్యవహరిస్తున్నాడు. ఇక టెస్ట్ జట్టు గిల్ సారథ్యం వహిస్తున్నాడు. ఈక్రమంలో వన్డేలకూ కొత్త నాయకుడిని ఎంపిక చేసే అవకాశాలు ఎంతో దూరంలో లేకపోలేదు.

ఆసీస్ జట్టును ఆపేశారు

లార్డ్స్‌లో చేదు అనుభవం

లండన్: ప్రఖ్యాత లార్డ్స్ మైదానంలో ఈనెల 11 నుంచి వరల్డ్ టెస్టు చాంపియన్‌షిప్ ఫైనల్ జరుగనుంది. ఈ నేపథ్యంలో ప్రాక్టీస్ కోసం శనివారం ఈ స్టేడియానికి వచ్చిన ఆస్ట్రేలియా ఆటగాళ్లకు చేదు అనుభవం ఎదురైంది. అక్కడి సిబ్బంది వారిని లోనికి అనుమతించలేదు. ప్రస్తుతానికి ఈ స్టేడియం మీకు అందుబాటులో లేదని చెప్పి వారిని పంపించేసినట్టు బ్రిటిష్ మీడియా పేర్కొంది. అయితే అదే రోజు భారత టెస్టు జట్టుకు అనుమతి ఇవ్వడంతో వారు లార్డ్స్‌లో ప్రాక్టీస్ చేశారని అక్కడి మీడియాలో కథనాలు ప్రచురితమయ్యాయి. కానీ డబ్ల్యూటీసీ ఫైనల్ బుధవారం నుంచే ఉండగా.. ఇంగ్లండ్‌తో భారత్ సిరీస్‌కు మరో పది రోజుల సమయం ఉంది. అలాంటప్పుడు ఆసీస్‌కు కాకుండా గిల్ సేనకు ప్రాధాన్యత ఇవ్వడమేమిటని పలువురు ప్రశ్నిస్తున్నారు. అదీగాకుండా లార్డ్స్‌లో ఇంగ్లండ్-భారత్ మూడో టెస్టు జూలై 10న జరుగుతుందని గుర్తు చేశారు.

కెప్టెన్సీ అంటే ఇష్టం: శ్రేయాస్



న్యూఢిల్లీ: పంజాబ్ కింగ్స్ కెప్టెన్‌గా శ్రేయాస్ అయ్యర్ తమ జట్టును ఐపీఎల్‌లో ఫైనల్‌కు చేర్చడంతో పాటు బ్యాటర్‌గానూ విశేషంగా రాణించాడు. దీంతో అతడిని భవిష్యత్ భారత వన్డే కెప్టెన్‌గానూ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. అటు అయ్యర్ సైతం జట్టును ముందుండి నడిపించడాన్ని ఆస్వాదిస్తానని అంటున్నాడు. 'కెప్టెన్సీ అనేది మనలో పరిణతిని, బాధ్యతను తెలియజేస్తుంది. నేను 22 ఏళ్ల నుంచే వివిధ జట్లకు సారథ్యం వహిస్తున్నా. అందుకే సారథ్య బాధ్యతలు అందుకునేందుకు సరిపడా అనుభవం నాకుందనే భావిస్తా' అని 30 ఏళ్ల శ్రేయాస్ చెప్పుకొచ్చాడు.

బిజినెస్

మిడ్‌వెస్ట్ నుంచి రేర్ ఎర్త్ మ్యాగ్నెట్స్

డిసెంబరుకల్లా ఉత్పత్తి ప్రారంభం

చైనా కుయుక్తులకు చెక్!

ఆటోమొబైల్స్, విండ్ టర్బైన్స్, సెమీకండక్టర్లలో విరివిగా ఉపయోగించే అరుదైన లోహాల మ్యాగ్నెట్స్ ఉత్పత్తికి హైదరాబాద్‌కు చెందిన మిడ్‌వెస్ట్ అడ్వాన్స్‌డ్ మెటీరియల్స్ (ఎంఏఎం) సిద్ధమవుతోంది. హైదరాబాద్ సమీపంలో ఏటా 500 టన్నుల ఉత్పత్తి సామర్థ్యంతో ఏర్పాటు చేయనున్న ఈ ప్లాంటులో డిసెంబరు నాటికల్లా ఉత్పత్తి ప్రారంభం కానుందని బిజినెస్ స్టాండర్డ్ కథనం వెల్లడించింది. అంతేకాకుండా వచ్చే మూడేళ్లలో రూ.1,000 కోట్లతో ప్లాంట్ ఉత్పత్తి సామర్థ్యాన్ని 5,000 టన్నులకు విస్తరించాలని కంపెనీ యోచిస్తోందని తెలిపింది. ఈ మ్యాగ్నెట్ల ఉత్పత్తికి కీలక ముడి పదార్థమైన మొనాజైట్‌ను శ్రీలంకలోని ఎంఏఎం సొంత గనుల నుంచి దిగుమతి చేసుకుంటుంది. బ్లాక్ గెలాక్సీ గ్రానైట్ ఉత్పత్తిలో పేరొందిన మిడ్‌వెస్ట్ లిమిటెడ్‌కు ఎంఏఎం అనుబంధ సంస్థ.

తీవ్ర కొరత: ఈ రేర్ ఎర్త్ మ్యాగ్నెట్ల ఉత్పత్తిలో ప్రస్తుతం చైనాదే హవా. ప్రపంచం ఉత్పత్తిలో చైనా వాటా 80 శాతానికిపైగా ఉంది. ట్రంప్ సుంకాల నేపథ్యంలో ఈ ఏడాది ఏప్రిల్ నుంచి చైనా వీటి ఎగుమతులను నిషేధించింది. మన దేశానికి చేసే ఎగుమతులపైనా అనేక ఆంక్షలు విధించి వీటి సరఫరాను కట్టడి చేస్తోంది. ఈ దెబ్బకు అమెరికా, యూరప్‌లోని కొన్ని ఆటోమొబైల్ కంపెనీలు ఉత్పత్తి నిలిపి వేసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది.ఈ నేపథ్యంలో మిడ్‌వెస్ట్ దేశీయంగా వీటి ఉత్పత్తికి సిద్ధమవుతోంది.

దేశీయ టెక్నాలజీ: ఈ మ్యాగ్నెట్ల ఉత్పత్తికి అవసరమైన కీలక ఖనిజాల ప్రాసెసింగ్ ప్రక్రియ చాలా కష్టంతో కూడుకున్నది. ఇందుకు అవసరమైన టెక్నాలజీని కూడా మిడ్‌వెస్ట్.. హైదరాబాద్‌లోని నాన్ ఫెర్రస్ మెటీరియల్స్ టెక్నాలజీ డెవలప్‌మెంట్ సెంటర్ (ఎన్ఎంటీడీసీ) నుంచే సమకూర్చుకుంది. ఈ మ్యాగ్నెట్ల సరఫరా కోసం కంపెనీ ఇప్పటికే దేశంలోని వివిధ ఆటోమొబైల్ కంపెనీలు, విండ్ టర్బైన్ కంపెనీలు, ఎంఆర్ఐ కంపెనీలతో చర్చలు జరుపుతోంది.

ఏపీలో ర్యాపిడో సేవల విస్తరణ

ఆంధ్రప్రదేశ్‌లో మరో 14 నగరాలకు సేవలను విస్తరించినట్లు రైడ్ హైలింగ్ ప్లాట్‌ఫామ్ ర్యాపిడో ప్రకటించింది. రాష్ట్రంలోని ఒంగోలు, విజయనగరం, ఏలూరు, మదనపల్లి, మచిలీపట్నం, శ్రీకాకుళం, భీమవరం, గుడివాడ, నర్సారావుపేట, నంద్యాల, తెనాలి, తాడేపల్లిగూడెం, తాడిపత్రి, చిత్తూరు పట్టణాలకు విస్తరించినట్లు తెలిపింది. దేశవ్యాప్తంగా 500 నగరాలకు కార్యకలాపాలు విస్తరించాలన్న వ్యూహంలో భాగంగా సేవలను విస్తరించినట్లు పేర్కొంది.

- దేశవ్యాప్తంగా మాన్‌సూన్ చెకప్ క్యాంప్‌ను నిర్వహిస్తున్నట్లు టాటా మోటార్స్ ప్రకటించింది. ఈ నెల 20 వరకు దేశవ్యాప్తంగా 500 నగరాలు, 1,090 అధీకృత వర్క్‌షాపుల్లో ఈ క్యాంప్ అందుబాటులో ఉంటుందని వెల్లడించింది. ఇందులో భాగంగా వాహనాన్ని సమగ్రంగా చెక్ చేయటంతో పాటు ఒరిజినల్ స్పేర్‌పార్ట్స్, యాక్సెసరీలపై ప్రత్యేక డిస్కౌంట్స్‌ను అందించనుంది.
- ఆడి ఇండియా.. ఆడి ఏ4 సిగ్నేచర్ ఎడిషన్‌ను విడుదల చేసింది. ఐదు ఎక్స్‌టీరియర్ కలర్స్, 360 డిగ్రీస్ కెమెరాతో పార్క్ అసిస్ట్ సహా పలు ప్రత్యేకమైన ఫీచర్లతో సిగ్నేచర్ ఎడిషన్‌ను తీసుకువచ్చింది. ఈ ఏ4 సిగ్నేచర్ ఎడిషన్ ప్రారంభ ధర రూ.57.11 లక్షలు (ఎక్స్‌షోరూమ్).
- ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కర్ణాటక, కేరళలో తన గోధుమ పిండి బ్రాండ్‌ను క్వాలిటీ అష్యూరెన్స్‌తో తీసుకువచ్చినట్లు ఐటీసీ ఆశీర్వాద్ ప్రకటించింది. ఆశీర్వాద్ గోధుమ పిండిని వినియోగదారులకు మరింత చేరువ చేసేందుకు టాలీవుడ్ నటి స్నేహను తిరిగా ప్రచారకర్తగా నియమించుకున్నట్లు ఐటీసీ వెల్లడించింది. 40కి పైగా నాణ్యతా పరీక్షలను నిర్వహించటమే కాకుండా క్వాలిటీ సర్టిఫికెట్‌తో ఈ ఆటాను తీసుకువచ్చినటు తెలిపింది.
- విశాఖపట్నం, గోదావరి జిల్లాలో రోడ్‌స్టర్ ఎక్స్ డెలివరీలను ప్రారంభించినట్లు ఓలా ఎలక్ట్రిక్ ప్రకటించింది. రైడ్ ది ఫ్యూచర్ క్యాంపెయిన్‌లో భాగంగా తొలి ఐదు వేల మంది కస్టమర్లకు రూ.10,000 విలువ కలిగిన ఆఫర్లను అందించనున్నట్లు వెల్లడించింది. రోడ్‌స్టర్ ఎక్స్ సిరీస్ ధరలు రూ.99,999 నుంచి రూ.1,99,999 మధ్యన ఉన్నాయి. 2.5, 3.5, 4.5, 9.1 కిలోవాట్ బ్యాటరీలతో ఈ ఎలక్ట్రిక్ మోటార్ బైక్స్ అందుబాటులో ఉండనున్నాయి.

స్టార్‌లింక్ కాస్ట్‌లీనే?

హార్డ్‌వేర్‌కు రూ.33,000 ● నెలవారీ చార్జీ రూ.3,000 ● 2 నెలల్లో సేవలు షురూ!



న్యూఢిల్లీ: దేశ బ్రాడ్‌బ్యాండ్ మార్కెట్లో మరో విప్లవాత్మక మార్పునకు రంగం సిద్ధమవుతోంది. ప్రపంచ అపర కుబేరుడు ఎలాన్ మస్క్ నాయకత్వంలోని స్టార్‌లింక్ సంస్థ త్వరలోనే మన దేశంలోనూ తన ఉపగ్రహ ఆధారిత (శాట్‌లైట్ బేస్డ్) బ్రాడ్‌బ్యాండ్ సేవలు ప్రారంభించనుంది. టెలికాం శాఖ (డాట్) నుంచి ఇప్పటికే ఇందుకు ప్రాథమిక అనుమతి (ఎల్ఓఐ) పొందింది. స్పెక్ట్రమ్ కేటాయింపులు లభించిన వెంటనే ఈ సేవలు ప్రారంభించనుంది. దరఖాస్తు చేసిన 15 నుంచి 20 రోజుల్లోనే స్టార్‌లింక్‌కు స్పెక్ట్రమ్ కేటాయింపులు చేయనున్నట్లు అధికారిక వర్గాలు వెల్లడించాయి. స్పెక్ట్రమ్ కేటాయింపులు లభించిన వెంటనే ఇతర అనుమతులు, మౌలిక సదుపాయాల ఏర్పాటు పూర్తి చేసుకుని రెండు నెలల్లో తన బ్రాడ్‌బ్యాండ్ సేవలు ప్రారంభించాలని స్టార్‌లింక్ యోచిస్తోంది. ప్రారంభంలో స్టార్‌లింక్ బ్రాడ్‌బ్యాండ్ సేవల బ్యాండ్‌విడ్త్ సామర్థ్యం 600 నుంచి 700 గిగాబైట్స్ పర్ సెకండ్ (జీబీపీఎస్)గా ఉంటుందని అంచనా. దీంతో మన దేశ బ్రాడ్‌బ్యాండ్ మార్కెట్లో మరిన్ని విప్లవాత్మక మార్పులు చోటు చేసుకుంటాయని భావిస్తున్నారు.

బంగ్లాదేశ్‌లోనూ ఇవే టారిఫ్‌లు

భారత్‌లో తాను ప్రారంభించే ఉపగ్రహ ఆధారిత బ్రాడ్‌బ్యాండ్ సేవల టారిఫ్‌లను స్టార్‌లింక్ ఇంకా అధికారికంగా వెల్లడించలేదు. అయితే అందుతున్న సమాచారాన్ని బట్టి ఈ హైస్పీడ్ బ్రాడ్‌బ్యాండ్ సేవల కోసం ఖాతాదారులు నెలకు కనీసం రూ.3,000 టారిఫ్‌గా చెల్లించాల్సి ఉంటుందని మార్కెట్ వర్గాల అంచనా. దీనికి తోడు హార్డ్‌వేర్ కోసం వన్‌టైమ్ చార్జీల కింద మరో రూ.33,000 (జీఎస్‌టీ అదనం) చెల్లించాల్సి ఉంటుంది. అంటే స్టార్‌లింక్ బ్రాడ్‌బ్యాండ్ కనెక్షన్ తీసుకునే ఖాతాదారులు తొలి ఏడాదే కనీసం రూ.69,000 వరకు చెల్లించాలి. బంగ్లాదేశ్‌లోనూ స్టార్‌లింక్ తన బ్రాడ్‌బ్యాండ్ సేవల కోసం ఇవే చార్జీలు వసూలు చేస్తోంది.

టెల్కోల ఆందోళన

గత ఏడాది డిసెంబరు నాటికి మన దేశంలో వైర్‌లెస్, వైర్‌లైన్ పద్ధతిలో 94.49 కోట్ల మంది బ్రాడ్‌బ్యాండ్ సేవలు అందుకుంటున్నారు. ఇందులో మొబైల్ ఆధారిత వైర్‌లెస్ బ్రాడ్‌బ్యాండ్ ఖాతాదారుల సంఖ్య 90.4 కోట్ల వరకు ఉంది. ఇప్పుడు స్టార్‌లింక్ ఉపగ్రహ ఆధారిత బ్రాడ్‌బ్యాండ్ సేవలు ఇందుకు తోడుకానున్నాయి. తన సేవలు ప్రారంభించిన తొలి ఏడాదే కనీసం కోటి మంది ఖాతాదారులను సంపాదించాలని స్టార్‌లింక్ లక్ష్యంగా పెట్టుకున్నట్టు సమాచారం. దీంతో ఈ మార్కెట్‌పై ఎక్కడ తమ గుత్తాధిపత్యానికి గండి పడుతుందోనని టెలికాం కంపెనీలు ఆందోళన చెందుతున్నాయి. తమలాగే ఉపగ్రహ ఆధారిత బ్రాడ్‌బ్యాండ్ సేవల కంపెనీలకూ వేలం ద్వారానే స్పెక్ట్రమ్ కేటాయించాలని ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చాయి. ప్రభుత్వం అందుకు తిరస్కరించడంతో కనీసం స్పెక్ట్రమ్ ధరైనా తమకు కేటాయించిన స్థాయిలో ఉండాలని కోరాయి. ట్రాయ్ దీనిపై సానుకూలంగా స్పందించడంతో కొద్దిగా ఊపిరి పీల్చుకున్నాయి. రేటింగ్ ఏజెన్సీలు మాత్రం స్టార్‌లింక్ వంటి సంస్థల బ్రాడ్‌బ్యాండ్ సేవలతో టెలికాం కంపెనీల సేవలకు పెద్ద పోటీ ఏమీ ఉండదని చెబుతున్నాయి. ఈ కంపెనీలు గ్రామీణ, మారుమూల ప్రాంతాల్లో టెలికాం కంపెనీలతో పోటీపడినా టారిఫ్‌లపరంగా పట్టణ ప్రాంతాల్లో పోటీపడడం కష్టమని తేల్చేస్తున్నాయి.

ప్రత్యేకత ఏమిటంటే..

ప్రస్తుతం మన దేశంలోని టెలికాం కంపెనీలు కేబుల్ లేదా మొబైల్ వైర్‌లెస్ ద్వారా తమ బ్రాడ్‌బ్యాండ్ సేవలు అందిస్తున్నాయి. సుదూర ప్రాంతాల్లోని గ్రామాలు, మారుమూల ప్రాంతాల్లోని ఖాతాదారులకు ఈ బ్రాడ్‌బ్యాండ్ సేవలు అందించాలంటే, ఆ ప్రాంతాలకు కేబుల్ వేయడం, ఇతర మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేసేందుకు పెద్దమొత్తంలో ఖర్చు చేయాలి. ఉపగ్రహ ఆధారిత బ్రాడ్‌బ్యాండ్ సేవల ద్వారా ఈ సమస్యను అధిగమించవచ్చు. ఈ విధానంలో భూదిగువ కక్ష్య (ఎల్ఈఓ) పరిభ్రమించే ఉపగ్రహాల నుంచి సిగ్నల్స్‌ను నేరుగా ఖాతాదారుల హార్డ్‌వేర్‌కు పంపించడం ద్వారా బ్రాడ్‌బ్యాండ్ సేవలు అందిస్తారు. ప్రపంచంలో దాదాపు వందకుపైగా దేశాల్లో ప్రస్తుతం ఈ సేవలు అందుబాటులో ఉన్నాయి.



దేశీయ బ్యాంకింగ్ దిగ్గజం భారతీయ స్టేట్ బ్యాంక్ (ఎస్‌బీఐ).. 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి రూ.8,076.84 కోట్ల డివిడెండ్‌ను కేంద్ర ప్రభుత్వానికి చెల్లించింది. సోమవారం నాడు ఆర్థిక సేవల కార్యదర్శి ఎం నాగరాజు, ఆర్థిక శాఖ కార్యదర్శి అజయ్ సేథ్ సమక్షంలో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌కు ఈ డివిడెండ్ చెక్‌ను ఎస్‌బీఐ చైర్మన్ సీఎస్ శెట్టి అందజేశారు.

నాలుగో రోజూ లాభాలొచ్చాయ్..

సెన్సెక్స్ 256 పాయింట్లు అప్

ముంబై: భారత స్టాక్ మార్కెట్ ప్రామాణిక సూచీలు వరుసగా నాలుగో రోజూ లాభపడ్డాయి. అంతర్జాతీయ మార్కెట్ల సానుకూల సంకేతాలతో పాటు గతవారం ఆర్‌బీఐ రెపో రేటును 0.50 శాతం తగ్గించిన నేపథ్యంలో మదుపరులు వడ్డీ రేట్ల ప్రభావిత రంగాలైన బ్యాంకింగ్, ఆర్థిక సేవలు, వాహనం, క్యాపిటల్ గూడ్స్ కంపెనీల షేర్లలో కొనుగోళ్లు పెంచడం ఇందుకు దోహదపడింది. సోమవారం ట్రేడింగ్‌లో సెన్సెక్స్ ఒక దశలో 480 పాయింట్ల వరకు ఎగబాకినప్పటికీ, చివరికి 256.22 పాయింట్ల లాభంతో 82,445.21 వద్ద ముగిసింది. నిఫ్టీ 100.15 పాయింట్ల వృద్ధితో 25,103.20 వద్ద స్థిరపడింది. నిఫ్టీకి ఈ ఏడాదిలో ఇదే గరిష్ఠ ముగింపు స్థాయి.

లలిత జువెలరీ రూ.1,700 కోట్ల ఐపీఓ: తెలుగు రాష్ట్రాల్లో పదుల సంఖ్యలో షోరూమ్‌లను నిర్వహిస్తున్న స్వర్ణ, వజ్రాభరణాల విక్రయ సంస్థ లలిత జువెలరీ తొలి పబ్లిక్ ఆఫరింగ్ (ఐపీఓ)కు రాబోతోంది. ఇందుకు అనుమతి కోరుతూ మార్కెట్ నియంత్రణ మండలి సెబీకి ప్రాథమిక ముసాయిదా పత్రాలు (డీఆర్‌హెచ్‌పీ) సమర్పించింది. ఐపీఓలో భాగంగా మొత్తం రూ.1,700 కోట్లు సమీకరించాలనుకుంటున్నట్లు డీఆర్‌హెచ్‌పీలో వెల్లడించింది. అందులో రూ.1,200 కోట్లు తాజా ఈక్విటీ జారీతో పాటు ప్రమోటర్ కిరణ్ కుమార్ జైన్ రూ.500 కోట్ల విలువైన ఈక్విటీ షేర్లను విక్రయించనున్నారు.

ఎంఎస్ఎంఈలపై మరింత ఫోకస్

● షిప్‌రాకెట్

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): త్వరలో పబ్లిక్ ఇష్యూకి వస్తోన్న ఈ-కామర్స్ ప్లాట్‌ఫామ్ షిప్‌రాకెట్.. ఎంఎస్ఎంఈలకు తన సేవలను మరింత విస్తరిస్తున్నట్లు ప్రకటించింది. ఆన్‌లైన్ ద్వారా అంతర్జాతీయంగా, దేశీయంగా తమ వ్యాపారాలను విస్తరించాలనుకునే ఎంఎస్ఎంఈలకు ప్రత్యేకమైన సేవలందించనున్నట్లు సంస్థ సీఈఓ (డొమెస్టిక్ షిప్పింగ్) సీఈఓ అతుల్ మెహతా చెప్పారు. షిప్‌రాకెట్ పోర్టల్‌పై ఇప్పటికే 3 లక్షల మంది విక్రేతలు ఉన్నారని ఆయన పేర్కొన్నారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల నుంచి దాదాపు 18 వేల మంది విక్రేతలు షిప్‌రాకెట్ ద్వారా 2 కోట్లకు పైగా ఉత్పత్తులను విక్రయించారని తెలిపారు. గడచిన ఆర్థిక సంవత్సరంలో తెలుగు రాష్ట్రాల నుంచి ఎంఎస్ఎంఈలు చేసిన షిప్‌మెంట్స్ 35 లక్షలకు పైగా ఉన్నాయన్నారు.

కాగా కంపెనీ హైదరాబాద్ సహా దేశవ్యాప్తంగా 32 వేర్‌హౌసెస్‌ను నిర్వహిస్తోందని మెహతా చెప్పారు. పైలెట్ ప్రాజెక్టు కింద ఢిల్లీలో డార్క్ స్టోర్స్ పేరుతో క్విక్ కామర్స్ సేవలను ప్రారంభించామని, దశలవారీగా దీన్ని ఇతర నగరాలకు విస్తరించనున్నట్లు ఆయన చెప్పారు. అలాగే హైదరాబాద్‌లో డ్రోన్ ద్వారా ఉత్పత్తుల డెలివరీని చేపట్టాలని చూస్తున్నట్లు మెహతా తెలిపారు.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)

10వ తేదీ			
హైదరాబాద్	540	విజయవాడ	550
వరంగల్	542	గోదావరి	535
చిత్తూరు	613	విశాఖపట్నం	550
		డజను గుడ్లు రూ.	78

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్

హైదరాబాద్	105	విజయవాడ	109
వరంగల్	105	గుంటూరు	112
కరీంనగర్	105	ఒంగోలు	112
మహబూబ్‌నగర్	105	చిత్తూరు	100
కర్నూలు	105	నెల్లూరు	105
విశాఖపట్నం	96	అనంతపురం	105
గోదావరి	109		

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	97,690 ▼	89,550 ▼	1,18,000 ▲
విజయవాడ	99,000 ▼	93,000 ▼	1,08,000 ▲
విశాఖపట్నం	99,130 ▼	89,950 ▲	1,18,000 ▲
రాజమండ్రి	97,690 ▼	89,550 ▼	1,08,400 ▲
ప్రొద్దుటూరు	96,300 ▼	88,600 ▼	1,03,000 ▲
ముంబై	95,864 ▼	87,811 ▼	1,05,560 ▲

ట్రైలర్‌కు ముహూర్తం ఫిక్స్

నితిన్ కథానాయకుడిగా శ్రీరామ్ వేణు తెరకెక్కిస్తున్న చిత్రం 'తమ్ముడు'. 'కాంతార' ఫేమ్ సప్తమి గౌడ, వర్ష బొల్లమ్మ, లయ కీలక పాత్రలు పోషిస్తున్నారు. దిల్‌రాజు, శిరీష్ నిర్మిస్తున్నారు. తాజాగా ఈ చిత్ర ట్రైలర్‌ను బుధవారం విడుదల చేస్తున్నట్లు



ప్రకటించారు మేకర్స్. ఈ మేరకు ఓ ఆసక్తికరమైన వీడియోను సోషల్‌మీడియా ద్వారా పంచుకున్నారు. ఇది ప్రస్తుతం అందర్నీ ఆకర్షిస్తోంది. జూలై 4న చిత్రం ప్రేక్షకుల ముందుకు వస్తోంది. ఈ చిత్రానికి ఎడిటర్:ప్రవీణ్ పూడి, సినిమాటోగ్రఫీ:కేవీ గుహన్, సంగీతం: అజనీష్ లోక్‌నాథ్.

ద్విభాషా చిత్రంలో సునీల్



రాజ్‌తరుణ్ హీరోగా తమిళ దర్శకుడు, 'గోలి సోడా' ఫేమ్ విజయ్ మిల్టన్ ఓ చిత్రాన్ని తెరకెక్కించనున్నారు. తమిళ, తెలుగు భాషల్లో రూపొందనున్న ఈ సినిమాలో ఓ కీలక పాత్రలో సునీల్ నటించనున్నారని మేకర్స్ తెలిపారు. ఈ సందర్భంగా విజయ్ విల్టన్ మాట్లాడుతూ "సినిమాలో సునీల్ చేయనున్న పాత్ర చాలా విభిన్నంగా ఉండబోతోంది. ప్రేక్షకుల హృదయాల్ని హత్తుకునే పాత్ర ఇది" అని తెలిపారు. చిత్ర టైటిల్‌ను ఈ నెల 15న ప్రకటించనున్నారు.

అమ్మవారి కథ



నూతన నటీనటులను పరిచయం చేస్తూ హెచ్‌బీజే క్రియేషన్స్, మదర్ అండ్ ఫాదర్ పిక్చర్స్ నిర్మిస్తున్న సినిమా 'చండీ దుర్గమా'. షైను ఖాన్ ఎండీ దర్శకత్వంలో జయశ్రీ వెల్ది నిర్మిస్తున్నారు. హైదరాబాద్‌లో సోమవారం నిర్వహించిన పూజా కార్యక్రమాలతో ఈ సినిమా ప్రారంభమైంది. హాస్య నటుడు అలీ ముఖ్య అతిథిగా విచ్చేసి ముహూర్తపు సన్నివేశానికి క్లాప్ కొట్టారు. నటుడు చిట్టి కెమెరా స్విచ్ఛాన్ చేయగా, ముహూర్తపు సన్నివేశానికి రఘు కారుమంచి దర్శకత్వం వహించారు. ఈ సందర్భంగా అలీ మాట్లాడుతూ 'అమ్మవారి కథతో వస్తున్న ఈ సినిమా మంచి విజయం సాధించాలని కోరుకుంటున్నా. ఫస్ట్‌లుక్ పోస్టర్ ఆకట్టుకుంటోంది' అని అన్నారు. ఈ చిత్రానికి సంగీతం: ఎంకే, సినిమాటోగ్రఫీ: వై.ఎస్.కృష్ణ



మరింత శక్తిమంతమైన పాత్రలో బాలకృష్ణ

నందమూరి బాలకృష్ణ అభిమానులు ఎంతగానో ఎదురుచూస్తున్న 'అఖండ 2' టీజర్ వచ్చేసింది. ఆయన పుట్టినరోజు సందర్భంగా మేకర్స్ ఈ టీజర్‌ను విడుదల చేశారు. ఇందులో బాలకృష్ణ పాత్ర మొదటి భాగంలో కంటే మరింత శక్తిమంతంగా కనిపిస్తోంది. 'నా శివుడి అనుమతి లేనిదే యముడైనా కన్నెత్తి చూడడు. నువ్వు చూస్తావా..' అంటూ ఆయన చెప్పిన పవర్‌ఫుల్ డైలాగులు, అద్భుతమైన విజువల్స్, అదిరిపోయే పోరాట సన్నివేశాలు, థమన్ అందించిన నేపథ్య సంగీతం సినిమాపై అంచనాలను భారీగా పెంచేశాయి. దసరా సందర్భంగా సెప్టెంబరు 25న సినిమా ప్రేక్షకుల ముందుకు వస్తోంది. బోయపాటి శ్రీను దర్శకుడు. బాలకృష్ణ కూతురు తేజస్విని సమర్పణలో రామ్ అచంట, గోపీ అచంట నిర్మిస్తున్నారు. ఎడిటర్: తిమ్మరాజు, డీఓపీ: సి.రామ్‌ప్రసాద్, సంతోష్ డి.డెటాకే. కాగా, బాలకృష్ణ బోయపాటి కాంబోలో ఇదివరకు వచ్చిన 'సింహా', 'లెజెండ్', 'అఖండ' సినిమాలు బ్లాక్‌బస్టర్ విజయాలు అందుకున్న విషయం తెలిసిందే.

చిత్రజ్యోతి

SINCE 1965

తెలంగాణ గద్దర్ ఫిల్మ్ అవార్డ్స్ జ్ఞాపిక



తెలుగు చిత్ర పరిశ్రమలో ప్రతిభ కలిగిన కళాకారులను, ఉత్తమాభిరుచితో నిర్మించిన చిత్రాలను ప్రోత్సహించడం కోసం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణ గద్దర్ ఫిల్మ్ అవార్డ్స్‌ను ప్రకటించిన సంగతి విదితమే. ఈ నెల 14న ఎంతో వైభవంగా జరిగే కార్యక్రమంలో విజేతలకు అవార్డులను అందజేస్తారు. ఈ సందర్భంగా విజేతలకు అందించే అవార్డుల జ్ఞాపికను రాష్ట్రప్రభుత్వం విడుదల చేసింది. ఫిల్మ్ రీల్‌ను చేతికి చుట్టుకున్నట్లుగా.. పైకెత్తిన చేతిలో కంజెర నమూనాతో గద్దర్ అవార్డ్‌ను తీర్చిదిద్దారు. కంజెరపై తెలంగాణ రాష్ట్ర చిహ్నాన్ని ముద్రించి చుట్టూ టీజీఎఫ్ఏ అక్షరాలను ఉంచారు.

అమరావతికి క్వాంటమ్ వ్యాలీ కీలకం

- సిలికాన్ వ్యాలీ తరహా ప్రత్యేక గుర్తింపు.. 30న వర్క్‌షాప్
- అధికారులకు చంద్రబాబు ఆదేశాలు

అమరావతి, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): అమరావతి క్వాంటమ్ వ్యాలీకి అమెరికాలోని సిలికాన్ వ్యాలీ అంత పేరు తీసుకురావాలని అధికారులకు సీఎం చంద్రబాబు సూచించారు. సోమవారం వెలగపూడి సచివాలయంలో క్వాంటమ్ కంప్యూటింగ్ మిషన్‌పై ఐటీ నిపుణులతో ముఖ్యమంత్రి సమీక్ష నిర్వహించారు. ఈ నెల 30న విజయవాడలో క్వాంటమ్ మిషన్‌పై వర్క్‌షాపును నిర్వహిస్తున్నట్టు చంద్రబాబు వెల్లడించారు. ముఖ్యమంత్రి అధ్యక్షన క్వాంటమ్ మిషన్ పనిచేస్తుందని చంద్రబాబుకు అధికారులు తెలిపారు. వారు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా కార్యాచరణను గురించి వివరించారు. క్వాంటమ్ ఇన్నోవేషన్ హబ్‌గా రాష్ట్రాన్ని నిలపడం, జాతీయ క్వాంటమ్ మిషన్‌లో భాగస్వామ్యం కావడం, నాలెడ్జ్ ఎకానమీని బలోపేతం చేయడం క్వాంటమ్ కంప్యూటింగ్ ముఖ్యోద్దేశమని అధికారులు వివరించారు. క్వాంటమ్ కంప్యూటింగ్, క్వాంటమ్ కమ్యూనికేషన్, క్వాంటమ్ సెన్సింగ్, మెట్రాలజీ, క్వాంటమ్ మెటీరియల్స్, డివైజ్‌లపై ప్రధానంగా దృష్టి పెడతున్నామని సీఎంకు అధికారులు వివరించారు. ఏపీ క్వాంటమ్ మిషన్ రెండు దశల్లో పనిచేస్తుందన్నారు. 2025-26 తొలి దశగానూ.. 2027-30 మలిదశగానూ చేపడతామన్నారు. క్వాంటమ్ కంప్యూటింగ్‌కు ఐబీఎం సారథ్యం వహిస్తుందని తెలిపారు.

మూడు కంపెనీలతో మత్స్య వర్సిటీ ఒప్పందాలు

అమరావతి, జూన్ 9(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో మత్స్య, ఆక్వా సాగును అభివృద్ధి చేసే లక్ష్యంతో ఏపీ ఫిషరీస్ యూనివర్సిటీ మూడు కంపెనీలతో అవగాహన ఒప్పందాలు చేసుకుంది. హరియాణా రాష్ట్రం పంచకులలోని ఎసెన్స్ నేచురా ప్రైవేట్ లిమిటెడ్, ముంబైలోని ఆగ్రోసెల్ ప్రైవేట్ లిమిటెడ్, నెల్లూరులోని హైటెక్ ఫార్మా కంపెనీలతో ఒప్పందాలు జరిగాయి. సోమవారం అమరావతి సచివాలయంలో మత్స్యశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రాజశేఖర్, కంపెనీల ప్రతినిధులు శ్యామ్‌కుమార్(ఎసెన్స్ నేచురా), ధర్మపాల్(ఆగ్రోసెల్), కే సతీష్(హైటెక్ ఫార్మా)లు ఒప్పంద పత్రాలను మార్చుకున్నారు. ఈ కంపెనీలు ఫిషరీస్ వర్సిటీ విద్యార్థులకు హెర్బల్ ఉత్పత్తులతోపాటు నానో టెక్నాలజీపై విజ్ఞానాన్ని అందించనున్నట్లు మత్స్య వర్సిటీ ఓఎస్డీ టి.అరుణ తెలిపారు.

అటవీ పెంపకం సలహాదారుగా అంకారావు

అమరావతి, జూన్ 9(ఆంధ్రజ్యోతి): నల్లమల అటవీ ప్రాంత పరిరక్షకుడు, ఉమ్మడి కర్నూలు జిల్లాకు చెందిన కొమెర అంకారావును ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ (అటవీ పెంపకం) సలహాదారుగా నియమితులయ్యారు. అంకారావును అటవీశాఖ సలహాదారుగా నియమించనున్నట్లు ఈ నెల 5న రాజధాని గ్రామం అనంతవరంలో జరిగిన ప్రపంచ పర్యావరణ దినోత్సవ సభలో సీఎం చంద్రబాబు ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ మేరకు సోమవారం అధికారికంగా ఉత్తర్వులు జారీ అయ్యాయి. రెండేళ్ల పాటు లేదా లేదా, ఈ పదవి అవసరం ఉన్నంత వరకు ఆయన సలహాదారుగా కొనసాగుతారని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

కొల్లేరు పరీవాహకం మ్యాపింగ్: కృష్ణయ్య

అమరావతి, జూన్ 9(ఆంధ్రజ్యోతి): కొల్లేరు సరస్సును కాలుష్య కోరల నుంచి కాపాడుకోవాలని రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి ఛైర్మన్ పి.కృష్ణయ్య అన్నారు. సోమవారం విజయవాడలో పీసీబీ సభ్య కార్యదర్శి శరవణన్, ఏలూరు, కృష్ణా, గుడివాడ డివిజన్ల అటవీ, పంచాయతీరాజ్, మున్సిపల్ అధికారులతో కొల్లేరు కాలుష్యంపై సమీక్ష నిర్వహించారు. కొల్లేరు పరీవాహక ప్రాంతాన్ని మ్యాపింగ్ చేయడంతో పాటు, సరస్సు ప్రాంతాన్ని అధ్యయనం చేయాలని అధికారులను ఆదేశించారు. కొల్లేరులో సమీప గ్రామాల ప్రజలు వ్యర్థాలు వేయకుండా, పరిశ్రమల నుంచి మురుగునీరు వదలకుండా అధికారులు చర్యలు తీసుకోలన్నారు.

విమానయానరంగ బలోపేతానికి కృషి చేశా

- మంత్రి రామ్మోహన్

న్యూఢిల్లీ, జూన్ 9(ఆంధ్రజ్యోతి): ప్రధాని మోదీ దార్శనిక నాయకత్వంలో గతేడాదిగా దేశ విమానయాన రంగాన్ని అభివృద్ధి చేసినట్లు కేంద్ర పౌరవిమానయాన మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు చెప్పారు. ప్రాంతీయ కనెక్టివిటీ పెంచడం, మౌలిక వసతులు మెరుగుపరచడం, ప్రతి పౌరునికీ విమానయానం సులభంగా అందుబాటులోకి తెచ్చేందుకు తాము కృషి చేశామని 'ఎక్స్' వేదికగా తెలిపారు. ఇటు రాష్ట్రంలో, సీఎం చంద్రబాబు సహకారంతో, శ్రీకాకుళం అభివృద్ధి కోసం గతేడాదిలో పలు ప్రాజెక్టులను ప్రారంభించినట్లు పేర్కొన్నారు.

వందేభారత్‌పై రాళ్లు.. ఇంజనీరింగ్ విద్యార్థుల అరెస్టు

ఒంగోలు క్రైం, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): వందేభారత్ ఎక్స్‌ప్రెస్‌పై రాళ్లు రువ్విన ముగ్గురు ఇంజనీరింగ్ విద్యార్థులను రైల్వే పోలీసులు అరెస్టు చేశారు. ఒంగోలులో సోమవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో రైల్వే డీఎస్పీ జీ.మురళీధర్ వివరాలు వెల్లడించారు. ఈ నెల 5వ తేదీ సాయంత్రం 6 గంటలకు ఒంగోలు-సూరారెడ్డిపాలెం స్టేషన్ల మధ్యలో వందేభారత్ రైలుపై కొందరు గుర్తుతెలియని వ్యక్తులు రాళ్లు విసిరారు. దీంతో సీ-5, 8, 11 బోగీల అద్దాలు పగిలాయి. ఈ ఘటనపై కేసు నమోదు చేసిన రైల్వే పోలీసులు... రైలులో ఉన్న సీసీ ఫుటేజీ ఆధారంగా... ఒంగోలులోని ఓ ప్రైవేటు ఇంజనీరింగ్ కళాశాలలో చదువుతున్న గంగవరపు రిషీంద్రబాబు, ఎస్‌కే ఖాదర్ బాషా, ఎస్‌కే ఆదిష్ కరిమూల్లా ఈ పనిచేసినట్టు గుర్తించారు. ఈ నెల 5న ఈ ముగ్గురూ రైల్వేట్రాక్ సమీపంలో బీరు తాగారు. ముందుగా కోర్బా-త్రివేండ్రం ఎక్స్‌ప్రెస్‌పై రాళ్లు విసిరారు. అయితే అవి రైలు వరకు వెళ్లలేదు. ఆ తర్వాత వచ్చిన వందేభారత్‌పైనా రాళ్లు విసరడంతో మూడు బోగీల కిటికీ అద్దాలు పగిలాయి. విచారణ అనంతరం ఈ ముగ్గురిని అరెస్టు చేసినట్లు డీఎస్పీ తెలిపారు.

వై మీడియాకు అక్రమంగా రూ.96 కోట్లు : లంకా

అమరావతి, జూన్ 9(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పథకాల సర్వే పేరుతో గత వైసీపీ ప్రభుత్వం సెర్ప్ ద్వారా వై మీడియా అనే సంస్థకు రూ.96 కోట్లు అక్రమంగా చెల్లించిందని రాష్ట్ర ఇరవై సూత్రాల కార్యక్రమం అమలు కమిటీ ఛైర్మన్ లంకా దినకర్ ఆరోపించారు. ఈ అక్రమాలపై విచారణ చేస్తున్నామని, పూర్తి వివరాలు తర్వాత వెల్లడిస్తామని చెప్పారు. సోమవారం అమరావతి సచివాలయంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. డబుల్ ఇంజన్ సర్కార్ ఏర్పడి ఏడాది కాలం పూర్తయిన సందర్భంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రాయోజిత పథకాల అమలు తీరుపైన 26 జిల్లాల అధికారులతో సమీక్షలు పూర్తి చేశామన్నారు. గత ఐదేళ్లలో కేంద్రం 2.61 లక్షల టిడ్కో ఇళ్లు ఇవ్వగా 1.40 లక్షలే లబ్ధిదారులకు ఇచ్చారని, అందులో నివసిస్తున్నది 87 వేల మందేనని పేర్కొన్నారు. జల్ జీవన్ మిషన్‌లో అవినీతి అక్రమాలకు పాల్పడి, నాణ్యత లేకుండా పనులు చేసి దోచుకున్నారన్నారు. రానున్న రోజుల్లో గ్రామీణ ప్రాంతాల్లో 97 లక్షల గృహాలకు తాగునీరు అందిస్తామన్నారు.

ఆస్ట్రేలియాలో ఘనంగా ఎన్టీఆర్ సినీ వజ్రోత్సవం

అమరావతి, జూన్ 9(ఆంధ్రజ్యోతి): ఆస్ట్రేలియాలోని ఆడిలాయిడ్‌లో ఎన్నారై తెలుగుదేశం, స్థానిక తెలుగు సాంస్కృతిక సంఘాల ఆధ్వర్యంలో ఎన్టీఆర్ సినీ వజ్రోత్సవం, సీబీఎన్ 75 సంవత్సరాల గోల్డెన్ జూబ్లీ ఇయర్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఎన్టీఆర్ లిటరేచర్ కమిటీ ఛైర్మన్ టీడీ జనార్దన్, నందమూరి రామకృష్ణ, అట్లూరి అశ్విన్, ఎమ్మెల్యే బోడె ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

రిటైర్డ్ ఐఏఎస్ దమయంతి దాతృత్వం

- ఎల్వీ ప్రసాద్ ట్రస్టుకు 10.88 ఎకరాలు దానం
- స్టాంపు డ్యూటీ, రిజిస్ట్రేషన్ ఫీజు మినహాయించిన ప్రభుత్వం

అమరావతి, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): లాభాపేక్ష లేకుండా సమాజసేవ చేసే ఎల్వీ ప్రసాద్ చారిటబుల్ ట్రస్టుకు రిటైర్డ్ ఐఏఎస్ కాసరనేని దమయంతి 10.88 ఎకరాల భూమిని దానం చేశారు. ఏలూరు జిల్లాలోని పెదవేగి మండలం వంగూరు గ్రామంలో రెండు వేర్వేరు సర్వే నెంబర్లలో ఉన్న ఈ 10.88 ఎకరాల భూమిని.. గిఫ్ట్ డీడ్ రూపంలో రిజిస్ట్రేషన్ చేస్తారు. అయితే ఈ రిజిస్ట్రేషన్‌పై.. స్టాంపు డ్యూటీ, ట్రాన్స్‌ఫర్ డ్యూటీ, రిజిస్ట్రేషన్ ఫీజును మినహాయించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు సోమవారం జీవో జారీ చేసింది. ఈ లావాదేవీపై స్టాంపు డ్యూటీ, రిజిస్ట్రేషన్ ఫీజు, ట్రాన్స్‌ఫర్ డ్యూటీ కలిపి మొత్తం రూ.10.54 లక్షలు మినహాయించినట్టు తెలిపింది. రిటైర్డ్ ఐఏఎస్ దమయంతి దానం చేసిన 10.88 ఎకరాల భూమి విలువ రూ.2.61 కోట్లు అని జీవోలో పేర్కొంది.

వేగంగా రోడ్ల నిర్మాణం

- ఇక ఏ ప్రాజెక్టూ ఆలస్యం కాకూడదు
- జూలైలోగా అవసరమైన క్లియరెన్సులు
- ఈ ఏడాది రూ.20,067 కోట్ల విలువైన 1,040 కి.మీ. జాతీయ రహదారుల నిర్మాణం
- రోడ్ల నిర్మాణ పురోగతిపై చంద్రబాబు సమీక్ష
- ఆలస్యమైన ప్రాజెక్టుల కాంట్రాక్టు సంస్థలపై ముఖ్యమంత్రి అసంతృప్తి



రహదారుల నిర్మాణంపై సమీక్షా సమావేశంలో సీఎం చంద్రబాబు, మంత్రి జనార్దన్ రెడ్డి తదితరులు

అమరావతి, జూన్ 9(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఇకపై ఏ రహదారి నిర్మాణమూ ఆలస్యం కాకూడదని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. రహదారుల నిర్మాణ పనులకు సంబంధించి నిర్ణీత కాల వ్యవధికి మించి ఆలస్యమైన ప్రాజెక్టుల కాంట్రాక్ట్ సంస్థలపై అసంతృప్తి వ్యక్తం చేశారు. సోమవారం అమరావతి సచివాలయంలో రహదారుల అభివృద్ధిపై అధికారులు, కాంట్రాక్టర్లతో సీఎం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ రహదారుల ప్రాజెక్టుల పురోగతిని సమీక్షించారు. ప్రస్తుతం నిర్మాణంలో ఉన్న, త్వరలో నిర్మించతలపెట్టిన అన్ని రాష్ట్ర, జాతీయ రహదారుల ప్రాజెక్టులకు భూసేకరణ, అటవీ, వన్యప్రాణి విభాగం క్లియరెన్స్ సమస్యలను జూలై నెలాఖరులోగా పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఎలాంటి ఆటంకాలు తలెత్తకుండా రాష్ట్రంలో రహదారుల నిర్మాణం వేగవంతంగా జరిగేలా చూడాలన్నారు. మరోవైపు ఎన్‌హెచ్‌ఏఐ, ఎంఓఆర్టీహెచ్ కింద రూ.11,325 కోట్లతో 770 కిలోమీటర్ల రహదారుల నిర్మాణాన్ని గత ఆర్థిక సంవత్సరంలో పూర్తి చేసినట్లు అధికారులు సీఎంకు వివరించారు. కాగా రాష్ట్రంలో మొత్తం 8,744 కి.మీ. రహదారులు ఉన్నాయి. వీటిలో 4,406 కి.మీ. మేర ఎన్‌హెచ్‌ఏఐ రహదారులు, పీఐయూ, ఎంఓఆర్టీహెచ్ పరిధిలో 641 కి.మీ. రహదారులు, ఎన్‌హెచ్(ఆర్అండ్‌బీ) కింద 3,697 కి.మీ. రహదారులు ఉన్నాయి. ప్రస్తుతం రాష్ట్రంలో ఎన్‌హెచ్‌ఏఐ, ఎంఓఆర్టీహెచ్ కింద రూ.76,856 కోట్లతో 144 ప్రాజెక్టులకు చెందిన 3,483 కి.మీ. మేర రహదారులు నిర్మాణంలో ఉన్నాయి. మరికొన్నింటిని త్వరలో చేపట్టనుండగా, వీటిలో ఎన్‌హెచ్‌ఏఐ కింద 1,392 కి.మీ. రహదారులు, ఎంఓఆర్టీహెచ్ కింద 2,091 కి.మీ. రహదారులున్నాయని అధికారులు వివరించారు. ఇందులో ఈ ఏడాది రూ.20,067 కోట్ల విలువైన 1,040 కి.మీ. జాతీయ రహదారి పనులు పూర్తి కావాలని సీఎం నిర్దేశించారు. గుంతలు లేని రహదారుల కోసం మిషన్ పాత్ హోల్ ఫ్రీ రోడ్స్ కింద గతేడాది నవంబరులో రూ.860.81 కోట్లతో సీఎం ప్రారంభించిన పనుల్లో 97% ఈ నెల 6 నాటికి పూర్తయ్యాయి. 19,475 కి.మీ. మేర రహదారుల్లో గుంతలన్నీ పూడ్చి, మరమ్మతులు చేశారు. మిగిలిన రహదారుల మరమ్మతులు జూలై 31 నాటికి పూర్తి కానున్నాయని అధికారులు తెలిపారు. సమీక్షలో ఆర్అండ్‌బీ శాఖ మంత్రి బీసీ జనార్దనరెడ్డి, అధికారులు పాల్గొన్నారు.



ఏలూరులో రేషన్ దుకాణాన్ని పరిశీలిస్తున్న మంత్రి నాదెండ్ల

సన్న బియ్యంతో మధ్యాహ్న భోజనం

- ఈ నెల 12 నుంచి అమలు: నాదెండ్ల

ఏలూరు, జూన్ 9(ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా ఈ నెల 12 నుంచి డొక్కా సీతమ్మ మధ్యాహ్నం భోజన పథకంలో భాగంగా ప్రభుత్వ పాఠశాలలు, కాలేజీల్లో చదివే విద్యార్థులకు సన్నబియ్యంతో ఆహారాన్ని అందించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టిందని పౌరసరఫరాల మంత్రి నాదెండ్ల మనోహర్ పేర్కొన్నారు. 41 వేల ప్రభుత్వ పాఠశాలలు, 4వేల సంక్షేమ హాస్టళ్లలో సన్న బియ్యంతో భోజనం పెట్టనున్నట్టు తెలిపారు. సోమవారం ఆయన ఏలూరులోని 74వ రేషన్ డిపోను, సుబ్బమ్మదేవి హైస్కూల్‌ను జేసీ ధాత్రిరెడ్డితో కలిసి తనిఖీ చేశారు. పాఠశాలకు సరఫరా చేసిన 25 కేజీల బియ్యం బస్తా, రాగి పిండి, బెల్లం పొడి ప్యాకెట్లను పరిశీలించారు. కొత్త రేషన్ విధానం అమలు, బియ్యం నాణ్యతపై స్థానిక మహిళ డి.వెంకటలక్ష్మి నుంచి అభిప్రాయం అడిగి తెలుసుకున్నారు. 65 ఏళ్ల పైబడిన వృద్ధులు, దివ్యాంగులకు రాష్ట్రవ్యాప్తంగా 15 లక్షల 75 వేలు కుటుంబాలకు రేషన్ అందించాల్సి ఉండగా, ఇప్పటి వరకు 12 లక్షల 46 వేల కుటుంబాలకు సరఫరా చేశామని మంత్రి వివరించారు. ఈ కార్యక్రమంలో విజయవాడ జోన్ ఆర్టీసీ రీజనల్ ఛైర్మన్ రెడ్డి అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

ప్రతిభకు ప్రోత్సాహం

- ప్రైవేటు కన్నా మిన్నగా ప్రభుత్వ విద్యా సంస్థలు
- వచ్చే నాలుగేళ్లలో అద్భుత ఫలితాలు సాధిస్తాం
- 100 రోజుల యాక్షన్ ప్లాన్ అమలు చేస్తున్నాం
- షైనింగ్ స్టార్స్ అవార్డుల ప్రదానోత్సవంలో మంత్రి లోకేశ్

పార్వతీపురం/విజయనగరం, జూన్9(ఆంధ్రజ్యోతి): "ప్రైవేటు రంగానికి మించి ప్రభుత్వ విద్యా వ్యవస్థను అద్భుతంగా తీర్చిదిద్దాలన్న లక్ష్యంతో అనేక సంస్కరణలు అమలు చేస్తున్నాం. సంస్కరణల ద్వారా రాబోయే నాలుగేళ్లలో ఉత్తమ ఫలితాలు సాధిస్తాం" అని రాష్ట్ర విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్ అన్నారు. పార్వతీపురంలో సోమవారం నిర్వహించిన షైనింగ్ స్టార్స్ అవార్డు-2025 కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా పార్వతీపురం మన్యం జిల్లాలో పదో తరగతి పరీక్షల్లో ప్రతిభ కనబరిచిన 95 మందికి, ఇంటర్ ఫలితాల్లో మెరిసిన 26 మందికి అవార్డులు అందించారు. టెన్త్ ఫలితాల్లో మన్యం జిల్లా వరసగా మూడేళ్లు ప్రథమ స్థానంలో నిలిచినందుకు ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులకు అభినందనలు తెలిపారు. ఆయన ఇంకా ఏమన్నారంటే.. "మెరుగైన ఫలితాలు సాధనకు వంద రోజుల యాక్షన్‌ప్లాన్ అమలు చేస్తున్నాం. ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో విద్యార్థులకు ఉచితంగా పుస్తకాలు, మధ్యాహ్న భోజనం అందిస్తున్నాం. ఇది సంస్కరణల్లో తొలి అడుగు మాత్రమే. మీ ప్రతిభను గుర్తించే బాధ్యత నాది. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు ఉన్నత చదువులు చదివి తిరిగి మీ పాఠశాలలకు సేవ చేయాలి. మీ జూనియర్లలో స్ఫూర్తినింపాలి. పేదరికం నుంచి బయటపడటానికి చదువే ఏకైక మార్గం. కష్టాలను అధిగమించి లక్ష్యాన్ని చేరుకున్న వారే విజేతలుగా నిలుస్తారు. కళాశాలలకు వెళ్లాక పక్కదారి పడితే జీవితాలు నాశనమవుతాయి. డ్రగ్స్‌పై మన ప్రభుత్వం యుద్ధం చేస్తోంది. తప్పు చేస్తే మీతో పాటు మీ తల్లిదండ్రులు ఇబ్బందులు పడతారు. మంచి మెంటార్స్ ద్వారా విద్యార్థులు స్ఫూర్తి పొంది నిరంతరం నేర్చుకోవాలి. విద్యార్థులు జీవితంలో కష్టమైన మార్గాన్ని ఎంచుకుంటే మంచి ఫలితాలొస్తాయి. అందుకు నేనే ఉదాహరణ. ఎన్నికల్లో ఎప్పుడూ టీడీపీ గెలవని మంగళగిరిని ఎంచుకున్నా. 2019లో ఓడిపోయా. అయినా పట్టుదలతో లక్ష్యాన్ని సాధించాను. మీరు డ్రీమ్ వాల్, గ్రాటిట్యూడ్ వాల్‌పై రాసినవి చూశాను. లిటరసీ రేటులో ఏపీ దేశంలో అత్యంత దిగువన ఉంది. రాబోయే నాలుగేళ్లలో నూరుశాతం అక్షరాస్యత లక్ష్యంగా మిషన్ అక్షర ఆంధ్రాను ప్రకటించామని లోకేశ్ చెప్పారు. విద్యార్థులతో కలిసి వందేమాతరం అంటూ నినదించారు. అనంతరం విద్యార్థులతో ముఖాముఖి నిర్వహించి వారడిగిన ప్రశ్నలకు సమాధానమిచ్చారు. నిత్యం రాష్ట్రం కోసం పరితపించే సీఎం చంద్రబాబు, మాజీ ప్రధాని వాజ్‌పాయ్ నుంచి స్ఫూర్తిపొందానన్నారు.



'షైనింగ్ స్టార్స్' అవార్డుల ప్రదానం కార్యక్రమంలో మాట్లాడుతున్న మంత్రి లోకేశ్, హాజరైన విద్యార్థులు

విద్యా రంగానికి పెద్ద పీట: అనిత

రాష్ట్ర ప్రభుత్వం విద్యా రంగానికి పెద్ద పీట వేస్తోందని హోంమంత్రి వంగలపూడి అనిత అన్నారు. విజయనగరంలో జరిగిన కార్యక్రమంలో ఆమె షైనింగ్ స్టార్స్ అవార్డులను విద్యార్థులకు బహూకరించారు. ఒక్కో విద్యార్థికి రూ.20 వేల నగదు, మెడల్, ప్రశంసా పత్రం అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రాష్ట్రంలోని అన్ని పాఠశాలల్లో మౌలిక సదుపాయాలను దశలవారీగా ఏర్పాటు చేయడంతో పాటు ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంచేందుకు కృషి జరుగుతోందన్నారు. విద్యార్థినులకు తమ ప్రభుత్వం పూర్తి రక్షణ కల్పిస్తుందని చెప్పారు. క్రీడలు, ఇతర సాంస్కృతిక కార్యక్రమాలపైనా దృష్టి పెట్టాలన్నారు.

శాసన సభ్యత్వం పోకుండా..

ఓఎంసీ కేసులో శిక్షను సస్పెండ్ చేయండి

- హైకోర్టులో గాలి జనార్దన్‌రెడ్డి పిటిషన్
- సస్పెన్షన్ పిటిషన్‌పై నేడు విచారణ
- శ్రీలక్ష్మి కేసుపైనా విచారణ జరుపుతాం: హైకోర్టు

హైదరాబాద్, జూన్ 9(ఆంధ్రజ్యోతి): "శాసన సభ్యత్వం పోకుండా.. ఓబుళాపురం మైనింగ్ కంపెనీ(ఓఎంసీ) కేసులో సీబీఐ కోర్టు విధించిన ఏడేళ్ల శిక్షను సస్పెండ్ చేయండి. దీనిపై మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వకుంటే.. ఎన్నికల నోటిఫికేషన్ వెలువడే ప్రమాదం ఉంది" అంటూ గాలి జనార్దన్‌రెడ్డి హైకోర్టును ఆశ్రయించారు. దాంతో పాటు.. బెయిల్ కోసం గాలి, బీవీ శ్రీనివాసరెడ్డి, వీడీ రాజగోపాల్, అలీఖాన్ మరో పిటిషన్‌ను దాఖలు చేశారు. తొలుత నిందితుల బెయిల్ పిటిషన్లపై జస్టిస్ కె.లక్ష్మణ్ ధర్మాసనం విచారణ చేపట్టింది. పిటిషనర్ల తరఫున సీనియర్ న్యాయవాదులు నాగముత్తు, నళిన్‌కుమార్, జె.రామచంద్రారావు, పి.నాగేశ్వర్‌రావు తదితరులు వాదనలను వినిపించారు. సీబీఐ కోర్టు విధించిన శిక్ష ఏడేళ్లు మాత్రమేనని.. ఇలాంటి కేసుల్లో అసలు మెరిట్‌లోకి వెళ్లకుండానే బెయిల్ ఇవ్వొచ్చని పేర్కొన్నారు. సీబీఐ తరఫున కాపాటి శ్రీనివాస్ వాదిస్తూ.. బెయిల్ పిటిషన్ల విషయంలో హైకోర్టు నిర్ణయానికి సీబీఐ కట్టుబడి ఉంటుందన్నారు. అయితే.. జైలుశిక్షను సస్పెండ్ చేయాలని గాలి జనార్దన్‌రెడ్డి సహా.. ఇతరుల వ్యాజ్యాలను తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్లు పేర్కొన్నారు. జైలుశిక్ష సస్పెన్షన్ పిటిషన్‌లలో వాదనలను వినిపిస్తామని.. అందుకు కొంత గడువు ఇవ్వాలని కోరారు. గాలి తరఫు న్యాయవాది నాగముత్తు వాదనలను వినిపిస్తూ.. తన క్లైంట్ తప్ప మిగితా నిందితులెవరూ చట్టసభల సభ్యులు కాదన్నారు. సీబీఐ కోర్టు తీర్పు నేపథ్యంలో కర్ణాటక అసెంబ్లీలో ఎమ్మెల్యేగా ఉన్న గాలి సభ్యత్వం ఈ ఏడాది మే 8న పోయిందని.. ప్రస్తుతం తమ పిటిషన్ విని, ఏదో ఒక నిర్ణయం వెల్లడించకపోతే కోలుకోలేని నష్టం జరుగుతుందన్నారు. వచ్చేవారం రోజుల్లో గాలి నియోజకవర్గానికి సంబంధించిన ఎన్నికల నోటిఫికేషన్ విడుదలయ్యే అవకాశం ఉందని వివరించారు. ఈలోపు ఏదో ఒక నిర్ణయం తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ పిటిషన్‌లో తాము విజయం సాధిస్తే.. ఎమ్మెల్యేగా సభ్యత్వం దానంతట అదే పునరుద్ధరణ అవుతుందన్నారు. ఈ పరిస్థితుల్లో తక్షణమే గాలి జనార్దన్‌రెడ్డి దాఖలు చేసిన జైలుశిక్ష సస్పెన్షన్ అప్లికేషన్‌పై విచారణ చేపట్టాలని కోరారు. వాదోపవాదాలను నమోదు చేసుకున్న ధర్మాసనం.. బెయిల్ అప్లికేషన్లపై తీర్పును రిజర్వ్ చేస్తున్నట్లు ప్రకటించింది. గాలి జైలుశిక్ష సస్పెన్షన్ అప్లికేషన్‌పై మంగళవారం విచారణ చేపడతామని పేర్కొంది. మరోవైపు శ్రీలక్ష్మిని డిశ్చార్జి చేస్తూ హైకోర్టు ఇచ్చిన తీర్పుపై సీబీఐ అధికారులు సుప్రీంకోర్టుకు వెళ్లారని, సుప్రీంకోర్టు హైకోర్టు తీర్పును కొట్టేసి.. మళ్లీ విచారించాలని తిప్పిపంపిన విషయాన్ని న్యాయవాదులు గుర్తుచేశారు. దీనిపై స్పందించిన జస్టిస్ లక్ష్మణ్ ధర్మాసనం.. తొలుత శ్రీలక్ష్మి దాఖలు చేసిన క్వాష్ పిటిషన్ తన వద్దకు వచ్చిందని.. దాన్ని కొట్టేశామని వ్యాఖ్యానించింది. డిశ్చార్జి పిటిషన్‌పై అప్పీల్ మరో హైకోర్టు ధర్మాసనం వద్దకు రాగా.. సదరు అప్పీల్‌ను మరో బెంచ్ అనుమతించిందని పేర్కొన్నారు. సుప్రీంకోర్టు శ్రీలక్ష్మి కేసును మళ్లీ హైకోర్టుకే తిప్పి పంపినందున ఆ పిటిషన్ నంబర్ సమర్పించాలని.. దానిపైనా విచారణ చేపడతామని స్పష్టం చేసింది.

కార్మిక చట్టాలకు సవరణలు!

- పనివేళలు 10 గంటల పెంపునకు ఇప్పటికే రాష్ట్ర క్యాబినెట్ ఆమోదం
- పారిశ్రామిక వివాద, కాంపౌండింగ్ చట్టాల్లోనూ సవరణలపై ప్రతిపాదనలు
- పని ప్రదేశాల్లో మహిళల రక్షణకు రూల్స్
- కొన్నింటికి కేంద్ర ప్రభుత్వ సమ్మతితో..

అమరావతి, జూన్ 9(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వ లేబర్ కోడ్ 2020కు అనుగుణంగా పలు కార్మిక చట్టాలకు సవరణలు తీసుకురావాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఇప్పటికే ఏపీ షాప్స్ అండ్ ఎస్టాబ్లిష్‌మెంట్ యాక్ట్, ఏపీ ఫ్యాక్టరీస్ రూల్స్ 1950కు సంబంధించి పని గంటల సవరణకు క్యాబినెట్ ఆమోదం తెలపగా.. రాత్రిపూట పనుల్లో మహిళలు పనిచేయడం, కార్మికుల సమస్యల పరిష్కారం తదితర అంశాల్లో సవరణలకు ప్రతిపాదనలు సిద్ధం చేసింది. షాప్స్ అండ్ ఎస్టాబ్లిష్‌మెంట్ చట్టం ప్రకారం గతంలో రోజుకు 8 గంటలు, వారానికి 48 గంటలు మాత్రమే కార్మికుడు పనిచేయాలి. నెలలో 50 గంటలు ఓవర్‌టైం చేసుకునే అవకాశం ఉంటుంది. ఐదు గంటల తర్వాత కనీసం ఒక గంట విశ్రాంతి తీసుకోవచ్చు. అయితే తాజా సవరణల ప్రకారం.. రోజుకు 8 నుంచి 10 గంటల వరకు పని చేయవచ్చు. వారానికి సరాసరిన 48 గంటలు పని చేయాలన్న దానిపై ఎలాంటి మార్పు చేయలేదు. అదేవిధంగా ప్రతి మూడు నెలలకు 144 గంటలు ఓవర్‌టైం పనిచేయవచ్చు. గతంలో 8 గంటలు దాటి పనిచేస్తే ఓవర్‌టైంగా పరిగణించేవారు. తాజా సవరణల్లో 10 గంటలు దాటిన తర్వాత ఓవర్‌టైంగా పరిగణిస్తారు. ఫ్యాక్టరీస్ చట్టం ప్రకారం ఇప్పటి వరకు రోజుకు 9 గంటలు పనిచేసేవారు. తాజా సవరణ ప్రకారం 10 గంటలు చేస్తారు. గతంలో త్రైమాసికంలో 75 గంటలు ఓవర్‌టైం చేసుకునే అవకాశం ఉండగా, ఇప్పుడు 144 గంటలు చేసుకోవచ్చు. గతంలో ఐదు గంటల తర్వాత కనీసం అరగంట విశ్రాంతి ఉండగా... తాజా సవరణల్లో 6 గంటల తర్వాత కనీసం అర్ధ గంట విశ్రాంతి తీసుకోవచ్చు.

రాత్రిపూట పనుల్లో మహిళలకు రక్షణ

ఏపీ షాప్స్ అండ్ ఎస్టాబ్లిష్‌మెంట్ చట్టంలో మహిళా కార్మికులు రాత్రి పూట పనిచేయరాదన్న నిబంధన 2022 వరకు ఉండేది. మహిళలపై వివక్ష చూపరాదన్న న్యాయస్థానాల ఆదేశాలతో ఆ తర్వాత కార్మిక చట్టాల్లో మార్పులు తెచ్చారు. పలు వసతులు కల్పించి, రాత్రి పూట కూడా మహిళలు పని చేసుకోవచ్చని పేర్కొన్నారు. పనిచేసే చోట కనీసం ఐదుగురు మహిళలు ఉండాలని, క్రెచ్ (పిల్లల సంరక్షణ కేంద్రాలు) సెంటర్లు, విశ్రాంతి గదులు, టాయ్‌లెట్లు తదితర ఐదు రకాల సర్వీసులుండాలని నిబంధన పెట్టారు. అయితే షాప్‌లు చిన్నవి కావడం వల్ల.. అలాంటి చోట్ల విశ్రాంతి గదులు, క్రెచ్ సెంటర్లు ఏర్పాటు కష్టమవుతుందని కేంద్రం నిబంధనలను కొంత మేర సవరించింది. విశ్రాంతి గది, టాయ్‌లెట్ తదితర కనీస సౌకర్యాలు కల్పించాలని తాజా ప్రతిపాదిత సవరణల్లో పేర్కొన్నారు. మెటర్నిటీ బెనిఫిట్ చట్టం-1961 ప్రకారం మహిళలకు ప్రసవానికి ముందు 8 వారాలు, తర్వాత 8 వారాలు పనిచేయరాదన్న నిబంధన అమలు చేయాలన్నారు. పనిప్రదేశాల్లో లైంగిక వేధింపులు లేకుండా, ప్రతి మహిళ ఇంటి వద్దకు రవాణా సౌకర్యం కల్పించాలని పేర్కొన్నారు. అదేవిధంగా రాత్రి పని విషయంలో ఫ్యాక్టరీస్ చట్టంలోనూ సవరణలు తెచ్చారు. మహిళల సమ్మతితోనే రాత్రి పూట వారితో పనిచేయించాలని, సీసీ కెమెరాలు, రవాణా వంటి సౌకర్యాలతో రక్షణ తదితర ఆరు నిబంధనలను చేరుస్తూ ఫ్యాక్టరీస్ చట్టంలోని 66 1(బీ)కు సవరణలతో ప్రతిపాదనలు సిద్ధం చేశారు. వచ్చే క్యాబినెట్ సమావేశంలో ముందుకు వీటిని తీసుకురానున్నారు. చట్ట సభల్లో ఆమోదం పొందిన తర్వాత రాష్ట్రపతి ఆమోదానికి పంపుతారు. రాష్ట్రపతి సమ్మతి తర్వాత చట్టరూపం దాలుస్తుంది.

పారిశ్రామిక వివాద చట్టంలోనూ మార్పులు

పారిశ్రామిక వివాద చట్టంలోనూ కొన్ని మార్పులు చేస్తూ రాష్ట్ర కార్మిక శాఖ సవరణలు తెచ్చింది. ఇది కేంద్ర చట్టం కావున.. ఈ చట్టం సవరణకు కేంద్రానికి ప్రతిపాదనలు పంపాలని నిర్ణయించింది. కార్మికులు తమ సమస్యల పరిష్కారం కోసం మూడేళ్ల లోపు దరఖాస్తు చేసుకోవాల్సిన నిబంధన ఉండేది. ఈలోపు దరఖాస్తు చేసుకోకపోతే ఆ విజ్ఞప్తికి కాలం చెల్లినట్లే. మూడేళ్ల గడువు వల్ల వివాదాలు ఎక్కువ అవుతున్నాయని, దాని నిడివి ఒక ఏడాదికి తగ్గించాలని 2019లో నిర్ణయించారు. అయితే కేంద్ర ప్రభుత్వం లేబర్ కోడ్ 2020 నిబంధనలకు అది విరుద్ధంగా ఉండడంతో మూడేళ్ల గడువును రెండేళ్లకు తగ్గిస్తూ తాజా ప్రతిపాదనలు సిద్ధం చేశారు. వచ్చే క్యాబినెట్ భేటీలో దానిని ఆమోదం కోసం పెట్టనున్నారు. అదే విధంగా పారిశ్రామిక వివాద చట్టం ప్రకారం అత్యవసర సేవలో పనిచేసే కార్మికులు బంద్ చేయాలంటే 14 రోజుల ముందు నోటీసులివ్వాలన్న నిబంధన ఇప్పటికే ఉంది. నాన్ యుటిలిటీ సేవా రంగంలో ఉన్న కార్మికులు కూడా బంద్ నిర్వహించాలంటే 14 రోజుల ముందు నోటీసులివ్వాలని తాజాగా సవరణ చేయనున్నారు. కేంద్ర ప్రభుత్వం సమ్మతిస్తే ఈ రెండు ప్రతిపాదనలతో చట్ట సవరణ చేయనున్నారు.

కాంపౌండింగ్ చట్టంలో సవరణలు

జరిమానాకు సంబంధించి కాంపౌండింగ్ చట్టంలో కూడా సవరణలు తీసుకురానున్నారు. చిన్న పొరపాట్లకు అధికారులు ట్రాఫిక్ చలానాలాగా అప్పటికప్పుడు జరిమానాలను అక్కడికక్కడే వసూలు చేసుకునే వెసులుబాటు కల్పించనున్నారు. దీంతో చిన్న తప్పిదాలకు కోర్టుదాకా వెళ్లే ఇబ్బందులు ఉండవు. ఏపీ షాప్స్ అండ్ ఎస్టాబ్లిష్‌మెంట్ చట్ట సవరణలకు ఇప్పటికే క్యాబినెట్ ఆమోదం లభించగా.. మిగిలినవి ప్రతిపాదనల దశలో ఉన్నాయి. అన్నీ కేంద్ర చట్టాలు కావడంతో రాష్ట్రపతి ఆమోదం తర్వాత అవి చట్టరూపం దాల్చనున్నాయి.

పనిగంటల పెంపును ఉపసంహరించుకోవాలి

పని గంటలు పెంచుతూ తీసుకున్న నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు సీఎం చంద్రబాబుకు సోమవారం లేఖ రాశారు. ఒకవైపు కేంద్ర ప్రభుత్వం కార్మిక లోకానికి వ్యతిరేకంగా కార్మిక చట్టాలను రద్దు చేసి లేబర్ కోడ్‌లను తీసుకురాగా.. మరోవైపు రాష్ట్ర ప్రభుత్వం పని గంటలు పెంచుతూ శ్రామికశక్తిపై గుదిబండ మోపిందని మండిపడ్డారు. -సీపీఐ రామకృష్ణ



విశాఖలో యోగాంధ్ర

అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా ఈ నెల 21న విశాఖపట్నంలో 5 లక్షల మందితో 'యోగాంధ్ర' కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించనున్నది. ఈ కార్యక్రమానికి ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబు, ఇతర ప్రముఖులు హాజరుకానున్నారు. ఈ సన్నాహాల్లో భాగంగా ప్రతి రోజూ వందలాది మందితో యోగాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహిసున్నారు. సోమవారం వీఎంఆర్‌డీఏ ఆధ్వర్యంలో సాగర తీరాన యోగాంధ్ర నిర్వహించారు. అక్కడ ఏర్పాటు చేసిన ప్రధాని, సీఎంల సైకత శిల్పం ఆకట్టుకుంది.

- విశాఖపట్నం, ఆంధ్రజ్యోతి.



అనంతపురంలోని సాక్షి కార్యాలయాన్ని ముట్టడించిన కూటమి శ్రేణులను అడ్డుకుంటున్న పోలీసులు



విజయవాడ ఆటోనగర్‌లోని సాక్షి కార్యాలయం గేటు ఎక్కి లోపలకు వెళ్తున్న అమరావతి మహిళలు, కూటమి పార్టీల కార్యకర్తలు



'సాక్షి'పై జనాగ్రహం

రాష్ట్రవ్యాప్తంగా మహిళల నిరసనలు.. పోలీసులకు ఫిర్యాదులు

(ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్)

అమరావతిని వేశ్యల రాజధాని అంటూ సాక్షి టీవీ చానల్‌లో చేసిన వ్యాఖ్యలపై మహిళా లోకం భగ్గుమంది. రాష్ట్రవ్యాప్తంగా సాక్షి కార్యాలయాల ఎదుట మహిళలు ఆందోళనలు నిర్వహించారు. కొన్నిచోట్ల గేట్లెక్కి నిరసన తెలిపారు. సాక్షి బోర్డులను ధ్వంసం చేశారు. చెప్పులు, చీపుర్లు, చాటలు చూపుతూ హెచ్చరికలు చేశారు. పలు పట్టణ కేంద్రాల్లోనూ మహిళలు ఆందోళనలు నిర్వహించారు. పోలీసుస్టేషన్లలో ఫిర్యాదులు చేశారు. సోమవారం రాజధానిలోని తుళ్లూరు నుంచి వందల సంఖ్యలో మహిళలు మంగళగిరిలోని సాక్షి యూనిట్ కార్యాలయానికి చేరుకున్నారు. మంగళగిరి మహిళలు కూడా వారి వెంట నడిచారు. వారంతా సాక్షి కార్యాలయంలోకి దూసుకెళ్లేందుకు ప్రయత్నించగా పోలీసులు అడ్డుకోవడంతో ఉద్రిక్తత నెలకొంది. సాక్షి నేమ్ బోర్డును పెకలించి, ధ్వంసం చేశారు. గుంటూరులోని సాక్షి కార్యాలయాన్నీ మహిళలు ముట్టడించారు. పొన్నూరులో వందలాది మహిళలు భారీ ర్యాలీ నిర్వహించారు. సాక్షి మీడియాను బహిష్కరించాలని, కొమ్మినేని శ్రీనివాసరావు, కృష్ణంరాజులను శిక్షించాలని, జగన్, భారతి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. కొమ్మినేని, కృష్ణంరాజు ఫొటోలు, సాక్షి దినపత్రికను చెప్పులతో కొట్టి దహనం చేశారు. కృష్ణంరాజు, కొమ్మినేనిపై కేసు నమోదు చేయాలని వేమూరు మార్కెట్‌యార్డు చైర్‌పర్సన్ పూర్ణకుమారి అమర్తలూరు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. విజయవాడ ఆటోనగర్‌లోని సాక్షి కార్యాలయం వద్ద సాక్షి బోర్డును తొలగించి కాళ్లతో తొక్కారు. దిష్టిబొమ్మలు, సాక్షి ప్రతులను దహనం చేశారు. గేటుపైకి కోడిగుడ్లు విసిరారు. సాక్షి టీవీ చానల్‌ను బ్యాన్ చేయాలని విశాఖపట్నంలోని సాక్షి యూనిట్ కార్యాలయం, అనకాపల్లిలోని ప్రాంతీయ కార్యాలయం ఎదుట తెలుగు మహిళలు, వీర మహిళలు డిమాండ్ చేశారు. పోలీసుస్టేషన్లలో ఫిర్యాదులు చేశారు. కొమ్మినేని, కృష్ణంరాజుపై చర్యలు తీసుకోవాలని శాసనసభ స్పీకర్ అయ్యన్నపాత్రుడు సతీమణి, నర్సీపట్నం మునిసిపల్ కౌన్సిలర్ చింతకాయల పద్మావతి ఆధ్వర్యంలో మహిళలు నర్సీపట్నం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. శ్రీకాకుళం జిల్లా ఎచ్చెర్లలోని సాక్షి ఆఫీసు వద్ద సాక్షి ప్రతులను దహనం చేసి, కార్యాలయ బోర్డును తొలగించి మంటల్లో వేశారు. గేటుకు చెప్పుల దండను వేలాడదీశారు. శ్రీకాకుళం జిల్లా టెక్కలిలోనూ సాక్షి పత్రిక ప్రతులను దహనం చేశారు. అనంతపురంలో సాక్షి కార్యాలయ ద్వారాన్ని కూటమి నేతలు, కార్యకర్తలు తెరిచేందుకు ప్రయత్నించగా పోలీసులు అడ్డుకోవడంతో తీవ్రస్థాయిలో పెనుగులాట జరిగింది. శ్రీసత్యసాయి జిల్లా పుట్టపర్తిలో ఎస్పీ కార్యాలయం ఎదుట తెలుగు మహిళలు నిరసన తెలిపారు. టీటీడీ బోర్డు సభ్యుడు మల్లెల రాజశేఖర్ ఆధ్వర్యంలో కర్నూలు జిల్లా సాక్షి కార్యాలయం ఎదుట మహిళలు జగన్ దిష్టిబొమ్మను చెప్పులతో కొట్టి దహనం చేశారు. కడపలోని సాక్షి కార్యాలయంలోకి వెళ్లేందుకు మహిళలు ప్రయత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. ఏలూరులోని సాక్షి కార్యాలయం ఎదుట ఆప్కాబ్ చైర్మన్ గన్ని వీరాంజనేయులు, ఎమ్మెల్యే బడేటి చంటి ఆధ్వర్యంలో మహిళలు ఆందోళన నిర్వహించారు. కోనసీమ జిల్లా అమలాపురంలో కూటమి నేతలు నిరసన ర్యాలీ నిర్వహించారు. సాక్షి కార్యాలయం ఎదుట కొమ్మినేని, కృష్ణంరాజు చిత్రపటాలను చెప్పులతో కొట్టి, సాక్షి ప్రతులను దహనం చేశారు. తిరుపతి జిల్లా రేణిగుంట, నెల్లూరులోని సాక్షి కార్యాలయాల్లోకి మహిళలు చొచ్చుకెళ్లేందుకు ప్రయత్నించగా పోలీసులు అడ్డుకున్నారు.



శ్రీకాకుళం జిల్లా ఎచ్చెర్లలో సాక్షి కార్యాలయం ముందు సాక్షి పత్రికలు, బోర్డును దహనం చేస్తున్న టీడీపీ శ్రేణులు

వైఛీపీ విషం!

- బరితెగించి మరీ అమరావతి మహిళలపై దూషణ
- ఈ ఘటనలు యాదృచ్ఛికం కాదు
- విషం చిమ్మండి అంటూ తిరుపతిలో పిలుపు
- అమరావతిపై అదే తీర్మానం అమలు

(అమరావతి - ఆంధ్రజ్యోతి)

"ప్రభుత్వంపై విషం చిమ్మండి. గ్రామస్థాయి నుంచి రాష్ట్రస్థాయి వరకు కార్యకర్తలు ఇదే పని మీద ఉండాలి. దీనికోసం సోషల్ మీడియాను వాడుకోండి".. తిరుపతి అంతర్గత సమావేశంలో వైసీపీ తీర్మానం ఇది. ఈ విషయం 'ఆంధ్రజ్యోతి' బయటపెట్టింది. ఆ తర్వాత 48 గంటలు గడవకముందే, జగన్‌కు చెందిన రోత మీడియా బరితెగించి మరీ అమరావతి మహిళలపై వ్యాఖ్యలుచేసింది. వైసీపీ అధినేత జగన్, ఆ పార్టీ రాజకీయ సలహాకమిటీ సమన్వయకర్త సజ్జల రామకృష్ణారెడ్డి ఆ ఘటనను సమర్థిస్తూ మరింత రెచ్చగొట్టేలా మాట్లాడారు. దీంతో వైసీపీ వికృత రూపం రాష్ట్రప్రజలకు కూడా తెలిసిపోయింది. పైతీర్మానాన్ని పరిశీలిస్తే...ఇవన్నీ ఏదో యాదృచ్ఛికంగా జరుగుతున్న ఘటనలు కాదని, ఉద్దేశపూర్వకంగానే చేస్తున్నారని స్పష్టమవుతోంది. కులమతాలు, ప్రాంతాలపై విద్వేషాన్ని ఎగచిమ్మాలనే తిరుపతి తీర్మానాన్ని సాక్షి చానల్ వేదికగా అమలు చేశారు. రాష్ట్రంలో కొంతకాలంగా జరుగుతున్న పరిణామాలను చూస్తే, అమరావతిపై కావాలనే విషం చిమ్ముతున్నారని తెలిసిపోతోందని రాజకీయ విశ్లేషకులు పేర్కొంటున్నారు. సార్వత్రిక ఎన్నికల్లో వైసీపీ మాడు పగిలేలా ప్రతిపక్ష హోదా కూడా దక్కనీయకుండా 11 అసెంబ్లీ స్థానాలకే పరిమితం చేస్తూ రాష్ట్ర ప్రజలు తీర్పు ఇచ్చారు. అప్పటి నుంచీ రాష్ట్ర ప్రజలపై జగన్ కక్ష కట్టినట్టు వ్యవహరిస్తున్నారు. సామాజిక మాధ్యమం వేదికగా దుష్ప్రచారం మొదలుపెట్టారు. వైసీపీ సోషల్ మీడియాలో జరిపే ప్రచారాన్ని జనం పెద్దగా పట్టించుకోరని జగన్‌కు తెలుసు. దీంతో మీడియా ముసుగులో కొంతమంది అద్దె జర్నలిస్టులను పెంచి పోషిస్తూ, ప్రతి చిన్న సంఘటనపైనా ప్రభుత్వాన్ని తప్పుబడుతూ వారితో విషప్రచారం చేయిస్తున్నారు. ఆయన ఒక ప్రమాదకర ఆటను మొదలుపెట్టారని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు.

ఇప్పుడు గుర్తొచ్చిందా జగన్!

సాక్షి టీవీ డిబేట్‌లో అమరావతి మహిళలపై ఉచ్చరించలేని విధంగా సీనియర్ జర్నలిస్టు కృష్ణంరాజు మాట్లాడుతుంటే యాంకర్ కొమ్మినేని శ్రీనివాసరావు ఏ దశలోనూ ఆపడానికి ప్రయత్నించలేదు. దీంతో ఆయన చేతులకు పోలీసులు బేడీలు వేశారు. దీన్ని.. అక్రమం, అన్యాయం అంటూ జగన్, సజ్జల గుండెలు బాదుకున్నారు. 70ఏళ్ల వ్యక్తిని అరెస్టు చేయడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమంటూ మాట్లాడారు. అయితే, సామాజిక మాధ్యమంలో ప్రభుత్వాన్ని విమర్శిస్తూ వచ్చిన పోస్టును ఫార్వర్డ్ చేసినందుకుగాను ఏడు పదుల వయస్సు దాటిన సీనియర్ పాత్రికేయుడు అంకబాబును లుంగీతోనే అరెస్టు చేశారు. అప్పుడు గుర్తుకురాని వయసు ఇప్పుడు గుర్తుకు వచ్చిందా జగన్..అంటూ పలువురు మండిపడుతున్నారు. సోషల్ మీడియా వచ్చిన పోస్టు నచ్చి ఫార్వర్డ్ చేసినందుకు వృద్ధురాలు రంగనాయకమ్మను అర్ధరాత్రి సమయంలో సీఐడీ పోలీసులు విచారణ పేరిట హింసించారు. అప్పుడు అరాచకం అనిపించలేదా జగన్.. అంటూ మండిపడుతున్నారు.

కొమ్మినేని అరెస్టు

(మొదటి పేజీ తరువాయి)

పోలీసు బృందాలు పెద్దఎత్తున గాలిస్తున్నాయి. ఇటీవల జగన్ చానల్లో యాంకర్ కొమ్మినేని నిర్వహించిన లైవ్ డిబేట్లో.. అమరావతి దేవతల రాజధాని కాదు... వేశ్యల రాజధాని అని కృష్ణంరాజు అనుచిత వ్యాఖ్యలు చేశారు. కొమ్మినేని ఆయన్ను వారించకుండా చర్చను కొనసాగించారు. దీనిపై రాజధాని ప్రాంతం సహా రాష్ట్రవ్యాప్తంగా ఆగ్రహావేశాలు పెల్లుబుకాయి. మహిళలు, ప్రజా సంఘాలు పెద్ద ఎత్తున నిరసనలు తెలియజేస్తున్నా.. ఆ ఇద్దరు గానీ, సాక్షి యాజమాన్యం గానీ కనీసం క్షమాపణలు చెప్పకపోవడంతో వారు మండిపడుతున్నారు. ఈ క్రమంలో రాజధాని ప్రాంత దళిత జేఏసీ నాయకురాలు కంభంపాటి శిరీష తుళ్లూరు పోలీసు స్టేషన్లో ఫిర్యాదు చేయగా.. కృష్ణంరాజు, కొమ్మినేని, సాక్షి యాజమాన్యంపై పోలీసులు ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీతోపాటు పలు నాన్ బెయిలబుల్ సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. సోమవారం ఉదయం తుళ్లూరు పోలీసులు హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లోని జర్నలిస్టుల కాలనీకి వెళ్లి కొమ్మినేని నివాసంలో ఆయన్ను అదుపులోకి తీసుకున్నారు. అనంతరం జూబ్లీహిల్స్ పోలీసు స్టేషన్లో హాజరుపరిచి.. అక్కడి నుంచి ట్రాన్సిట్ వారెంట్‌పై సోమవారం రాత్రికి విజయవాడ తీసుకొచ్చారు. తొలుత రాజధానిలోని తుళ్లూరు పోలీసు స్టేషన్‌కు గానీ.. లేదంటే గుంటూరు గానీ తీసుకురావాలని భావించారు. అయితే ఈ ప్రాంతంలో తీవ్ర ఆగ్రహంతో ఉన్న మహిళలు ప్రతిఘటించవచ్చని నిఘా వర్గాలు హెచ్చరించాయి. దీంతో పోలీసులు విజయవాడలోనే ఆయన్ను రహస్య ప్రాంతంలో ఉంచారు. రాత్రి పొద్దుపోయాక నల్లపాడు పోలీసు స్టేషన్‌కు తరలించారు. మంగళవారం ఉదయం మంగళగిరి కోర్టులో హాజరుపరుస్తారని అంటున్నారు.

మూడ్రోజుల కిందటే కృష్ణంరాజు పరార్!

అమరావతిపై తన వ్యాఖ్యలకు మహిళలు తీవ్ర ఆగ్రహావేశాలు వ్యక్తం చేస్తున్న నేపథ్యంలో ప్రధాన నిందితుడైన కృష్ణంరాజు మూడ్రోజుల కిందటే విజయవాడలోని తన ఇంటికి తాళం వేసి కుటుంబంతోపాటు అజ్ఞాతంలోకి వెళ్లిపోయారు. ఆయన ఆచూకీ కోసం మూడు ప్రత్యేక పోలీసు బృందాలు వివిధ ప్రాంతాల్లో గాలిస్తున్నాయి. వేరే రాష్ట్రానికి వెళ్లి ఉంటారని పోలీసులు అనుమానిస్తున్నారు. సాధ్యమైనంత త్వరలోనే కృష్ణంరాజును అరెస్టు చేసి కోర్టులో హాజరుపరుస్తామంటున్నారు.

నిరసనలు, ఫిర్యాదుల వెల్లువ..

మరోవైపు జగన్ మీడియా తీరుపై రాష్ట్రవ్యాప్తంగా మహిళల నిరసనలు రోజురోజుకూ తీవ్రమవుతున్నాయి. జగన్ పత్రిక కార్యాలయాల ఎదుట ఆందోళనలు చేపడుతున్నారు. ఇదే సమయంలో రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటికే 60కి పైగా పోలీసు స్టేషన్లలో మహిళా సంఘాలు, ప్రజా సంఘాలు కృష్ణంరాజు, కొమ్మినేని, సాక్షి యాజమాన్యంపై పెద్దఎత్తున ఫిర్యాదులు చేస్తున్నారు. రాజధాని ప్రాంతమైన తుళ్లూరు పోలీసు స్టేషన్లో వారిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీతో పాటు పలు సెక్షన్ల కింద కేసు నమోదైంది. ఇందులో ఏ-1గా కృష్ణంరాజు, ఏ-2గా కొమ్మినేని శ్రీనివాసరావు, ఏ-3గా సాక్షి యాజమాన్యాన్ని చేర్చారు.

నల్లపాడు స్టేషన్ వద్ద వైసీపీ నేతల హల్‌చల్

కొమ్మినేనిని నల్లపాడు పోలీసు స్టేషన్‌కు తీసుకొచ్చారని తెలుసుకున్న వైసీపీ లీగల్ సెల్ బృందం రాత్రి 11:10 గంటల సమయంలో అక్కడకు వచ్చారు. అప్పటికే అక్కడ పోలీసులు నిషేధాజ్ఞలు అమల్లోకి తెచ్చారు. మీడియాను సైతం లోపలకు అనుమతించలేదు. దీంతో లీగల్ సెల్ న్యాయవాదులు పోలీసులపై తిరగబడ్డారు. కేసులో నిందితుడిని కలిసే హక్కు తమకుందని, ఎలా ఆపుతారంటూ లోనికి వెళ్లేందుకు ప్రయత్నించారు. పోలీసులు వారిని గేటు వద్దే అడ్డుకున్నారు. ఒక్కరినే అనుమతిస్తామని చెప్పడంతో వైసీపీ లీగల్ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు మనోహర్‌రెడ్డి లోపలకు వెళ్లి సంతకాలు చేయించుకుని వచ్చారు. స్టేషన్ వద్దకు వచ్చినవారిలో మాజీ ఏఏజీ పొన్నవోలు సుధాకర్ రెడ్డి, పోలూరి వెంకటరెడ్డి, పలువురు న్యాయవాదులు ఉన్నారు. కాగా.. కొమ్మినేనిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదవడంతో డీఎస్పీ మురళీకృష్ణ ఆయన్ను సుదీర్ఘంగా విచారించారు.

నిరసన తెలిపితే సంకర జాతా!

- మహిళల జోలికొస్తే చర్యలు తప్పవు
- వైసీపీ నేతలకు లోకేశ్ హెచ్చరిక



అమరావతి, జూన్ 9(ఆంధ్రజ్యోతి): ప్రజాస్వామ్యబద్ధంగా నిరసన తెలియజేస్తున్న మహిళలు.. సంకరజాతి వారుగా కనిపిస్తున్నారా అని వైసీపీ నాయకులపై మంత్రి లోకేశ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. వైసీపీ నేత సజ్జల రామకృష్ణారెడ్డి వ్యాఖ్యలపై 'ఎక్స్'లో ఆయన స్పందించారు. 'తమను అవమానించిన వారి ఫొటోల వద్ద మహిళలు నిరసన తెలియజేస్తే.. వారు సంకర జాతి వారుగా కనిపిస్తున్నారా? ఏమిటీ భాష? ఏవిటీ విపరీత ప్రవర్తన? తలపండిన సాక్షి జర్నలిస్టులు మహిళలను వేశ్యలంటూ అవమానించారు. ఇప్పుడు వైసీపీ నేతలు.. సంకర జాతి అంటూ దిగజారి మాట్లాడుతున్నారు. జగన్ తల్లి, చెల్లిని తరిమేసిన అమానవీయ ప్రవర్తనను వైసీపీ నేతలు ఆదర్శంగా తీసుకున్నట్లు ఉన్నారు. మహిళల జోలికొస్తే చట్టప్రకారం తప్పనిసరిగా చర్యలు తీసుకుంటాం' అని తేల్చిచెప్పారు.

జర్నలిస్టు ముసుగులో చీడపురుగులు

- అనగాని, భూపతిరాజు, కొల్లు, ఆనం ధ్వజం

(ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్)

జగన్ మీడియాలో అమరావతి మహిళలపై చేసిన అనుచిత వ్యాఖ్యలపై రాష్ట్రవ్యాప్తంగా పలువురు ప్రజాప్రతినిధులు మండిపడ్డారు. ఆడబిడ్డలంటే సాక్షి మీడియాకు గౌరవం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. జర్నలిస్టుల ముసుగులో చీడపురుగులు ఉన్నారంటూ విమర్శించారు. కేంద్ర సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ భీమవరంలో మాట్లాడుతూ, కృష్ణంరాజు క్యారెక్టర్ ఉన్న వ్యక్తి కాదన్నారు. రాష్ట్ర మంత్రి కొల్లు రవీంద్ర అనకాపల్లిలో మాట్లాడుతూ, 'ఆడబిడ్డలను కించపర్చేవిధంగా చర్చావేదికలు నిర్వహిస్తే ప్రభుత్వం తీవ్రంగా పరిగణిస్తుంది' అని హెచ్చరించారు. మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి మహానందిలో మాట్లాడుతూ, 'మీడియా విశ్లేషణ పేరుతో మహిళలను దుర్భాషలాడటం సృష్టి ధర్మానికి విరుద్ధం.' అని మండిపడ్డారు. మంత్రి అనగాని తిరుపతిలో మాట్లాడుతూ, 'మా ప్రభుత్వం ఎవరినీ టార్గెట్ చేయలేదు. కొంతమంది జర్నలిస్టు ముసుగులో చీడపురుగుల్లా తయారయ్యారు. వైసీపీ సోషల్ మీడియాపై ప్రత్యేక దృష్టిపెట్టాం' అని హెచ్చరించారు. కొమ్మినేని శ్రీనివాసరావు, కృష్ణంరాజుకు మద్దతుగా వైసీపీ నేత జగన్ రెండు పేజీల ట్వీట్ పెట్టడం సిగ్గుచేటు అని టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు వర్ల రామయ్య విమర్శించారు. 'గత ఐదేళ్ల వైసీపీ పాలనలో రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేశారు. కొమ్మినేని, కృష్ణంరాజు సభ్యత్వం తీసుకోని వైసీపీ కార్యకర్తలు' అని వర్ల మండిపడ్డారు.

ఆ వ్యాఖ్యలు జుగుప్సాకరం, హేయం

- బాధ్యులపై చర్యలు తీసుకోవాలి: వెంకయ్య

న్యూఢిల్లీ, జూన్ 9(ఆంధ్రజ్యోతి): 'అమరావతిపై చేసిన జుగుప్సాకరమైన వ్యాఖ్యలు అత్యంత దారుణమైనవి, హేయమైనవని. సభ్యసమాజం సహించలేనివి' అని మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతులను, ముఖ్యంగా మహిళా మూర్తులను ఉద్దేశించి చేసిన వ్యాఖ్యలు కిరాతకమైనవి. క్షమించరాని నేరం. బాధ్యులైన ప్రతి ఒక్కరి మీద చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలి" అని వెంకయ్యనాయుడు డిమాండ్ చేశారు.

మీ మహిళలను ఇలాగే అంటారా?

- ప్రెస్ కౌన్సిల్‌కు ఫిర్యాదు చేస్తాం: శైలజ

విజయవాడ, మే 9(ఆంధ్రజ్యోతి): 'సాక్షి చానల్‌లో నిర్వహించిన చర్చా వేదికలో అమరావతి ప్రాంత మహిళలను ఉద్దేశించి కృష్ణంరాజు చాలా అసభ్యంగా మాట్లాడారు. ఇదే మాటలను మీ ఇళ్లలో మహిళలను అనగలరా? సాక్షి చానల్, పత్రిక లైసెన్స్‌ను రద్దు చేయాలని కేంద్ర ప్రభుత్వానికి, ప్రెస్ కౌన్సిల్‌కు లేఖ రాస్తాం' అని మహిళా కమిషన్ చైర్‌పర్సన్ రాయపాటి శైలజ అన్నారు. విజయవాడలో ఆమె మీడియాతో మాట్లాడారు.

దురుద్దేశంతోనే..: ఆలపాటి సురేశ్

అమరావతిపై విషం చిమ్మే ఉద్దేశంతోనే కొమ్మినేని శ్రీనివాస్ డిబేట్‌లో మహిళలపై అసభ్యంగా మాట్లాడారని అనిపిస్తోందంటూ ప్రెస్ అకాడమీ చైర్మన్ ఆలపాటి సురేశ్ కుమార్ అన్నారు. 'ఆంగ్ల పత్రిక కథనంలో ఎక్కడా లేని ప్రస్తావన ఆ చర్చలో ఎందుకు తీసుకొచ్చారో వివరణ ఇవ్వాలి.' అన్నారు.

ఆ వ్యాఖ్యలు తెలుగు మహిళలపై దాడే

- ఏపీ, టీజీ ఎంఎస్‌ఓ ఫెడరేషన్

అమరావతి మహిళలపై సాక్షి టీవీ డిబేట్‌లో చేసిన అవమానకర వ్యాఖ్యలను ఏపీ, టీజీ మల్టీ సిస్టమ్ ఆపరేటర్ల(ఎంఎస్.ఓ) ఫెడరేషన్ ఖండించింది. ఫెడరేషన్ జనరల్ సెక్రటరీ కె.శ్రీనివాసరావు, ప్రతినిధులు జి.సూర్యనారాయణ, కె.గౌరిశంకర్ ఈ మేరకు ప్రకటన విడుదల చేశారు. జర్నలిస్టు కృష్ణంరాజు, యాంకర్ కొమ్మినేని శ్రీనివాస్ వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు. వారి వ్యాఖ్యలు సమాజాన్ని తీవ్రంగా ప్రభావితం చేస్తున్నాయని, బాధిస్తున్నాయని తెలిపారు. చర్చలు జరిపేటప్పుడు బాధ్యతతో మెలగాలని ఈ సందర్భంగా అన్ని మీడియా వేదికలను కోరారు.

నాలుగేళ్ల తర్వాత జవాబు చెప్పాలి

చేసిన తప్పులకు బాధ్యత వహించాలి

- చంద్రబాబుకు జగన్ బెదిరింపు



అమరావతి, జూన్ 9(ఆంధ్రజ్యోతి): సీఎంగా చంద్రబాబు నాలుగేళ్ల తర్వాత తన అరాచక పాలనపై ప్రజలకు సమాధానం చెప్పాల్సి ఉంటుందని వైసీపీ అధ్యక్షుడు జగన్ హెచ్చరించారు. రాష్ట్రం అరాచకానికి కేరాఫ్‌గా మారిపోయిందని 'ఎక్స్'లో ఆరోపించారు. చేయని వ్యాఖ్యలకు 70 ఏళ్ల వృద్ధుడైన సీనియర్ జర్నలిస్టు కొమ్మినేని శ్రీనివాసరావును అరెస్టు చేసి.. కక్షసాధింపు, విషసంస్కృతిని పతాకస్థాయికి తీసుకెళ్లారని ఆరోపించారు. డిబేట్ జరిగేటప్పుడు వక్తలు మాట్లాడే మాటలకు, యాంకర్‌కు ఏం సంబంధమని ప్రశ్నించారు. కొమ్మినేనిపై చంద్రబాబు కక్షకట్టడం ఇదే తొలిసారి కాదని.. 2014-19 మధ్య ఒక చానల్ నుంచి కొమ్మినేనిని ఉద్యోగం నుంచి తొలగింపజేశారని ఆరోపించారు. ఆయన అరెస్టును తీవ్రంగా ఖండిస్తున్నానని తెలిపారు. చెడు సంప్రదాయాలకు నాంది పలుకుతూ ఇవాళ ఏది విత్తారో.. రేపు అదే పండుతుందని.. అది రెండింతలవుతుందని బెదిరించారు.

సంకరజాతి తెగవారే ఇలా చేస్తారు!

రాక్షసులు, పిశాచాలు కూడా చేయవు

తప్పంతా చంద్రబాబు, లోకేశ్‌దే: సజ్జల

అమరావతి, జూన్ 9(ఆంధ్రజ్యోతి): అమరావతి మహిళలను అవమానించారని యాంకర్ కొమ్మినేని శ్రీనివాసరావు, ఎనలిస్టు కృష్ణంరాజు ఫొటోలను చెప్పులతో కొట్టడం వంటి పనులు సంకరజాతి తెగవారే చేస్తారని వైసీపీ నేత సజ్జల రామకృష్ణారెడ్డి అన్నారు. రాక్షసులు, పిశాచాలు కూడా ఇలాంటివి చేయవన్నారు. సంకరజాతి తెగ పూనుకుంటేనే ఇలా చేయగలుగుతుందని.. ఈ తెగ వ్యవస్థీకృతమైందని చెప్పారు. ఇది పూర్తి సమన్వయంతో పనిచేస్తోందని.. కమ్ముకుని దెబ్బకొడుతోందని ఆరోపించారు. ఈ వ్యవహారంలో తప్పంతా సీఎం చంద్రబాబు, టీడీపీలో రెండో వ్యక్తి.. ఒకటిన్నర వ్యక్తి అయిన మంత్రి లోకేశ్‌దేనని చెప్పారు. కొమ్మినేనిని నిష్పక్షపాత జర్నలిస్టుగా, తమ అధినేత జగన్‌ను మహిళా పక్షపాతిగా అభివర్ణించారు. రాష్ట్రంలో ఎక్కువ మంది సెక్స్ వర్కర్లు ఉన్నారంటే మహిళలను అవమానించినట్లా.. అమరావతి చుట్టుపక్కల సెక్స్‌వర్కర్లు ఉన్నారని కృష్ణంరాజు చెబితే దానిని అమరావతి మహిళలకు ఆపాదిస్తారా అని ప్రశ్నించారు. జగన్ పాలనలో ఒక్కటంటే ఒక్కటైనా మహిళలపై అఘాయిత్యం జరిగిందా అని ప్రశ్నించారు. పోలీసులు అరాచకంగా వ్యవహరిస్తున్నారని.. నిష్పాక్షికంగా వ్యవహరించేవారిపై కక్ష గడుతున్నారని విమర్శించారు. డిబేట్‌లో ఎనలిస్టు ఒకసారి అని ఊరుకుంటే.. అధికార పక్షం దానిపై మళ్లీ మళ్లీ మాట్లాడుతూ అమరావతి మహిళలను అవమానిస్తోందన్నారు. దీనిపై వైసీపీ మహిళా విభాగం తరఫున మంగళవారంనాడు రాష్ట్రవ్యాప్త నిరసనలు చేపట్టాలని నేతలను ఆదేశించారు.

భారతీరెడ్డి, జగన్ క్షమాపణ చెప్పాలి: షర్మిల



చిత్తూరు రూరల్, జూన్ 9(ఆంధ్రజ్యోతి): అమరావతి వేశ్యల రాజధాని అనే కామెంట్స్‌పై మహిళలకు భారతి రెడ్డి, జగన్ వెంటనే క్షమాపణ చెప్పాలని పీసీసీ అధ్యక్షురాలు షర్మిల డిమాండ్ చేశారు. చిత్తూరులో ఆమె మీడియాతో మాట్లాడారు. 'ఆంధ్రుల రాజధాని అమరావతి. మన రాజధాని మీద ఇలాంటి కామెంట్స్ ఎవరు చేసినా క్షమించకూడదు. ఈ కామెంట్స్‌కు భారతీరెడ్డి, జగన్ బాధ్యత వహించాలి. వేశ్యల రాజధాని అనే వ్యాఖ్యలను కాంగ్రెస్ పార్టీ ఖండిస్తోంది. ఇలాంటి మాటలు క్షమించరానివి. ఇలాంటప్పుడు పార్టీ అయినా, మీడియా హౌస్ అయినా సరే క్షమాపణ చెప్పాలి. వైసీపీకి చెందిన సాక్షి చానెల్‌లో ప్రసారం చేసినందుకు భారతీరెడ్డి క్షమాపణ చెప్పడంలో తప్పులేదు. ఇలాంటి వ్యాఖ్యలు బేస్‌లెస్ అండ్ సెన్స్‌లెస్' అని షర్మిల అన్నారు. కాంగ్రెస్ పార్టీ ముఖ్య అధికార ప్రతినిధి తులసిరెడ్డి స్పందిస్తూ... 'కృష్ణంరాజు,కొమ్మినేనితో పాటు సాక్షి యాజమాన్యం రాష్ట్ర ప్రజలకు, ప్రత్యేకించి మహిళా లోకానికి క్షమాపణ చెప్పాలి. ఆ వ్యాఖ్యలు గర్హనీయం' అని అన్నారు.









కడపలో సాక్షి ఆఫీస్ వద్ద తెలుగు మహిళ, యువత, విద్యార్థుల ధర్నా. విశాఖలో కృష్ణంరాజు, కొమ్మినేని ఫొటోల దహనం. సోమవారం రాత్రి నల్లపాడు స్టేషన్‌లోకి వెళ్లేందుకు దూసుకొచ్చిన మహిళలను అడ్డుకున్న పోలీసులు. పొన్నూరు నిరసన ర్యాలీ

‘భారతి’కి భూ హారతి!

(మొదటి పేజీ తరువాయి)

యజమానిగా ఉన్న ‘భారతీ సిమెంట్స్’కు బరితెగించి మరీ 744 ఎకరాల సున్నపురాయి లీజును కట్టబెట్టారు. ఎప్పుడో వైఎస్ హయాంలో మొదలైన ఈ తతంగాన్ని... 2024లో మరికొన్ని రోజుల్లో ఎన్నికల షెడ్యూలు వస్తుందనగా గుట్టుగా ముగించారు. కడప జిల్లాలోని ఎర్రగుంట్ల, కమలాపురం మండలాల్లో విస్తరించిన ఈ గనులను 50 ఏళ్ల కాలానికి కట్టబెట్టారు. జగన్ తనకు తాను చేసుకున్న ఈ సొంత మేలు విలువ కనీసం రూ.3వేల కోట్లపైనే!

ఇలా మొదలైంది...

‘భారతీ సిమెంట్స్’కు భూ పందేరం ప్రక్రియ వైఎస్ సీఎంగా ఉండగా మొదలైంది. ఎర్రగుంట్ల, కమలాపురం మండలాల పరిధిలో 2037.52 ఎకరాల్లో ఉన్న సున్నపురాయి నిక్షేపాలను రఘురామ్ సిమెంట్స్ అనే కంపెనీకి 2006 మార్చి 27న కట్టబెట్టారు. సిమెంటు తయారీలో కీలకమైన అత్యంత నాణ్యమైన సున్నపురాయి నిల్వలు ఇక్కడున్నాయి. మహా అయితే 10 మీటర్ల లోతు వరకు సరైన నాణ్యత లేని సున్నపురాయి వచ్చినా, ఆ తర్వాత మరో 250 మీటర్ల లోతు వరకు శ్రేష్ఠమైన ఖనిజం వస్తుంది. అయితే... 475.16 ఎకరాల్లో తాము ఆశించిన ఖనిజం లేదంటూ 2008 నవంబరు 7న ఆ భూమిని రఘురామ్ సిమెంట్స్ సర్కారుకు వెనక్కి ఇచ్చింది. ఇక ఆ కంపెనీ వద్ద ఉన్న భూమి 1562.36 ఎకరాలు. ఇందులో... వేర్వేరు గ్రామాల పరిధిలో విస్తరించిన 744.74 ఎకరాలకు మాత్రం లెటర్ ఆఫ్ ఇంటెంట్ (ఎల్‌ఓఐ) ఇచ్చారు. ఆ వెంటనే లీజు అమలు ఉత్తర్వులు కూడా ఇచ్చారు. దీని ప్రకారం రఘురామ్ సిమెంట్స్ ఆ భూముల్లో లైమ్‌స్టోన్ మైనింగ్ చేపట్టాలి. అయితే... 2009 ఫిబ్రవరిలో రఘురామ్ సిమెంట్స్ చేతులు మారిపోయింది. యజమాని కూడా మారిపోయారు. అది... ‘భారతీ సిమెంట్స్’గా మారింది. దాని యజమాని... జగన్ సతీమణి భారతీ రెడ్డి! దీని వెనుక ఏం జరిగిందన్నది సీబీఐ ఎప్పుడో వెల్లడించింది! రఘురామ్ సిమెంట్స్‌ను భారతీ సిమెంట్స్‌గా మార్చుకోవడానికి వైఎస్ ప్రభుత్వం 2009 ఫిబ్రవరి 13న ఉత్తర్వులు(జీఓ54) ఇచ్చింది. ఈ జీవోతో అన్నీ అయిపోతాయని, రఘురామ్ సిమెంట్స్ పేరిట ఉన్న వేలకోట్ల విలువైన లైమ్‌స్టోన్ లీజులు, మైనింగ్ చేసుకోవడానికి రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన ఎల్‌ఓఐ, ఇతర పర్యావరణ అనుమతులు కూడా సింపుల్‌గా మారిపోతాయని భావించారు. కానీ, అదంతా సులువుగా జరగలేదు.

2014లో కదలిక...

రాష్ట్ర విభజన తర్వాత జగన్ తన భారతీ సిమెంట్స్ ప్రాజెక్టులో కదలిక తీసుకొచ్చారు. మైనింగ్‌కు అవసరమైన అనుమతుల కోసం కేంద్ర ప్రభుత్వాన్ని సంప్రదించారు. భారతీ సిమెంట్స్ దరఖాస్తు చేసుకున్న మేరకు మైనింగ్ ప్లాన్‌కు 2014 జూలై 15న కేంద్ర గనుల శాఖ ఆమోదం తెలిపింది. అయితే... అప్పటికి ఆ కంపెనీకి పర్యావరణ అనుమతి (ఈసీ), కన్సెంట్ ఫర్ ఎస్టాబ్లిష్‌మెంట్ (సీఎఫ్‌ఈ) వంటివి రాలేదు. ఇక్కడ మరో కీలకమైన అంశముంది. అదేమిటంటే... తొలుత భూముల లీజు పొందిన రఘురామ్ సిమెంట్స్ దీనిపై ప్రభుత్వంతో ఒప్పందం చేసుకోలేదు. భారతీ సిమెంట్స్‌గా మారిన తర్వాత కూడా ఒప్పందం కుదుర్చుకోలేదు. అంటే, మైనింగ్ ప్లాన్‌కు కేంద్రం ఆమోదం తెలిపిన 2014 జూలై 15న నాటికి లీజు అమల్లోకే రాలేదన్న మాట!

మరిన్ని మలుపులు...

744 ఎకరాల లీజులెక్క కొలిక్కి రాకముందే... మైనింగ్ చట్టాల్లో కేంద్రం కీలక మార్పులు చేసింది. మైనింగ్, మినరల్ (అభివృద్ధి నియంత్రణ) చట్టం-1957 (ఎంఎండీఆర్)ను 2015 జనవరిలో సవరించి... కొత్తగా 10 ఏ అనే క్లాజును చేర్చింది. దీని ప్రకారం అప్పటికే... సుదీర్ఘకాలం పెండింగ్‌లో ఉన్న దరఖాస్తుల కాలపరిమితి దానంతట అదే ముగిసిపోతుంది. అంటే, ఇక ఆ దరఖాస్తులు పనికి రావు. మైనింగ్ కోసం కొత్తగా దరఖాస్తు చేసుకోవాల్సిందే. దీని ప్రకారం తగిన చర్యలు తీసుకోవాలని కేంద్రం 2016 నవంబరు 23న రాష్ట్రానికి లేఖ రాసింది. పర్యావరణ అనుమతి లేని ఒప్పందాలకూ ఇదే వర్తిస్తుందని అందులో స్పష్టం చేసింది. ఆ మేరకు... అమల్లోకి రాని లీజుదారులందరికీ రాష్ట్రం షోకాజ్ నోటీసులు ఇచ్చింది. ప్రభుత్వంతో లీజ్ డీడ్‌పై సంతకాలు చేసుకోని, పర్యావరణ అనుమతులూ పొందని భారతీ సిమెంట్స్‌కూ ఈ నోటీసులు వెళ్లాయి. కేంద్రం చట్టం ప్రకారం లీజు ఒప్పందాన్ని ఎందుకు రద్దు చేయకూడదో చెప్పాలంటూ 2016 డిసెంబరు 30న భారతీ సిమెంట్స్‌కు నోటీసు ఇచ్చింది. దీనిపై కంపెనీ స్పందించలేదు. ఫలితంగా... 2017 జనవరి 10న రఘురామ్ సిమెంట్స్‌కి ఇచ్చిన ఎల్‌ఓఐని సర్కారు రద్దుచేసింది.

ఏజీతో ‘అబద్ధాలు’...

జగన్ హయాంలో గనుల శాఖ పనితీరు గురించి చెప్పాల్సిన పనే లేదు. అంతా అడ్డగోలుతనమే. మరి... భారతీ సిమెంట్స్ విషయంలోనూ అదే జరిగింది. ఆనాడున్న గనుల శాఖ కార్యదర్శితో 2021 జనవరి 1న అడ్వొకేట్ జనరల్‌కు ఓ లేఖ రాయించారు. 2009లో జారీ చేసిన జీవో 54కు విరుద్ధంగా లీజులను, ఎల్‌ఓఐని రద్దుచేయించారని, ఇది చెల్లదని అందులో చెప్పించారు. నిజానికి... జీవో 54 అనేది రఘురామ్ సిమెంట్స్‌ను భారతీ సిమెంట్స్‌గా మార్చుకోవడాన్ని ఆమోదిస్తూ ఇచ్చింది. 2015లో కేంద్రం ఎంఎండీఆర్ చట్టంలో చేసిన సవరణ ఆధారంగా షోకాజ్ నోటీసు ఇచ్చి, దానికి సమాధానం రాకపోవడంతో లీజులు రద్దు చేసిన సంగతి మాత్రం దాచేశారు. అంటే... అడ్వొకేట్ జనరల్‌ను తప్పుదారి పట్టించి ఉండాలి. లేదా... అన్నీ తెలిసే ఆయన అబద్ధాలు చెప్పి ఉండాలి.

అన్నీ ఉల్లంఘించి భారతికి మేలు

మైనింగ్ మినరల్ (అభివృద్ధి-నియంత్రణ) చట్టం-1957కు 2015లో ఒకసారి, 2021లో మరోసారి కేంద్రం చేసిన సవరణల ప్రకారం భారతీ సిమెంట్స్‌కు లీజులు ఇవ్వడానికి వీల్లేదని అధికార వర్గాలు చెబుతున్నాయి. ‘న్యాయ సలహా’ పేరుతో జగన్ ఈ చట్టాలను తుంగలోకి తొక్కారు. అదే సమయంలో... ఆ చట్ట సవరణలు అనుమతించినట్లుగా 50 ఏళ్ల కాలపరిమితితో లీజులు ఇచ్చుకున్నారు. అంటే, కేంద్ర చట్టాల్లో తనకు నష్టం చేసే నిబంధనలను పక్కన పెట్టేసి, మేలు చేసేవి మాత్రం వర్తింపచేశారన్న మాట!

ఫిర్యాదుతో వెలుగులోకి...

జగన్ లీజుల దందాపై కడప జిల్లాకు చెందిన ఓ వ్యక్తి కేంద్ర ప్రభుత్వానికి లేఖ రాశారు. భారతీ సిమెంట్స్‌కు అన్యాయంగా, అక్రమంగా లైమ్‌స్టోన్ నిల్వలున్న భూములు దోచిపెట్టారని, దీనిపై విచారణ జరిపించాలని కోరారు. ఈ ఫిర్యాదులోని అంశాలను కేంద్రం తీవ్రంగా పరిగణించింది. భారతీ సిమెంట్స్ లీజుల విషయంలో వాస్తవిక నివేదిక ఇవ్వాలని, ఫిర్యాదులోని అంశాలపై సమగ్ర విచారణ జరిపించాలని కేంద్రం ఆదేశించింది. ఇప్పుడు ఈ అక్రమాలను నిగ్గు తేల్చే బాధ్యత కూటమి ప్రభుత్వానిదే!

అధికారంలోకి రాగానే...

2019లో జగన్ అధికారంలోకి వచ్చారు. 2020...భయంకరమైన కరోనా కాలం. ఆ సమయంలో... ఆయన భారతీ సిమెంట్స్ మైనింగ్‌ప్లాన్ ఆమోదం కోసం అనేక ప్రయత్నాలు చేశారు. మైనింగ్ ప్లాన్ ఆమోదం కోసం భారతీ సిమెంట్స్ దరఖాస్తు చేసుకుంది. జగన్ కేంద్రం వద్ద తన పలుకుబడి ఉపయోగించి ఇందులో కదలిక తీసుకొచ్చారు. కేంద్రం నుంచి వచ్చిన తనిఖీల బృందం కడప జిల్లాలోని లీజులను పరిశీలించింది. దీంతో పాటు భారతీ సిమెంట్స్ ఇచ్చిన దరఖాస్తునూ పరిశీలించి... అనేక ప్రశ్నలు, సందేహాలను లేవనెత్తింది. “మీకున్న లీజుల సంగతేమిటి? అవి ఎలా వచ్చాయి? కంపెనీ పేరు ఎలా మారింది? మైనింగ్‌ప్లాన్‌ను మార్చాలని ఎందుకు ప్రతిపాదించారు? అసలు దీనికున్న హేతుబద్ధత ఏవిటో వివరించండి. మేం నమ్మదగిన కారణాలు చెప్పండి” అంటూ 2020 ఫిబ్రవరిలో ఇచ్చిన తనిఖీ నివేదికలో ప్రశ్నించింది. ఆ తర్వాత ఇదే నివేదికను జోడించి... తమకు వాస్తవాలే చెప్పాలని ఇండియన్ బ్యూరో ఆఫ్ మైన్స్ కూడా లేఖ రాసింది. ‘నమ్మదగిన కారణాలు ఏవీ చెప్పలేని అసహాయత’ నేపథ్యంలో... భారతీ సిమెంట్స్ దీనిపై నోరెత్తలేదు. ఎలాంటి సమాధానమూ ఇవ్వలేదు. దీంతో... అధికారాన్ని అడ్డం పెట్టుకుని, తప్పుడు దారిలో లీజులు కొట్టేసే ప్రణాళిక రచించారు.

కోర్టుకు ఎక్కిన ‘భారతీ సిమెంట్స్’

సర్కారు ఎల్‌ఓఐని రద్దు చేయడంపై 2017 ఏప్రిల్ 13న హైకోర్టులో భారతీ సిమెంట్స్ రిట్ పిటిషన్ దాఖలు చేసింది. ఎల్‌ఓఐ రద్దును నిలిపివేయాలని కోరింది. ఈ విషయంలో స్టేటస్‌కో పాటించాలని హైకోర్టు ఆదేశించింది. ఇదిలాఉండగానే, 2021 మార్చి 23న ఆ కంపెనీకి మరో దెబ్బ తగిలింది. ఎంఎండీఆర్ చట్టంలో మరోసారి కేంద్రం సవరణలు చేసింది. ఈ సారి 10(ఏ)తోపాటు 2(బి)ని జతపరిచింది. దీని ప్రకారం....ఈ సవరణ జరిగే నాటికి అమలులోకి రాని మైనింగ్ లీజులు, మంజూరు కాని దరఖాస్తులకు సుమోటోగా కాలం చెల్లిపోతుంది. భారతీ సిమెంట్స్‌కు సంబంధించిన 744 ఎకరాల సున్నపురాయి లీజు అమలులోకి రాలేదు కాబట్టి... అది రద్దయినట్లే!

హైకోర్టు ఆదేశాలూ బుట్టదాఖలు

సున్నపురాయి గనుల లీజుల రద్దుపై స్టేటస్ కో ఇచ్చిన హైకోర్టు... 2023 సెప్టెంబరు 21న దీనిపై తీర్పు చెప్పింది. భారతీ సిమెంట్స్ ఇచ్చిన వివరణను పరిగణనలోకి తీసుకోవాలని, వారి అభిప్రాయం వినాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది. అదే సమయంలో, గనుల చట్టంలోని నియమ నిబంధనలకు అనుగుణంగా వ్యవహరించాలని భారతీ సిమెంట్స్‌ను హైకోర్టు ఆదేశించింది. దీని ప్రకారం... భారతీ సిమెంట్స్ సంస్థ ప్రభుత్వం ముందు హాజరై తన వివరణ ఇవ్వాలి. దీని ఆధారంగానే లీజుల రద్దు నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలా? లేక కొనసాగించాలా? అనేది తేల్చాలి. కానీ... జగన్ సర్కారు ఈ పనిచేయలేదు. హైకోర్టు ఆదేశాలను అమలు చేస్తే లీజులు పునరుద్ధరించడం అసాధ్యం. అందుకే... హైకోర్టు ఆదేశాల అమలును పక్కనపెట్టి సొంత ఆలోచనను తెర మీదకు తీసుకొచ్చారు. భారతీ సిమెంట్స్‌కు లాభం చేకూర్చేలా... గనుల శాఖ ద్వారా ఒక మాజీ న్యాయమూర్తి న్యాయసలహా కోరారు. వారు ఆశించినట్లుగానే... “ఎంఎండీఆర్ చట్టంలో 2021లో తీసుకొచ్చిన సవరణలు భారతీ సిమెంట్స్ లీజు హక్కులను రద్దు చేయలేవు” అనే సలహానే వచ్చింది. ఇదే సలహాను పాటించాలని 2023 సెప్టెంబరు 22న నాటి అడ్వొకేట్ జనరల్ కూడా చెప్పేశారు. ఇదంతా ఒక ‘స్క్రిప్టు’ ప్రకారం జరిగిందన్న మాట.



‘ఉక్కు’ దీక్షా శిబిరం పోలీసుల స్వాధీనం

విశాఖ ఉక్కు కర్మాగారానికి సొంత గనులు కేటాయించాలని, సెయిల్‌లో విలీనం చేయాలని డిమాండ్ చేస్తూ కార్మికులు దీక్షలు చేస్తున్న శిబిరాన్ని సోమవారం పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. విశాఖ ఉక్కును ప్రైవేటీకరణ చేస్తామని కేంద్రం ప్రకటించిన మరుసటి రోజు నుంచి కూర్మన్నపాలెంలోని స్టీల్ ప్లాంటు వద్ద 1,579 రోజులుగా కార్మికులు దీక్షలు చేస్తున్నారు. ప్లాంటును పూర్తిస్థాయి సామర్థ్యంతో నడపాలని యాజమాన్యం ప్రయత్నిస్తున్న తరుణంలో కార్మికులు సహకరించకుండా ఇంకా ఆందోళనలు చేస్తుండటంతో ప్రభుత్వం చర్యలకు దిగింది. దీక్షా శిబిరాన్ని స్వాధీనం చేసుకుంది. దీనిని నిరసిస్తూ కార్మిక సంఘాల నాయకులు శిబిరం బయట కూర్చొని ఆందోళన కొనసాగించారు.

- విశాఖపట్నం, ఆంధ్రజ్యోతి

‘కాకాణి’పై మరో కేసు

» టోల్‌గేట్ అక్రమ వసూళ్లపై గతంలోనే టీడీపీ ఫిర్యాదు

ముత్తుకూరు, నెల్లూరు (లీగల్), జూన్ 9 (ఆంధ్రజ్యోతి) : అక్రమ మైనింగ్ కేసులో జైలుకు వెళ్లిన మాజీ మంత్రి, వైసీపీ నేత కాకాణి గోవర్ధన్ రెడ్డిపై సోమవారం ముత్తుకూరు పోలీస్‌స్టేషన్‌లో మరో కేసు నమోదైంది. పంటపాలెం సమీపంలో ప్రైవేటు టోల్‌గేట్ ఏర్పాటు చేసి అక్రమ వసూళ్లకు పాల్పడ్డారని గతంలో టీడీపీ నాయకులు ముత్తుకూరు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదు ఆధారంగా విచారించి పోలీసులు కేసు నమోదు చేశారు. కాకాణి అనుచరుడైన తూపిలి శ్రీధర్‌రెడ్డితోపాటు ప్రకాశం జిల్లాకు చెందిన తిరుపతిస్వామిని అరెస్టు చేసి విచారిస్తున్నట్లు సమాచారం. కాగా, ఎస్సీ, ఎస్టీ అక్రమ మైనింగ్, పేలుడు పదార్థాల నిషేధ చట్టం కేసులో రిమాండ్‌లో ఉన్న కాకాణి గోవర్ధన్ రెడ్డి రిమాండ్‌ను ఈ నెల 23 వరకు పొడిగిస్తూ నెల్లూరు ఎస్సీ, ఎస్టీ స్పెషల్ కోర్టు ఇంచార్జ్ న్యాయాధికారి సిరిపిరెడ్డి సుమ ఉత్తర్వు చేశారు. బెయిల్ పిటిషన్‌పై వాదనలను 11కు వాయిదా వేశారు.

నేడు ఎడ్‌సెట్ ‘కీ’ విడుదల.. 21న ఫలితాలు

పెదకాకాని, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా బీఈడీ కోర్సులో ప్రవేశానికి ఈ నెల 5న నిర్వహించిన ఏపీ ఎడ్‌సెట్-2025 ప్రవేశ పరీక్షకు సంబంధించిన ‘కీ’ని మంగళవారం విడుదల చేస్తున్నట్లు ఏపీ ఎడ్ సెట్ కన్వీనర్ ఆచార్య ఏవీఎస్ స్వామి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. తుది ఫలితాలను ఈ నెల 21న విడుదల చేస్తామని పేర్కొన్నారు.

12 నుంచి నైరుతిలో కదలిక

విశాఖపట్నం/అమరావతి, జూన్ 9(ఆంధ్రజ్యోతి): వాయువ్య బంగాళాఖాతంలో సోమవారం ఉపరితల ఆవర్తనం ఆవరించింది. తూర్పుమధ్య బంగాళాఖాతంలో ఆదివారం ఏర్పడిన ఆవర్తనం స్థిరంగా కొనసాగుతోంది. వీటి ప్రభావంతో నైరుతి రుతుపవనాలు కదిలేందుకు అనుకూల వాతావరణం ఏర్పడనుందని నిపుణులు అంచనా వేశారు. అయితే, ఈనెల 12 నుంచి దక్షిణ భారతంలో నైరుతి రుతుపవనాల్లో కదలిక రానుందని భారత వాతావరణశాఖ పేర్కొంది. దీంతో దక్షిణ భారతంలో వర్షాలు పెరుగుతాయని తెలిపింది. సోమవారం ఎండతీవ్రత కొనసాగింది. నర్సాపురంలో 40.7, తునిలో 40.6, కావలిలో 40.1 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. రాయలసీమలో మంగళవారం నుంచి, కోస్తాలో బుధవారం నుంచి పలుచోట్ల భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ తెలిపింది. కోస్తాంధ్రలో మరో రెండు రోజులు అధిక ఉష్ణోగ్రతలు, ఉక్కపోత వాతావరణం ఉంటుందని విపత్తుల నిర్వహణ సంస్థ తెలిపింది.

పీఎస్ఆర్ బెయిల్ పిటిషన్ కొట్టివేత

» ప్రాథమిక దశలోనే కేసు దర్యాప్తు
» నేర స్వభావం కూడా తీవ్రంగా ఉంది
» మెడికల్ బెయిల్ కోసం విజయవాడ కోర్టును ఆశ్రయించవచ్చు: హైకోర్టు
» ఏ2 మధుసూదన్‌కు కూడా చుక్కెదురు
» ఏపీపీఎస్సీ అక్రమాల కేసులో కోర్టు తీర్పు



అమరావతి, జూన్ 9(ఆంధ్రజ్యోతి): ఐపీఎస్ అధికారి పీఎస్ఆర్ ఆంజనేయులు, క్యామ్‌సైన్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ డైరెక్టర్ మధుసూదన్‌కు హైకోర్టులో ఎదురు దెబ్బతగిలింది. ఏపీపీఎస్సీ గ్రూప్-1 మెయిన్స్ మూల్యాంకనంలో అక్రమాలకు పాల్పడ్డ కేసులో వీరు ప్రస్తుతం జైల్లో ఉన్నారు. ఈ క్రమంలో తమకు బెయిల్ మంజూరు చేయాలని కోరుతూ దాఖలు చేసిన పిటిషన్లను హైకోర్టు కొట్టివేసింది. బెయిల్ మంజూరు సమయంలో నిందితులపై ఉన్న ఆరోపణల తీవ్రత, నేరం రుజువైతే ఎంత శిక్ష పడుతుంది? సాక్ష్యాధారాలను తారుమారు చేసే అవకాశం ఉందా? తదితర అంశాలను దృష్టిలో పెట్టుకోవాల్సిన అవసరం ఉందని పేర్కొంది. కేసు దర్యాప్తు ప్రాథమిక దశలోనే ఉందని, అలాగే పిటిషనర్లపై ఉన్న నేర స్వభావాన్ని పరిగణనలోకి తీసుకొని బెయిల్ పిటిషన్లు కొట్టివేస్తున్నట్లు న్యాయస్థానం ప్రకటించింది. ఈ మేరకు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ మండవ కిరణ్మయి సోమవారం ఉత్తర్వులు ఇచ్చారు. ఏపీపీఎస్సీ గ్రూప్-1 మూల్యాంకనంలో అక్రమాలకు పాల్పడడంతోపాటు నిధుల దుర్వినియోగం చేశారని పేర్కొంటూ విజయవాడ సూర్యారావుపేట పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ కేసులో సీనియర్ ఐపీఎస్ అధికారి పీఎస్ఆర్ ఆంజనేయులు(ఏ1), మధుసూదన్(ఏ2) ప్రస్తుతం జ్యుడీషియల్ కస్టడీలో ఉన్నారు. ట్రయల్ కోర్టు బెయిల్ పిటిషన్లు కొట్టివేయడంతో హైకోర్టును ఆశ్రయించారు. ప్రాసిక్యూషన్ తరఫున ఏపీపీ సాయి రోహిత్ వాదనలు వినిపించారు.

తీర్పు ఇదీ..

“హాయ్‌ల్యాండ్ రిసార్ట్స్‌లో మ్యాన్యువల్ మూల్యాంకనం చేయించేందుకు ఏపీపీఎస్సీ కార్యదర్శి హోదాలో పీఎస్ఆర్ ఆంజనేయులు నిర్ణయం తీసుకున్నారు. దీనికోసం క్యామ్‌సైన్ సంస్థకు రూ.1.14 కోట్లు చెల్లించారనే ఆరోపణపై దర్యాప్తు ప్రాథమిక దశలో ఉంది. అనారోగ్య కారణాలు చూపుతూ బెయిల్ మంజూరు చేయాలని పీఎస్ఆర్ తరఫు న్యాయవాది కోరుతున్నారు. రికార్డులను పరిశీలించగా.. తమ పర్యవేక్షణలో ఉండాలని విజయవాడ ప్రభుత్వ ఆసుపత్రి వైద్యులు పీఎస్ఆర్‌ను కోరారు. దీనికి ఆయన నిరాకరిస్తూ డిశ్చార్జ్ అయ్యారు. ఈ నేపథ్యంలో రెండు వారాల మెడికల్ బెయిల్ కోరుతూ విజయవాడ మొదటి అదనపు ఫస్ట్ క్లాస్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ కోర్టులో పిటిషన్ వేసుకొనేందుకు పీఎస్ఆర్‌కు స్వేచ్ఛను ఇస్తున్నాం.” అని న్యాయమూర్తి తీర్పులో పేర్కొన్నారు. మెడికల్ బెయిల్ కోసం పిటిషన్ దాఖలు చేసిన అనంతరం విజయవాడ జీజీహెచ్ నుంచి ఆరోగ్య పరిస్థితిపై తాజా నివేదిక తెప్పించుకోవాలని విజయవాడ కోర్టును ఆదేశించారు. అదేవిధంగా రెండు వారాల్లోగా వ్యాజ్యాన్ని పరిష్కరించాలన్నారు.

నియోజకవర్గానికో విజన్

(మొదటి పేజీ తరువాయి)

కార్యాలయం లేదని, ఈ యూనిట్ల ఏర్పాటుతో ఆ లోటు కూడా తీరిందని చెప్పారు. ఇకపై విజన్ డాక్యుమెంట్ అమలును మరింత ముందుకు తీసుకెళ్లాల్సిన బాధ్యత ఎంపీలు, ఎమ్మెల్యేలు, జిల్లా కలెక్టర్లు, ఇతర అధికారులదేనని అన్నారు. ఈ సందర్భంగా వీడియో కాన్ఫరెన్స్‌లో విజన్ డాక్యుమెంట్ అమలుపై చంద్రబాబు చర్చించారు. యూనిట్ కార్యాలయాల్లో ఉండే 9 మంది టీమ్‌లో అధ్యక్షుడిగా ఎమ్మెల్యే, ఉపాధ్యక్షుడిగా నియోజకవర్గ ప్రత్యేక అధికారి, సభ్యులుగా స్థానిక సంస్థల ఎమ్మెల్సీ, మున్సిపాలిటీ/నగర పంచాయతీ చైర్మన్, ఆర్డీఓ/సబ్ కలెక్టర్, తహసీల్దార్లు, ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లు ఉంటారన్నారు. నియోజకవర్గ కేంద్రానికి చెందిన ఎంపీడీవో కన్వీనర్‌గా ఉంటారని తెలిపారు. స్వర్ణాంధ్ర విజన్ డాక్యుమెంట్‌లో రాష్ట్రాభివృద్ధికి ఉద్యోగాల కల్పన, పేదరికం లేని సమాజం, నైపుణ్యం-మానవ వనరుల అభివృద్ధి, నీటి భద్రత, వ్యవసాయ సాంకేతికత, అంతర్జాతీయ స్థాయి రవాణా సదుపాయాలు, ఇంధన వనరుల సమర్థ వినియోగం, నాణ్యమైన ఉత్పత్తులు-బ్రాండింగ్, స్వచ్ఛాంధ్ర, డీప్‌టెక్ విభాగాలను అభివృద్ధి చేయాలని నిర్ణయించారు. ఇప్పుడు ఈ యూనిట్ కార్యాలయాల ద్వారా నియోజకవర్గ స్థాయిలో వీటిని అమలు చేయాలని సీఎం ఆదేశించారు.

అన్ని జిల్లాల సమాన అభివృద్ధి

26 జిల్లాల్లో ఐదేళ్లలో అమలు చేయాల్సిన అభివృద్ధి కార్యక్రమాలపై రోడ్‌మ్యాప్ రూపొందించినట్టు సీఎం చంద్రబాబు చెప్పారు. ప్రస్తుతం వాట్సప్ గవర్నెన్స్ ద్వారా 400కి పైగా ప్రభుత్వ సేవలందిస్తున్నామని, వచ్చే 2 నెలల్లో మొత్తం ప్రభుత్వ సేవల్ని మన మిత్రతో పొందవచ్చని తెలిపారు. ఆగస్టు 15వ తేదీ నుంచి మహిళలకు ఉచిత బస్సు సదుపాయం అమల్లోకి తెస్తామని చెప్పారు. ఆగస్టు 15 నాటికి 15 లక్షల బంగారు కుటుంబాలను మార్గదర్శులు దత్తత తీసుకునేలా ప్రయత్నం చేస్తున్నామని వెల్లడించారు. ఎక్కువ మంది మార్గదర్శులను పరిచయం చేసిన అధికారులకు అవార్డులు ఇస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు తాను 10 బంగారు కుటుంబాలను దత్తత తీసుకుంటానని ప్రకటించారు. ఆయనను సీఎం చంద్రబాబు అభినందించారు. మిగిలిన ప్రజాప్రతినిధులు కూడా దత్తతకు ముందుకు రావాలని సీఎం పిలుపునిచ్చారు.

2027 నాటికి పోలవరం పూర్తి

గత ప్రభుత్వం డయాఫ్రమ్ వాల్‌ను కాపాడి ఉంటే పోలవరం ఎప్పుడో పూర్తయ్యేదని చంద్రబాబు అన్నారు. అయినా 2027 నాటికి పోలవరం పూర్తి చేస్తామని, 2028 నాటికి అమరావతి నిర్మిస్తామని చెప్పారు. విశాఖను ముంబై స్థాయిలో అభివృద్ధి చేసేందుకు ప్రయత్నిస్తున్నామని తెలిపారు. విశాఖ-విజయవాడ మెట్రో రైళ్లు, విశాఖ రైల్వే జోన్, పోర్టులు, ఫిషింగ్ హార్బర్ల నిర్మాణం సాధ్యమైనంత త్వరగా పూర్తి చేస్తామన్నారు.

మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా భారత్

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ వికసిత్ భారత్-2047 తీసుకొస్తే దానికి అనుబంధంగా రాష్ట్రంలో స్వర్ణాంధ్ర-2047 విజన్ రూపొందించుకున్నామని చంద్రబాబు అన్నారు. ప్రస్తుతం 4వ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఉన్న భారత్ త్వరలో మూడోస్థానానికి చేరుతుందన్నారు. ప్రపంచంలో అత్యధిక తలసరి ఆదాయం భారతీయులు ఆర్జిస్తున్నారని, ఇందులో 30 శాతంపైన తెలుగువారు ఉండడం గర్వకారణమన్నారు.

ఎస్జీటీల బదిలీలకు మాన్యువల్ కౌన్సెలింగ్

» బదిలీలు ఆలస్యమయ్యే అవకాశం

అమరావతి, జూన్ 9(ఆంధ్రజ్యోతి): సెకండరీ గ్రేడ్ టీచర్ల బదిలీల విషయంలో ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. వారికి మాన్యువల్ కౌన్సెలింగ్ ద్వారానే బదిలీలు చేపట్టనున్నట్లు మానవ వనరుల శాఖ మంత్రి లోకేశ్ సోమవారం ‘ఎక్స్’లో ప్రకటించారు. ‘పార్వతీపురం మన్యం జిల్లాలో నా క్షేత్రస్థాయి పర్యటన అనంతరం ప్రజాప్రతినిధులు, టీడీపీ ఎమ్మెల్సీలు వేపాడ చిరంజీవి, భూమిరెడ్డి రాంగోపాల్ రెడ్డి, ఆలపాటి రాజా, పేరాబత్తుల రాజశేఖర్, కంచర్ల శ్రీకాంత్‌లతో చర్చించాను. ఉపాధ్యాయుల అభిప్రాయాలను ఎమ్మెల్సీలు నాకు తెలియజేశారు. టీచర్ల విజ్ఞప్తి మేరకు ఎస్జీటీలకు ఆన్‌లైన్ కౌన్సెలింగ్‌కు బదులుగా మాన్యువల్ కౌన్సెలింగ్ నిర్వహించాలని నిర్ణయించాం’ అని పేర్కొన్నారు. మంత్రి ప్రకటనతో మాన్యువల్ కౌన్సెలింగ్ డిమాండ్‌తో ఉపాధ్యాయ సంఘాల ఐక్య వేదిక తన పోరాటాన్ని వాయిదా వేసుకున్నట్లు ప్రకటించింది. ఉద్యమ కార్యాచరణ ప్రకారం మంగళవారం(నేడు) మంగళగిరిలోని విద్యాభవన్‌ను ముట్టడించేందుకు ఐక్య వేదిక సన్నద్ధమైంది. టీచర్ల అభిప్రాయాలకు అనుగుణంగా నిర్ణయం తీసుకున్నందున ఈ కార్యక్రమాన్ని తాత్కాలికంగా వాయిదా వేసినట్లు ప్రకటించింది. కాగా, మాన్యువల్ కౌన్సెలింగ్ కోసం ఐక్య వేదిక ఆధ్వర్యంలో టీచర్లు సోమవారం రాష్ట్రవ్యాప్తంగా డీఈవో కార్యాలయాల వద్ద నిరాహార దీక్షలు చేశారు. అయితే మాన్యువల్ కౌన్సెలింగ్‌తో బదిలీల ప్రక్రియ ఆలస్యమయ్యే అవకాశం ఉంది. షెడ్యూలు ప్రకారం ఈనెల 12 నాటికి టీచర్ల బదిలీల ప్రక్రియ పూర్తికావాలి. అందుకు అనుగుణంగా పాఠశాల విద్యాశాఖ వెబ్ కౌన్సెలింగ్‌కు ఏర్పాట్లు చేసింది. మాన్యువల్ కౌన్సెలింగ్‌లో టీచర్లు ప్రత్యక్షంగా హాజరై బదిలీ స్థానాలు ఎంపిక చేసుకోవాలి. దీనిని స్లాట్ల వారీగా నిర్వహిస్తారు. ఈ ప్రక్రియతో బదిలీలు ఆలస్యమవుతాయి.

జూలై నుంచి గడపగడపకు వెళ్లాలి: లోకేశ్

పార్వతీపురం, జూన్ 9(ఆంధ్రజ్యోతి): ఎర్ర బుక్ కాదు, ఎర్ర పేపర్ చూసినా వైసీపీ నాయకులకు గుండెపోటు వస్తోందని మంత్రి నారా లోకేశ్ అన్నారు. పార్వతీపురం మండలం చినబొండపల్లిలో టీడీపీ ముఖ్య కార్యకర్తలు, నాయకులతో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..‘జూలై ఒకటో తేదీ నుంచి టీడీపీ కార్యకర్తలు, నాయకులు, ప్రజా ప్రతినిధులు గడపగడపకు వెళ్లి ప్రజలకు సంక్షేమ పథకాలు అభివృద్ధి కార్యక్రమాలపై వివరించాలి. ప్రభుత్వంపై వైసీపీ దుష్ప్రచారాన్ని కార్యకర్తలు, నాయకులు తిప్పికొట్టాలి’ అని లోకేశ్ తెలిపారు.

ఐటీఐ విద్యార్థులకు ‘గ్లోబల్ స్కిల్లింగ్’

అమరావతి, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని ఐటీఐ విద్యార్థులకు జర్మనీలో ఉద్యోగావకాశాలు కల్పించడం కోసం రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, ప్రాజెక్టు సర్వ సేతు సంయుక్తంగా ఆన్‌లైన్ గ్లోబల్ స్కిల్లింగ్ కార్యక్రమాన్ని ప్రారంభించాయి. రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఎండీ, సీఈవో జి.గణేష్‌కుమార్ సోమవారం ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు.

బాలికపై అత్యాచారం కేసులో ఆరుగురు అరెస్ట్

పుట్టపర్తి రూరల్, జూన్ 9(ఆంధ్రజ్యోతి): శ్రీసత్యసాయి జిల్లా రామగిరి మండలం ఏడుగుర్రాలపల్లిలో బాలికపై అత్యాచారం కేసులో ఆరుగురు నిందితులను అరెస్టు చేశారు. ఎస్పీ వి.రత్న సోమవారం పుట్టపర్తిలో విలేకరులకు ఆ వివరాలను వెల్లడించారు. బాలికపై అదే గ్రామానికి చెందిన అచ్చంపల్లి వర్ధన్, బడగొర్ల నందవర్ధన్ రాజ్, అరెంచేరు నాగరాజు, బోయ సంజీవ, బుడిద రాజన్న, పేరూరు బీసీ కాలనీకి చెందిన తలారి మురళి వేర్వేరు సమయాలలో అత్యాచారానికి పాల్పడ్డారని తెలిపారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు రామగిరి మండలం పేరూరు డ్యాం వద్ద ఆరుగురిని అరెస్టు చేశామన్నారు. పట్టుబడినవారు ఇచ్చిన సమాచారం ఆధారంగా గిరి, రాజేష్, అంజి, హేమంత్, కార్తీక్ అనే మరో ఐదుగురిపైనా కేసు నమోదు చేశామని చెప్పారు.

అనంతలో మరో ఇద్దరికి కొవిడ్

అనంతపురం టౌన్, జూన్ 9(ఆంధ్రజ్యోతి): అనంతపురం జిల్లాలో మరో ఇద్దరికి కొవిడ్ నిర్ధారణ అయింది. దీంతో జిల్లాలో పాజిటివ్ కేసుల సంఖ్య నాలుగుకు చేరింది. పెద్దవడుగూరు మండలానికి చెందిన ఓ గర్భిణి జిల్లా ఆస్పత్రిలో ప్రసవించారు. ఆమెకు కొవిడ్ పరీక్షలు చేయగా, పాజిటివ్‌గా తేలింది. అదేవిధంగా రామ్‌నగర్‌కు చెందిన 30 ఏళ్ల మహిళకు కొవిడ్ లక్షణాలు ఉండటంతో పరీక్షలు నిర్వహించడంతో పాజిటివ్ వచ్చింది.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, Editor : N.Rahul Kumar, RNI No:3470/1960, Managing Director : Vemuri Radha Krishna, Founder : K.L.N. Prasad.